# గంధపు చెక్కల వీరప్పన్

నక్కీరన్




C. 12289

# గంధపు చెక్కల వీరప్పన్

మూలం : నక్కీరన్

తెలుగుసేత . జానకీ అయ్యర్

సహాయకుడు : ప్రభాకర్



హైదరాబాద్ బుక్ ట్రస్ట్

**NAVODAYA BOOK HOUSE**

STREET OPP ARYA SAMAJ KACH GUDA

HYDERABAD-500 027 ☎ 4652387

634.973 S4

సుందరయ్య గ్రంథాలయ
ACC NO. 98598
హైదరాబాద్ - 500032

వెల : రు. 25/-

తమిళ మూలం : Mudhal Vetta yum Mudhal Ko aiyum (Tam ) Nakkheeran Pub cat ons, Chenna © Nakkheeran Pub cat ons

ప్రథమ ముద్రణ : జులై 2000

ప్రతులకు, వివరాలకు హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్-28 (ఫోన్ 3521849)

---

ముద్రణ నవ్యప్రింటర్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29

# ముందుమాట

తమిళనాడు, కర్ణాటకల్లోనే కాకుండా మన రాష్ట్రంలో కూడా గంధపు చెక్కల వీరప్పన్ పేరు విననివాళ్ళు వుండరనడంలో అతిశయోక్తి లేదు. గత పాతిక సంవత్సరాలుగా తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో 6,000 కి.మీ.ల మేర విస్తరించివున్న దట్టమైన అటవీ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంగా మార్చుకుని చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తూ, అడ్డుకున్నవాళ్ళని హత్యచేస్తూ ఆ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యగా మారాడు.

దంతాల కోసం రెండు వందల ఏనుగుల్ని చంపాడనీ, రూ. 100 కోట్లకు పైగా విలువచేసే ఏనుగు దంతాలనీ గంధపు చెక్కలనీ దొంగరవాణా చేశాడనీ అంటారు. ముప్పై రెండుమంది పోలీసు సిబ్బంది, పదిమంది అటవీశాఖ సిబ్బందితో సహా మొత్తం 138 మందిని దారుణంగా హత్య చేశాడనే ఆరోపణలున్నాయి.

వీరప్పన్‌ని పట్టించిన వారికి 40 లక్షల రూపాయల బహుమతి చాలా కాలం కిందటే ప్రకటించబడింది. గత కొన్ని సంవత్సరాలుగా సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఏడు బెటాలియన్ల సైనికులు; తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 4,500 మంది స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వీరప్పన్ వేటలో నిమగ్నులై వున్నారు. ఏడాదికి కొన్ని కోట్ల రూపాయలను ఆ ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి. అయినా అతను తన సామ్రాజ్యంలో స్వేచ్ఛగానే విహరిస్తున్నాడు. అడపా దడపా ఏదో ఒక సంఘటనతో జాతీయ మీడియాని ఆకర్షిస్తూనే వున్నాడు. అయితే అతని గురించి వాస్తవాల కంటే అభూతకల్పనలే ఎక్కువగా ప్రచారంలో వున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో 'నక్కీరన్' అనే తమిళ పత్రిక విలేకరి ఎంతో సాహసంతో అడవిలోకి వెళ్ళి యావత్ భారతదేశంలోనే 'మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌'గా పేరుగాంచిన వీరప్పన్‌తో ఐదారురోజులపాటు గడిపి వీడియో ఇంటర్వ్యూ చేశారు. తొమ్మిది గంటల నిడివి కలిగిన ఆ ఇంటర్వ్యూ 1996 ఏప్రిల్‌లో సన్ టీవీ ఛానెల్‌లో సీరియల్‌గా ప్రసారమై గొప్ప సంచలనం సృష్టించింది.

ఆ ఇంటర్వ్యూలో వీరప్పన్ తన బాల్యం గురించి, తన కుటుంబం గురించి, తను ఏనుగుల వేటగాడిగా గంధపు చెక్కల స్మగ్లర్‌గా మారడానికి దారితీసిన పరిస్థితుల గురించి, తను చేసిన హత్యల గురించి, అటవీ శాఖలోని అవినీతి, పోలీసుల అత్యాచారాలు, ప్రస్తుత వ్యవస్థలోని హిపోక్రసీ గురించి సోదాహరణగా వివరించాడు.

ఇటీవలే నక్కీరన్ పత్రికవాళ్ళు ఆ ఇంటర్వ్యూని కొంత సంక్షిప్తం చేసి "ముధల్ వెట్టైయుమ్ ముధల్ కొలైయుమ్" (మొదటి వేట మొదటి హత్య) పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు.

భాషా సమస్య కారణంగా వీరప్పన్ వీడియో ఇంటర్వ్యూని చూడలేకపోయిన తెలుగు వారి కోసం మేం పై పుస్తకాన్ని తెలుగులో వెలువరిస్తున్నాం. ఈ పుస్తక ప్రచురణ వెనక వీరప్పన్‌ని సమర్థించే లేదా వీరప్పన్‌ని కీర్తించే ఉద్దేశమేమీ మాకు లేదు. అయితే మన వ్యవస్థలోని లొసుగులను ముఖ్యంగా న్యాయవ్యవస్థ, పోలీసుల పనితీరు, ప్రభుత్వ యంత్రాంగంలోని అవినీతి, రాజకీయ నాయకుల అవకాశవాదం వంటి విషయాలను అర్థం చేసుకునేందుకు ఇది చాలావరకు తోడ్పడుతుందని మేం భావిస్తున్నాం


వీరప్పన్ చెప్పినవన్నీ అక్షరసత్యాలుగా పరిగణించనవసరంలేదు. అలా అని వాటిని బొత్తిగా కొట్టిపారేయడం కూడా సబబు కాదు. వీరప్పనే కాకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా తమిళనాడు - కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలోని వివిధ గ్రామాలను సందర్శించి పోలీసుల మీద తీవ్ర ఆరోపణలు చేశాయి. అక్రమ నిర్బంధం, చిత్రహింసలు, అత్యాచారాలు, చట్ట వ్యతిరేకంగా హత్యచేయడం, మనుషుల్ని మాయం చేయడం, వెట్టిచాకిరీ చేయించుకోవడం వంటి పోలీసులపై వచ్చిన అనేక ఫిర్యాదులను విచారించేందుకు జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ఒక ప్యానెల్‌ను నియమించింది ఇద్దరు సభ్యులతో కూడిన ఆ ప్యానెల్‌లో కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ ఎ.జె సదాశివ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) మాజీ డైరెక్టర్ శ్రీ సి వి. నరసింహన్‌లు సభ్యులుగా వున్నారు ఆ ప్యానెల్ గత ఫిబ్రవరిలోనే మెట్టూరుకు 19 కి.మీ. దూరంలో వున్న కొలత్తూర్ శివారు గ్రామంలో తన విచారణను ప్రారంభించింది. నిజానిజాలు ఎలాగూ వెల్లడికాక మానవు.

వీరప్పన్, ఫూలన్‌దేవి వంటి వ్యక్తుల ఆవిర్భావానికి మూలాలు మన వ్యవస్థలోనే వున్నాయి. వాళ్ళు కూడా ఈ వ్యవస్థచే సృష్టించబడ్డ వ్యక్తులే! అందువల్ల మన వ్యవస్థలోని లొసుగుల్ని నిర్మూలించే ప్రయత్నం చేయకుండా కేవలం వ్యక్తుల్ని అదీ - తను సృష్టించిన వ్యక్తుల్ని ... తనే వేటాడుతూ పోవడం వల్ల సమాజానికి జరిగే ప్రయోజనం ఏమీ వుండదు ఇప్పుడు ఆలోచించాల్సింది వ్యక్తి నిర్మూలన గురించి కాదు సమూల సామాజిక మార్పు గురించి. అసమానతలు, అక్రమాలు, ఆకలి, అవినీతి, నిరుద్యోగం వంటి రుగ్మతలకు తావులేని వ్యవస్థను సృష్టించుకోగలిగినప్పుడే మన వ్యవస్థ భవిష్యత్తులో మరింత నేరమయం కాకుండా వుంటుంది.

ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేసేప్పుడు - పాఠకుల సౌలభ్యం కోసం చర్వితచరణాలను, ఊతపదాలను తొలగించి భావానికి భంగం కలగకుండా స్వల్పంగా సవరించి అక్కడక్కడా కొన్ని వివరణలు ఇవ్వడం జరిగింది.

విలక్షణమైన ఈ పుస్తకాన్ని తెలుగులో వెలువరించేందుకు కోరిన వెంటనే అనుమతినిచ్చిన నక్కీరన్ గోపాల్ గారికి, అందుకు సహకరించిన మిత్రులు కామరాజు, ఎం ఎస్.ఎస్. పాండ్యన్ గార్లకు మా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.

- హైదరాబాద్ బుక్ ట్రస్ట్
జులై 2000





వీరప్పన్ ఇంటర్వ్యూ వీడియో తీస్తున్న శివసుబ్రహ్మణ్యన్




నక్కీరన్ గోపాల్‌తో వీరప్పన్

















# ఎందుకీ వీరప్పన్ ఇంటర్వ్యూ?

వీరప్పన్ విషయంలో నక్కీరన్ పత్రిక మరీ యింత శ్రద్ధ ఎందుకు చూపిస్తోంది?

ఈ ప్రశ్నకు ఒక్కమాటలో జవాబు చెబితే సరిపోతుంది అదేమిటంటే - ఒక పరిశోధనాత్మక పత్రిక చేసే పనే అది! అయితే పాఠకుల సందేహాలని పూర్తిగా తీర్చేందుకుగాను ఇక్కడ సవివరమైన సమాధానం అవసరమని మేం భావిస్తున్నాం.

గత పది సంవత్సరాల నుంచీ కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలకు సింహస్వప్నంగా మెదులుతున్న వ్యక్తి గంధపు చెక్కల వీరప్పన్. అతని గురించిన వార్తలు పత్రికలలో పలుమార్లు పతాక శీర్షికలతో వెలువడ్డాయి. ఎవరీ వీరప్పన్ అని ఒకింత ఆశ్చర్యంతో జనం చర్చించుకోవడం మొదలుపెట్టారు. అలాంటి సమయంలో 1991లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీనివాసన్ అనే డి.ఎఫ్.ఓ. (జిల్లా అటవీశాఖ అధికారి)ని వీరప్పన్ అతి కిరాతకంగా చంపేశాడు. శ్రీనివాసన్ తలను నరికి మొండెం నుంచి వేరుచేసి తీసుకెళ్ళిపోయాడు. ఆ సమాచారాన్ని ప్రచురించవలసివచ్చినప్పుడు మా దగ్గర పోలీసు వాళ్ళు యిచ్చిన వీరప్పన్ పాత ఫొటో ఒక్కటే ఉండింది. మా దగ్గరే కాదు. మిగతా పత్రికలవాళ్ళకు కూడా అది తప్ప మరేదీ గతిలేని పరిస్థితి చేతులు కట్టుకుని వినయంగా నిలుచుని వున్న వీరప్పన్ బ్లాక్ అండ్ వైట్ ఫొటో అది. అంతటి దారుణ హత్య చేసింది ఇతనే అంటూ పోలీసు వాళ్ళు ఆ ఒక్క ఫొటోనే అన్ని పత్రికలకు అందజేశారు.

ఆ తరువాత నక్కీరన్ పత్రిక వీరప్పన్‌కు సంబంధించిన అనేక వివరాలను సేకరించి వెలుగులోకి తెచ్చింది. వాటిని చదివి కర్ణాటక సరిహద్దు గ్రామాలకు; కోవై, ఈరోడ్, సేలం, ధర్మపురి తదితర జిల్లాలకు చెందిన ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. అయితే ప్రతి సందర్భంలోనూ మేం పదే పదే ఆ పాత ఫొటోనే వినియోగించుకోవలసి వచ్చింది. అది మాకు చాలా చిరాకును కలిగించింది. అదే సమయంలో ఒక సవాలుగా కూడా అనిపించింది.

డి.ఎఫ్.ఓ.ని తరువాత వీరప్పన్ చాలామంది ఇతర అధికారులని, పోలీసుల్ని, ఇన్‌ఫార్మర్లని చంపుతూ వచ్చాడు. అతను చేసిన హత్యల్లో అతి కీలకమైనది కర్ణాటక పోలీసు సూపరింటెండెంట్ హరికృష్ణ హత్య. వీరప్పన్ తన అనుచరులతో కలిసి పోలీసు బృందం మీద బాంబులతో చేసిన దాడిలో - హరికృష్ణ తలలోంచి ఓ తుపాకి గుండు దూసుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. హరికృష్ణ అంతిమయాత్రలో ఐదు లక్షలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. ఆరోజు బెంగుళూరు నగరంలోని దుకాణాలన్నీ మూసేసి బంద్‌ని పాటించారు. ఆ హత్య వల్ల వీరప్పన్ పట్ల కర్ణాటక రాష్ట్రంలో తీవ్రమైన వ్యతిరేకత పెల్లుబికింది. నాటి హత్యాకాండ పూర్వాపరాలను పరిశోధించి నక్కీరన్ అనేక కొత్త సంగతులను వెలికితీసి ప్రచురించింది. అప్పుడు కూడా వీరప్పన్ తాలూకు ఓ కొత్త ఫొటోని సేకరించలేకపోయినందుకు మేం తీవ్ర అసంతృప్తికి గురయ్యాం.

నేను నక్కీరన్‌కు సంపాదకుడిని మాత్రమే కాదు. స్వయంగా ఒక లే అవుట్ ఆర్టిస్ట్‌ని కూడా! పత్రిక మనుగడకు సరికొత్త వార్తలు, విశేషాలు ఎంత ముఖ్యమో సరికొత్త ఫొటోలు కూడా అంతే ముఖ్యమనే విషయం నాకు అనుభవపూర్వకంగా తెలుసు. ప్రతి సంచిక ముఖచిత్రం ప్రత్యేకంగా వుండాలనీ, అది పాఠకులను విశేషంగా ఆకర్షించాలనీ నేను అనుక్షణం తాపత్రయపడుతుంటాను.

ఇదేదో గొప్పకోసం చెప్పుకోవడం లేదు అతిశయోక్తిలేని వాస్తవం ఇది రకరకాల నూతన చిత్రాలను ఉపయోగించుకుంటూ ప్రతి సంచిక ముఖచిత్రాన్ని కొంగ్రొత్త రీతిలో తీర్చిదిద్దుతూ తమిళనాట పాఠకుల విశేష అభిమానాన్ని సంపాదించుకుంది నక్కీరన్. ఈ క్రమంలోనే ముఖచిత్రంగా వేసేందుకు వీరప్పన్ కొత్త ఫొటోల ఆవశ్యకత ఏర్పడింది అయితే నాలో కూడా అప్పుడు ఓ సందేహం తలెత్తింది అసలు వీరప్పన్ అనే వ్యక్తి నిజంగా వున్నాడా? లేక ఆ పేరుతో రక్షక దళాలే దాగుడుమూతలు ఆడుతున్నాయా అని.

ప్రతి వృత్తిలో ఆరోగ్యకరమైన పోటీ అనేది ఉంటుంది మంచి అవకాశం లభించినప్పుడు దానిని సరిగా ఉపయోగించుకోగలిగితే అదే విజయానికి సోపానమవుతుంది పత్రికా ప్రపంచానికి వీరప్పన్ వ్యవహారం అలాంటి ఒక పెద్ద అవకాశం లాంటిది ఆ అవకాశాన్ని ఏ పత్రిక అందిపుచ్చుకుంటుందో ఆ పత్రిక విజయాన్ని సాధిస్తుంది ఆ రోజుల్లో వీరప్పన్ గురించిన వాస్తవాలని, విశేషాలని ఏ పత్రిక ఎక్కువగా అందిస్తుందా అని తమిళ పాఠకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండేవారు. ఆ అవకాశాన్ని ఒక సవాలుగా స్వీకరించి, ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో, ప్రాణాలకు తెగించి ఈ యుద్ధరంగంలోకి దిగింది నక్కీరన్.

వీరప్పన్‌కు సంబంధించిన ఒక సమాచారం 1989లోనే నా చెవినబడింది అదేమిటంటే ధర్మపురి అటవీ ప్రాంతంలోని ఓ చిన్న గ్రామానికి వీరప్పన్ అప్పుడప్పుడు వస్తున్నాడు అక్కడ అతను ఓ అడ్వొకేట్‌ని సంప్రదిస్తున్నాడు అని. వీరప్పన్ వ్యవహారం అంతకంతకూ పెద్దదై పత్రికలలో పతాక శీర్షికలకు ఎక్కిన తరువాత అతను ఎవరు? ఇప్పుడు ఎలా వున్నాడు వంటి విషయాలను ఫొటోలతో సహా ప్రచురించాలనే ఆకాంక్ష బలంగా ఏర్పడింది వీరప్పన్ వ్యవహారం ప్రభుత్వానికీ, పోలీసు దళాలకే కాకుండా పత్రికా ప్రపంచానికి కూడా ఒక సవాలైపోయింది.

అప్పుడు నేను వీరప్పన్ తిరిగే అటవీ ప్రాంతాలున్న జిల్లాలకు సంబంధించిన మా పత్రికా విలేఖరులు - శివసుబ్రహ్మణ్యం, జీవా, తంగవేలు, మఖరన్, జయప్రకాష్‌లతోనూ ఇంకా ఇంబదురై, సన్ తదితరులతోనూ ఈ సవాలు గురించి చర్చించాను

వీరప్పన్ అనేవాడు నిజంగా వున్నాడా? అతణ్ణి మనం చూడగలమా? లేక ప్రభుత్వమూ పోలీసులూ అబద్ధమాడుతున్నారా? రాజకీయనాయకులు వీరప్పన్ పేరుతో అక్రమాలు చేస్తున్నారా? వంటి అంశాలని నక్కీరన్ పత్రిక ద్వారా బట్టబయలు చేయాలని వాళ్ళతో చెప్పాను. కొత్తగా ఎవరు వచ్చినా సరే వీరప్పన్‌ను చూడగలిగితే చూసి, అతని ఫొటో సంపాదించుకు రమ్మని కోరవలసిందిగా ఆ జిల్లాల విలేఖరి వేలుకు సూచనలిచ్చాను అలాగే కోవై, సేలం, ఈరోడ్, ధర్మపురి జిల్లాల నుంచి ఎవరు వచ్చినా పనిలోకి తీసుకొమ్మని, అయితే వాళ్ళు వీరప్పన్ ఫొటోతో రావాలని మా జాయింట్ ఎడిటర్ కామరాజుతో చెప్పాను

1989-91 ప్రాంతంలో తమిళనాడు రాష్ట్రంలో డి.ఎం.కె పార్టీ అధికారంలో వుంది. అప్పుడు శ్రీ దురై డి.జి.పి.గా వున్నారు. ఆరోజుల్లో కళానిధి మారన్ 'పూమాలై' అనే పేరుతో ప్రతినెలా ఓ వీడియో పత్రికను వెలువరిస్తున్నారు. ఆ వీడియో పత్రికలో డి.జి పి. దురై ఇంటర్వ్యూ వచ్చింది. ఆయన తన సిబ్బందితో అడవిలోకి వెళ్ళి ఎనభై లక్షల రూపాయల విలువచేసే గంధపు చెక్కలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్టు, వీరప్పన్ కోసం తీవ్రంగా గాలింపు చర్యలు జరుపుతున్నట్టు వీడియోలో చూపించారు. మరోపక్క వీరప్పన్ అనేవాడు వున్నాడా లేడా అనే విషయం గురించి ఒక్కో పత్రికలో ఒక్కోరకమైన కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా మురసోలి, దినమణి వంటి పత్రికలలో వీరప్పన్

అనే మనిషే లేడు అని పతాక శీర్షికలతో వార్తలు వచ్చాయి. ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రాజకీయ వ్యాసాలు రాసే ఓ వృద్ధ పత్రికా రచయిత అయితే ఏకంగా ఎస్.పి. గోపాలకృష్ణనే వీరప్పన్‌గా నటిస్తున్నాడంటూ నివేదించాడు. డి.ఎం.కె. అధ్యక్షుడు శ్రీ కరుణానిధిని మేం కలిసినప్పుడు తన సహజధోరణితో వీరప్పన్ అనే వ్యక్తి వున్నట్లు తనకు తెలియనే తెలియదని చెప్పారు.

అదే సమయంలో దినతంతి, దినమలార్, దినకరన్, మాలైమురసు, మాలైమలార్ తదితర దినపత్రికల్లో వీరప్పన్ పైశాచికత్వం, వీరప్పన్ మనుషులచే ముగ్గురు పోలీసుల కాల్చివేత, వీరప్పన్ ఎక్కడికి వెళుతున్నాడు - ఎక్కడ వున్నాడు అనే శీర్షికలతో రకరకాల వార్తలను ప్రచురించాయి. అంతేకాదు తన ఆచూకీ గురించి పోలీసులకు చెప్పిన ఏడుగురు కొండ గ్రామాల ప్రజల్ని వీరప్పన్ అతి భయంకరంగా చంపాడని, ఒక పాలవాడినీ అతని కొడుకునీ దారుణంగా నరికిపడేశాడని వార్తలు ప్రచురించాయి.

ఈ గందరగోళ పరిస్థితిని, రకరకాల వార్తలను గమనించినప్పుడు అసలు వాస్తవం ఏమిటి, నిజంగా ఏం జరుగుతోంది అనే విషయాలను ప్రజలకు ఎలాగైనా తెలియజేయాలనే తపన నాలో మరింతగా పెరిగింది. 1993లో తమిళనాట స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ గోపాలకృష్ణన్ ఓ చిరుతపులిని తన భుజం మీద వేసుకుని పోజిస్తూ పదిరోజుల్లో వీరప్పన్‌ని పట్టేస్తానని ప్రకటించారు. ఇదిలావుంటే అదే సంవత్సరం ఏప్రిల్ నెల మొదటివారంలో తమిళనాడు శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో వీరప్పన్ గురించి ఒక కొత్త వివాదం తలెత్తింది.

అప్పుడు అటవీశాఖ మంత్రి సమాధానం చెబుతూ 'వీరప్పన్ అనే అతను ప్రస్తుతం ఇక్కడ లేడు. బొంబాయి వైపు పారిపోయాడు' అన్నారు. సభలో వున్న అప్పటి ముఖ్యమంత్రి కుమారి జయలలిత తన మంత్రి చెప్పిన సమాధానాన్ని ఆమోదించినట్టు మౌనంగా వుండిపోయారు. అటవీశాఖ మంత్రి శెంగోట్టయ్యన్ శాసనసభలో పై ప్రకటన చేసిన పది రోజుల తర్వాత పత్రికలలో పెద్ద అక్షరాలతో ఈ క్రింది వార్త ప్రచురించబడింది :

"వీరప్పన్ మందుపాతరకు తమిళనాడు, కర్ణాటక ప్రత్యేక పోలీసు దళానికి చెందిన 22 మంది దుర్మరణం. - మృత్యువుతో పోరాడుతున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్.పి. గోపాలకృష్ణన్". ఆ వార్త ప్రతి ఒక్కరిని విభ్రాంతికి గురిచేసింది. ఆ సమయంలో ప్రభుత్వం నుంచి వెలువడిన గందరగోళపు ప్రకటనలు మేం తీసుకున్న నిర్ణయానికి మరింత బలాన్ని చేకూర్చాయి.

ఎలాగైనాసరే వీరప్పన్ గురించిన వాస్తవిక సమాచారాన్ని ఫొటోలతో సహా ప్రచురించి తీరాలనే పట్టుదలతో మా ప్రయత్నాలని తీవ్రం చేశాం

ఎవరీ వీరప్పన్? అతనలా ఎందుకు మారాడు? అతని వెనకాల ఎవరున్నారు? అతనింత కిరాతకంగా ప్రవర్తించడానికి కారణం ఏమిటి? అనే అంశాలను ప్రజల ముందుంచాలనే మా బృహత్తర కృషి చివరికి విజయవంతమైంది. ఆ తొలిగెలుపునకు మూలకారకుడు మా విలేకరి తంబి శివసుబ్రహ్మణ్యం.

1993 ఏప్రిల్ 24 నాటి నక్కీరన్ సంచిక వీరప్పన్ తాజా ఫొటోతో కూడిన ముఖచిత్రంతో, అతని గురించిన తాజా సంగతులతో వెలువడింది. అంతవరకు పోలీసులు వినియోగిస్తూ వచ్చిన బ్లాక్ అండ్ వైట్ ఫొటోలోని వీరప్పన్‌కి మా నక్కీరన్ విలేకరి శివ సుబ్రహ్మణ్యం కారడవిలోకి వెళ్ళి తీసుకువచ్చిన కలర్ ఫొటోలోని వీరప్పన్‌కి మధ్య ఉన్న తేడాను పాఠకులు గ్రహించాలనే ఉద్దేశంతో ఆ రెండింటినీ నక్కీరన్ ముఖచిత్రంపై వేశాం. అదొక పెద్ద సంచలనం సృష్టించింది.

మా విలేకరి శివసుబ్రహ్మణ్యం అడవిలో ఎంతో దూరం ప్రయాసపడుతూ పయనించి వీరప్పన్‌ని కలుసుకుని సేకరించిన అనేక విషయాలను నక్కీరన్ ప్రచురించింది. సరిగ్గా అప్పుడే వీరప్పన్ గురించి కొన్ని ప్రకటనలను పత్రికలకు విడుదల చేసింది ప్రభుత్వం. వీరప్పన్ తలకు రూ. 40 లక్షలు, అతని తమ్ముడు అర్జునన్ తలకు రూ. 20 లక్షలు, వీరప్పన్ అనుచరుల తలలకు తలా పది లక్షల రూపాయలు బహుమానం చెల్లిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క కర్ణాటక స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 2,500 మంది పోలీసులు, తమిళనాడు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 2,000 మంది పోలీసులు వీరప్పన్‌ను వేటాడ్డానికి గట్టి పట్టుదలతో రంగంలోకి దిగారు.

వాళ్ళకి తోడుగా జాతీయ సైన్యంలో ఒక విభాగమైన సరిహద్దు భద్రతా దళానికి (బి.ఎస్ ఎఫ్)కు చెందిన ఏడు బెటాలియన్లు వీరప్పన్‌ను వేటాడేందుకు రప్పించబడ్డాయి. (ఒక్కో బెటాలియన్‌లో 135 మంది చొప్పున సుశిక్షితులైన వీర జవాన్లు వుంటారు). అంతేకాదు అడవినంతా గాలించి వీరప్పన్ ఉనికిని కనుగొనేందుకు హెలికాప్టర్‌ని కూడా వినియోగించారు.

కొద్దిరోజుల కిందటే వీరప్పన్ బొంబాయికి పారిపోయాడంటూ ప్రకటించిన ఒక రాష్ట్ర ప్రభుత్వం, దానికి తోడుగా మరో రాష్ట్ర ప్రభుత్వం అవి చాలనట్టు జాతీయ సైన్యం మూకుమ్మడిగా ఒక వ్యక్తిని పట్టుకునేందుకు యుద్ధరంగంలోకి దిగినట్టు దిగాయని తెలిసినప్పుడు మాకు బాధగానూ, హాస్యాస్పదంగానూ అనిపించింది.

అటవీ ప్రాంతంలో రక్షక దళాలు తీవ్రమైన గాలింపు చర్యలు జరుపుతున్నప్పుడు మేము కొండ ప్రాంతాలలోని గ్రామస్థులను కలుసుకుంటూ వీరప్పన్ గురించి ఎన్నో కొత్త సంగతులను సేకరించాం.

వీరప్పన్‌ను చూసినవాళ్ళు, వీరప్పన్‌తో చనువుగా తిరిగినవాళ్ళు, వీరప్పన్‌కు సహాయం చేసిన వాళ్ళు అనే కారణాలతో ప్రత్యేక పోలీసు దళాలు ఐదువందలకు పైగా అమాయక గ్రామీణ ప్రజలను జైలుకు పంపిన సంగతి మమ్మల్ని ఎంతో వేదనకు గురిచేసింది వీరప్పన్ కోసం వెతుకుతున్నాం అనే సాకుతో ప్రత్యేక పోలీసు దళాలు పచ్చని పొలాల్లోకి వెళ్ళి వాటిని నాశనం చేశారని తెలిసినప్పుడు, చిందరవందరగా మారిన ఆ పొలాలని ప్రత్యక్షంగా చూసినప్పుడు మా గుండెలు భగ్గుమన్నాయి. ఆ కొండగ్రామాల్లో ఐదెకరాల భూమి వున్న వ్యక్తి కూడా ఏ పంటా పండించేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది.

వీరప్పన్ వచ్చాడా అని ప్రశ్నిస్తూ ప్రత్యేక పోలీసులు ఒక్కో ఇంటిలోకి దూరేవారు అమాయకుల్ని హింసించేవారు. స్త్రీలపై దుర్మార్గంగా అత్యాచారాలు చేసేవారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలు మాకు ఎన్నో లభించాయి ఆ పైశాచికత్వాన్ని ఏ వ్యక్తి అయినా ఎదిరిస్తే అతణ్ణి అక్కడికక్కడే చంపి 'ఇది వీరప్పన్ అనుచరులు చేసిన హత్య' అని ప్రకటించేవాళ్ళు. పోలీసుల చిత్రహింసలకు భయపడి మరెవరైనా వీరప్పన్ ఆచూకీ ఏమాత్రమైనా బయటపెడితే స్వయంగా వీరప్పన్ తన అనుచరులతో వచ్చి ఆ వ్యక్తిని కాల్చిపడేసి వెళ్ళిపోయేవాడు. ఈవిధంగా ముందు నుయ్యి వెనక గొయ్యి లాంటి దుర్భరమైన పరిస్థితిలో ఇరుక్కుపోయారు ఆ కొండ ప్రాంతాల ప్రజలు. వారి మనుగడే పెద్ద ప్రశ్నార్థకంగా మారిపోయింది

అలాంటి సంక్లిష్ట పరిస్థితుల మధ్య తమ్ముడు శివసుబ్రహ్మణ్యం వీరప్పన్‌తో జరిపిన తొలి ఇంటర్వ్యూను నక్కీరన్ పత్రిక ప్రచురించింది. ఆ ఇంటర్వ్యూ వరుసగా మూడు సంచికలలో ధారావాహికంగా ప్రచురించాం! ఆ మూడు సంచికల ముఖచిత్రాలను వీరప్పన్ తాజా కలర్ ఫొటోలతో అలంకరించాం!

అయితే మేం సాధించిన ఈ విజయాన్ని జీర్ణించుకోలేక, నక్కీరన్ మీద ఈర్ష్యతో కొన్ని పత్రికలు పిచ్చిపిచ్చిగా విమర్శలు చేయడం మొదలుపెట్టాయి. తోడబుట్టకుండానే ఆమెగారి (జయలలిత) చెల్లెలైపోయిన ఆవిడ (శశికళ) భర్త నడిపే ఒకానొక పత్రిక (ఒకవైపు వంగిన తరాజు బొమ్ముండే పత్రిక) మమ్మల్ని దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా రాసింది :

"ఆ పత్రిక కార్యాలయంలో సంపాదకునితో సహా సెక్యూరిటీగార్డు వరకు అందరికీ బుర్రమీసాలు వుంటాయి వాళ్ళలో ఎవరో ఒకరికి ఆకుపచ్చ యూనిఫాం తొడిగి, కిరాయికి తెచ్చిన తుపాకిని చేతిలో పెట్టి ఫొటో తీసి ఇతనే వీరప్పన్ అంటూ ప్రచురించారు." ఇలాంటి పిచ్చిరాతలతో వాళ్ళు తమ అసమర్థతను చాటుకున్నారు.

ఎంతో ఘనమైన వారసత్వం వున్న మరో పత్రిక నేలబారు స్థాయికి దిగజారి ఏమేమో రాసింది "పత్రికా వీధిలో" అనే శీర్షిక కింద 'వేరెవరో తీసిన ఫొటోని బాగా డబ్బు గుమ్మరించి కొనుక్కొని మా విలేఖరి పేరుతో ప్రచురించినట్టుగా' మా కృషిని కించపరుస్తూ అవహేళన చేసింది.

ఆ దుష్ప్రచారాలేవీ మా ప్రయత్నాలను నీరుగార్చలేకపోయాయి ఎందుకంటే వీరప్పన్ సంచరించే ఆరువేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం వున్న అడవికి మేమేమీ కంచెకట్టి, గేటుపెట్టి, ఆ గేటుకి తాళంవేసి తాళంచెవిని జేబులో పెట్టుకుని కూచున్నవాళ్ళం కాదు కదా! ప్రాణాలకు తెగించి పట్టుదలగా కృషి చేస్తే ఎవ్వరైనా వీరప్పన్‌ను ఇంటర్వ్యూ చేయొచ్చు అనే విషయాన్ని మేం మొదటి నుంచి నమ్ముతూ వచ్చాం.

ఈ వాస్తవాన్ని అర్థం చేసుకునేందుకు ఇష్టపడని పత్రికలు మా మీద ఓ పక్క ఈర్ష్యాద్వేషాలను వెళ్ళగక్కుతుంటే - మరోపక్క అశేష పాఠకుల ప్రశంశా లేఖలు మా కృషికి స్వాంతనని చేకూర్చాయి.

ఏవో కొన్ని పత్రికలని మినహాయిస్తే ఇతర చిన్నా పెద్దా తమిళ పత్రికలన్నీ మా కృషిని ప్రశంసిస్తూ ఆశీర్వదిస్తూ వార్తలు రాశాయి.

ముఖ్యమంత్రి కలైంజ్ఞర్, కురువృద్ధులైన పత్రికా సంపాదకుడు చిన్నక్కుత్తూసి, స్టేట్స్‌మెన్ పత్రికకు చెందిన రాజప్ప, ఎన్. రాం, మాలన్, రామచంద్ర ఆదిత్యన్, కల్కి రాజేంద్రన్, టి.ఎన్. గోపాలన్ మొదలైన ప్రముఖ పత్రికా రచయితలు, ఇతర ప్రముఖులు నక్కీరన్ కృషిని అభినందించారు అలాగే మమ్మల్ని నిండు మనసుతో మెచ్చుకున్న మరో ప్రముఖ వ్యక్తి రజనీకాంత్!

తమిళ పత్రికా ప్రపంచమే కాదు జాతీయ స్థాయి పత్రికలు కూడా నక్కీరన్ పరిశోధనా కృషిని సగౌరవంగా చూశాయి ఉత్తర భారతదేశం నుంచి వెలువడే స్టేట్స్‌మన్, పయొనీర్, హిందుస్థాన్ టైమ్స్ అనే మూడు ప్రముఖ ఆంగ్ల దినపత్రికలు ఒకే రోజున మొదటిపేజీలో నక్కీరన్ కృషిని ఎనిమిది కాలమ్‌ల వార్తగా ప్రచురించాయి.

ఆ కీర్తి కిరీటాన్ని తగిలించుకుని మా కర్తవ్యం అంతటితో పూర్తయిపోయిందని మేం భావించలేదు వీరప్పన్‌ను వెతుక్కుంటూ వెళ్ళిన మేము సువిశాలమైన ఆ అటవీ ప్రాంతంలోని దాదాపు 175 కొండగ్రామాల ప్రజలు పడుతున్న బాధల్ని ప్రత్యక్షంగా చూశాం. అవి మా గుండెల్ని పిండివేశాయి. అటు వీరప్పన్‌కీ ఇటు రెండు రాష్ట్ర ప్రభుత్వాల పోలీసులకీ మధ్య అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్న ఆ అమాయక ప్రజల్ని ఏదో ఒకవిధంగా కాపాడాలని నిర్ణయించుకున్నాం. వీరప్పన్ వ్యవహారానికి ఒక పరిష్కారం లభించినప్పుడే అక్కడి ప్రజలు నిజమైన స్వేచ్ఛావాయువులు పీల్చుకోగలుగుతారని మాకు బోధపడింది. ఆ అటవీ ప్రాంత ప్రజల విముక్తికోసం కృషి చేయడం తన విద్యుక్త ధర్మంగా భావించి యుద్ధరంగంలోకి దిగి పోరాటం ప్రారంభించింది నక్కీరన్. శాసనసభ,

ప్రభుత్వ యంత్రాంగం, న్యాయస్థానాలు, మానవహక్కుల సంస్థలు వంటి ముఖ్యమైన ప్రజా వేదికలన్నింటిమీద వారి విముక్తి కొరకు గొంతెత్తి నినదించింది నక్కీరన్. ఆ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడటాన్ని తన కర్తవ్యంగా చేసుకుంది నక్కీరన్

వీరప్పన్ వ్యవహారానికి సాధ్యమైనంత త్వరగా ఒక ముగింపును కనుగొనాలనేది మా కోరిక అయితే ప్రభుత్వం వైపు నుంచి మాత్రం అలాంటి ప్రయత్నాలు ఏమీ కన్పించలేదు

జయలలిత ముఖ్యమంత్రిగా వున్నప్పుడు "వీరప్పన్ని పదిరోజుల్లో పట్టుకుంటామని" సవాలు చేశారు ఎస్ పి. గోపాలకృష్ణన్. ఆ తరువాత డి.జి.పి దేవారం కూడా అదేవిధంగా వీరప్పన్ని బంధించి చూపిస్తామని డాంబికంగా ప్రకటించారు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ప్రస్తుత అధిపతి అయిన కాళిముత్తు సైతం "ఇరవైనాలుగు గంటల్లో వీరప్పన్ని పట్టేస్తామని" ఆర్భాటంగా ప్రకటించారు. ఆ మాటలు అని ఇప్పటికే ఎన్నో రోజులు గడిచిపోయాయి. అబద్ధాల చిట్టాలు విప్పడమే రక్షక దళాలకు ఒక ఆనవాయితీగా మారిపోయింది ఈ తతంగమంతా సంవత్సరాల తరబడి కొనసాగుతోంది

వీరప్పన్కు సహాయం చేశారనే నెపంతో ఎంతోమంది గ్రామీణ స్త్రీల మీద పోలీసులు అత్యాచారాలు చేశారు. మగవాళ్ళని టాడా చట్టం కింద అరెస్టు చేసి దారుణమైన చిత్రహింసలకి గురిచేశారు. ఒకప్పుడు అండమాన్ సెల్యులర్ జైల్లో పెట్టిన చిత్రహింసా పద్ధతులను ఇప్పుడు మాతేశ్వరన్ కొండ ప్రాంతంలో మళ్ళీ అమలు పరుస్తున్నారు. దానిని జైలు అని కాకుండా వర్క్షాప్ అని వ్యవహరిస్తుంటారు. వర్క్షాప్ పేరు వింటేనే కొండప్రాంత ప్రజలు గజగజ వణికిపోతారు. మాతేశ్వరన్ కొండమీద స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆ వర్క్షాప్ అమాయక ప్రజల అంగాంగాన్ని ఛేదించే ఒక భయంకర చిత్రహింసా కేంద్రం

వీరప్పన్కు ఏదో ఒకవిధంగా సహాయపడినట్టు ప్రత్యేక పోలీసులకు ఏమాత్రం అనుమానం వచ్చినా సరే ఆ కుటుంబం మొత్తాన్ని ఆడామగా పిల్లపితకా అని చూడకుండా, విచారణ అనేది లేకుండా వర్క్షాప్కు తరలించేస్తారు. తల్లీ తండ్రి - అన్నా, చెల్లీ అనే తేడా లేకుండా అందరి బట్టలను ఊడదీసి ఒకేచోట నుంచోబెట్టి మొదట నీటిని చిమ్ముతూ హింసిస్తారు ఆ తరువాత తడిచిన శరీరాల మీద, మర్మాంగాల మీద మిరపపొడి చల్లి నరకయాతనకు గురిచేస్తారు.

ఇక మూడవ దశలో వారి ఆయువుపట్లకు క్లిప్పులు బిగించి కరంట్షాక్ యిస్తారు ముక్కుకు, చెవులకు, స్త్రీల వక్షోజాలకు క్లిప్పులు తగిలించి ఎలక్ట్రిక్ షాక్ ఇస్తుంటే ఖైదీలు విలవిలలాడిపోతుంటారు దాంతరువాత రోడ్రోలర్ ట్రీట్మెంట్ అనే మరో భయంకరమైన చిత్రహింస వుంటుంది దిశమొలతో వున్న ఖైదీని ఏటవాలుగా వుండే సిమెంట్ బెంచీల మీద పడుకోబెట్టి ఒక భారీ చెక్కమొద్దును వాళ్ళమీద కిందకీ పైకీ తిప్పుతారు అప్పుడు ఖైదీల ఎముకలు చిట్లిపోవాల్సిందే. ఆ చిత్రహింసలను ఒక్కసారి అనుభవించిన వ్యక్తి ఇక తన శేష జీవితమంతా సరిగా నుంచోలేడు, కూచోలేడు, అడుగుతీసి అడుగు వేయలేడు. బతికినన్ని రోజులు నేలమీద పడి వుండాల్సిందే ఆహారం, నీళ్ళు మొదలైన వాటిని కుక్క మాదిరిగా నేరుగా నోటితో నాకవలసిందే!

ఇదికాక ఏరోప్లేన్ అని వ్యవహరించే మరో రకం చిత్రహింస వుంది అందులో ఖైదీని పైనుంచి కిందికి తాడుతో వేలాడదీస్తారు. రెండు చేతులను ఓ కర్రకు కట్టి విపరీతంగా కొడతారు. ఆ చిత్రహింసకు గురిచేసిన అనంతరం కొనప్రాణంతో వున్న ఆ ఖైదీని కిందకు దింపి అతని కొలతలు తీసుకుంటారు. ఆ కొలతలకు తగిన ఆకుపచ్చని యూనిఫాం తెప్పించి ఖైదీకి తొడుగుతారు అదేరాత్రి అతణ్ణి కాల్చి చంపి అడవిలో పడేస్తారు. మరుసటిరోజు అన్ని దినపత్రికలలో 'ఎన్కౌంటర్లో వీరప్పన్

అనుచరుడి మరణం' అంటూ ఓ వార్త ప్రచురించబడుతుంది.

కొలతలు తీసుకుంటున్నప్పుడే ఆ ఖైదీకి తనకు చావు మూడినట్టు తెలిసిపోతుంది. తన తోటి ఖైదీలతో 'అన్నా! నా కొలత తీసేసుకున్నారు. మీరు గనక ప్రాణాలతో ఇళ్ళకుపోతే నేను చచ్చిపోయినట్టు మా వాళ్ళకి చెప్పండి' అని ఏడుస్తూ విన్నవించుకుంటాడు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వాళ్ళు చేసిన ఇలాంటి చిత్రహింసల గురించి కొండ ప్రాంత గ్రామీణులు నక్కీరన్‌కు ఎంతో వివరంగా చెప్పారు. అదే పోలీసులు వీరప్పన్ భార్య ముత్తులక్ష్మిని కూడా పట్టుకుపోయి వివస్త్రను చేసి కరంట్ షాక్‌తో చిత్రహింసలకు గురిచేశారు. అప్పుడు వీరప్పన్ ప్రతీకారంతో రగిలిపోయాడు.

1994 డిసెంబర్ 25న డి ఎస్.పి చిదంబరనాథన్, ఏట్టు గోపాలన్, శేఖర్ అనే ఓ ఉపాధ్యాయుడు మొత్తం ముగ్గుర్ని వీరప్పన్ కిడ్నాప్ చేశాడు. వాళ్ళని విడుదల చేయాలంటే తనకు వెయ్యి కోట్ల రూపాయల నగదు యివ్వాలని షరతు విధించాడు. బేబీ వీరప్పన్ అనే తన దూత ద్వారా అతను తన డిమాండ్‌ను ఆడియో క్యాసెట్ రూపంలో పంపించాడు. ఆ క్యాసెట్‌ని అప్పటి డీజీపీ దేవారం, కోవై జిల్లా కలెక్టర్ శంకర్‌లు జయలలితకు వినిపించారు.

ఆ తరువాత వీరప్పన్ రెండవ దూతగా అతని సొంత తమ్ముడు అర్జునన్ వచ్చాడు. అతనితో మరో ఆడియో క్యాసెట్‌ని పంపించాడు వీరప్పన్. అయితే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దూతగా వచ్చిన అర్జునన్‌ని అరెస్టు చేసి జైల్లో పడేశారు.

అదే సమయంలో వీరప్పన్‌చే కిడ్నాప్‌కు గురైన ముగ్గురు అధికారులను తమిళనాడు ప్రత్యేక పోలీసు దళం ప్రాణాలతో విడిపించుకొచ్చినట్టు, వీరప్పన్ మాత్రం తప్పించుకుని పారిపోయినట్టు, వీరప్పన్ సహచరులు అయ్యన్‌దురై, రంగస్వామి పట్టుబడినట్టు డీజీపీ దేవారం ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రకటించారు. మరోపక్క "మేమే బందీలను విడుదల చేయించాం" అంటూ కర్ణాటక స్పెషల్ టాస్క్ ఫోర్స్ వాళ్ళు ప్రకటించుకున్నారు. వాళ్ళలో ఎవరి మాట నమ్మాలో తెలియలేదు. అప్పుడు బందీలుగా పట్టుబడిన డి.ఎస్.పి చిదంబరనాథన్‌ని, తక్కిన ఇద్దరిని వారి వారి ఇళ్ళలో కలుసుకుని నక్కీరన్ ప్రశ్నించినప్పుడు అసలు విషయం బయటపడింది.

"మమ్మల్ని ఎవరూ కాపాడలేదు. మా అంతట మేమే ప్రాణాలతో తప్పించుకుని వచ్చేశాం" అని చెప్పారు డి.ఎస్.పి. చిదంబరనాథన్. అయ్యన్‌దురై, రంగస్వామి అనే వీరప్పన్ సహచరుల మనస్సులను మంచి మాటలతో మార్చి ఏవిధంగా తమతో తీసుకువచ్చిందీ నక్కీరన్‌కు సవివరంగా చెప్పారాయన. "మా పోలీసులు చెప్పినవన్నీ అబద్ధాలు. రెండు రాష్ట్రాల పోలీసులు ప్రకటించినట్టు ఏ ఆపరేషనూ జరగలేదు. వీరప్పన్ తప్పించుకుని పారిపోయిందీ లేదు అసలతను ఆ చోటులోనే లేడు. ఉంటే తప్పించుకునే అవకాశమే మాకు దొరికేది కాదు. మా పై అధికారి అయిన దేవారం అలా ప్రవర్తిస్తారని నేను ఎప్పుడూ అనుకోలేదు. మా అంతట మేము తప్పించుకుని వస్తే ఆయన మాముందే పత్రికల వాళ్ళతో అబద్ధాలు చెప్పారు. కర్ణాటక ప్రత్యేక పోలీసు దళం డిజిపి శంకర్ బిదారి చెప్పింది కూడా పచ్చి అబద్ధం" అన్నారాయన. వీరప్పన్ చెర నుంచి తనను తాను రక్షించుకోవడమే కాకుండా వీరప్పన్ సహచరులిద్దరి మనసులు మార్చి వాళ్ళు ప్రభుత్వానికి సరండర్ అయ్యేట్టు చేసినందుకు డిఎస్‌పి చిదంబరనాథన్‌కు మన పోలీసు డిపార్ట్‌మెంట్ యిచ్చిన బహుమతి ఏమిటంటే బదిలీ!

పచ్చి అబద్ధాలే రక్షక దళానికి పర్యాయపదం అనేందుకు మరో ఉదాహరణ . దూతగా వచ్చిన అర్జునన్, సరండర్ అయిన అయ్యన్‌దురై, రంగస్వామిల మిస్టరీ మరణం! పై సంఘటన తరువాత

ఎనిమిది నెలలకు అర్జునన్, అయ్యన్‌దురై, రంగస్వామి - ముగ్గురూ పోలీసులతో మైసూరుకు పయనమై వెళుతుండగా దారిలో హఠాత్తుగా సైనైడ్ గుళికలు (.) మింగి ఆత్మహత్య చేసుకున్నట్టుగా పత్రికలలో ఓ వార్త వెలువడింది!

అందుకు ప్రతీకారంగా -

1995 నవంబర్ 1 నాడు వీరప్పన్ మల్మీ అందియూర్ అటవీ ప్రాంతానికి చెందిన ముగ్గురు అధికార్లను కిడ్నాప్ చేశాడు. మూడు కోట్ల రూపాయలు యివ్వాలని తన తమ్ముడి (అర్జునన్) మరణంపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్లు పెట్టాడు. డబ్బు ఎలా తెచ్చి యివ్వాలో పోలీసులకు పంపిన ఆడియో క్యాసెట్‌లో వివరించాడు. డబ్బు తెచ్చే వ్యక్తి ఎరుపురంగు బుల్లెట్ (మోటార్‌బైక్) మీద రావాలి. అతను ఎర్ర షర్టు ధరించి వుండాలి తన వాహనానికి ఎర్రజెండా తగిలించుకుని వుండాలి అంటూ సూచనలు చేశాడు. అదే ప్రకారంగా ఒకరిని అడవిలోకి పంపింది రక్షక దళం. వీరప్పన్‌కు మొదటి వాయిదా డబ్బు చేరిందని పత్రికలు ప్రచురించినప్పుడు అది నిజమని కానీ, అబద్ధమని కానీ జయలలిత ప్రభుత్వం నుంచి ఎలాంటి వివరణా రాలేదు. ఆ తరువాత రెండవదఫా చెల్లింపు నిమిత్తం డి.ఎస్.పి కొడుకు సెల్వరాజ్‌ని వీరప్పన్ విధించిన షరతులకు లోబడి అడవిలోకి పంపింది రక్షకదళం. సెల్వరాజ్ దగ్గరనుంచి మూడు లక్షల రూపాయలను తీసుకున్నట్టు మాకు యిచ్చిన ఇంటర్వ్యూలో వీరప్పన్ చెప్పాడు

ఇదిలా ఉండగా కిడ్నాప్‌కు గురైన ముగ్గురు అధికార్లని వీరప్పన్ చెర నుంచి తామే విడుదల చేసి తీసుకువచ్చినట్టు కర్ణాటక స్పెషల్ టాస్క్ ఫోర్స్ డి.జి.పి శంకర్ బిదారి ప్రకటించుకున్నారు. ఆ ముగ్గురు అధికార్లతో ఆయన కలిసి దిగిన ఫొటో కూడా పేపర్లలో వచ్చింది. మరోపక్క చెన్నైలో దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమిళనాడు డి జి.పి దేవారం ఆ ముగ్గుర్ని విడిపించి తెచ్చింది తామే అంటూ చెప్పుకున్నారు. అసలు వాస్తవం ఏమిటా అని నక్కీరన్ పత్రిక పరిశోధించినప్పుడు పోలీసుల కపట నాటకం బయటపడింది

వీరప్పన్ కిడ్నాప్ చేసిన ఆ ముగ్గురు అటవీశాఖ అధికార్లని నక్కీరన్ ఇంటర్వ్యూ చేసింది. అప్పుడు వాళ్ళు ఇలా చెప్పారు .

"వీరప్పన్‌ను పట్టుకునేందుకు అప్పుడు రెండు రాష్ట్రాలకు చెందిన రెండువేల మంది పోలీసులు అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. మేం అక్కడుంటే మా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని భావించాడు వీరప్పన్ పోలీసులే మమ్మల్ని కాల్చిపడేసి వీరప్పనే చంపినట్టు ప్రకటించవచ్చు. అందుకని మమ్మల్ని ఒక సురక్షితమైన ప్రదేశానికి తీసుకెళ్ళి మమ్మల్నక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు వీరప్పన్. ఆవిధంగా తెల్లవారుజామున విడుదలైన మేము అడవిలో పడుతూ లేస్తూ పయనించి మధ్యాహ్నం ఒంటిగంటకు ఓ రోడ్డు పక్కకు చేరాం. ఆకలితో నకనకలాడుతూ అక్కడే కూలబడ్డాం. అదేసమయంలో కర్ణాటక ప్రత్యేక పోలీసు దళం అటువైపు వచ్చింది. ముందు వాళ్ళు మమ్మల్ని వీరప్పన్ మనుషులనుకొని బెదిరింపు ధోరణిలో ప్రశ్నించారు మేం భయంతో వణికిపోతూ జరిగిన సంగతంతా చెప్పాము. అప్పుడు ఇద్దరు పోలీసుల్ని మాకు కాపలాగా వుంచి మిగతావాళ్ళు వెళ్ళి డిజిపి శంకర్ బిదారిని తీసుకొచ్చారు. వాళ్ళ వెంట జీపుల్లో పత్రికా విలేఖరులు, ఫొటోగ్రాఫర్లు కూడా వచ్చారు మాకు ప్రాణభిక్ష పెట్టింది వీరప్పన్ అయితే శంకర్ బిదారిగారు మాతో కలిసి ఫొటోలు తీయించుకుని తానే మమ్మల్ని విడిపించినట్టు పత్రికలకు చెప్పి ఆ తరువాత మమ్మల్ని మా ఇళ్ళల్లో దింపేయించారు అక్కడేమో తమిళనాడు డిజిపి దేవారంగారు మమ్మల్ని విడిపించింది తామే అంటూ టీవీ ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు."

ఈ విధంగా పోలీసు బలగాలు వీరప్పన్ విషయంలో అన్నీ అబద్ధాలే చెబుతున్న సమయంలో ఒక్కో కిడ్నాప్ సంఘటన వెనకవున్న నిజానిజాలను నక్కీరన్ బయటపెడుతూ వచ్చింది నక్కీరన్ విలేఖరులు ప్రాణాలకు తెగించి, ప్రత్యేక పోలీసు దళాల దాడులను తప్పించుకుంటూ కారడవిలో దూరి వీరప్పన్‌ను ఇంటర్వ్యూ చేశారనే వాస్తవాన్ని ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి.

డి.ఎస్.పి చిదంబరనాథన్ కిడ్నాప్‌కు గురైనప్పుడు మా విలేఖరి శివసుబ్రహ్మణ్యం అడవిలోకి వెళ్ళి వీరప్పన్‌తో ముఖాముఖి జరిపివచ్చారు. అందియూర్ అటవీశాఖ సిబ్బంది కిడ్నాప్‌కు గురైనప్పుడు శివసుబ్రహ్మణ్యంతోపాటు జీవా తంగవేలు కూడా అడవిలోకి వెళ్ళి మరోమారు వీరప్పన్‌తో ముఖాముఖి జరిపివచ్చారు.

అప్పుడు డిజిపి దేవారంగారు "వీరప్పన్ మాకు మొదటి శత్రువైతే నక్కీరన్ పత్రిక మా రెండో శత్రువు" అంటూ బహిరంగంగానే ప్రకటించారు. నక్కీరన్ విలేఖరులు అడవిలో కనిపిస్తే కాల్చిపారేయండి అంటూ రక్షణ దళాలకు మౌఖిక ఆదేశాలు కూడా జారీచేశారు. దరిమిలా మా విలేఖరుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందనే విషయాన్ని ఢిల్లీలోని ఇండియన్ ప్రెస్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్ళాము ప్రెస్ కౌన్సిల్ వారు మా ఫిర్యాదును పరిశీలించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ఆ రెండు రాష్ట్రాల డీజీపీలకు, హోంమంత్రులకు మా విలేఖరుల ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ సూచనలు జారీ చేశారు

నక్కీరన్ విలేఖరుల్ని కనిపిస్తే కాల్చేయండని ఆనాడు డీజీపీ దేవారం మౌఖిక ఉత్తర్వులు జారీచేసిన విధంగానే ఆ తర్వాత వచ్చిన కాళిముత్తుగారు కూడా అలాంటి ఆదేశాలనే జారీచేశారు. అయినా నక్కీరన్ వెనుకంజవేయలేదు. వీరప్పన్ వ్యవహారంలో నిజానిజాలను వెలికితీసేందుకు మేం నిరంతరం మా కృషిని కొనసాగిస్తూనే వచ్చాము.

ప్రభుత్వమూ, పోలీసు దళాలూ ప్రతిరోజూ అబద్ధాలనే కక్కుతున్నాయనే విషయం పామరులకు కూడా అర్థమయ్యేటట్టు వెల్లడించాలి. అందుకు ఈ వ్యవహారానికి సంబంధించిన దారులన్నింటినీ వినియోగించుకోవాలి అని మేం గట్టిగా నిర్ణయించుకున్నాం. పత్రికల తర్వాత ఇప్పుడు ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన మీడియా టీవీ! దానిని కూడా ఉపయోగించుకుని ప్రభుత్వం ధరించిన ముసుగుల్ని చీల్చిపారేయాలని నిశ్చయించుకున్నాం.

వందకు పైగా హత్యలు చేసిన ఒక వ్యక్తి - ఆ హత్యలను తాను ఎందుకు చేసిందీ, వాటి వెనక వున్న కారణాలేమిటి చెబుతున్నాడు తను చేసిన తప్పులను తనే అంగీకరిస్తున్నాడు వాటన్నింటినీ వీడియోలో రికార్డుచేసి తద్వారా ఇన్నాళ్ళుగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, రెండు రాష్ట్రాల ప్రత్యేక పోలీసు దళాలు చెప్తూవస్తున్నవి పచ్చి అబద్ధాలని ప్రజల ముందు బట్టబయలు చేయాలి వీరప్పన్ వెన్నుదన్నుగా పనిచేసిన వాళ్ళని కూడా బహిర్గతం చేయాలి అనే సవాలును నక్కీరన్ స్వీకరించింది.

రోజులు గడిచిపోతున్నకొద్దీ మేం చేయాలనుకున్న పనిని త్వరగా ముగించాలనే పట్టుదల మాలో పెరిగింది అప్పటికే మూడుసార్లు పొంచివున్న ప్రమాదాలను లెక్కచేయకుండా అడవిలోకి వెళ్ళి వీరప్పన్‌ను కలిసి ఆడియో టేపుల ద్వారా ముఖాముఖి నిర్వహించి వచ్చిన శివసుబ్రహ్మణ్యన్‌కు మెచ్చుకోలుగా ఒక వీడియో కెమెరాని నక్కీరన్ బహుకరించింది ఆ కెమెరాను ఎలా ఆపరేట్ చేయాలో ఆయనకు ప్రత్యేకంగా తర్ఫీదును కూడా యిచ్చింది. నక్కీరన్ పత్రికా కుటుంబంలో జరిగే ఉత్సవాలను ఆ కెమెరాలో బంధిస్తూ, ప్రాక్టీస్ చేస్తూ తంబి శివసుబ్రహ్మణ్యన్ కొద్దిరోజుల్లోనే వీడియోగ్రఫీలో ఆరితేరిపోయాడు. ఆ తరువాత నక్కీరన్ కోసం మళ్ళీ అడవికి బయలుదేరాడు.

అది 1996వ సంవత్సరం. మార్చి 19వ తేదీ

మొట్టమొదటిసారిగా వీడియో కెమెరా ముందు నిలుచున్నాడు గంధపుచెక్కల వీరప్పన్. అడవిలో ముప్పై కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తూ, వీరప్పన్‌తో ఐదురోజులపాటు కలిసి తిరిగి దాదాపు తొమ్మిది గంటల నిడివిగల వీడియో ఇంటర్వ్యూ నిర్వహించి, ఆ టేపులతో విజయవంతంగా తిరిగివచ్చాడు తమ్ముడు శివ అష్టకష్టాలు పడి తీసుకువచ్చిన ఆ వీడియో ఇంటర్వ్యూ ప్రజల ముందు పెట్టాలనే ఉద్దేశంతో సన్ టీవీని సంప్రదించింది నక్కీరన్.

వీరప్పన్‌తో జరిపిన వీడియో ముఖాముఖిని త్వరలో ప్రసారం చేయబోతున్నట్టు సన్‌టీవీలో ప్రకటించినప్పుడు - ఆ ముఖాముఖిని సన్ టీవీ వాళ్ళే షూట్ చేసినట్టు ఒక తప్పుడు అభిప్రాయం కలిగింది అందరిలోనూ! దాంతో ప్రసార తేదీకి ఒకరోజు ముందు మేం ప్రెస్‌మీట్ పెట్టి వీరప్పన్‌తో వీడియో ఇంటర్వ్యూని నక్కీరన్ పత్రిక నిర్వహించిన వైనాన్ని స్పష్టంచేశాం సరిగ్గా ఆ ఇంటర్వ్యూ ప్రసారం అయ్యే తేదీనాడు అన్ని పత్రికలలోనూ నక్కీరన్ కృషిని ప్రశంసిస్తూ ఎనిమిది కాలమ్‌ల సవివరమైన వార్త వెలువడింది.

ఆరోజు అంటే 1996 ఏప్రిల్ 7వ తేదీనాడు సన్‌టీవీలో వీరప్పన్ ముఖాముఖి ప్రసారం అవుతున్న సమయంలో తమిళనాడు అంతటా బంద్ పాటిస్తున్నారా అనేంతగా వీధులన్నీ నిర్మానుష్యమై పోయాయి. స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు అందరూ టీవీలకు కళ్ళప్పగించి చూస్తూ కూర్చుండి పోయారు ఈరోడ్, ధర్మపురి మొదలైన జిల్లాల్లోని అనేక గ్రామాల్లో వీరప్పన్ ఇంటర్వ్యూని చూసేందుకు ఎంతోమంది అప్పటికప్పుడు కేబుల్ కనెక్షన్లు పెట్టించుకున్నారు. బెంగుళూరు, మైసూరు తదితర నగరాల్లో సైతం వేలాదిమంది ఆ కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకించారు.

అయితే, లక్షలాది మంది ప్రజల్ని ఆకర్షించిన ఆ సీరియల్ ఇంటర్వ్యూకి ఆదిలోనే కొన్ని చిత్రమైన ఆటంకాలు ఎదురయ్యాయి

వీరప్పన్ తన తొలిరోజుల్లో ఏనుగులను చంపి వాటి దంతాలను స్మగ్లింగ్ చేసేవాడు అప్పుడు అతనికి పోటీగా మరో ఐదుగురు అదే వ్యాపారంలో వుండేవాళ్ళు వీరప్పన్ ఆ ఐదుగురినీ పట్టి అతికిరాతకంగా చంపి, వాళ్ళ శవాలను ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచుల్లో మూటలు కట్టి కావేరీ నదిలోకి విసిరిపారేశాడు. తాను వాళ్ళను చంపిన వైనాన్ని చాలా వివరంగా సుస్పష్టంగా తన టీవీ ఇంటర్వ్యూలో చెప్పాడు వీరప్పన్

ఆ వివరాలు ప్రసారమైన మరుసటిరోజే -

ఆ ఐదుగురి హత్యకు సంబంధించిన కేసు మైసూరు కోర్టులో విచారణకు వచ్చింది. ఇది ఎంత యాదృచ్ఛికమో చూడండి. విచిత్రం ఏమిటంటే ఆ ఐదుగురిని చంపింది వీళ్ళేనంటూ కర్ణాటక పోలీసులు కొందరిని అరెస్టుచేసి అప్పటికే కేసు ఫైల్ చేశారు. కాగా సదరు నిందితుల తరపున వకాల్తా పుచ్చుకున్న లాయర్లు వీరప్పన్ ఇంటర్వ్యూను చూశారు పోలీసులు మోపిన అభియోగాలకీ - వీరప్పన్ స్వయంగా చెప్పిన వాస్తవానికీ మధ్యన వున్న తేడాని గమనించారు. అంతే -

వీరప్పన్ ఇంటర్వ్యూ క్యాసెట్‌ని కోర్టుకు సమర్పించి ఆ హత్యలను వీరప్పనే చేశాడు కాబట్టి నిర్దోషులైన నిందితులందరినీ తక్షణమే వదిలివేయాలంటూ వాదించారు. ఎన్నాళ్ళుగానో కొనసాగుతున్న ఆ కేసులో హఠాత్తుగా వచ్చిన మార్పును చూసి న్యాయమూర్తిగారు సదరు కేసు విచారణ ముగిసేవరకూ వీరప్పన్ వీడియో ఇంటర్వ్యూ ప్రసారాన్ని నిలిపివేయాలంటూ స్టే ఆర్డర్‌ని జారీ చేశారు.

ఆ స్టే ఆర్డర్ గురించి టీవీ ప్రసారం మధ్యలో ప్రేక్షకులకు తెలియజేయడం జరిగింది అయితే ఎలాగైనా ఆ అడ్డంకిని అధిగమించి సత్వరమే ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలన్న తాపత్రయంతో నక్కీరన్ చట్టపరమైన పోరాటాన్ని ప్రారంభించింది. సన్ టీవీ యాజమాన్యం మాత్రం ఈ విషయంతో తనకేం సంబంధంలేనట్టు మిన్నకుండిపోయింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే నక్కీరన్ తన పోరాటంలో విజయం సాధించింది. టీవీ ప్రసారానికి అడ్డంకులన్నీ పటాపంచలైపోయాయి. దాంతో సన్ టీవీలో వీరప్పన్ ఇంటర్వ్యూ సీరియల్‌గా ఎనిమిదిరోజులపాటు నిరాటంకంగా ప్రసారమైంది. ఇది నక్కీరన్ కీర్తికిరీటంలో ఒక కలికి తురాయి వంటి అంశం.

ఇంటర్వ్యూ ప్రసారమవుతున్నప్పుడు తమిళనాడు అంతటా ఎక్కడ చూసినా వీరప్పన్ గురించిన చర్చలే వినిపించేవి శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న కాలంలో ఆ ఇంటర్వ్యూ వెలుగుచూడడం వల్ల రాజకీయరీత్యా కూడా అది ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. కొన్ని మార్పులకు అది దోహదం చేసింది 1996 నాటి శాసనసభ ఎన్నికలలో జయలలిత పరాజయం పాలవడానికి ముఖ్యమైన కారణాల్లో ఒకటి నక్కీరన్, రెండు వీరప్పన్ ఇంటర్వ్యూ కూడా వున్నాయనేది ఎవరూ కాదనలేని వాస్తవం

ఆ ఇంటర్వ్యూ జరుపుతున్న సమయంలోనే వీరప్పన్ ప్రభుత్వానికి సరండర్ అయేందుకు సంసిద్ధపడుతున్నాడనే విషయం మాకు బోధపడింది. అందుకే ఆ తరువాత నేనూ, శివసుబ్రహ్మణ్యన్ కలిసి మరో రెండుసార్లు అడవిలోకి వెళ్ళి వీరప్పన్‌తో చర్చలు జరిపాం. అతని ఉద్దేశాలనూ, కోరికలనూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించాం. అయితే వీరప్పన్ లొంగుబాటుకు సంబంధించిన ప్రయత్నాలు కొనసాగుతుండగానే - బేతాళుడు తిరిగి చెట్టు కొమ్మకు చేరుకున్నట్టుగా అయింది. కర్ణాటక అటవీ శాఖకు చెందిన తొమ్మిది మంది సిబ్బందిని వీరప్పన్ మళ్ళీ కిడ్నాప్ చేశాడు. అప్పుడు రెండు రాష్ట్ర ప్రభుత్వాల కోరిక మేరకు మేం మరోసారి అడవిలోకి ప్రభుత్వ దూతలుగా వెళ్ళి వీరప్పన్‌తో వాగ్యుద్ధం చేసి ఆ తొమ్మిదిమంది సిబ్బంది ప్రాణాలను రక్షించి తీసుకొచ్చాం. అప్పుడు నాతోపాటు మా విలేకరులు శివసుబ్రహ్మణ్యన్, సుబ్బు తోడుగా వచ్చారు. బందీల విడుదలకు సంబంధించిన రోమాంచితమైన మా ప్రయత్నాలను మరో పుస్తకంలో వివరిస్తాను.

ఒక ప్రజా వ్యతిరేక పరిపాలనను ఇంటికి పంపడంలో ముఖ్య భూమికను వహించిన శక్తివంత మైన ఆ మొట్టమొదటి వీడియో ఇంటర్వ్యూలోని విశేషాలను యధాతథంగా మీకు అక్షర రూపంలో అందిస్తున్నందుకు నక్కీరన్ ఎంతగానో సంతోషిస్తోంది.

- నక్కీరన్ గోపాల్



## ఈ వీడియో ఇంటర్వ్యూని ఎలా తీశాం ?

ఇప్పటికే మూడుసార్లు అడవిలోకి వెళ్ళి వీరప్పన్‌ని కలిసి మాట్లాడి తిరిగివచ్చాను. కానీ ఈసారి మాత్రం ఎందుకో కొంచెం బెరుకుగా వుంది నాకు. అడవిలో వీరప్పన్ దాగివున్న ప్రాంతాన్ని కనుగొనేం దుకు మూడు నెలలుగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైపోయాయి. అయినా నా ప్రయత్నాలు నేను కొనసాగిస్తూనే వున్నాను. చివరికి మార్చినెల మొదటివారంలో వీరప్పన్ వున్న చోటుని పసిగట్టగలిగాను వెంటనే వీడియో కెమెరాను భుజానవేసుకుని, రక్షణ కోసం ఇద్దరు స్నేహితుల్ని వెంటబెట్టుకుని కొండకి బయలుదేరాను

అంతకు ముందు మూడవసారి వీరప్పన్‌ని కలిసినప్పుడు ఇక మళ్ళీ కలవడమంటూ జరిగితే వీడియో కెమెరాతోనే వస్తానని చెప్పాను అందుకని అతను ఎదురుచూస్తుండొచ్చు. నాలో త్వరగా వెళ్ళాలనే ఆత్రుత .. మరోపక్క వీడియో తీయడమైతే నేర్చుకున్నానుగానీ సమయానికి సరిగా రికార్డవుతుందో కాదో అనే బెంగ ...! ఇలాటి ఆలోచనలతో కొండ ఎక్కబోతుండగా అక్కడ ప్రత్యేక పోలీసు దళాలు ఒక దుర్భేద్యమైన రక్షణ వలయాన్ని ఏర్పాటుచేశాయనే కబురు తెలిసింది.

దాంతో వెనుకంజ వేయక తప్పలేదు. పదకొండు, పన్నెండు, పదమూడు తేదీల్లో కూడా పరిస్థితి అలాగే వుంది. చివరికి 14వ తేదీనాడు కొంత వెసులుబాటు దొరికింది. అంతే చప్పున అడవిలోకి దూరిపోయాం

సుదీర్ఘ ప్రయాణం చేసి వీరప్పన్ వున్న చోటుకు చేరుకున్నాం. ఆరోజు రాత్రి అక్కడే గడపవలసి వచ్చింది. కొత్త వాతావరణం, కొత్త ప్రదేశం అన్నీ కలిసి కొంచెం బెరుకు బెరుకుగా అనిపించాయి.

వీడియో తీయడానికి అది అనువైన స్థలంకాదని పదిహేనో తేదీన వేరే చోటుకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాం అయితే శకునం బాగాలేదని ప్రయాణాన్ని వాయిదా వేశాడు వీరప్పన్ అతనికి పక్షుల భాష తెలుసట. వాటిని బాగా నమ్ముతాడు.

గతంలో శకునాలను పట్టించుకోకుండా వెళ్ళినప్పుడు ఎన్ని అనర్థాలు జరిగాయో ఏకరువు పెట్టాడు.

చివరికి పదహారో తేదీనాడు మా ప్రయాణాన్ని ప్రారంభించాం. నీటి వనరులు వుండి, మనుషుల అలికిడి లేని చోటును వెతుకుతూ మా ప్రయాణం కొనసాగింది. దాదాపు పది కిలోమీటర్ల దూరం నడిచాక ఒక వాగు దగ్గర ఆగి నీళ్ళు తాగాం. తలెత్తి చూసేసరికి ఎనిమిది ఏనుగులు మా దారికి అడ్డుగా నిలుచుని కనిపించాయి ఎంత అరిచినా, ఏం చప్పుళ్ళు చేసినా అవి కొంచెం కూడా జరగలేదు. దాంతో వీరప్పన్ సిబ్బంది తూటాలను బయటకు తీశారు. ఆ వాసనకే కాబోలు అవి మరుక్షణమే పరుగుపరుగున పారిపోయాయి.

ఆగకుండా నడవడం వల్ల బాగా అలసిపోయాం. పైగా స్టిల్ కెమెరా, వీడియో కెమెరా, బ్యాటరీలు, ఇతర పరికరాలు అన్నీ కలిసి దాదాపు నలభై కిలోల బరువులు మా భుజాలకు వేలాడుతున్నాయి. దాంతో ఒకటే నొప్పులు మరోపక్క కొన్ని ప్రదేశాల్లో దారికి ఇరువైపులా దట్టంగా ముళ్ళచెట్లు వుండేవి. మధ్య సన్నని సందుగుండా మా పరికరాలని ఒక్కొక్కటిగా అవతలివైపు చేరవేస్తూ పాకుకుంటూ వెళ్ళవలసి వచ్చేది

అంతేకాదు చెట్లకు వేలాడే విష జంతువుల బారినపడకుండా అనుక్షణం అప్రమత్తంగా వుండవలసి వచ్చేది అవిధంగా సుమారు ముప్పై కిలోమీటర్లు పయనించి చివరి మజిలీకి చేరుకున్నాం. అది చాలా ఎత్తైన ప్రదేశం. చుట్టూ పెద్దపెద్ద బండరాళ్ళున్నాయి. ఆ బండల మధ్యలోంచి ఓ వాగు పారుతోంది అందులోని నీళ్ళు చాలా తేటగా వున్నాయి.

పన్నెండేళ్ళ తరువాత తిరిగి ఇప్పుడే ఈ చోటుకి వచ్చాను అన్నాడు వీరప్పన్. చాలా దూరం నడిచివున్నందువల్ల అలసటకు వెంటనే నిద్రపోయాం మేము. మరుసటి రోజు కళ్ళు తెరిచినప్పుడు మాధేస్ అనే వీరప్పన్ అనుచరుడు మాకు సమీపంలోని నేలమీద కొన్ని పాదముద్రలు చూపించాడు. ఏదో జంతువు అటుగా నడిచివెళ్ళింది. పరీక్షగా చూసినప్పుడు మాకు అర్థమయింది - అవి పెద్ద పులి అడుగులని. ఒక్కసారిగా మా వెన్నులో వణుకుపుట్టినట్టయింది

అందరం స్నానపానాదులు ముగించుకున్నాం. వీరప్పన్ అప్పుడే పూజలు మొదలుపెట్టాడు. అతను ప్రతిరోజూ ఆయుధాలన్నింటినీ శుభ్రంగా కడిగి, పూజ చేశాక గాని ఆ తదుపరి కార్యక్రమాన్ని నిర్ణయించుకోడు. వాళ్ళందరూ అలాగే చేస్తారు.

మధ్యాహ్న భోజనాలు ముగించుకున్న తరువాత ముఖాముఖికి సంసిద్ధుడయ్యాడు వీరప్పన్. తను ఎక్కడ పుట్టిందీ, ఎలా పెరిగిందీ, గతంలో ఎలాంటి చేదు అనుభవాలు ఎదురైందీ వివరించాడు వీరప్పన్. తన కష్టాలు, కన్నీళ్ళు, రెండు రాష్ట్రాల పోలీసులు జరిపిన అరాచకాలు, అత్యాచారాలు, తనను కుంగదీసిన సంఘటనలు ఇలా తన బతుకు పుస్తకంలోని పేజీలన్నింటినీ వీడియో కెమెరా ముందు పరిచాడు వీరప్పన్. ఆ ముఖాముఖి జరుపుతున్నప్పుడు ఒకోసారి అడవిదున్నలు వచ్చి అవాంతరం కలిగించేవి. అప్పుడు వీరప్పన్ చిన్నపిల్లాడిలా పరుగెత్తుకుంటూ వాటిని అదిలిస్తూ దూరంగా తరిమేసి రొప్పుతూ వచ్చేవాడు. ఆ వెంటనే తన ఇంటర్వ్యూను కొనసాగించేవాడు ఈవిధంగా ఐదు రోజులపాటు అతనితో గడిపి వీరప్పన్ జీవితాన్ని వీడియోలో బంధించి విజయవంతంగా తిరుగు ప్రయాణమయ్యాము.

ఐదురోజుల పాటు నాగరిక ప్రపంచానికి దూరంగా ఓ ఎత్తైన ప్రదేశంలో వుండిపోవడం వల్ల కొండకింద ఏమేం మార్పులు చోటుచేసుకున్నాయో మాకు తెలియదు. అందుకే సకల జాగ్రత్తలతో నడిచివచ్చాం.

వీరప్పన్ మనిషి ఒకరు మా ముందు దాదాపు పదిహేను వందల మీటర్ల దూరంలో ఎస్కార్ట్‌లాగా వెడుతుండేవాడు. అతను ప్రమాదమేమీ లేదు వచ్చెయ్యండని సైగ చేసిన తరువాత మేం ముందుకు కదిలేవాళ్ళం. మాకు రక్షణగా మరో నలుగురు అనుచరులను కూడా మా వెంట పంపాడు వీరప్పన్. అవిధంగా చివరికి ఇరవైయ్యవ తేదీనాడు వణత్తురై సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నాం. దూరంగా ఓ కారు నిలిచివుండడాన్ని గమనించి ఇక భద్రంగా వెళ్ళండి అంటూ వీరప్పన్ అనుచరులు మాకు వీడ్కోలు చెప్పి వెనక్కి వెళ్ళిపోయారు.

ఆ ప్రాంత ప్రజల జీవన విధానంతో పోల్చిచూసినప్పుడు వీరప్పన్ సగటు జీవితంలో పెద్ద తేడా ఏమీ కనిపించదు. అతనిలో దైవభక్తి, సెంటిమెంటు రెండూ చాలా ఎక్కువగా వున్నాయి. 'సోవి' వేసి శకునం చూస్తాడు శకునం చూసేందుకు సూర్యుడు ఉదయించే దిక్కు, అస్తమించే దిక్కు, పిచ్చుకల అరుపులు ఇలా చాలావాటిని ఆధారంగా చేసుకుంటాడు. రేడియో, పత్రికలు అతని ప్రధాన సమాచార సాధనాలు. ఎక్కువగా రేడియోమీదే ఆధారపడతాడు. రేడియోలో వచ్చే అన్ని కార్యక్రమాలు వింటానని చెప్పాడు మాతో ఢిల్లీ, చెన్నై, కోవై, తిరుచ్చి, బిబిసి, సింగపూర్ స్టేషన్ల నుంచి వచ్చే వార్తల్లో

వేటినీ అతను వినకుండా వుండలేడు.

అవకాశం దొరికినప్పుడల్లా వివిధ వారపత్రికలు, దినపత్రికలు తెప్పించుకుంటాడు రామాయణం, మహాభారతం, దేశింగురాజు కథ, అరవళ్ళి-సూరవళ్ళి కథలు, ఎంజిఆర్ జీవితచరిత్ర, తమిళ టైగర్ ప్రభాకరన్ పోరాట గాథ వంటి అనేక పుస్తకాలు ఎప్పుడూ అతనివద్ద కనిపిస్తాయి

ఇరవైఏళ్ళ వయసు దాటాకే అతను చదువుకోవడం నేర్చుకున్నాడు అడవిలోనే అక్షరాలు దిద్దుకున్నాడు అయితే చదువు ద్వారా కంటే స్వీయ జీవితానుభవాల నుంచే ఎక్కువగా జ్ఞానం సంపాదించుకున్న వ్యక్తి వీరప్పన్.

నగరాల్లో నివశించే వాళ్ళతో సమానంగా ప్రపంచంలోని అన్ని విషయాల గురించి అతను మాట్లాడగలడు వాదించగలడు రష్యా ఎదుర్కొంటున్న సమస్యలు, అమెరికాలో చెలరేగుతున్న ఆందోళనలు, శ్రీలంకలో జరుగుతున్న తమిళ పోరాటం, భారతదేశపు రాజకీయాలు అన్నీ అతనికి బాగా తెలుసు.

రోగాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు అవసరమైన రకరకాల మందులు, మాత్రలు, పెన్సిలిన్ ఇంజక్షన్లు ఎప్పుడూ అతనివద్ద వుంటాయి. సూది యివ్వడం కూడా అతనికి వచ్చు మాథేజ్ అనే తన అనుచరుడికి వీరప్పన్ సూది ఇవ్వడాన్ని నేను స్వయంగా చూశాను.

పక్షుల, జంతువుల అరుపులు, ఆ అరుపులలోని భావాలు అతనికి బాగా తెలుసు. ఒకోసారి ఆయా జంతువుల మాదిరిగా అరిచి వాటిని తను వున్న చోటుకు రప్పించుకుని కాల్చి చంపి వండుకుని తినేవాడు ఇతనికి తెలిసినన్ని విద్యలు అడవిలో వుండే వాళ్ళెవరికీ తెలియవేమో అనిపిస్తుంది పోలీసుల డేగ కన్నుల్లో పడకుండా వీరప్పన్ ఇన్నాళ్ళుగా తప్పించుకుంటూ తిరగగలుగుతున్నాడంటే బహుశ అందుకు కారణం యిదే కావచ్చు. తనకూ పోలీసులకూ మధ్య తుపాకి యుద్ధం ఎలా జరుగు తుంటుందో ఆ రణరంగ వ్యూహాన్ని తను ఎలా పన్నుతాడో, తూటా దెబ్బలు తగిలిన పోలీసులు ఎలా అరుస్తారో, ఎలా పడిపోయి చచ్చిపోతారో, తమ ప్రాణాలని కాపాడుకునేందుకు మిగతావాళ్ళు ఎలా పరుగుపెడతారో వంటి ఘట్టాలన్నింటినీ ఆయన మాముందు చేసి (నటించి) చూపించాడు. అది మాకెంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది

కేంద్ర ప్రభుత్వానికి సైతం సవాలుగా మారిన ఈ టెర్రరిస్టుతో మొట్టమొదట ముఖాముఖిని జరిపి ప్రపంచానికి వెల్లడించినప్పుడు కొందరు పత్రికా జాంబవంతులు మమ్మల్ని నమ్మడానికే నిరాకరించారు. అలాంటివాళ్ళ అనుమానాలని పటాపంచలు చేసేందుకు ఇదిగో ఇప్పుడు వీరప్పన్‌తో నిర్వహించిన వీడియో ఇంటర్వ్యూని ప్రజల ముందు పెడుతున్నాం.

నేను ఈ విజయాన్ని సాధించడంలో సదా వెన్నంటివుంటూ, ప్రోత్సహిస్తూ, అవసరమైన సహాయాలనూ, డబ్బునూ అందిస్తూ, నాకు ఎంతో ధైర్యాన్నిచ్చి తోడ్పడిన మా పత్రికా సంపాదకుడికీ, ఇతర మిత్రులకీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

- శివ సుబ్రహ్మణ్యన్

విలేకరి, నక్కీరన్ పత్రిక



## వీరప్పన్ చెప్పిన వీరప్పన్ కథ

తూర్పున మెట్టూరు, పడమటన ఊటీ, దక్షిణాన అందియూర్, ఉత్తరాన ఓకనేక్కల్ ఉంటాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ మూడు రాష్ట్రాలకు విస్తరించిన ఆరువేల చదరపు కిలోమీటర్ల సువిశాలమైన, కొండకోనలతో కూడుకునివున్న, దట్టమైన అడవి అది.

మరోవిధంగా చెప్పాలంటే గత ముప్పై ఐదు సంవత్సరాలుగా గంధపు చెక్కల వీరప్పన్ ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న సామ్రాజ్యం అది!

వీరప్పన్‌కి దైవభక్తి ఎక్కువ. ప్రతిరోజూ పొద్దున లేవగానే సూర్యనమస్కారాలు చేస్తాడు. తన ఆయుధాలను పూజించుకుంటాడు.

ఆరోజు (18-3-1996 నాడు) కూడా అదే ప్రకారంగా వీరప్పన్, బేబి, సిద్ధన్, గోవిందన్, మాథేజ్ మొదలైన వాళ్ళంతా కలిసి దైవ ప్రార్థన, ఆయుధ పూజ చేసుకున్నారు. ఆ తరువాత నక్కీరన్ పత్రికకు వీడియో ఇంటర్వ్యూని మొదలు పెట్టేందుకు మంచి శకునం కోసం ఎదురుచూస్తూ కూచున్నాడు వీరప్పన్. కొంతసేపటికి పశ్చిమదిశ నుంచి బల్లి అరుపు వినిపించింది. వీరప్పన్ ముఖంలో ఒక విధమైన నిరాశ కనిపించింది. అతను అలాగే మరో శుభశకునం కోసం వేచి చూస్తూ మౌనంగా వుండిపోయాడు. మరికాసేపటికి తూర్పు దిశనుంచి బల్లి అరుపు వినిపించింది. ఈసారి వీరప్పన్ ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది.

'ఉత్తర్వు దొరికింది. ఇక మన ముఖాముఖిని ప్రారంభిద్దాం' అన్నాడు గంధపు చెక్కల వీరప్పన్ తన కథను తనే చెప్పడం మొదలుపెట్టాడు. ... ...



## తమిళమే!
## తమిళ రక్తమే!!

నా రాష్ట్ర ప్రజలకు, తల్లులకు, తండ్రులకు, పిల్లలకు, పెద్దలకు, నా దేశ జనులకు అందరికీ నా నమస్కారాలు!

నా గురించీ, నా కుటుంబం గురించీ, దాని చరిత్ర గురించీ ... అంటే, నేను ఎక్కడ పుట్టాను, ఎట్లా పెరిగాను, ఎందుకిట్లా మారాను అనే విషయాలన్నీ మీకు ఉన్నది ఉన్నట్లు చెప్తాను. అందరూ శ్రద్ధగా వినండి నా యాభై సంవత్సరాల అనుభవాలని మీ ముందుపెడుతున్నాను. తప్పు నాదా లేక ప్రభుత్వానిదా మీరే అర్థం చేసుకోండి.

నేను ఎప్పుడూ అబద్ధం ఆడను. ఎప్పుడన్నా నా ఎదుటవున్న శత్రువును మట్టుపెట్టేందుకు మాత్రమే అబద్ధం చెప్తాను. కానీ నన్ను చంపేందుకు పోలీసులు ఎన్నో అబద్ధాలు ఆడుతుంటారు. వాళ్ళని నిర్మూలించేందుకు నేను కూడా వాళ్ళకు తగ్గట్టు నాటకాలు ఆడుతుంటాను.

అంతేతప్ప నిజమైన ఒక సగటు మనిషి కోసం నేను నా ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనుకాడను. ఇది నా మనస్సాక్షిగా చెప్తున్న యదార్థం.

రాజకీయ నాయకులు వేదికలు ఎక్కి మిమ్మల్ని కాపాడతాను, మీకు అదిచేస్తాను, మీకు ఇది చేస్తాను అని రకరకాలుగా నాటకాలు ఆడి పదవిలోకి వచ్చి తమ కుటుంబం కోసం కావలసినంత డబ్బు మూటగట్టుకుంటారు. ప్రజల కోసం ఏమీ చేయరు. కానీ నేను అలాటివాడిని కాదు నేను ఆడిన మాట తప్పను. నేలలో శౌర్యం విత్తనాలను నాటే వాడిని నేను.

మాకు పది ఎకరాల భూమి వుండేది. అది మా తాత ఆస్తి. దానిని మా నాయన, మా చిన్నాయన చెరి ఐదు ఎకరాల చొప్పున పంచుకున్నారు.

మాది శంగప్పాడి అనే ఊరు అది చాలా చిన్న పల్లెటూరు. పాలారు సమీపంలో కావేరి నది ఒడ్డున వుంది ఆ గ్రామం. అంటే కర్ణాటక సరిహద్దు ప్రాంతం అన్నమాట. మా పూర్వీకులందరూ తమిళులే. నేను కూడా ఒక తమిళం వాడినే. నాలో వున్నది కూడా తమిళ రక్తమే. అయితే మేము కర్ణాటక సరిహద్దులో నివశిస్తున్నాము. అంతే.

నాకు ప్రజలంటే ప్రాణం. ప్రజలకు కూడా నేనంటే చాలా ప్రాణం.

భారతదేశంలోని ఇరవైనాలుగు రాష్ట్రాల ప్రజలకు నేనంటే ఎంతో ప్రేమ. నాకు కూడా వాళ్ళందరూ అంటే ఎంతో ప్రేమ. అటువంటి మంచి మనిషిని నేను ప్రజల అభిమానాన్ని నేను అస్సలు మరచిపోను. అయితే నా తలరాత మారి నాకూ పోలీసులకూ మధ్య విరోధం ఏర్పడింది.

అందుకు కారణాలు ఏమిటో అన్ని విషయాలు మీకు వివరంగా చెప్తాను తప్పు ఎవరిదో మీరే నిర్ణయించాలి.

నేను చెప్పింది అంతా విన్న తరువాత - నువ్వు చేసిందే తప్పు, నువ్వు బయటికి రా అని మీరు (ప్రజలు) అంటే నేను తప్పకుండా బయటికి వస్తాను. నన్ను నడిబజారులో నిలబెట్టి లక్షల మంది రాళ్ళతో కొట్టి చంపినా ఫరవాలేదు. నేను ఆ శిక్షను అంగీకరిస్తాను.

అయితే ఈ పోలీసువాళ్ళు, నన్ను చంపడానికి అని చెప్పి అక్కడా ఇక్కడా తిరుగుతూ ప్రజల మీద అత్యాచారాలు చేస్తున్నారు. పంచాయితీ పెట్టి న్యాయం వాదిస్తే వాళ్ళే ఓడిపోతారు. నేను ఓడిపోను.

తమ చేతిలో అధికారం వుందని, తాము ఏం చేసినా చెల్లుతుందని వాళ్ళు ఎలా కావాలంటే అలా ఆడుతుండొచ్చు కాని న్యాయం మాట్లాడితే మాత్రం నేనే గెలుస్తాను.

సరే ఇది అట్లా వుండనివ్వండి. దీని గురించి తర్వాత మాట్లాడుకుందాం.

మాకు పదెకరాల భూమి వుందని చెప్పాను కదా. అది చాలా ఎత్తైన ప్రదేశంలో వుంది. అందులో సరిగా పంటలు పండవు. ఎలాగోలా విత్తనాలు చల్లి కష్టపడితే ఒక మోస్తరుగా పండుతుంది.

మా తాతల కాలం నుంచి మాకు వేటనే ముఖ్యవృత్తి. వేట మీదే మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. నాకు బొత్తిగా చదువురాదు. ఈ అడవిలోకి వచ్చిన తరువాతనే మెల్లిగా చదువుకున్నాను. ఇక్కడే నా మాతృభాష తమిళం చదవడం నేర్చుకున్నాను. చిన్నప్పుడు నన్ను చదివించేందుకు నా తల్లిదండ్రులకు అవకాశం లేకుండా పోయింది. అప్పుడు వస్తులతో నేనూ, మా కుటుంబం ఎన్నో కష్టాలు పడ్డాము. మమ్మల్ని కాపాడేందుకు, మాకు ఇంత తిండిపెట్టేందుకు మా అమ్మా, నాయనా చాలా తిప్పలు పడేవాళ్ళు.

ఒక ఏనుగు తన బిడ్డను తనతోనే తిప్పుతూ ఎట్లా పెంచుతుందో అట్లా కష్టపడి మమ్మల్ని పెంచారు.

నా చిన్నప్పుడు నేను పశువుల కాపరిగా పనిచేశాను. వేరేవాళ్ళ ఆవులని, గేదెలని అడవిలోకి తోలుకుపోయి మేపుకొస్తుండేవాడిని

అయితే నాకు మాత్రం ఎప్పుడూ వేటమీదే వుండేది కన్ను. మా తాత, మా నాయన అదే వృత్తి చేసేవాళ్ళు అందుకే నాకు కూడా వేటాడాలని వుండేది. రోజూ అడవిలో పశువులను కాస్తుండటం వలన నాకు చిన్నప్పుడే అడవితో బాగా మిళితమైపోయింది.

మా నాయన అప్పుడప్పుడు తన చేతికింద సహాయంగా వుండేందుకు నన్ను వేటకు తీసుకు పోతుండేవాడు. అప్పుడు తుపాకి ఎట్లా పట్టుకుంటారు, ఎట్లా పేలుస్తారు, ఎట్లా లోడ్ చేస్తారు అని బాగా గమనించేవాడిని అందువల్ల నాకు చిన్నప్పుడే వేట గురించి కొంచెం అనుభవం వచ్చింది.

వేటాడటం తప్పు, జంతువులను చంపకూడదు అని మీరు అనొచ్చు నేను అది ఒప్పుకుంటాను నిజమే, తప్పే! జంతువులను అనవసరంగా కొట్టకూడదు కానీ ఈ మనిషిని భగవంతుడే సృష్టించాడు. ఈ మనిషి కోసమే ఈ చరాచర జగత్తునంతా ఏర్పాటుచేశాడు

దేవుడు మనకోసరమే ఈ జంతువులను అన్నింటినీ సృష్టించి యిచ్చాడు దీనిని ఎవరూ మార్చలేరు. అన్నింటినీ సృష్టించింది మనుషుల కొరకే. అయితే జంతువులన్నీ ఒకేసారి నశించిపోకూడదని ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వం కొన్ని నియమాలు పెట్టింది. ప్రాణుల పుట్టుక - నశించుట సమంగా వుండాలని ఈ మనిషే వాటిని ఏర్పాటు చేసుకున్నాడు.

అందువల్ల మీరు వీరప్పన్‌ను తప్పు పట్టేందుకు వీలులేదు. నేను వేటాడినాను. వేటాడుతున్నాను. ఎందుకు? నా కుటుంబ పరిస్థితి వల్ల. కుటుంబ పరిస్థితివల్లనే నాకు వేట అంటే ఆసక్తి కలిగింది. వేటాడితేనే నా కుటుంబం బతుకుతుంది. ఆ పరిస్థితే నన్ను వేటగాడిని చేసింది. నిజంగా మేము వేటాడే వాళ్ళమే.

ఏ ప్రభుత్వం మాకు తిండి పెడుతుంది? ఏ రాజకీయవాది మాకు సహాయం చేస్తాడు? ఎవ్వరూ ఏమీ చెయ్యరు. మాలాంటి బీదవాళ్ళకి ఒక బిచ్చగాడికి ఇచ్చే గౌరవం కూడా ఎవ్వరూ యివ్వరు.

కొంచెం పెద్దవాడిని అయ్యాక ... అంటే నాకు పదమూడు సంవత్సరాల వయసున్నప్పుడు మొదటిసారిగా తుపాకిని పట్టుకున్నాను. పధ్నాలుగేళ్ళ వయసు వచ్చేటప్పటికే నేను ఒక భయంకరమైన వేటగాడిని అయ్యాను. మా వాళ్ళందరికంటే బాగా కాల్చేవాడిని. వేరే ఎవరూ నా అంత చాకచక్యంగా తుపాకి కాల్చేవాళ్ళుకాదు.

సినిమాల్లో నటించేవాళ్ళ పిల్లలకి సినిమాల మీదే ఆసక్తి వుంటుంది. డ్రైవింగ్ ఫీల్డ్‌లో వున్నవాళ్ళ పిల్లలకి దానిమీదే ఆసక్తి ఏర్పడుతుంది. చదువుకోవాలనుకునే వాళ్ళకి చదువుమీదే శ్రద్ధ వుంటుంది. నాకు ఈ వేట మీద దేవుడే ఆసక్తి కలిగించాడు. అందుకు నేనేం చేయగలను? సరే అలాగే కానియ్యమని చెప్పి వేట నేర్చుకుని దానిమీదే జీవనం సాగిస్తున్నాను.

నేను వేటాడటం తప్పు అంటారు. కానీ కొంతమంది న్యాయమూర్తులే వేటకోసం స్వయంగా ఇక్కడికి వస్తుంటారు. న్యాయస్థానంలో కూర్చుని వేరే వాళ్ళకి శిక్షలు వేసే న్యాయమూర్తులే కార్లో వేటాడ్డానికి వస్తారు. నేను నా కళ్ళారా చూశాను. ఈ విషయం ఇక్కడి ప్రజలందరికీ తెలుసు. కాకపోతే జడ్జీగారు లైసెన్స్ వున్న తుపాకిని తెచ్చుకుంటాడు. అయనతో రేంజర్ వస్తాడు. డి.ఎఫ్.ఓ. కూడా వస్తాడు. పెట్టెలకు పెట్టెలు విస్కీ, బ్రాండీ సీసాలు తెచ్చుకుంటారు. మూడు నాలుగు జింకలని వేటాడి చంపుతారు. తింటారు, తాగుతారు మజా చేస్తారు. మిగిలింది ఇంటికి తీసుకుపోతారు.

వీళ్ళంతా ఆఫీసర్లు. వీళ్ళు చేసేది నేరం కాదు. న్యాయమూర్తి వేటాడితే తప్పులేదు కానీ ఈ వీరప్పన్ లాంటి ఒక పిచ్చివాడు తిండికి గతిలేక వేటాడితే మాత్రం అది చాలా పెద్ద తప్పా! పాపం

అదేపని పెద్దవాళ్ళు చేస్తే పాపం కాదు. ప్రపంచమంతా ఈవిధంగా నడుస్తున్నది. అందుకే మీకు ఇంత వివరంగా చెబుతున్నాను.



## మొదటి వేట !
## మొదటి హత్య !!

నేను అడవికి వచ్చి ఏదో పొట్టపోసుకుంటుండగా సేవికొండర్ అనే ఆయన వచ్చాడు. నాకు ఆయన గురువు వంటివాడు. చాలా మంచి వేటగాడు. ఈ ప్రాంతంలో పెద్ద పేరుంది ఏనుగు దంతాల వ్యాపారం చేస్తుండేవాడు. ఒకరకంగా నాకు బావ వరస అవుతాడు.

ఒకరోజు నేను అడవిలోకి పోతున్నప్పుడు ఆయన కనిపించాడు 'ఏంటి బావా ఏనుగులని వేటాడడానికి వచ్చావా?' అని అడిగాను.

'అవునురా బామ్మరిదీ' అన్నాడు. ఎంత చిన్నవాడినైనా ఆయన అట్లాగే పిలుస్తాడు

ఆయన ఏనుగులని ఏవిధంగా పడగొడతాడో చూడాలనిపించింది. 'నేను కూడా నీతో రానా' అని అడిగాను. 'రారా' అని తీసుకెళ్ళాడు

కణత నుంచి నుదురు భాగాన్ని చూపిస్తూ 'ఏనుగును ఇక్కడే కొట్టాలి. అప్పుడే అది పడిపోతుంది' అని చెప్పాడు. నాకు తన 577 రైఫిల్ యిచ్చాడు. అది చాలా పెద్ద రైఫిల్. ఆయన కాల్చమని సైగ చేసినప్పుడు గురిచూసి కాల్చాను అంతే. ఏనుగు అరుస్తూ పడిపోయింది.

అదే నా మొట్టమొదట వేటాడిన ఏనుగు!

అది చెంగంపాడి అనే ఊరు పక్కన వున్న రామదాన్యం అనే అడవి ఆ ఏనుగును ఎలా కొయ్యాలి? ఒక పదునైన కత్తితో దాని తలను నరికి దంతాలను వేరుచేసి తీసుకుని పోయాము. ఆ రోజు నుంచే నేను ఏనుగుల వేటగాడిని అయ్యాను దాంతో ఏదో కొంత డబ్బును కూడా సంపాదించాను.

నా పేరు చెప్పి ఎంతోమంది ఏనుగులను వేటాడేవాళ్ళు. ఎందరో రాజకీయనాయకులు కూడా ఏనుగులను చంపారు. కిరాయి మనుషులను పెట్టి చంపించారు కాని పేరు మాత్రం వీరప్పన్‌ది!

ఆ తరువాత నేను పెద్ద ఎత్తున వేటాడాను. ఆఫీసర్లకు లంచాలు ఇచ్చాను అటవీశాఖ సిబ్బందికి లంచాలు యిచ్చాను. అయితే నేను ఎవరితోనూ నేరుగా మాట్లాడేవాణ్ణికాదు. ఆ పనులన్నీ మా అన్న చూసుకునేవాడు. మేము వేటాడుకోడానికి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు మా దగ్గర డబ్బు తీసుకుపోయే వాళ్ళు. మేము వేటాడి సంపాదించిన డబ్బుని తిండికి మాత్రమే వాడుకుని మిగతాది వేరేవాళ్ళకి ఇచ్చేవాళ్ళం. దానధర్మాలు చేసేవాళ్ళం

చెంగప్పాడిలో వున్న కుటుంబాలన్నీ మా కుటుంబంలాగే పేదరికంతో మగ్గిపోతూ వుండేవి. నేను పేదరికంతో పోరాడినవాడినే కాబట్టి నాకు వాళ్ళ కష్టాలన్నీ బాగా తెలుసు. ఒక మనిషి తిండిలేక పస్తులు వున్నప్పుడు ఎంత బాధగా వుంటుందో నాకు అనుభవమే అందుకని నేను చాలామందికి సహాయం చేస్తుండేవాణ్ణి. డబ్బు దాచుకునేవాణ్ణికాదు. అది వేటాడి సంపాదించిన డబ్బు. అందుకని కొంచెం కూడా నా దగ్గర వుంచుకోలేదు.

రాజకీయ నాయకులు ఏ గ్రామంలోనైనా కొంచెం పలుకుబడి వున్న పెద్దమనిషి కనిపిస్తే అతణ్ణి ఓట్లకోసం తమవైపు తిప్పుకోవాలని చూస్తారు. అందుకనే వాళ్ళు నా దగ్గరకు వచ్చి 'వీరప్పా! నువ్వు మాకు కొంచెం సపోర్ట్ ఇవ్వవయ్యా' అని అడిగేవాళ్ళు. భారతదేశం గణతంత్ర దేశం. ఎలాగూ ఓటు వెయ్యకతప్పదు. ఏదో ఒక పక్షానికి సపోర్ట్ చెయ్యవలసిందే నేను చెబితే ప్రజలు వింటారు అందుకని ఎవరో ఒకరికి సపోర్ట్ చేసేవాణ్ణి. అప్పుడు వేరే పక్షం వాళ్ళకి కోపం వచ్చేది 'వీరప్పన్ ఫలానా వాళ్ళకి సపోర్ట్ చేస్తున్నాడు. ఆ రాజకీయవాదులకు బాగా డబ్బు యిచ్చాడు' అని ఏదేదో ప్రచారం చేసేవాళ్ళు

నేను అధికార్లకు డబ్బు ఇచ్చిన మాట నిజం! కాని రాజకీయవాదులకు మాత్రం ఐదుపైసలు కూడా ఇవ్వలేదు! ఓటు వేయమని మాత్రం ప్రచారం చేశాను నేను చెబితే ప్రజలు వింటారు. వేరేవాళ్ళకి ఓటు వెయ్యరు. అందుచేత వేరే పక్షం వాళ్ళకి కోపం వచ్చేది.

అప్పుడు ఊరంత వెంకటగౌడ కంట్రోల్‌లోనే వుండేది. అతను మొదట కాంగ్రెస్ పార్టీలో వుండేవాడు. అతను ఒక వకీలు. ప్రజలు అతనికే ఓటు వేశారు అతను చనిపోయిన తరువాత రాజాగౌడ రాజకీయాల్లోకి వచ్చాడు మన ఊళ్ళో వేరే పెద్ద మనుషుల మాట వినరు. అందరూ నా మాటే వింటారు. అందుకని రాజాగౌడ నా దగ్గరకు వచ్చాడు 'వీరప్పా కొంచెం హెల్ప్ చెయ్యాలయ్యా' అని అడిగాడు ఆయనకు అదే మొదటి ఎలక్షన్ ఆయన అడగగానే నేను సరే అని ఒప్పుకున్నాను ఆయనకే ఓటు వెయ్యమని ప్రజలకు చెప్పాను. ప్రజలందరూ ఆయనకే ఓటు వేశారు. ఆ ఎన్నికల్లో ఆయనే గెలిచాడు. ఆ ఎన్నికలప్పుడు నేను ఆ ఒక్క గ్రామంలోనే కాకుండా ఆ ప్రాంతంలోని గ్రామాలన్నింటిలోని ప్రజలకు చెప్పాను. అప్పుడు రాజాగౌడకు పోటీగా జనతాపార్టీలో ఎవరు నిలుచున్నారు? ఆ ... నాక్కణ్ణన్ నిలుచున్నాడు. ఆయన ఓడిపోయాడు. అప్పటి నుంచే ఆయనకు నేనంటే కొంచెం .. ...

ఆ తరువాత రాజకీయవాదులందరూ 'వీరప్పన్ ప్రజలందరి మనసు మార్చాడు. లేకపోతే రాజాగౌడ గెలిచేవాడు కాదు' అని అన్నారు. అందుకే నాక్కణ్ణన్‌కి అప్పటినుంచే నామీద ఏడుపు ...! అంటే నా వల్ల రాజాగౌడకు ఒక యాభైవేల ఓట్లు దొరికి వుండొచ్చు ఎందుకంటే చెంగప్పాడి, గోపీనత్తమ్, మాదేశ్వర కొండ, మాట్టల్లి, నల్లూరు, జల్లిపాళయమ్, ఊంగియమ్, గూడలూరు, కొళల్లూరు, కొప్పం, ఇంకా పూరాంఅల్లూర్ తదితర ప్రాంతం అంతా ప్రజలు నేను చెబితే వింటారు. వీరప్పన్ వల్లనే ఇలా జరిగిందని ఆయనకి నామీద మంట.

తరువాత ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మళ్ళీ ఎన్నికలు జరిగాయి. ఇలా ఉండగా మా ఊళ్ళోనే ఒక తగాదా వచ్చింది వాళ్ళు కూడా మా కులం మనుషులే. అయితే వాళ్ళు నాక్కణ్ణన్ గ్రూపులో వున్నారు వాళ్ళకి అప్పుడే నాతో శతృత్వం వచ్చింది. ఈ వీరప్పన్‌ని ఎలాగైనా లేపెయ్యాలి అనుకున్నారు వాళ్ళు వాళ్ళకీ వ్యవసాయం వుంది. నాకూ వ్యవసాయం వుంది. వాళ్ళు ఏనుగులను వేటాడతారు. నేనూ ఏనుగులని వేటాడతాను. కానీ వాళ్ళు వేరే పనులు కూడా చేస్తారు. అంటే దొంగతనాలు చేస్తారు దొడ్లో మేకనీ వదిలిపెట్టరు. ఇంట్లో కోడిపిల్లనీ వదిలిపెట్టరు. చివరికి కొబ్బరికాయలు కూడా దొంగిలిస్తారు.

అయితే వాళ్ళు ఎప్పుడూ నా దగ్గరకు రారు. నేనంటే వాళ్ళకి భయం. ప్రజల సొత్తు మాత్రం ఏదైనా దొంగిలించుకుపోతారు. దేన్నీ విడవరు. నేనైతే కాల్చిపారేస్తాను. అందుకనే నా జోలికి రారు. డబ్బు మొదలుకొని ఆడపిల్లల వరకు దేన్నీ వదిలిపెట్టరు. వాళ్ళు అవతలి పక్షంలో వున్నందువల్ల నన్ను కాల్చిపడెయ్యాలని వాళ్ళకి కసి. చివరికి నన్ను చంపాలని ఒక నిర్ణయం తీసుకున్నారు. నాక్కణ్ణన్

మనుషులు ఒక ముప్పై మంది వరకు వుంటారు. ఆ గ్యాంగుకు తుపాకి కాల్చడంలో బాగా అనుభవం వుంది. చాలాసార్లు నేను ఎక్కడికిపోతే వాళ్ళు అక్కడికి వచ్చి చూశారు అదే సమయంలో మా అమ్మకు క్యాన్సర్ వచ్చింది. అప్పుడు నేను అడవిలో దాక్కుని వున్నాను ఎందుకంటే ఊళ్ళోకి వస్తే . కష్టం కదా!

వాళ్ళు నన్ను కాల్చాలని చూస్తున్నారని, ఏ కొంచెం అజాగ్రత్తగా వున్నా కాల్చేస్తారని చాలామంది ప్రజలు నా దగ్గరకు వచ్చి చెప్పారు. నా చేతిలో కూడా తుపాకి వున్నది. కానీ వాళ్ళు ఎదురుగా రాకుండా ఎక్కడో దాక్కుని కాలుస్తారు కదా. అందుకని నా జాగ్రత్తలో నేను వున్నాను. అప్పుడే మా అమ్మ ఆరోగ్యం చాలా దెబ్బతిన్నది. నేను పోయి చూసేందుకు వీలుకాలేదు. ఒకరోజు ఒక మనిషి వచ్చి 'అమ్మ నన్ను ఒకసారి వచ్చిపొమ్మని చెప్పింది' అన్నాడు. అప్పుడు నేను ఒక పదిహేనుమంది అనుచరులని రక్షణగా పెట్టుకుని పోయాను అమ్మ నన్ను చూసి బాగా ఏడ్చింది. అప్పుడు టైం మధ్యాహ్నం పన్నెండున్నర అవుతుంది. 'ఎందుకమ్మా ఏడుస్తావు' అని అడిగాను

"ఏం లేదు నాయనా! నేను ఇంక ఐదారు రోజులు కూడా బతకను. నా ఆరోగ్యం పరిస్థితి అట్లా వున్నది. నేను చచ్చిపోయినా నువ్వు మాత్రం మళ్ళీ రావద్దు నన్ను చూడవద్దు ఎందుకంటే నువ్వు వస్తే వాళ్ళు నిన్ను కూడా కాల్చి చంపుతారు నేను జీవితంలో అన్నీ చూశాను. నువ్వు ఇంకా బతకాలి. ఎలాగైనా నీ ప్రాణాలు కాపాడుకో బిడ్డా ఇక్కడ వున్నవాళ్ళే నన్ను పూడ్చిపెడతారు. నువ్వు మాత్రం అస్సలు రావద్దు' అని ఏడుస్తూ చెప్పింది. అయ్యో అమ్మ అట్లా మాట్లాడిందేమిటి అని బాధపడుకుంటూ నేను మళ్ళీ అడవిలోకి వచ్చేశాను ఒక పదిహేను రోజుల తర్వాత ఉండబట్టలేక మా తమ్ముడు అర్జుననను ఒక చోటుకు రమ్మని కబురు పంపించాను. ఆ చోటు మా తమ్ముడికి బాగా తెలుసు. నేను చెప్పిన రోజు అనుకున్నట్టుగానే వాడు వచ్చాడు

'అమ్మ ఎట్లా వుందిరా?' అని అడిగాను

వాడు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ 'ఇంకెక్కడి అమ్మ నువ్వు వచ్చిన ఐదవరోజునాడే చచ్చిపోయింది. అంత్యక్రియలు అన్నీ అయిపోయాయి' అని చెప్పాడు

నాకు ఒక్కసారి పిచ్చిఎత్తినట్టు అయింది

కన్నతల్లికదా. పదినెలలు నన్ను మోసింది. కనీ పెంచీ పెద్ద చేసింది ఈగలు వాలకుండా, చీమలు కుట్టకుండా కళ్ళలో పెట్టుకుని నన్ను కాపాడింది అట్లాంటి తల్లికి ఆఖరుకు నోట్లో నీళ్ళు కూడా పొయ్యలేక పోయానే అని నాకు బాగా దుఃఖం వచ్చింది.

వీళ్ళవల్లనే కదా నేను నా కన్నతల్లిని చూడలేకపోయాను అని వెర్రి కోపం వచ్చింది వీళ్ళని కాల్చిపడెయ్యాలని నేరుగా లేచివెళ్ళిపోయాను.

మేం కనబడితే కాల్చాలని వాళ్ళు అక్కడక్కడా తిరుగుతున్నారు. నా దగ్గర కూడా మనుషులున్నారు నేను ఒక దగ్గరకు పోయి మాటువేసి కూచున్నాను. వాళ్ళు వచ్చారు. అంతే కొట్టేశాను. వాళ్ళలో ముఖ్యమైన ఇద్దరినీ కాల్చేశాను. ఆ తరువాత ఊరుకెళ్ళి అక్కడినుంచి అడవిలోకి వెళ్ళి దాక్కున్నాను. కొంతకాలం అడవిలోనే వుండిపోయాను.

అడవిలో జీవనం సాగించాలంటే ఏం చేయాలి? వేటాడాలి అది గుండలపేట్టై అడవి. చాలా పెద్ద అడవి. నాకు ఆ అడవి కొత్త. ఏ దారి ఎటు పోతుందో నాకు తెలియదు. ఒక రాత్రంతా ఒకచోటులో వున్నాను. వంట చేసుకుని తిన్నాను. ఆ అడవిలో ఏనుగులు చాలా వున్నాయి. ఒక ఏనుగుల గుంపు మాకు కొంచెం దూరంలో మేస్తున్నాయి. అక్కడ నేను పడుకుని వున్నాను నాతోపాటు పన్నెండు

మంది వున్నారు. నేను కావాలనుకుంటే యాభై మందైనా నాతో వస్తారు. కాని అప్పుడు పన్నెండుగురే వున్నారు. భోజన సామాగ్రి బియ్యం, పప్పులు, పాత్రలు అన్నీ కలసి ఒక ముప్పై నలభై కిలోలు వుంటాయి మా దగ్గర.

అప్పుడు మా వద్ద రెండు మూడు తుపాకులే వున్నాయి. వంట చేసుకుని తిని అందరం పడుకున్నాము. ఇప్పటి మాదిరిగా అప్పుడు మాకు కాపలా లేదు. నన్ను ఎవరూ వెతకరు. అయితే మేం వంట చేసుకున్నప్పుడు నిప్పు, పొగా రావటం గమనించి అడవిలో వుండేవాళ్ళు ఎవరో పోయి ఫారెస్టువాళ్ళకు చెప్పారట. దాంతో ఫారెస్టు గార్డులు ముప్పై తుపాకులు తీసుకుని వచ్చేశారు. మేము ఎవరమో అప్పుడు అక్కడ ఎవరికీ తెలియదు. అప్పుడు నాకు ఇంత పేరు కూడా లేదు. మేమంతా పడుకుని నిద్రపోతూ వున్నాం. చుట్టూ ఎత్తైన గడ్డి భయంకరంగా వుంది. దడదడమంటూ ఫారెస్టు వాళ్ళు మా దగ్గరకు వచ్చేశారు.

నేను మొదట ఏనుగు వస్తోందేమో అనుకున్నాను. నేను ఎప్పుడూ తలదగ్గరే తుపాకి పెట్టుకుని పడుకుంటాను. చెయ్యితో తడిమిచూస్తే తుపాకి దొరకలేదు. గబుక్కున లేచి కూర్చున్నాను. ఎదురుగా కొంచెం దూరంలో వున్నది ఏనుగు కాదు - మనిషి. మనవాళ్ళే ఒంటేలుకుగాని పోయివస్తున్నారేమోనని భావించాను. కాని వెంటనే ఆలోచన వచ్చింది. మనవాళ్ళయితే తలమీద టోపీ వుండదు కదా? సడన్‌గా తెలిసిపోయింది - వాళ్ళు ఫారెస్ట్‌వాళ్ళని. ఒకటి రెండు తుపాకులు ధడేల్ ధడేల్‌మని పేలిన శబ్దాలు వినిపించాయి. నేను గభాల్న వేరే పక్కకు దూకి ఆ గడ్డిలోంచి వేగంగా పరుగెత్తాను. వాళ్ళు నా మనుషులలో ఒకర్ని కాల్చేశారు. మిగతావాళ్ళు పారిపోయారు. చనిపోయిన కుర్రాడిపేరు రత్నం. నేను ఒక చెట్టుచాటున దాక్కున్నాను. నేను నా తుపాకిని తీసుకోలేకపోయాను. తీసుకుని వుంటే వాళ్ళందరిని కాల్చేసి వుండేవాడిని. ఎందుకంటే నాది ఏ.కె. 47 రైఫిల్, ఇంకా 124 రైఫిల్ కూడా వుంది. వాటిని ఎప్పుడూ పూర్తిగా లోడ్‌చేసి పెట్టుకుని వుంటాను. ఆ తుపాకులను వాళ్ళు తీసుకుపోయారు. వాళ్ళు చాలాదూరం పోయిన తరువాత నేను అక్కడినుంచి వెళ్ళిపోయాను. ఈ సంఘటన జరిగిన తరువాతనే నేను పోలీసులకు బెంగుళూరులో పట్టుబడ్డాను.



## ఏనుగు దంతాలన్నీ బొమ్మలుగా మారి ఎప్పుడో అమెరికాకు వెళ్ళిపోయి వుంటాయి!

అప్పుడు భవానీ అనే ఊళ్ళో రాజామణి అనేవాడు వుండేవాడు. ప్రపంచంలోనే వాడొక నెంబర్ వన్ కేడీ. భయంకరమైన లోఫర్. ఆ ద్రోహి ఎంతోమందిని ఎన్నో విధాలుగా దోచుకున్నాడు. వాణ్ణి నేనే చంపాలనుకున్నాను. కాని వేరెవరో చంపేశారు.

ఆ రాజామణి ఒక బ్రోకర్‌గాడు. తుపాకులు కొనిస్తాడు. తూటాలు కొనిస్తాడు. గంధపు చెక్కలు కొంటాడు. ఏనుగు దంతాలు కొంటాడు. అన్నిరకాల అరాచకాలు చేస్తాడు.

నేను వాడి దగ్గరకు వెళ్ళి 'ఒక తుపాకి దొరుకుతుందా' అని అడిగాను. 'ఆ దొరుకుతుంది' అన్నాడు. 'ఊటీలో ఉంది' అన్నాడు. ఒక కారు తీసుకుని ఇద్దరం ఊటీకి పోయాము. అక్కడ దొరకలేదు. అక్కడ నుంచి సేలం పోయాము. అక్కడ కూడా దొరకలేదు. ఆ తరువాత బెంగుళూరు పోయాము. అక్కడ ఒక రూం తీసుకున్నాం 'హసన్‌లో ఒక తుపాకుల దుకాణం వున్నది. ముందు

నేను పోయి చూసి వస్తాను' అన్నాడు. అప్పుడు 'నేను కూడా నీతో వస్తాను' అని చెప్పాను. అప్పుడు 'వద్దు వద్దు నువ్వు ఇక్కడే వుండు. ఎందుకంటే అక్కడ ఒక గలాటా జరిగింది. నువ్వు వస్తే ఇబ్బంది అవుతుంది' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఎక్కడికి వెళ్ళాడు? గలాటా జరిగిన కుండలపేటకు వెళ్ళాడు. కారులో నేరుగా రేంజర్ దగ్గరకు పోయి 'వీరప్పన్ ఇట్లా రూంలో వుండమని చెప్పి వచ్చాను అతణ్ణి పట్టిస్తే ఎంత డబ్బు యిస్తారు?' అని బేరం ఆడాడు. చివరికి రాజామణి ఆ రేంజర్‌నీ, గార్డు, ఫారెస్టర్, డి ఎఫ్ ఓ , డి.ఎస్.పి లను వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళంతా సివిల్ డ్రస్‌లో వున్నారు. అందరినీ ఒక హోటల్‌లో వుంచి మా రూంకి వచ్చాడు ఇదంతా అప్పుడు నాకు తెలియదు.

"ఏంటయ్యా? పోయినపని ఏమైంది?' అని అడిగాను

'అవన్నీ వెనకాల వస్తున్నాయి ఎ.కె. 47, తూటాలు తీసుకుని ఒక మనిషి వస్తాడు ఈలోపల మనం భోంచేసి వద్దాం పద' అని నన్ను పిలుచుకుని పోయాడు.

బెంగుళూరు కంటోన్మెంట్ బస్టాండుకు ఉత్తరంవైపు బంగళా మీద ఒక మిలిటరీ హోటల్ వుంది. ఇద్దరం అక్కడికి పోయాము నేను చేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నాను నన్ను పట్టించాలని ప్లాన్ వేసిన ఆ దొంగ నాకొడుకు నా పక్కనే కూర్చుని వున్నాడు.

ఏం తిందాం చెప్పు అని అడిగాను. నువ్వే చెప్పు అన్నాడు వాడు రెండు చికెన్ బిర్యాని తీసుకురా అని వెయిటర్‌కు చెప్పాను. అతను గ్లాసులో మంచినీళ్ళు పెట్టాడు. నేను ఎందుకో అనుమానంతో నలువైపులా చూశాను. ఇద్దరి చూపులు నామీదనే వుండటం గమనించాను అవి దొంగ చూపులు. పైగా వాళ్ళు జేబుల్లో చెయ్యి పెట్టుకోవడం కూడా గమనించాను ఒకతను చప్పున నా దగ్గరకు వచ్చి నా జేబులు తడిమాడు నా ప్యాంటు జేబులో చెయ్యి పెట్టేవాడు ఎవడై వుంటాడు? నాకు అర్థమైపోయింది వాళ్ళు పోలీసులే.

అప్పుడు నా మీద రెండు హత్యకేసులు వున్నాయి. ఇన్నాళ్ళు తప్పించుకుని తిరుగుతున్నాను. అందుకే వాళ్ళు ఇప్పుడు నన్ను పట్టుకుంటున్నారు అతను నన్ను చెక్ చేసిన వెంటనే ఒక ఇరవై చేతులు నన్ను చుట్టుముట్టివేశాయి నన్ను గట్టిగా పట్టుకుని రివాల్వర్, పిస్టల్ ఏదైనా వుంటే తీసేయ్ తీసేయ్ అన్నారు

'అరె నా దగ్గర ఒక్క మట్టి పెడ్డ కూడా లేదు' అని చెప్పాను. 'ఏ ఊరు' అని అడిగారు 'నా ఊరేదో తెలియకుండానే నన్ను పట్టుకున్నారా' అన్నాను 'నువ్వు వీరప్పన్‌వి కదా?' అని అడిగారు. 'అవును' అన్నాను. "ఏం చేశావు?' అని అడిగారు.

'రెండు హత్యలు చేశాను. ఒక ఏనుగుని చంపాను అందుకనే కదా మీరు అరెస్టు చేస్తున్నారు. మీరు నా మీద కేసు వెయ్యండి. నేను అన్నీ ఒప్పుకుంటాను ఎలాగైనా తీసుకెళ్ళండి. కానీ పైన చెయ్యి వెయ్యకూడదు. దెబ్బలు కొట్టకూడదు' అని చెప్పాను.

నాకు ఈ వైపు ఐదుగురు, ఆవైపు ఐదుగురు వచ్చి తీసుకుపోతున్నారు. నన్ను ప్లాన్ వేసి పట్టిచ్చిన ఆ రాజామణిగాడు తనకు ఏం తెలవనట్టు ఇంకా అట్లాగే నటిస్తున్నాడు అతణ్ణి కూడా పట్టుకుని నాతోపాటు ఈడ్చుకుని వచ్చారు. అక్కడికి పోయిన తర్వాత చూస్తే ఎస్.పి , డి ఎస్.పి. అంతా వున్నారు. నన్ను ఎవరు ఏమిటి అని విచారించారు.

'మా ఊరు చెంగప్పాడి, నా పేరు వీరప్పన్. నేను ఇద్దరిని కాల్చి చంపాను' అని చెప్పాను. 'ఎందుకు చంపావు?' అని ప్రశ్నించారు 'మా మధ్య విరోధం ఏర్పడింది. నన్ను చంపడానికి ముందు

వాళ్ళే తుపాకులు తీసుకుని తిరిగారు. నేను ఏం చెయ్యాలి? అందుకే కాల్చి చంపాను. మీరు కేసు వేయండి నేను కోర్టులో తేల్చుకుంటాను. నేను మీ దగ్గర ఏదీ దాచలేదు. నేను అబద్ధం చెప్పి తన్నులు తినేవాణ్ణి కాదు మీరు కూడా అన్నీ తెలిసే కదా నన్ను పట్టుకున్నారు. అందుకని కేసు వేయండి. నేను కోర్టులో చూసుకుంటాను' అని చెప్పాను.

'ఆహా బాగానే మాట్లాడుతున్నావే! ఇంకా ఏమేం నేరాలు చేశావు?' అని అడిగారు.

'ఏం చేశాను. బతుకుతెరువు కోసం ఒక ఏనుగును కాల్చాను ఒక పులిని చంపాను. అంతే' అని చెప్పాను

ఆ తరువాత 'అయ్యా నాకు బాగా ఆకలిగా, నీరసంగా వుంది. కొంచెం భోజనం తెప్పించండి తక్కిన విషయాలు రేపు చెబుతాను' అన్నాను. పెరుగన్నం పెట్టారు. తిన్నాను. నన్ను ఒక రూంలో పెట్టారు. మరుసటిరోజు ఇంకొక రూంకి మార్చారు. ఇట్లా పదిహేను రోజులపాటు న్యాయమైన భోజనం పెడుతూ నన్ను తమ దగ్గర పెట్టుకున్నారు. అంటే బెంగుళూరులో నన్ను పట్టుకున్నప్పుడు నా దగ్గర ఐదువేల రూపాయలు వున్నాయి. వాళ్ళు ఆ డబ్బు తీసేసుకుని నా డబ్బుతోనే నాకు భోజనం పెట్టారు.

ఇట్లా పదిహేను రోజులు గడిచిపోయిన తరువాత నేను ఒకరోజు ఒక పోలీసు అతణ్ణి పిలిచి 'ఇక్కడ రా అయ్యా! పోయి ఒకసారి డి.ఎస్.పి ని పిలుచుకొని రా' అన్నాను 'ఎందుకు' అని అడిగాడు 'నీతో ఏం చెప్తాను' అన్నాను. 'సరే ఫోన్ చేస్తాను' అంటూ అతను డి.ఎస్.పి.కి ఫోన్ చేశాడు ఆ మరుసటి రోజు డి ఎస్ పి. వచ్చాడు. 'ఏంటీ నన్ను రమ్మన్నావట' అని అడిగాడు. 'అవునయ్యా' అన్నాను ఆ డి.ఎస్.పి. కుర్చీలో కూర్చున్నాడు. నేను నేలమీద కూచున్నాను.

'అయ్యా గుండలపేట అడవిలో జరిగిన సంగతి ఫారెస్టు వాళ్ళ దగ్గర డి.ఎస్.పి. దగ్గర పొరపాటుగా చెప్పివున్నాను. నిజం ఏమిటంటే ఫారెస్టు వాళ్ళు నలుగురైదుగురు నా మనిషి ఒకణ్ణి పట్టుకున్నారు. అప్పుడు వాడు వాళ్ళ నుంచి తప్పించుకుని పారిపోవటానికి ప్రయత్నం చేశాడు. ఒక ఫారెస్ట్ గార్డు నా మనిషిమీద కాల్పులు జరిపాడు. ఒక తూటా గురితప్పి వేరే గార్డుకు తగిలింది. అప్పుడు వాళ్ళు వీరప్పనే ఆ ఫారెస్టుగార్డుని కాల్చి చంపాడు అని డి.ఎస్.పి. దగ్గర చెప్పారు. అది నేను ఒప్పుకున్నాను. కాని ఇప్పుడు మీతో జరిగింది జరిగినట్టు చెప్తున్నాను' అన్నాను

అప్పుడు ఆ డి ఎస్.పి 'ఫైరింగ్ ఆర్డర్స్ లేకుండా ఫారెస్ట్ గార్డులు అట్లా కాల్చడం తప్పు వాళ్ళ మీద కూడా కేసు వెయ్యొచ్చు' అన్నాడు.

'నాకు ఒక ఉపకారం చెయ్యగలరా అయ్యా' అని అడిగాను. 'ఏం ఉపకారం?' అన్నాడు డి.ఎస్.పి.

'నేను ఇట్లా అడుగుతున్నాను అని ఏమీ అనుకోవద్దు. ఒప్పుకుంటే ఒప్పుకోండి లేకపోతే వదిలేయండి. లక్ష కావాలా రెండు లక్షలు కావాలా చెప్పండి. డబ్బు యిస్తాను. నన్ను విడుదల చెయ్యండి' అని చెప్పాను.

'నువ్వు డబ్బు ఎట్లా ఇస్తావు' అని అడిగాడు.

పోలీసు వాళ్ళ సంగతి మనకు తెలియదా? డబ్బు కావాలనుకుంటే దానికోసం ఒక కేసు వేస్తారు. మనలాంటి అమాయకులని అందులో యిరికిస్తారు. రాజకీయ నాయకుల దగ్గర గుంజీలు తీయమంటే తీస్తారు. అందుకని నేను ఆ డి.ఎస్.పి దగ్గర ఏం చెప్పానంటే 'అయ్యా! మాకు కొంచెం భూమి వుంది సుమారు ముప్పై ఎకరాల వరకు వుంటుంది. ఆ ఊళ్ళో తక్కువలో తక్కువగా ఒక ఎకరం లక్ష రూపాయల ధర పలుకుతుంది. నేను భూమి అమ్మి నీకు డబ్బు యిస్తాను. మా ఊళ్ళో డబ్బున్న వాళ్ళని అడిగితే వెంటనే రెండు లక్షల వరకు ఇచ్చేస్తారు. అది నీకు యిస్తాను. నమ్మకం కొరకు

నలుగురు పోలీసులను నమ్మకస్తులను నాతోటి పంపించు. డబ్బు చేతిలో పడ్డ తర్వాతనే నన్ను రిలీజ్ చెయ్యి' అని చెప్పాను.

అప్పుడు డి.ఎస్.పి ఏం చెప్పాడంటే 'వీరప్పా నాకు ముప్పై ఐదు సంవత్సరాల సర్వీసు వుంది. ఇంతవరకు నేను ఎవరిదగ్గరా ఐదు పైసలు కూడా తీసుకోలేదు. ఎవడో తీసుకోవచ్చు. అరాచకంగా ప్రవర్తించి వుండొచ్చు. నేను రిటైర్ అవటానికి ఇంకా రెండు సంవత్సరాలే వుంది. ఇన్నాళ్లు తీసుకోకుండా ఇప్పుడు తీసుకోవడం ఏమిటి? తీసుకుంటే ఎక్కడికైనా బదిలీ చేస్తారు అంతే. కానీ చెడ్డపేరు కదా నాకు డబ్బు వద్దు. నీమీద కేసు ఫైల్ చేస్తాను. ఏమీ భయపడవద్దు నీకు ఏమీ కాదు. ఇంకమీదట మాత్రం నువ్వు ఏనుగుల వేటకి పోవద్దు. అయ్యప్పస్వామి గుడికి వెళ్ళు. నీవు ఇంతవరకు చేసిన తప్పులను క్షమించమని వేడుకో. నీకు ముప్పై ఎకరాల భూమి వుందంటున్నావు. మంచిగా వ్యవసాయం చేసుకుంటూ బతుకు. నేను నిన్ను కోర్టుకు సరండర్ చేస్తాను. నీకు బెయిల్ దొరుకుతుంది. ఈ కేసు కూడా నిలవదు. కానీ నా దగ్గర చెప్పినట్టు వేరే ఎవరిదగ్గర డబ్బు యిస్తానని చెప్పవద్దు. వాళ్ళు డబ్బు తీసుకుని పోతారుకాని నీకు మంచి చెయ్యరు'అన్నాడు.

ఈయన మంచిమాట చెప్తున్నాడులే సరే కానీయ్ అని ఊరుకున్నాను

అయితే నా ఏనుగు దంతాలన్నీ అప్పటికే బొమ్మలుగా మారి అమెరికాకు తరలివెళ్ళిపోయి వుంటాయి పోతేపోనీయ్ అనుకున్నాను.

'అయ్యా. కేసు వేయాలంటే ఆధారం కావాలి కదా! నా దగ్గర ఒక తుపాకి వున్నది. దాని ఆధారంగా కేసు వేయండి. నేను అంతా ఒప్పుకుంటాను' అని చెప్పాను.

ఎస్.పి., డి.ఎస్ పి., సబ్ఇన్స్పెక్టర్, ఫారెస్ట్ గార్డులు, పోలీసువాళ్ళు అంతా వచ్చారు. నేను నా తుపాకి తెప్పించి ఇచ్చేశాను. వాళ్ళు తీసుకున్నారు.

ఆ సమయంలో బెంగుళూరులో సార్క్ సమావేశం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడే ఆరు దేశాల పెద్దలు వచ్చేశారు. రాజీవ్‌గాంధీ రాకకోసం ఏర్పాట్లు అవుతున్నాయి. చాలా పెద్ద శిఖరాగ్ర సమావేశం. అందుకని డి.ఎస్ పి , ఎస్.పి. ఏం చెప్పారంటే మేం ఆ సమావేశం దగ్గరకు పోతున్నాం. నిన్ను డిఎఫ్ఓకి అప్పగించి వెళ్తాం అన్నారు. అని నన్ను డిఎఫ్ఓకి అప్పజెప్పి పోయారు. అయన ముఖం నేను ఆరోజే చూశాను. అంతవరకు నేను అతణ్ణి చూడలేదు. (శ్రీనివాసన్ తలను ఆ తరువాత వీరప్పన్ నరికి తీసుకువెళ్ళాడు - నక్కీరన్)

అంటే నా శత్రువులు తంగవేలు, మాదయన్ అనే ఇద్దరినీ నేను అంతకుముందు కాల్చి చంపాను కదా. వాళ్ళకూ, వాళ్ళ మనుషులు ముప్పైమందికి కావలసినన్ని తుపాకులు యిచ్చి నన్ను చంపమని మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటానని, మేమే (ఫారెస్ట్ వాళ్ళమే) కాల్చామని చెప్తామని కుట్ర పన్నింది ఈ శ్రీనివాసనే!

అలాంటి డిఎఫ్ఓ.కు నన్ను అప్పగించి వెళ్ళిపోయారు. అసలు ఈ డిఎఫ్ఓ. శ్రీనివాసన్ నా మీద ఎందుకు అలా కుట్రపన్నాడంటే - తంగవేలు, మాదయన్ ఈ డిఎఫ్ఓ. దగ్గర ఇరుక్కున్నారు. వాళ్ళ ఇద్దరిమీద ఏనుగును చంపిన కేసు వున్నది. అప్పుడు వాళ్ళు ఈ శ్రీనివాసన్‌తో 'ఏంటి మమ్మల్ని మాత్రమే పట్టుకుంటారా? వీరప్పన్ కూడా ఎన్నో ఏనుగులను వేటాడాడు కదా? అతణ్ణి మీరు పట్టుకోరా? అని అడిగారు. అప్పుడు శ్రీనివాసన్ 'వీరప్పన్‌ని మీరే పట్టి ఇవ్వండి' అని చెప్పాడు. అందుకు వాళ్ళిద్దరూ ఏం చెప్పారంటే 'వీరప్పన్‌ని పట్టుకోవడం చాలా కష్టం కావాలంటే కాల్చి చంపి ఇస్తాం' అన్నారు.

అందుకు శ్రీనివాసన్ 'సరే అలాగే చెయ్యండి' అని వాళ్ళకి తుపాకులు సప్లై చేశాడు. శ్రీనివాసన్ పన్నిన కుట్రతో ఎం.ఎల్.ఏ నాక్కణ్ణన్ కూడా చేతులు కలిపాడు. అందరూ కలిసి వాళ్ళకు ధైర్యం ఇచ్చారు. దాంతో వాళ్ళు రెచ్చిపోయారు. వీరప్పన్ ఊళ్ళో కనబడ్డా, అడవిలో కనబడ్డా ఎక్కడైనా సరే కాల్చేయండి అని వాళ్ళకి చెప్పారు.

జుడీషియల్ కస్టడీలో వున్న వాళ్ళకే సైనైడ్ ఇచ్చి చంపి మేం చంపలేదు వాళ్ళే ఆత్మహత్య చేసుకున్నారు అన్నారు కదా పోలీసులు. అలాంటప్పుడు ఊళ్ళోనో, అడవిలోనో నన్ను చంపితే అడిగే దిక్కేముంటుంది? ఈ గవర్నమెంటు చేసే పని అంతా ఇప్పుడు ఇలాగే వుంది కదా?

ఆ తరువాత డిఎఫ్ఓ శ్రీనివాసన్ నన్ను విచారించాడు. తమిళం బాగా మాట్లాడుతున్నారు తమరు ఎవరండీ అని అడిగాను. నేనూ తమిళనాడు మనిషినేలే అని చెప్పాడు. తరువాత అక్కడొక గార్డు వుంటే ఈ అధికారి ఎవరు అని అడిగాను. ఈయన డిఎఫ్ఓ శ్రీనివాసన్ అని చెప్పాడు గార్డు. అప్పుడు ఓహో వాళ్ళకి తుపాకులు ఇచ్చి నన్ను చంపమని చెప్పింది ఈయనేనా! ఉండు నీ సంగతి చూసుకుంటాను అని మనసులో అనుకున్నాను.

డిఎఫ్ఓ శ్రీనివాసన్ నా గురించి ఎస్.పి., డి.ఎస్.పి.లతో మాట్లాడి మళ్ళీ ఒక కుట్ర పన్నాడు. ఆ కుట్ర విని ఒక వాచర్ పిల్లవాడు నా దగ్గరకు వచ్చి 'అన్నా! నిను రేపు పొద్దున అడవిలోకి తీసుకుపోయి కాల్చి చంపబోతున్నారు. రాత్రి డి.ఎస్.పి. రాగానే నిన్ను కాల్చి చంపుతారు. ఈ డిఎఫ్ఓ. చెప్తే వాళ్ళు వింటారు. పొద్దున్నే నిన్ను జీపులో తీసుకెళ్ళబోతున్నారు' అని చెప్పాడు.

అప్పటికే ఇరవై రోజులు అయిపోయినా నా మీద కేసు గీసు ఏమీ వేయలేదు. ఈ ఆఫీసర్లు ఏం చేస్తారు. మనం వీళ్ళకు ఏ అపకారం చెయ్యలేదు కదా అని అంతవరకు నేను నమ్మకంతో వున్నాను.

అసలు ఆ డిఎఫ్ఓ వెంటనే నన్ను ఎందుకు చంపలేదంటే డి.ఎస్.పి., ఎస్.పి. నన్ను అతనికి అప్పగించి పోయారు కదా. వాళ్ళకి జవాబు చెప్పవలసి వస్తుంది. అందుకే వాళ్ళు తిరిగి రాగానే చెప్పి ఒప్పించి చంపేద్దామని ప్లాన్ వేసుకున్నాడు.

ఈ విషయం వాచర్ కుర్రవాడు నాకు చెప్పగానే అక్కడి నుంచి ఎలాగైనా తప్పించుకుపోవాలని నిర్ణయించుకున్నాను

అవకాశం దొరికింది.

అప్పుడు నా చేతులకు మాత్రమే బేడీలు వేశారు. ఆ బేడీలను ఎలా వదిలించుకోవాలో నాకు బాగా తెలుసు. వాటినే కాదు ఎలాంటి సంకెళ్ళనైనా సులువుగా పగలగొట్టి వదిలించుకోగలను.

సరే ...అప్పుడు పగలు మూడు అవుతుండవచ్చు గార్డులు అందరూ నా గదికి అటువైపు భోజనాలు చేస్తున్నారు. నేను నా సంకెళ్ళను ఛేదించుకున్నాను. ఆ గదికి కొంచెం ఎత్తులో చువ్వలు లేని వెంటిలేటర్ ఒకటి ఉంది. ఎగిరి దానిని అందుకుని అందులోంచి బయటపడ్డాను. చేతుల్లో రాళ్ళు పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చేశాను. నాలుగు రోజులు నడిచి అడవిలోకి చేరాను.

నన్ను అప్పుడు చామరాజ్‌నగర్ అడవి సమీపంలో పూదిపడుకాంగి అనే ప్రదేశంలో బంధించి పెట్టారు.

ఆ డిఎఫ్ఓ. బచ్చాగాడు ఎవరిని పట్టుకున్నా సరే కోర్టులో కేసు వేయడు. పట్టుకునిపోయి ఒక రూంలో బంధించి బాగా తంతాడు. అయితే నన్ను మాత్రం అతను కొట్టలేదు. ఎందుకంటే నేను ఏ విషయాన్నీ దాచలేదు కదా! అదీగాక నన్ను ఎలాగైనా కాల్చిచంపాలనే ఆశ ఉండింది వాళ్ళకి.

వేరే జనం తప్పు చేసినా చేయకపోయినా బాగా దంచుతాడు. వాళ్ళమీద కేసు అయితే వెయ్యనే వెయ్యడు రెండు సంవత్సరాలైనా తన దగ్గర అట్లాగే పెట్టుకుంటాడు. వకీలు వెళ్ళి అడిగితే వాళ్ళని అసలు అరెస్టే చెయ్యలేదని చెప్తాడు ఎంతదూరం పోయి వెతికినా కనబడలేదని చెప్తాడు. రెండు సంవత్సరాల తర్వాత తనంతట తనే వాళ్ళని ఏడెనిమిది రోజుల కిందటే పట్టుకున్నట్టు కేసు వేసేవాడు. లేకపోతే అడవికి తీసుకెళ్ళి కాల్చి చంపేసేవాడు.

ఇదంతా నాకు తెలుసు. అందుకనే నేను తప్పించుకుని బయటపడ్డాను. బయటపడ్డప్పుడే అతణ్ణి చంపాలని కూడా అనుకున్నాను

అతను నామీద కోర్టులో కేసు వేసి వుండొచ్చు కదా? నన్ను కాల్చి చంపాలని ఎందుకు నిర్ణయించుకున్నాడు? నేను అతనికి ఏం ద్రోహం చేశాను? అడవి ఏమైనా వాడి బాబు సొత్తా? రాజకీయ నాయకులు కోట్ల సొమ్ముతో ఏదో కొంత చేస్తారు. దేశాన్ని కోట్లకు కోట్లు దోచుకుని తింటారు. వీళ్ళు వాళ్ళ వెంట్రుకలని కూడా పీకలేరు. నువ్వే చెప్పు. నేను ఏదో అడవిలో ఒక జంతువుని కాల్చాను. అందుకు కేసు వెయ్యొచ్చు కదా?



## రెండున్నర రోజులు .... మూడువందల కిలోమీటర్లు నడిచాను !

నేను ఆవిధంగా తప్పించుకుని పారిపోయి వచ్చినప్పుడు ప్రభుత్వం ఒక తప్పుడు అంచనా వేసింది. ఆ డిఎఫ్ఓ శ్రీనివాసన్ నాదగ్గర లంచం తీసుకుని నన్ను తనే వదిలిపెట్టాడు అని భావించింది. అందుకని అతణ్ణి అక్కడ నుంచి చిక్‌మగళూరుకి బదిలీ చేసింది. అతనికి రావలసిన కన్జర్వేటర్ ప్రమోషన్‌ను క్యాన్సిల్ చేసి డి ఎఫ్ ఓగానే బదిలీ చేసింది.

అప్పుడు ఆ డిఎఫ్ఓ 'నాకు ఒక పోలీసు దళాన్ని ఇవ్వండి, వీరప్పన్‌ని పట్టుకుని అప్పగిస్తాను' అని పై అధికారులతో చెప్పాడు.

'వీరప్పన్ దగ్గర లంచం తీసుకుని నువ్వే అతణ్ణి వదిలిపెట్టావు కదా మళ్ళీ అతణ్ణి ఎక్కడి నుంచి పట్టుకొస్తావు?' అన్నారు పై అధికారులు.

డిఎఫ్ఓ నాకు శత్రువే అయినా నా నోటి నుంచి అబద్ధం రాదు. ఇదంతా వాస్తవం. నన్ను చంపడానికి అతను రడీగా వున్నాడు.

అసలు ఆ రోజు డి.ఎస్.పి. చెప్పినట్టు అతను నా మీద కేసు ఫైల్ చేసి వుంటే ఇన్ని అనర్థాలు జరిగి వుండేవే కాదు. కనీసం ఒక్క కుక్కపిల్ల కూడా చచ్చిపోయి వుండేది కాదు. ఆ ద్రోహి డిఎఫ్ఓ. శ్రీనివాసనే వీటన్నింటికీ మూల కారణం.

మొదట్లో అతను వేరే ద్రోహులతో నన్ను చంపించాలని చూశాడు. ఆ తర్వాత తనే స్వయంగా కాల్చివేయాలని ప్లాన్ వేశాడు. అందుకే నేను కస్టడీ నుంచి తప్పించుకుని పారిపోయాను. లేకపోతే కోర్టులో కేసు జరిగివుండేది. నేను, నా కుటుంబం ఇన్ని కష్టాలు పడకుండా బతికేవాళ్ళం.

నేను తప్పించుకుని వచ్చిన తర్వాత అడవిలో నా మానాన నేను వున్నాను. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చిపోతూ వుండేవాణ్ణి. ఇలా వుంటుండగా -

అన్ని దేశాలలో ఏనుగులని ఎవ్వరూ చంపకూడదని, దంతాలని కొనకూడదని ఒక నిషేధం అమలులోకి వచ్చింది. ఎందుకంటే దంతాల కోసం ఏనుగుల జాతి మొత్తం నశించిపోతున్నది. అందుకని అట్లా గట్టిగా అడ్డు చెప్పారు.

మరి నేను డబ్బు ఎట్లా సంపాదించాలి? నేనూ నా దగ్గర వున్న పదిహేను మంది తిండి ఎట్లా తినాలి? మాకు రోజులు కష్టంగా గడుస్తున్నాయి. సరే ఇదట్లా వుండనియ్యండి. నేను కస్టడీలో వున్నప్పుడు ఒకరోజు రాత్రి నా కులదైవాలను అందరినీ తలచుకున్నాను. ఆ రాత్రి మా అమ్మ నా కలలో కనిపించింది. నన్ను చూసి బాగా ఏడ్చింది. 'ఎందుకమ్మా ఏడుస్తున్నావు?' అని అడిగాను. 'నువ్వు ఇంత పెద్ద కష్టంలో ఇరుక్కున్నావు కదా బిడ్డా' అని కన్నీళ్ళు పెట్టుకుంది. 'ఏం చేయాలమ్మా నా బతుకు ఇట్లా అయిపోయింది' అని చెప్పాను. అంతలో మా అమ్మ మాయమై పోయింది.

అప్పుడే తెల్లవారింది. 'ఏంటి ఇది. మా అమ్మ నా కలలోకి ఎందుకు వచ్చింది' అనుకున్నాను ఆ తరువాత అదేరోజు గార్డులు లోపల బంధించివుంచిన నన్ను హాలులోకి తీసుకొచ్చి ఒక వైరుతో కట్టేశారు నా చేతులకు సంకెళ్ళు వేసి వాళ్ళంతా భోజనాలకు వెళ్ళిపోయారు. ఇదే సమయమని నేను నా సంకెళ్ళని తెంచుకుని మూడు కిటికీ చువ్వలను ఊడబీకి ఆ సందులోంచి బయటపడ్డాను. చప్పుడు రాకుండా కాలివేళ్ళు పడేలాగా దూకాను. ఎందుకంటే ఆ గార్డుల దగ్గర ఆయుధాలు వున్నాయి. చూస్తే కాల్చేస్తారు. ఆ తరువాత ఎవరన్నా తరుముకుని వస్తే కొట్టవచ్చుని రెండు రాళ్ళు తీసుకున్నాను. ఇక అక్కడి నుంచి ఒకటే పరుగు. పరుగెత్తుకుంటూనే కొండ ఎక్కేశాను.

అంతులేని పెద్ద అడవి అది దారి తెన్ను లేకుండా నడక మొదలు పెట్టాను. తినడానికి ఏమీ దొరకలేదు కస్టడీలో వున్నప్పుడు వాళ్ళు నా బట్టలు తీసేసి వేరే పెద్ద సైజు బట్టలు వేశారు వాటితోనే నడుస్తున్నాను.

అక్కడక్కడా అడవి దున్నలతో ఇబ్బంది వాటిని విదిలించి తప్పించుకుంటూ నడుస్తున్నాను. ఆ అడవి నాకు బాగా తెలిసినదే. కాలిబాటమీద నడుస్తూ పోతున్నాను. ఒక ముప్పై కిలోమీటర్లు నడిచివుంటాను. అది బాగా ఏనుగులు తిరిగే అడవి. కాని అప్పుడు నాకు ఒక్క ఏనుగు కూడా కనిపించలేదు చీకటిగా వుంది చందమామ కూడా దిగిపోయాడు కళ్ళు కనిపించడంలేదు. కడుపులో ఒకటే ఆకలి.

ఈవిధంగా మూడు రోజులపాటు ఉసిరికాయలు తినడం ... దొరికితే నీళ్ళు తాగడం అంతే! నడుస్తూనే ఉన్నాను. అక్కడ జలగలు చాలా ఎక్కువ. మనిషి కాలికి అతుక్కుంటే ఇక వదలదు. రక్తం పీల్చేస్తుంది. జలగను పీక్కోవడం చాలా కష్టం. చూస్తుండగానే రక్తం పీల్చి బలిసిపోతుంది. అట్లాంటి జలగల దారిలోంచి ముందుకు నడుస్తూనే వున్నాను.

రాత్రి పడగానే చెట్టు ఎక్కి పడుకునేది. పెద్ద చెట్టుమీద రెండు కొమ్మలు కలిసిన చోటు ఒక మంచం కూడా వేయవచ్చు కింద పడుకుంటే ఏనుగో ఏదైనా జంతువో రావచ్చు. అందుకనే చెట్టుమీద పడుకున్నాను.

ఆరోజు తెల్లవారుజామున ఐదు ఐదున్నర కావస్తోంది. పిచ్చుకలు, అడవి కోళ్ళు, పక్షులు గోలగోలగా అరుస్తున్నాయి. తెలతెలవారుతోంది. గబగబా చెట్టు దిగాను నన్ను పట్టుకునేందుకు గార్డులు తిరుగుతూ వుండొచ్చు. పైగా ఆ ప్రాంతంలో కనీసం రెండు వందల మంది గార్డులు ఎప్పుడూ వుంటారు. వాళ్ళు ఇప్పటికే నేను తప్పించుకున్న సంగతి అడవి ప్రజలందరికీ చెప్పి వుండొచ్చు. అందరూ నా కోసం గాలిస్తుంటారు అందుకనే ఆగి ఆగి బాగా గమనించుకుంటూ నడుస్తున్నాను. అప్పటికి

సుమారు మూడు వందల కిలోమీటర్లు నడిచివుంటాను కాళ్ళకి చెప్పులు లేవు కదా ముళ్ళు గుచ్చుకుని ఒకటే బాధగా వుంది. అడవిలో తుమ్మ ముండ్లు వేలెడు పొడవుతో వుంటాయి గుచ్చుకుంటే తీయడం కష్టం అవి కూడా నా కాళ్ళలో గుచ్చుకుని వున్నాయి.

తిణ్ణలి సత్యమంగళం అనే చిన్న ఊరు కార్కేయకండి పక్కనే వుంది అక్కడికి చేరుకునేటప్పటికే నా కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. చెవులు కూడా సరిగా వినిపించడంలేదు ముందు ఎక్కడన్నా కొంచెం ఆకలి బాధ తీర్చుకోవాలి. అప్పుడు రాత్రి ఎనిమిదిన్నర అవుతుండవచ్చు. ఒక చిన్న ఇల్లు కనిపించింది. ఆ ఇంట్లో గుడ్డి దీపం వెలుగుతోంది. 'అమ్మా' అని పిలిచాను. ఒకామె ఇంట్లోంచి బయటకు వచ్చింది.

'ఎవరయ్యా నీవు?' అని అడిగింది ఆమె నన్ను గుర్తుపట్టలేదు. నేను వేసుకున్న బట్టలు చూసి ముందు కొంచెం భయపడింది.

'అమ్మా నాది నల్లూరు' అని చెప్పాను. 'మరి ఎందుకొచ్చావు ఇక్కడికి' అని అడిగింది. 'మా ఆవులు రెండు తప్పించుకున్నాయమ్మా. అవి ఉడయ్‌తాళ్‌పట్టిలో వున్నాయని ఎవరో చెప్పారు. అక్కడంతా వెతికి చూశాను కానీ దొరకలేదు. అన్నం తిని మూడు రోజులు అవుతోందమ్మా కొంచెం గంజి వుంటే ఉప్పువేసి ఇవ్వమ్మా' అన్నాను.

'అయ్యో ఈ రోజు అడవిలో కొంచెం పనివుండి చద్దన్నం మొత్తం అంతా మేమే తినేశాము' అని చెప్పి రెండు మొక్కజొన్న కంకులు తెచ్చి యిచ్చింది. వాటిని తీసుకుని వెళ్ళబోతుండగా 'అయ్యా, మూడురోజులుగా తిండిలేదు అంటున్నావు అదిగో ఆ దూరంగా వెలుతురు కనబడుతుందే . అక్కడికి వెళ్ళు. తినడానికి ఏమైనా దొరకొచ్చు' అంటూ ఒక ఇంటిని చూపించింది

సరే అనుకొని అక్కడికి వెళ్ళాను. అక్కడ ఇద్దరు ఆడవాళ్ళు రోళ్ళో ఏదో దంచుతున్నారు. వాళ్ళని అడిగాను అప్పుడు వాళ్ళు వేరే ఇంటివైపు చూపించారు. నేను మొదటి ఆమె చెప్పిన ఇంటికి కాకుండా మరొక ఇంటికి వచ్చినట్టు అర్థమైంది. తరువాత వాళ్ళు చూపించిన ఇంటివైపు పోయాను. అక్కడ ఒక పదిహేను ఆవులు కట్టేసి వున్నాయి కొబ్బరికాయలు, పండ్లు, ఫలాలు పెట్టి పూజలు ఏవో చేస్తున్నారు. ఒక పది ఇరవైమంది దేవుడికి మొక్కుకుంటున్నారు. అక్కడ కరంటు లైటు వెలుతురు వుంది. వాళ్ళంతా నన్ను చూశారు 'ఎవరయ్యా నీవు?' అని అడిగారు. 'మాది నల్లూరు. మా ఆవులు తప్పించుకుపోతే వెతుక్కుంటూ వచ్చాను. నాకు బాగా ఆకలిగా వుందయ్యా అదిగో ఆ ఇంట్లో అడిగితే ఇక్కడికి పోయి నీ ఆకలి తీర్చుకో అని చెప్పారు' అన్నాను.

అప్పుడు వాళ్ళు నాకు వంకాయ పులుసు, అదీ వేసి మంచి భోజనం పెట్టారు. నేను తృప్తిగా తిన్నాను పాపం ఎవరో పిచ్చివాడులే అనుకుని వాళ్ళు నాకు భోజనం పెట్టారు నేను మాత్రం కడుపునిండా తిని లేచి 'అయ్యా నాలుగు పుల్లలు వుంటే అగ్గిపెట్టెలో వేసి యివ్వండి. ఇక నేను మా ఊరుకుపోతాను' అని అడిగాను.

నాకు ఆరోజు జరిగిందంతా బాగా జ్ఞాపకం వుంది

ఒక అగ్గిపెట్టెలో ఎనిమిది పుల్లలు వేసి నాకు యిచ్చారు దానిని జేబులో వేసుకుని మళ్ళీ నడక మొదలుపెట్టాను నేను అక్కడినుంచి వచ్చేసే ముందు 'ఏంటి కాళ్ళంతా గాయాలు వున్నాయి' అని అడిగాడు. అప్పుడు నేను 'తమ్ముడూ బాగా నడవడం వల్ల కాళ్ళు వాచిపోయినాయి. చెప్పులు లేక ముళ్ళు గుచ్చుకున్నాయి' అని చెప్పాను. అందుకు అతను 'నువ్వు అబద్ధం చెప్తున్నావు. ఎవరో నిన్ను బాగా కొట్టినట్టున్నారు' అన్నాడు లేదు తంబీ! నన్ను ఎవరూ కొట్టలేదు. మా పూర్వీకులు చేసిన పుణ్యం వల్ల నాకు మీ దగ్గర ఇప్పుడు అన్నం దొరికింది నేను మళ్ళీ ఏదో ఒక రోజు ఇక్కడికి తప్పకుండా

వస్తాను. అప్పుడు నేను ఎవరో ఏమిటో మీకు తెలుస్తుంది' అని వచ్చేశాను. అట్లా మాట్లాడినా కూడా నన్ను ఎవరూ గుర్తుపట్టలేకపోయారు.

నేను అలా వచ్చి తెలియకుండా తిన్నగా ఒక స్మశానానికి చేరుకున్నాను. ఆ రాత్రి అక్కడే పడుకున్నాను. బాగా నిద్ర ముంచుకు వస్తోంది. చాలా చలిగా వున్నది. కొంచెం మంటపెట్టి ముందు చలి కాగుదామని పుల్లలు ఏరి నిప్పు అంటించాను. సరిగ్గా అప్పుడు ఏదో అలికిడి అయినట్టు అనిపించింది. ఏమిటో ఆ చీకట్లో సరిగా కనిపించలేదు. కాని అచ్చు మనిషిలాగే పిలిచింది. బాగా పరికించి చూస్తే అక్కడ మనిషి గినిషి ఏమీ లేదు. దయ్యమో, భూతమో అంటారే అదే అయివుండాలి.

జింకలు, కుక్క అరిచినట్టు, పులి గాండ్రుమన్నట్టు శబ్దాలు వినిపించాయి. ఆ వెంటనే మరోవైపు నుంచి నాన్నా .... నాన్నా ... అయ్యో .... అని పెద్ద కేక ...! అప్పుడు నేను అర్థం చేసుకున్నాను ఇదంతా దయ్యం చేష్ట అని.

నేను అప్పుడు బిగ్గరగా ఇట్లా అన్నాను. 'నేను ఎప్పుడో రుషిగా మారిపోయాను. నువ్వు నన్ను బెదిరించేదేమిటి? రా. నువ్వు ఏ రూపంలో నా ఎదరకు వచ్చినా నీతో మాట్లాడతాను. రా. నేను ఇప్పుడు మనిషిని కాదు రుషిని '

అంతే, చప్పమని ఆగిపోయింది. ఆ తరువాత మళ్ళీ ఏమీ వినిపించలేదు. నేను ఆ స్మశానంలోనే పడుకుని నిద్రపోయాను. పొద్దున లేచి మళ్ళీ ప్రయాణం సాగించాను.

అంతకు ముందు ఆయమ్మ ఇచ్చిన మొక్కజొన్న కంకి ఒకటి ఇంకా నా దగ్గర అట్లాగే వుంది. దాన్ని తీసుకుని బయలుదేరాను. దారిలో ఒక నీటి చెలిమ కనిపించింది. ఆ కంకిని తిని నీళ్ళు తాగాను. కాలిలో గుచ్చుకున్న ముళ్ళన్నీ ఒక్కటొక్కటిగా తీసేసుకున్నాను. చాలా ముళ్ళు. కాలు కిందపెడితే భరించలేని బాధ. ఒక పెద్ద తుమ్మ ముల్లును తెంపి దానితో వాటిని తీసేశాను.

మళ్ళీ అక్కడి నుంచి నడక ప్రారంభించాను. ఒక చిన్న గూడెం దగ్గరకు వచ్చాను. అంతకు ముందు కూడా నాకు ఇట్లాంటి మీసాలే వుండేవి. పోలీసు వాళ్ళు ఫొటో తీశారే - ఆ ఫొటోలోలాగా. అయితే వాళ్ళు నా మీసాలను తీసేశారు. అందుకని ఆ గూడానికి చెందిన అతను ఒకరు నాకు ఎదురుపడినా కూడా నన్ను గుర్తుపట్టలేకపోయాడు. అతను ఆవును తోలుకువస్తున్నాడు. అతను నాకు బాగా తెలిసినవాడు. కాని నాకు మీసాలు లేకపోవడం వల్ల నా దుస్తులు బాగా వదులుగా వుండడం వల్ల అతను నన్ను పోల్చుకోలేకపోయాడు. 'ఎవరయ్యా నీవు' అని అడిగాడు. 'ఏం నేను ఎవరో నీకు తెలియదా?' అన్నాను. అప్పుడు అతను బాగా పరీక్షగా నా మొహంలోకి చూసి గుర్తుపట్టాడు.

'అయ్యో! ఎందుకిలా జరిగింది' అని ప్రశ్నించాడు. 'ఏదోలేగాని ... నాకు బాగా ఆకలిగా వుంది' అని చెప్పాను.

'ఆవును ఇక్కడ వదిలేసి వస్తే ఏ నక్కో తోడేలో తినేస్తుంది. అందుకని నువ్వు ఊళ్ళోకి వెళ్ళు. ఇంట్లో పిల్లలు వున్నారు. ఇంట్లో పిండి, పాలు అన్నీ వున్నాయి. నువ్వు చెప్తే భోజనం రెడీ చేసి యిస్తారు. తినేసి వెళ్ళు అన్నాడు. నేను అలాగే వాళ్ళ ఇంటికి వెళ్ళి తిని చేతులు కడుక్కుంటుండగా ఇంకో ఇద్దరు మనుషులు వచ్చారు. వాళ్ళు కూడా తెలిసినవాళ్ళే. నన్ను గుర్తుపట్టారు. 'అయ్యో బావా ఏమిటీ అవతారం! రా పోదాం' అని వాళ్ళ ఇంటికి తీసుకుపోయారు. కొత్త పంచ, షర్టు ఇచ్చారు. వేసుకున్నాను. ఆ రోజంతా వాళ్ళతోనే గడిపాను.

ఆ మరుసటిరోజు నా వాళ్ళను చేరుకోవాలని తిరిగి బయలుదేరాను. బాగా తెలిసినవాడు వెళితే

తప్ప వాళ్ళున్న చోటును కనుక్కోలేదు. అందుకని ఆ ప్రాంతానికి పోయి ఒక పగలు, ఒక రాత్రి అంతా కాచుకుని వున్నాను. చివరికి ఒకతనితో కబురు పంపించాను కాని అతను చాలాచోట్ల తిరిగి తిరిగి వాళ్ళ జాడ ఏమీ కనుక్కోకుండానే వెనక్కి వచ్చేశాడు అప్పుడు నేను 'బహుశ వాళ్ళు వేరే ఒక ప్రాంతంలో వుండవచ్చు. అక్కడికి పోయి ప్రయత్నం చేద్దాం. ముందు నువ్వు పోయి ఏదైనా లారీని మాట్లాడుకుని రా' అని అతనితో చెప్పాను.

అతను రాత్రి ఒంటిగంట సమయంలో ఒక లారీని మాట్లాడుకుని వచ్చాడు. దాంట్లో కూచున్నాను. లారీ మెట్టూరు డ్యాం దాటి ఒక మలుపు తిరుగుతోంది. సరిగ్గా అప్పుడే పోలీసు జీపు మాకు ఎదురువచ్చింది. ఆ జీపులో నన్ను పట్టుకుని డిఎఫ్ఓ.కు అప్పగించిన డి ఎస్ పి. కూచుని వున్నాడు. ఆ జీపు కూడా నాకు బాగా తెలుసు లారీ హెడ్‌లైట్ వెలుతురు అతని ముఖం మీద పడి బాగా కనిపిస్తోంది. అతను జీపులోంచి తల బైటకు పెట్టి లారీని ఆపమని సైగ చేస్తున్నాడు

లారీ ఆగింది. అప్పుడు నేను లారీ ముందు సీట్లోనే కూర్చుని వున్నాను. కళ్ళు మూసుకుని తల వంచుకున్నాను. ఇప్పుడు ఏం చేయాలి? కాళ్ళు చూస్తే పుండ్లలాగా బాధపెడుతున్నాయి. నడవడానికి కూడా వీలు కాదు. పైగా చేతిలో ఆయుధం కూడా లేదు ఎట్లా? భారమంతా దేవుడిమీద వేసి అలాగే కూచున్నాను

'ఎక్కడికి రా ఈ లారీ పోతున్నది?' అని అడిగాడు డి ఎస్.పి 'బండిలో ఏం లేదయ్యా, ఎంప్టీ లారీ వేరుశనగల వాళ్ళింటికి పోతున్నాం' అని చెప్పాడు క్లీనర్ 'సరే పొండి' అని వదిలేశాడు అతను.

ఆ జీపు అటు వెళ్ళిపోగానే అంతకు ముందు జరిగిందంతా ఆ కుర్రవాడికి చెప్పాను. 'అయ్యో కొంచెం ముందు చెప్తే ఆ జీపు మీదకు లారీని ఎక్కించేవాళ్ళం కదా' అన్నారు వాళ్ళు 'అదిసరే ఇంక ఎక్కడా నిలపకుండా లారీని త్వరగా పోనివ్వు' అన్నాను డ్రైవర్‌తో అలాగే అని నేను చెప్పిన చోటుకి చేర్చారు వాళ్ళు. అపుడు తెల్లవారు జామున ఐదు అవుతున్నది వాళ్ళకి బాడుగ డబ్బులు ఇచ్చేసి పంపించాను.

ఒక ఇంటికి పోయాను. అది తెలిసినవాళ్ళ ఇల్లు ఇద్దరు కుర్రాళ్ళు పడుకుని వున్నారు. నన్ను చూడగానే 'బావా ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? ఏం చేశావు?' అంటూ అడిగారు విషయం అంతా చెప్పి మనవాళ్ళు ఎక్కడ అని ప్రశ్నించాను. పచ్చమలైలో వున్నారని చెప్పారు. మేం మాట్లాడుతున్నప్పుడు మిగతావాళ్ళు వచ్చారు.

నేను తప్పించుకుని పోయిన తరువాత ఎట్లాగైనా ఈ ఊరుకే వస్తానని రాజామణి పోలీసువాళ్ళకి చెప్పాడట. అందుకనే అక్కడ సిఐడీలు బాగా తిరుగుతున్నారనీ, ఒక ఇద్దరు సిఐడీలు ఊళ్ళోనే వున్నారని నాకు తెలిసింది. ఆ ఊరు వాళ్ళు చాలా మంచి వాళ్ళు. మమ్మల్ని ఎవరికీ కనపడకుండా ఒక ఇంట్లో దాచేశారు భోజనం ఏర్పాటు చేశారు గదిలోనే మూత్రం పోసుకోవడానికి పాత్రలు కూడా యిచ్చారు. వాళ్ళు అంత మంచివాళ్ళు.

మా దగ్గర ఆయుధాలు లేవు అందుకని రెండు కత్తులు కొన్నాను కారంపొడి అది తయారు చేయించి పెట్టుకున్నాను. బయట ఎవరన్నా అడ్డువచ్చినప్పుడు ఉపయోగపడుతుంది కదా అందుకని. ఆ తరువాత ఒక కారును అద్దెకు తీసుకురమ్మని చెప్పాను ఆ కారులోనే ప్రయాణం చేసి చివరికి మా వాళ్ళు వున్న చోటుకు చేరుకున్నాను. దారిలో మా కారుకు ఏ పోలీసులు అడ్డుపడలేదు.



# చంపుతాను అని చెప్పి మరీ చంపాను !

ఆ రోజుల్లో ఏనుగు దంతాల వ్యాపారాన్ని అన్ని దేశాలు అడ్డుకున్నాయి. దంతాలను ఎవరూ కొనడం లేదు. ధరలు బాగా పడిపోయాయి. కర్ణాటక రాష్ట్రంలో ఏనుగు దంతాలు పట్టుబడితే పెద్ద శిక్ష పడుతుంది.

మరి బతుకుతెరువుకు ఏం చేయాలి అని ఆలోచిస్తున్నప్పుడు నా మనుషుల్లోని కుర్రవాడు ఒక సలహా ఇచ్చాడు 'అన్నా! అన్నా! ఈ అడవిలో గంధం చెట్లు బాగా వున్నాయి. చాలామంది గంధం చెక్కల స్మగ్లింగ్ చేస్తున్నారు. మనం కూడా రెండు చెట్లను నరికి అమ్ముదాం' అన్నాడు.

సరే పద అని కొంగురుపాళై దగ్గర పుండక్కాడు సత్యమంగళం రేంజ్‌లో గంధపు చెక్కల వ్యాపారం మొదలు పెట్టాము.

అప్పుడు ఆ రేంజ్‌లో ఒక సంఘటన జరిగింది. అప్పట్లో నేను మా అన్న ఇంట్లో వుండేవాడిని. అందుకని ఆ డిఎఫ్ఓ. గాడు ఒకరోజు వచ్చి మా అన్నను పట్టుకుని పోయాడు. ఆయన పిల్లల్ని కూడా పట్టుకుపోయాడు.

మా అన్న అసలు దేంట్లోనూ తలదూర్చేవాడుకాదు. అతని చెయ్యి విరగనప్పుడు మాత్రం తుపాకితో అడవిలో వేటకు పోయేవాడు. ఒకసారి తుపాకి పొరపాటుగా పేలి చెయ్యి విరిగిపోయింది. అప్పుడు చికిత్స జరిపించాం. ఆరోజు నుంచి ఆయన వ్యవసాయమే చూసుకుంటున్నాడు. ఆయనకు దాంతోనే సరి. ఆవులు, దూడలు చాలా వున్నాయి. మూడు బావులు వున్నాయి. మోటారు వేశాడు. ఆయనకు పెళ్ళయింది ముగ్గురు పిల్లలు. ఇద్దరమ్మాయిలు, ఒకబ్బాయి. అబ్బాయి ఎయిర్‌కాట్‌లో చదువుకుంటున్నాడు.

మా అన్న దేనికీ రాడు. కానీ ఎప్పుడన్నా అధికార్లకు లంచం యివ్వడం అదీ చూసుకునేవాడు. మా తరపున వెళ్ళి చూసి మాట్లాడి వచ్చేవాడు. అది తప్ప వేరే ఏదీ చేసేవాడు కాదు. అట్లాంటివాడిని పట్టుకుపోయి కేసులో ఇరికించారు

అంతకుముందే నేను గంధం చెట్లు నరికి చెక్కలను పదకొండు వేల రూపాయలకు అమ్మాను. ఆ డబ్బు మా ఖర్చులకు పనికొచ్చింది. అప్పుడే ఇంకొకడు గంధం చెక్కలు కావాలని అడిగాడు. అతను ఎవరంటే నేగవం కుందస్వామి యొక్క బామ్మరిది. గంధం చెక్కలను నాకు ఇవ్వు. నేను అడవిలోనే వాటిని మీ దగ్గరనుంచి తీసుకుపోతాను అన్నాడు. ఎందుకంటే ఇసుక కోసం ఇసుక లారీలు వస్తుంటాయి. వాటిలో తీసుకుని పోతాను అని చెప్పాడు.

అడవిలో ఎంతో గంధం చెక్క ఊరికే పడివుంటుంది అడవిలో వుండే కొంతమంది జనాన్ని పిలిచి మీకు కిలోకి ఇంత అని డబ్బు ఇస్తాను. నేను ఐదు పది కమిషన్ దొరికేట్టు తీసుకుంటాను అని బేరం ఆడాను. అప్పుడు ఒక ముప్పై మంది వరకు ఆ పనికోసం నాతో వచ్చారు. నాలుగు టన్నుల చెక్క పోగైంది. అది ఒక చోట అలా పడివుంది. లారీని అక్కడికే తెచ్చి తీసుకుపొమ్మని ఇద్దరు కుర్రాళ్ళతో కబురు పంపాను. లారీ రావడం చాలా ఆలస్యం అయింది. పొద్దుపొడిచే వేళ అవుతోంది. అందుకని మరుసటి రోజుకి వాయిదా వేశాను. ఒక చెరువు దగ్గర లారీని కడిగి నిలిపి వుంచాము. అప్పుడు ఆ లారీ డ్రైవర్ పక్కనే వున్న ఒక హోటల్లో భోజనం చేస్తున్నాడు.

ఇదంతా ఒక వాచ్‌మెన్ చూసి పోయి రేంజర్‌కు చెప్పాడు. వెంటనే రేంజర్ అక్కడికి వచ్చేశాడు. రావడం రావడమే భోజనం చేస్తున్న ఆ డ్రైవర్ చెయ్యిని వెనక్కి విరిచి పట్టుకుని 'లారీ ఎక్కడికి పోతోందిరా?' అని ప్రశ్నించాడు 'ఇసుక లోడు తీసుకుని పోతుందిసార్' అని చెప్పాడు డ్రైవర్.

'ఇసుకలోడు పోతోందా ఇసుక లోడు' అంటూ డ్రైవర్‌ని అక్కడే బాగా కొట్టాడు. ఒక దెబ్బ అతని మూతిమీదపడి రెండు ముందు పళ్ళు రాలి కిందపడ్డాయి అతని నోట్లోంచి ఒకటే రక్తం కారుతోంది. అట్లా కారుతుండగానే చిదంబరం రేంజర్ ఆ డ్రైవర్ రెండు చేతులు కట్టేసి లారీలో పడేసుకుని, వాచ్‌మెన్‌ని కూడా వెంటబెట్టుకుని డ్యాంకు వచ్చేశాడు ఆయన దగ్గర రెండు తుపాకులు, ఒక 22 పిస్టల్ వున్నాయి.

మేం అప్పుడు ఒక కొండమీద వున్నాము అంతకు ముందే గంధపు చెక్కలకు ఇద్దరు మనుషుల్ని కాపలాగా పెట్టాను. అయితే వాళ్ళు అక్కడ పడుకుని నిద్రపోతున్నారు. ఎలాంటి కాపలావాళ్ళో చూడు. తుపాకులు దగ్గర పెట్టుకుని ఖాకీ పాయింట్, ఖాకీ షర్ట్ వేసుకుని అట్లా నిద్రపోతున్నారు.

సరిగ్గా ఆ సమయంలో ఇరవై మంది ఫారెస్ట్ గార్డులను తీసుకుని ఆ రేంజర్ చుట్టుముట్టేసి ఆ ఇద్దరు కాపలావాళ్ళని పట్టుకున్నారు. వాళ్ళు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. అప్పుడు వాళ్ళని బాగా కొట్టారు నోట్లోంచి, ముక్కులోంచి రక్తం కారింది తుపాకిని తిరగేసి కొడితే ఆ తుపాకీయే విరిగిపోయింది. అంత ఘోరంగా కొట్టారు.

'చెప్పరా చెప్పు వీరప్పన్ ఎక్కడున్నాడు?' అని అడిగాడు రేంజర్ ఆ దెబ్బలకు తాళలేక నేను ఫలానా కొండమీద వున్నానని చెప్పేశారు వాళ్ళు.

అప్పటికే సాయంత్రం అయిపోయింది చీకటి పడబోతోంది 'ఒరే తొందరగా పోయి ఆ వీరప్పన్‌ను పట్టుకురండి' అని ఆదేశం యిచ్చాడు రేంజర్. అందుకు గార్డులు 'ఇప్పుడు ఎలాగండి? పొద్దు పోయింది కదా' అన్నారు 'ఒరే మీరు పోతారా నేనే పోవాల్నా?' అని మళ్ళీ బెదిరించాడు రేంజర్. దాంతో నన్ను పట్టుకోడానికి బయలుదేరారు వాళ్ళు

అప్పుడు నేను ఓ రాయిమీద పడుకుని వున్నాను గోవిందన్ ఒక చెట్టెక్కి ఇదంతా గమనిస్తున్నాడు. గోవిందన్ చిన్నవాడు. ఇంకా తుపాకి కాల్చడం రాదు. అప్పుడు మేం ఐదుగురం వున్నాము.

నేనూ, ఆండియప్పన్, దొరైస్వామి, గోవిందన్, బాలరాజ్ బాలరాజ్ ఓ వేటగాడి కొడుకు. మంచి సమర్థుడైన కుర్రాడు.

ఫారెస్టువాళ్ళని గమనించి గోవిందన్ పరుగెత్తుకుంటూ వచ్చి 'అన్నా, అన్నా, మనం గంధం కర్రలు పెట్టిన చోట చాలామంది గుమిగూడి వున్నారు అక్కడేదో జరుగుతోంది' అని చెప్పాడు.

నేను పరుగున వెళ్ళి చూశాను. నిజమే అక్కడ కొంతమంది కనిపిస్తున్నారు. ఏదో కీడును శంకించాను. అసలు నాకు మొదటిరోజే ఒక దుశ్శకునం ఎదురైంది. అప్పుడే అనుకున్నాను ఏదో చెడు జరుగుతుంది అని అందుకని నా మనుషుల్ని జాగ్రత్తగా వుండమని, నిద్రపోకూడదని ముందే హెచ్చరించాను. మళ్ళీ పొద్దున మరొక దుశ్శకునం ఎదురైంది.

మొదటిది ఏమీటంటే ఒక బల్లి నా కాలు మీదికి ఎక్కింది. బల్లి మనుషులపైకి పాకకూడదు. శాస్త్రరీత్యా అది మంచిది కాదు. దానికి విరుగుడుగా మంచినీళ్ళు తాగాలి.

ఇక రెండవ దుశ్శకునం ఏమిటంటే కాకులు గుంపులు గుంపులుగా తలమీద తిరుగాడాయి. ఆ విధంగా కాకులు అరుస్తూ తిరిగితే తప్పకుండా అక్కడ ఏదో అరిష్టం జరుగుతుంది. ఇది సత్యం. అందుకని నా మనుషులకు ఆ శకునాల గురించి చెప్పి బాగా హెచ్చరించివచ్చాను.

అయినా ఆ తిండిపోతులు నా ముందు సరే సరే అనిచెప్పి ఆ తరువాత ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారు ఫారెస్టు వాళ్ళు సరిగా ఆ చోటుకి చేరుకుని వాళ్ళని బంధించేశారు. ఇదంతా గురునాధుడు కుళిందాను పనే. నా మనుషులిద్దరినీ ఫారెస్టు వాళ్ళు బాగా కొట్టి తాడుతో కట్టి లారీలో పడేశారు.

ఆ తరువాత పదిహేనుమందికి పైగా ఫారెస్ట్ గార్డులు నన్ను పట్టుకునేందుకు కొండపైకి రాసాగారు వాళ్ళు అవైపు నుంచి పైకి ఎక్కుతుంటే మేము ఈవైపు నుంచి కిందకు దిగాము.

కిందకు వచ్చి ఒక చోటు నుంచి నేను తొంగి చూశాను. ఆ రేంజర్ తన రెండు చేతుల్నీ పాంటు జేబుల్లో పెట్టుకుని నిలుచుని వున్నాడు. నా కుర్రాళ్ళిద్దరూ లారీలో వేలాడుతున్నారు. రెండు తుపాకులు లారీకి ఆనించివున్నాయి ఆ రేంజర్ ఎవరో అప్పుడు నాకు తెలియలేదు. ఇంకా అక్కడ ఇద్దరు రేంజర్లు, ఒక రైటరు, ఇద్దరు వాచర్లు, దూరంగా దాదాపు ఓ వందమంది జనం వున్నారు ఇదీ అక్కడి పరిస్థితి.

అది లారీలు లోడ్ చేసే ప్రదేశం. అందువల్ల లోడింగ్ కోసం వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు మూగి వున్నారు. నేను గబుక్కున వెళ్ళి ఒక మట్టి దిబ్బమీద నిలబడి నా తుపాకి ఎక్కుపెట్టి 'ఒరేయ్ వాళ్ళని విడుదల చెయ్యి ... చేస్తావా లేదా?' అంటూ అరిచాను.

సరే ఈ సంగతి ఇట్లా ఉండనీ. తర్వాత చెప్తాను. ఇక్కడ ఒక విషయం చెప్పాలి

**ఒక ఫ్లాష్‌బాక్ ... ...**

చిదంబరం రేంజర్‌ని నేను ఎందుకు కాల్చాను? అతణ్ణి కాల్చవలసిన అవసరం ఏం వచ్చింది? అది ఇప్పుడు చెప్తాను.

అప్పటికి ఓ పదకొండు నెలల ముందు జరిగింది ఈ సంఘటన.

ఊరికే ఇంట్లో వున్న మా అన్నను డిఎఫ్ఓ. శ్రీనివాసన్ పట్టుకుపోయాడు. ప్రభుత్వానిక సరండర్ చేయలేదు. కేసు వేయలేదు. ఇరవై రోజులుగా అక్రమంగా మా అన్నని తన దగ్గరే కొండ అడవిలో బంధించిపెట్టాడు. అతనికి ఇది అలవాటే.

మా అన్న కుటుంబం వాళ్ళు ఇప్పుడు ఏం చెయ్యాలి అని వాళ్ళని వీళ్ళని అడిగారు. ఒక ఫిర్యాదు ప్రభుత్వానికి ఇవ్వండి అని కొంతమంది చెప్పారు అప్పుడు వాళ్ళు ఒక వకీలు ద్వారా హైకోర్టు న్యాయమూర్తికి పిటిషన్ ఇచ్చారు.

ఫలానా ఫలానా అధికార్లు వచ్చి ఐదుగురు అమాయక ప్రజలను ఇన్ని రోజుల కిందట ఈ సమయంలో పట్టుకుని తీసుకుపోయారు. వాళ్ళు ఎక్కడున్నారు, ఏం తెలియదు అని ఆ రిపోర్టులో రాసిచ్చారు

మా అన్నని, ఇతర్లని పట్టుకునిపోయిన వాళ్ళలో ఒక డి.ఎస్ పి కూడా వున్నాడు. అతను కొంచెం న్యాయం పాటించే మనిషే కాని ఇదంతా ఆ డిఎఫ్ఓ శ్రీనివాసన్ పని ఎవర్నైనా పట్టుకుపోయి నప్పుడు కోర్టులో కేసు వేయాలి కదా కాని ఆ డిఎఫ్ఓ కేసులు వేయడు. తన దగ్గరే పెట్టుకుని తన అధికార బలంతో వాళ్ళమీద పగతీర్చుకుంటాడు.

సరే, రిపోర్టు వెళ్ళగానే న్యాయమూర్తి దగ్గరనుంచి అతనికి ఒక మెమో వచ్చింది.

అరెస్టు చేసేందుకు వచ్చిన వాళ్ళలో ఒక డి.ఎస్ పి వున్నాడని చెప్పానే - అతని పేరు అర్. పూజారి. కొంచెం న్యాయమైనవాడే. కానీ అరెస్టు చేసినప్పుడు కేసువేసి వుండాలి కదా. కోర్టులో సరండర్ చేసి పదిహేను రోజులు వాయిదా తీసుకుని వుండవచ్చు కదా. కాని అతను కూడా అలా చేయలేదు. మరి అతను న్యాయమైనవాడు అని ఎలా చెప్పగలం?

ఇరవై ఐదు రోజులపాటు తమ దగ్గర పెట్టుకుని ఇప్పుడు జడ్జి ముందుకు తీసుకుపోతే ఆయన కారణం అడుగుతారు కదా అందుకని ఆ డిఎఫ్ఓ శ్రీనివాసన్ ఏం చేశాడంటే రేంజర్ చిదంబరం దగ్గరకు వెళ్ళాడు రేంజర్ చిదంబరం తమిళంవాడు మనకు కావలసినవాడు కానీ మన తమిళంవాడు ఆ కన్నడం వాడికి సపోర్ట్ ఇచ్చాడు. చూడు ఎలా వుందో!

డిఎఫ్ఓ శ్రీనివాసన్ రేంజర్ చిదంబరం దగ్గరకు వెళ్ళి నీకు ఒక భాగం యిస్తాను అని చెప్పాడు. ఒక సెట్టు ఏనుగు దంతాలు, రెండు తుపాకులు ఇస్తాను. నీవు వీళ్ళని సత్యమంగళం అడవిలో వేటాడుతుంటే ఫారెస్టు వాళ్ళు వెంబడించి పట్టుకున్నట్టుగా కేసు బుక్‌చెయ్యి. కోర్టులో అప్పగించు అని చెప్పాడు.

అంటే మా వాళ్ళు కోర్టులో రిపోర్ట్ యిచ్చిన తేదీకి ముందురోజు నాడే వాళ్ళని అరెస్టు చేసినట్టుగా ఏర్పాట్లు చేసేశాడు. అందుకు ఈ చిదంబరం రెంజర్ ఒప్పుకున్నాడు.

ఈయన చెప్పి వుండొచ్చు కదా 'చూడయ్యా ఒక అమాయకుడి మీద అబద్ధం కేసు వేయడం నా వల్లకాదు నిజంగా వస్తువులతో పట్టుకుంటే కేసు వేయొచ్చు తప్పుడు కేసు వేయకూడదు. నాకు పిల్లలున్నారు' అని ఆ డిఎఫ్ఓ. తో చెప్పి వుండొచ్చు కదా? చెప్పలేదు

ఇతనికి కూడా తప్పుడు కేసులు వేసే అలవాటు వుంది. రోడ్డు పక్కన నించున్న వాళ్ళని పట్టుకుపోవటం బాగా తన్నటం. లంచం యిస్తే తీసుకుని వదిలేయటం లేకపోతే ఆఫీసులోంచి ఒక మూట గంధపు చెక్కలు తెచ్చి వాళ్ళమీద తప్పుడు కేసులు బనాయించటం ఇట్లా వేలాది మందిని హింసించాడు చిదంబరం రేంజర్.

ఇట్లాంటి రాక్షసునికి మా అన్నావాళ్ళని తీసుకొచ్చి అప్పగించాడు ఆ డిఎఫ్ఓ అప్పుడు వెంటనే ఈ రేంజర్ ఒక సెట్టు ఏనుగు దంతాలు, రెండు తుపాకులను మా అన్న మునియన్, పిరవా, దావునాయక్, కుళందయప్పన్‌ల పక్కన పెట్టి కేసు బుక్ చేశాడు. పాపం వీళ్ళందరూ ఇళ్ళల్లో వున్నవాళ్ళు. వాళ్ళు సత్యమంగళం అడవిలో ఏనుగుల్ని వేటాడుతుంటే చూశామని, మమ్మల్ని చూసి వాళ్ళు పారిపోయేందుకు ప్రయత్నించారనీ, మూడు మైళ్ళ దూరం వెంబడించి, పరుగెత్తి పట్టుకున్నామని రేంజర్ వాళ్ళు ఒక కేసు రాశారు ఇదంతా పేపర్లో కూడా వచ్చింది.

ఆ పేపర్‌ని నేను చూశాను. నాకు పిచ్చి కోపం వచ్చింది 'ఇతనొక అధికారా! ఏమిట్రా ఇతను ఇట్లా మనల్ని పదే పదే వేధిస్తున్నాడు. ఈ చిదంబరం రేంజర్ ఎక్కడరా వుండేది' అని పక్కవాళ్ళని అడిగాను. 'ఇక్కడే గుడి దగ్గర ఉంటాడు ఎప్పుడూ పది ఇరవై మందిని వెంటబెట్టుకుని వస్తుంటాడు. వచ్చినప్పుడల్లా అందరిమీదా బాగా అరుస్తుంటాడు' అనిచెప్పారు వాళ్ళు

'ఎంత మందితో వచ్చినా సరే ఇతనిని కాల్చాల్సిందే. మా జీవితాలని ఇతను నాశనం చేశాడు' అని అనుకున్నాను

ఆ ద్రోహి ఇలా తప్పుడు కేసు పెట్టొచ్చా? ఆ కన్నడప్ప చెప్పడం ఏమిటి - ఈ తమిళం వాడు వినడం, తప్పుడు కేసు పెట్టడం ఏమిటి? ఇదెక్కడి న్యాయం. పైగా ఆ అమాయకులని బెయిల్‌పై కూడా వదలం అంటున్నారు. నేను అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాను - 'ఇక ఇతని కథ ముగించాల్సిందే'.

ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది.

ఆ లారీదగ్గర నిలుచున్నది చిదంబరం రేంజరే!

'నా వాళ్ళను వదులుతావా లేదా' అని డబుల్ బ్యారల్ గన్ ఎక్కుపెట్టి నేను గద్దించినప్పుడు

అతను తలయెత్తి చూశాడు. ఆ వెంటనే గబుక్కున తలవంచుకుని పడిపోయాడు.

నన్ను చూసి భయపడి అలా వంగిపోయాయనుకున్నాను. కాని పిస్టల్ తీసి నాపైకి ఢాం .. ఢాం . అని కాల్పులు జరిపాడు ఓహో నన్నే కాలుస్తున్నావా కొడకా అనుకున్నాను. అంతలో నా మనిషి దొరైస్వామి అనేవాడు వేరేవైపు నుంచి పరుగెత్తి చిదంబరం రేంజర్‌మీద తుపాకి బాయ్‌నెట్‌తో పొడిచి 'ఎవరిమీదరా కాలుస్తున్నావు?' అన్నాడు. అప్పుడు అతను తన పిస్టల్‌ని మట్టిలో గుచ్చాడు.

నేను 'మన తుపాకులు తీయండి. మన మనుషుల కట్లు విప్పండి' అని అరిచాను. అక్కడ అంతవరకు గుంపుగా వున్న కుర్రాళ్ళంతా నన్ను చూసి భయపడి పారిపోయారు. మా వాళ్ళు తుపాకులు తీసుకున్నారు. అక్కడవున్న వాళ్ళ చేతి కట్లు అన్నీ విప్పేశారు

. ఒకడు చిదంబరం రేంజర్ వెనకాల తుపాకి ఎక్కుపెడుతున్నాడు అప్పుడు నేను 'ఒరేయ్ కాల్చకు కాల్చకు నేను వస్తున్నాను' అని అరిచాను నేరుగాపోయి అతణ్ణి ఒరేయ్ ఇలా రారా అన్నాను. నువ్వెవరివి అని అడిగాను. రేంజర్‌ని అని చెప్పాడు అతను 'నీది ఏ కులం?' 'పడయాచ్చి' 'నీ పేరేంటి?' 'చిదంబరం'

'ఒరే పాతకుడా! తమిళుణ్ణి అంటున్నావు పడయాచ్చి కులం వాడినని చెప్తున్నావు. ఎవడో కర్నాటక వాడు చెప్తే నా వాళ్ళమీదే తప్పుడు కేసు బనాయిస్తావా? నీకు మేం ఏం అపకారం చేశాం రా? నీ కుటుంబం బాగు కోసం మమ్మల్ని వేధిస్తావా? మమ్మల్ని కష్టాలపాలు చేస్తావా? అందుకే ఇప్పుడు నిన్ను కాలుస్తున్నాను' అని చెప్పాను. అతను నా వైపు అలాగే చూశాడు. నేను కాల్చాను. ధబ్‌మని కింద పడిపోయాడు

ఆ తర్వాత ఇంకొక రేంజర్‌ని 'ఒరే ఇలా రారా' అన్నాను వచ్చాడు 'నువ్వెవరివి' అని అడిగాను. 'నేను ఫారెస్టు వాడినే' అని చెప్పాడు 'నువ్వెవరివైనా కావచ్చు. నీ కులం ఏంటి?' 'బాయ్ అండి'. 'సరే నువ్వు ఏ పాపం చెయ్యలేదు. అందుకని నేను నిన్ను కాల్చను నువ్వు పోవచ్చు' అని వదిలేశాను.

అక్కడ ఇంకొకడు నిలుచున్నాడు. 'ఒరేయ్ ఇలారా' అన్నాను వచ్చాడు. 'నీ కులం ఏంటి?' అని అడిగాను. 'నేన మొదిలియార్ అండి' అన్నాడు. 'నువ్వు ఏం అధికారివి?' 'నేను రైటర్‌ని'. రైటర్ అంటే ఆఫీసులో వుండాలి కదా వీళ్ళతో ఎందుకు వచ్చావు?' అని అడిగాను. 'తెలియక వచ్చేశాను' అన్నాడు. 'సరే నువ్వు కూడా ఏం పాపం చెయ్యలేదు. అందుకని నిన్ను కూడా చంపకుండా వదిలేస్తున్నాను. ఫో ఆ రేంజర్ చాలా పాపాలు చేశాడు అందుకు ఫలితం అనుభవించాడు. రేంజర్‌ని వీరప్పనే కాల్చాడు అని పోయి నీ అధికార్లకి చెప్పు' అన్నాను.

ఆ తరువాత నా మనుషులను తీసుకుని వెనక్కి వచ్చేశాను. ఆ గంధపు చెక్కలని వాళ్ళే మళ్ళీ స్వాధీనం చేసుకున్నారు అమ్ముకున్నారు. చిదంబరం రేంజర్‌ని చంపినప్పుడు మా అన్న మాదయన్ జైల్లోనే వున్నాడని అనుకున్నాను. కానీ ఆయన అంతకుముందే బెయిలుమీద బయటకు వచ్చి వున్నాడట. వారం రోజులో ఎనిమిది రోజులో అయిందట. కానీ అప్పుడు నాకు ఆ సంగతి తెలియదు. నేను ఎక్కువగా అన్న వుండే ఊరివైపు పోను కదా. ఎవరితోనైనా మాట్లాడి, పేపర్ చూసి విషయాలు తెలుసుకుంటాను. నాకు కొన్ని రోజుల తర్వాత ఈ సంగతి తెలిసింది

చిదంబరం రేంజర్‌ని చంపింది మా అన్న మాదయన్ అని కేసు వేశారట. ఇప్పటికి కూడా ఆయన జైల్లోనే వున్నాడు ఇప్పటికి ఏడు సంవత్సరాలైంది. అతనికి ఈ హత్యకు అసలు ఏ సంబంధమూ లేదు తన చెయ్యి విరిగిపోయినప్పటి నుంచి వ్యవసాయం చేసుకుంటూ, ఇంటిపట్టునే పడి వుంటున్నాడు. ఎప్పుడూ ఈ వైపునకే రాడు. అతనికి ఏ పాపం తెలియదు. నేను అంతకు ముందు

నా శత్రువులను చంపినప్పుడు కూడా అతను జైలు లోపలే వున్నాడు. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి.



## మా పన్నెండు కుక్కలను విషంపెట్టి చంపాడు ఆ డి.ఎఫ్.ఓ !

చిదంబరం రేంజర్ చనిపోవడానికి ముందు ఆ డిఎఫ్ఓ గాడే నన్ను వెతు క్కుంటూ వచ్చాడు.

ఊళ్ళో వుండి ఆవులను కాచే రోజులప్పటి నుంచీ నేను ఓ పన్నెండు కుక్కలను పెంచేవాణ్ణి. కుక్కలంటే నాకు చాలా ప్రేమ. ఇప్పుడు మిమ్మల్ని సుబ్రమణీ ఇలా రాయ్యా అని ఎట్లా పిలుస్తున్నానో అప్పుడు నా కుక్కలన్నింటినీ అలా పిలుచుకునేవాణ్ణి. అన్ని కుక్కలకు పేర్లు పెట్టాను. చిన్నయ్యా, వీతా, చిక్కా, చేనా, చిన్నకుట్టి, చింగిలి ఇట్లా ఒక్కో కుక్కకి ఒక్కో పేరు పెట్టాను అన్నీ మామూలు జాతి కుక్కలే. వాటికి ఆవుపాలు పోసి పెంచాను. ఏయ్ చింగిలీ ఇలారా అనగానే వచ్చేసేది. అన్ని కుక్కలూ బాగా వేటాడేవి. వాటికి ఇంట్లో బెడ్‌షీట్ పరిస్తేనే పడుకునేవి. ఉత్త నేలమీద అస్సలు పడుకునేవి కావు. నేను వాటికి మంచాలు వేసి జంపుఖానాలు, దుప్పట్లు పరిచి ఒక్కో దాంట్లో నాలుగు ఐదు చొప్పున పడుకోబెట్టేవాణ్ణి.

ఒకరోజు ఆ డిఎఫ్ఓ శ్రీనివాసన్ ఇడ్లీల్లో విషంపెట్టి నా పన్నెండు కుక్కలను చంపేశాడు. నా ఎడ్ల బండి చక్రాలని తగులబెట్టేశాడు అప్పుడే నాకు ఆయన మీద పిచ్చి కోపం వచ్చింది. పన్నెండు కుక్కలను చంపేశాడే. అవి ఆయనకు ఏం ద్రోహం చేశాయి? నోరులేని జంతువులు కదా!

నేను అప్పుడే ఆ డిఎఫ్ఓను కాల్చేయడానికి బయలుదేరబోయాను. కానీ ఇదే అన్న నాకు అడ్డం వచ్చాడు. 'ఒరే నువ్వు ఆయనను కాల్చేస్తావు కానీ పోలీసులు నన్ను పట్టుకుపోతారు' అన్నాడు. అట్లా కొన్నాళ్ళపాటు మా అన్న నన్ను అడ్డుకున్నాడు. కాని అతను జైల్లో వున్నప్పుడు కోపంతో రేంజర్‌ని చంపేశాను.

రేంజర్‌ని చంపిన తరువాత ఎక్కడికి వచ్చాను? మళ్ళీ మా చోటుకే - అంటే గోపీనత్త అడవికే వచ్చేశాను. అప్పటినుంచి నా శత్రువులతో మెయిన్‌గా అయ్యన్నన్, అయ్యాన్‌దురై, గుణశేఖరన్, ముత్తుకుమార్, ధన్‌పాల్ అనే ఐదుగురితో విరోధం బాగాపెరిగింది. వాళ్ళంతా మంచి వేటగాళ్ళు. మంచి తుపాకులు అవీ వున్నవాళ్ళు. 'వీరప్పన్ మనవాళ్ళని కాల్చి చంపాడు కాబట్టి మనం ఎలాగైనా అతణ్ణి కాల్చి చంపాలి' అనే కసితో తిరుగుతున్నారు.

వాళ్ళు నన్ను కాల్చేందుకు తిరుగుతున్నారని నాకు తెలుసు. అందుకని వాళ్ళు అసలు ఎక్కడెక్కడ తిరుగుతారో నేనే ముందు కనుక్కున్నాను. వాళ్ళని వెంబడించాను ఐదుగురినీ నేనే చంపేశాను. ఇది ఎలా జరిగిందంటే వాళ్ళు తుపాకులు పట్టుకుని నన్ను వెతుక్కుంటూ ఒకచోటుకి వచ్చారు. నేను దాగి వుండి వాళ్ళని ఐదుగురినీ కాల్చేశాను. వాళ్ళని చంపిన తరువాత ఆ శవాలని తీసుకెళ్ళి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న కావేరి నదిలోకి విసిరేశాము వాళ్ళ ఐదు తుపాకులను మేమే తీసేసుకున్నాం.

ఆ తర్వాత మా చోటులో వుండిపోయాం. పోలీసులు కేసు రిజిష్టర్ చేశారు. మా కోసం వెతకడం మొదలుపెట్టారు. కానీ వాళ్ళు అంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే పోలీసులకు కూడా తెలుసు

- వాళ్ళందరూ నన్ను కాల్చడానికి చాలా రోజులుగా తిరగడం. అందువల్లే నేను వాళ్ళని కాల్చానని తెలుసు కాబట్టి దానిని అలా ఓ లెవెల్‌గా వదిలేశారు. ఆ కేసు అలాగే వుండిపోయింది. ఈ డిఎఫ్ఓ.నేమో చిక్‌మగళూరు ధర్మశాల లైనుకు వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లో నాకు తిండి దొరకడమే కష్టంగా వుండేది. అంతకు ముందు నేను చాలా సంపాదించాను అదంతా ప్రజలకు ధారపోశాను. అందుకని అయ్యో ఇప్పుడు వీరప్పన్ కష్టపడుతున్నాడే అని ప్రజలే నాకు తిండీ అదీ తీసుకొచ్చి పెట్టేవాళ్ళు ఖర్చులకు వుంచుకో అని పేదవాళ్ళు కొంత డబ్బు యిచ్చేవాళ్ళు. కాని నేను వద్దని చెప్పేవాణ్ణి.

సరే అదట్లా వుండనీ. నేను పంచాయితీలు కూడా చెప్పేవాడిని ఈ ప్రాంతపు ప్రజలంతా తమ తగాదాల పరిష్కారానికి, పంచాయితీల కోసం నా దగ్గరకే వచ్చేవాళ్ళు అయితే ఎవరిదగ్గరా ఐదు పైసల లంచమైనా తీసుకునేవాణ్ణి కాదు. ఊరు జనానికి ఏ సమస్య వచ్చినా మాట్లాడి పరిష్కరించేవాణ్ణి ఎవర్నీ మోసం చేసేవాణ్ణి కాదు కోపంతో శత్రువుల్ని చంపి వనవాసం చేస్తున్నవాణ్ణి, అడవిపాలైనవాణ్ణి కదా అందుకని అందరికీ మంచిగా బుద్ధి చెప్పేవాణ్ణి.

ఒకడు ఒకామెను ప్రేమించి ఆమె గర్భవతికాగానే మోసగించి వెళ్ళిపోయాడు వాళ్ళు వచ్చి నా దగ్గర ఏడ్చారు. నేను ఆ మోసగాణ్ణి ఈడ్చుకురండి అని నా వాళ్ళను పంపించాను. అతనికి బుద్ధి చెప్పి వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించాను. ఇప్పుడు పిల్లా పాపలతో వాళ్ళు సంతోషంగానే వున్నారు

ఇట్లా ఎంతోమంది ఆడవాళ్ళకు సంబంధించిన కేసులు పరిష్కరించాను. అట్లాగే భూ తగాదాలు కూడా నా దగ్గరకు చాలా వచ్చేవి. ఆ కేసులు కోర్టుల్లో చాలా ఏళ్ళ నుండి పడి వుండేవి. నేను వాళ్ళతో మీరు ముందు కోర్టుకు పోయి రాజీ పడినాము అని చెప్పి కేసు వాపసు తీసుకోండి అని చెప్పేవాణ్ణి. ఆ తర్వాత నేను వాళ్ళకి న్యాయం చెప్పేవాణ్ణి. నేను ఇట్లా చెప్పిన న్యాయం వల్ల నాకు చాలా పేరు వచ్చింది. అయితే ఇక్కడ నేను ఒక కేసు మాట్లాడుతుంటే ఆ వెనకే పది కేసులు కాచుకుని వుండేవి. రాత్రి పూట కూడా ఈ ప్రజలు నన్ను సరిగా నిద్రపోనిచ్చేవాళ్ళు కాదు. లైటు పెట్టుకుని మరీ తీర్పిచ్చేవాణ్ణి. ఈ తగాదాలు అడవి నుంచి కాదు టౌను నుంచే ఎక్కువగా వచ్చేవి.

రాళ్ళ క్వారీకి సంబంధించిన ఒక పెద్ద తగాదాని కూడా నేనే పరిష్కరించాను.

వాళ్ళిద్దరూ పెద్ద పార్టీలే. ఒకరు ఛైర్మన్, ఇంకొకరు రాళ్ళ నేల యజమాని. నాపరాళ్ళ క్వారీ విషయంలో వాళ్ళిద్దరి మధ్య తగాదా వచ్చింది. దానికి ఎవ్వరూ పరిష్కారమార్గం చూపలేకపోయారు. చివరకు వాళ్ళు ఎం.పి.గారి దగ్గరకు కూడా వెళ్ళారు. అయినా లాభం లేకపోయింది. చివరికి వాళ్ళు నా దగ్గరకు వచ్చారు. ఇద్దరినీ కూచోబెట్టి తగాదాని నేనే పరిష్కరించాను. ఎలా పరిష్కరించాను? ఆ ఇద్దరి మధ్య రాళ్ళ క్వార్రీని వేలం వేశాను. ఇద్దరూ ఆ వేలంపాటలో పాల్గొన్నారు. ఆ తరువాత ఒకరు తప్పుకోగానే వేరేవాడికి వేలం దక్కింది. అంటే తొమ్మిది లక్షలు ఇవ్వాలని చెప్పి పంపాను. అట్లాగే యిచ్చేశాడు. ఆ తర్వాత అతను దానిని పదిహేను లక్షలకు అమ్మేశాడు. నేను గనక ఆ రోజు ఆ తగాదాని పరిష్కరించి వుండకపోతే అది హత్యలతో ముగిసి వుండేది. ఎందుకంటే రెండూ కూడా చాలా పెద్ద పార్టీలే కదా.

ఈవిధంగా నేను బీదవాళ్ళకీ, స్త్రీలకీ, రైతులకీ, పెద్ద పార్టీలకి న్యాయం చేశాను కొన్ని హత్య కేసులు కూడా నా దగ్గరకు వచ్చాయి. కోర్టుకు పోతే ఏమవుతుంది? వకీళ్ళు డబ్బు గుంజుతారు. కోర్టులు మిమ్మల్ని నాలుగైదు సంవత్సరాలు అటూ ఇటూ తిప్పుతాయి. అంతే, ఏం న్యాయం దొరకదు అక్కడ.

కానీ, నా దగ్గరకు అట్లాంటి కేసు వచ్చినప్పుడు చచ్చిపోయిన కుటుంబం వాళ్ళకి కొంత డబ్బు యిప్పించి, బతుకుతెరువు చూపించి న్యాయం చేసి పంపేవాడిని



## పదిహేను ప్రయత్నాలు ...
## అదే చోట నలుగురు సఫా !

ఇదిలా వుండగా గంధపు చెక్కల స్మగ్లింగ్ చేద్దామని కొంతమంది చెప్పారు 'అయ్యయ్యో వద్దు. ఆ గంధపు చెక్కలను తరలిస్తున్నాడనే కదా రేంజర్‌ని చంపాను' అన్నాను.

అప్పుడు వాళ్ళు 'అదికాదు చాలామంది లక్షల కొద్దీ తరలిస్తున్నారు. అడవిలో గంధపు చెక్క కూడా చాలా పడివుంది' అన్నారు. సరే కానీయ్ అని అప్పటి నుంచే గంధపు చెక్క సేకరించడం మొదలుపెట్టాను. గంధపు చెక్కల (స్మగ్లింగ్)కు నాయకత్వం వహించాను. ప్రజలు గంధపు చెక్కలు పోగు చేసేవారు వాళ్ళకి ఇంత డబ్బు దొరికేది.

నాకు గంధపు చెక్కల వీరప్పన్ అని ఎంతో పేరు వచ్చింది కానీ ఆ గంధపు చెక్కలవల్ల నేను పెద్దగా ఏమీ సంపాదించుకోలేదు కేవలం పదకొండు నెలలు మాత్రమే వృధాగా ఆ వ్యాపారం చేశాను మహా అయితే ఒక కోటి రూపాయలు వచ్చి వుంటాయి ఆ డబ్బంతా ప్రజలకే యిచ్చేశాను. అంతే!

కానీ, ఎన్నో సంవత్సరాలు గంధపు చెక్కల స్మగ్లింగ్ చేసి వేల కోట్లు సంపాదించుకున్న వాళ్లు వున్నారు. నాకు మాత్రం దాంట్లో వెంట్రుక ముక్క కూడా మిగల్లేదు. గంధపు చెక్కల వీరప్పన్ అనే పెద్ద పేరైతే వచ్చింది. పోలీసు వాళ్ళు నాకోసం ఇక్కడ మకాం వేసుకుని కూచున్నారు.

మన అందియూర్ ఎం ఎల్ ఎ పెరియస్వామి ఇంటికి ప్రతిరోజూ ఎంతలేదన్నా నాలుగు లోడ్ల ఈట్టిమరం చెక్క తరలిపోతూ వుంటుంది అదేం విచిత్రమో ఆ ఎం ఎల్.ఎ లారీ వస్తోంటే చెక్‌పోస్ట్ దూలం అలా పైకి లేచిపోతుంది. ఇంత చేసినా ఆయనకు ఈట్టిమరం పెరియస్వామి అని పేరు మాత్రం రాలేదు ఎందుకు? ఎందుకంటే ఆయనకు రాసిలేదు నాకు రాసి వుంది. అందుకే నా ఒక్కడికే గంధపు చెక్కల వీరప్పన్ అని పేరువచ్చింది. ఏం చేస్తాం!

నేను గంధపు చెక్కలను రవాణా చేసింది కేవలం పది పదకొండు నెలలు మాత్రమే అప్పుడు తమిళనాడు కరుణానిధి పాలనలో వుంది కర్ణాటక, తమిళనాడు రెండు ప్రభుత్వాలు పోలీసు దళాలను పంపి నానా హడావిడి చేశాయి. అప్పుడు నా మనుషులు అడిగారు 'కాల్చేయమంటావా?' అని. నేను వాళ్ళతో 'వద్దు నాయనా గచ్చికాయలకు మొండాన్ని యిచ్చిన కథలో మాదిరిగా పోలీసు అధికారులను చంపుదామా వద్దయ్యా' అన్నాను.

కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒక అరవై టన్నుల గంధపు చెక్కను పోగుచేసి పెట్టాను. ఈ విషయం ఎలాగో వాళ్ళకి తెలిసిపోయింది. ఒక ఐదువేల మంది వున్న సాయుధ పోలీసు దళాలు వచ్చి పడ్డాయి. మన కుర్రవాళ్ళు (అనుచరులు) వున్నది పదిమందే. వాళ్ళేమో వేల మంది. ఏం చేయడానికి వీలుకాని పరిస్థితి. నా మనుషులు వెనక్కి వచ్చి 'అన్నా మన చెక్కలన్నీ వాళ్ళు దోచుకుపోతున్నారు' అని చెప్పారు. నేను 'పోతే పోనీరా, గవర్నమెంటు సొమ్ము గవర్నమెంటుకే పోతున్నది' అని చెప్పి ఆ చెక్కలను అలాగే వదులుకున్నాను

మంచిమంచి చెక్కలను పోలీసువాళ్ళు మూటలు కట్టుకుని తమ ఇళ్ళకు తీసుకుపోయారట.

మిగిలిన చెక్కలను రెండు ప్రభుత్వాలు (కర్ణాటక - తమిళనాడు) చెరిసగం పంచుకున్నట్టు విన్నాను. దాంతోపాటే ఆ కథ ముగిసిపోయింది

గంధపు చెక్కల బిజినెస్‌ను అంతటితో వదిలేశాను.

నేను శింగాపురంలో వున్నప్పుడే పెళ్ళి చేసుకున్నాను.

ఆ సమయంలో పోలీసులు బాగా వెతుకుతున్నారు. వాళ్ళు వెతుక్కుంటూ ఆలంబాడి అనే చోటుకి వెళ్ళారు. అక్కడొక పురాతనమైన గుడి వుంది. కనీసం మూడు వందల ఏళ్ళ కిందటి గుడి రాజుల కాలం నాటిది. అక్కడి శిల్పాలు చాలా అందంగా వుంటాయి. అసలు అక్కడ లేని శిల్పాలు లేవు. ఆ గుడిలో ఒక పూజారి పూజలు చేస్తుంటాడు. అతని వయసు అరవై ఏళ్ళకు పైనే వుంటుంది. ఆ స్వామి భార్య కూడా అరవై సంవత్సరాలు వుంటుంది.

ఈ పోలీసువాళ్ళు జీపువేసుకుని ఆ గుడి దగ్గరకు పోయారు. ఆ పూజారిని పట్టుకుని 'నీవు వీరప్పన్ వచ్చినప్పుడు పూజ చేసిపెట్టావట కదా' అని అడిగారు.

అప్పుడు ఆ పూజారి 'సామీ నేను గుడిలో పూజారిని. వీరప్పన్ వచ్చినా, ఇంకెవరు వచ్చినా పూజ చేసిపెట్టవలసిందే. మీరు ఏ కొబ్బరికాయో యిస్తే మీ తరఫున కూడా అర్చన చేస్తాను' అని చెప్పాడు.

అంతే పోలీసువాళ్ళు అక్కడే ఆ పూజారినీ, ఆయన భార్యనీ బాగా కొట్టి చంపేశారు.

ఆలంబాడిలో అమాయక జనుల ఇండ్లను కూల్చేశారు. అన్నింటినీ తగులబెట్టారు. అక్కడ జనం అంతా అమాయకులు. ఏదో ఇళ్ళు కట్టుకుని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు.

ఈ కబురు నాకు అందింది 'అయ్యయ్యో పూజారినీ, పూజారి భార్యనీ చంపేశారు. అంత ముసలి వాళ్ళని చంపినవాడు ఒక మనిషేనా. ముందు ఆ పోలీసు అధికారిని చంపేయాలి' అనుకున్నాను.

మరుసటి రోజు అదే జీపు అదే ఆలంబాడి వైపు వెళ్ళింది. చూశాను. ఒక అనువైన చోటుకు వెళ్ళి మాటు వేశాను. ఆ జీపు పగటిపూట వచ్చి వుంటే ఒక్కణ్ణి కూడా వదిలివుండేవాణ్ణి కాదు. చీకటి పడ్డాక వచ్చింది. అమావాస్య కారు చీకటి రాత్రి ఎనిమిది అవుతుండవచ్చు జీపు వచ్చింది హెడ్‌లైట్ వెలుతురు గమనించి ముందు జీపు అద్దాలపై కాల్చాను. ఒక పది పదిహేను రౌండ్లు నేను ఒక్కణ్ణే కాల్చాను నలుగురు అక్కడికక్కడే చచ్చారు. నలుగురు సబ్‌ఇన్స్పెక్టర్లు, ఒక రేంజర్, ముగ్గురు పోలీసు వాళ్ళు వున్నారు. అందులో ముగ్గురు సబ్‌ఇన్స్పెక్టర్లు, ఒక పోలీస్‌వాడు అవుట్ ..!



## డి.ఎఫ్.ఓ శ్రీనివాసన్ తలను నరికి తెచ్చేశాను !

ఆ సంఘటన తరువాత కనిపిస్తే కాల్చేయమని ఫైరింగ్ ఆర్డర్ ఇచ్చింది. నన్ను అక్కడికక్కడే కాల్చేయా లనే ఘోరమైన నిర్ణయం తీసుకుంది. నాకోసం పోలీసులు తీవ్రంగా వెతుకుతున్నారు అచూకీ చెప్పమనీ అమాయక ప్రజలను బాగా కొడుతున్నారు. కేసులు పెడుతున్నారు. అదొక పెద్ద గందరగోళం ...

అప్పుడే ఆ డిఎఫ్ఓ శ్రీనివాసన్ 'నేను పోయి వీరప్పన్‌ని పట్టుకుంటాను. నాకు ఐదు వందల మంది సాయుధ పోలీసులని ఇవ్వండి' అని ప్రభుత్వాన్ని అడిగాడు.

అంతకుముందు ఎప్పుడో నా చెల్లి మారీని నాట్రాంపాళయం అనే ఊరుకు ఇచ్చియున్నాను అమెకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు వున్నారు. ఆ ఊళ్ళో వాళ్ళకి ఓ ఐదెకరాల భూమి వుంది. వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు నేను ఎప్పుడన్నా రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి వీలైనప్పుడు చెల్లె ముఖం చూసి వచ్చేవాడిని. లేకపోతే లేనేలేదు.

ఇట్లా వుంటే ఆ డిఎఫ్ఓ. శ్రీనివాసన్ పోయి నా చెల్లెలి భర్త మీద తప్పుడు కేసు బనాయించి లోపలికి తోసేశాడు. నా చెల్లెల్ని, ఆమె పిల్లల్ని లాక్కొచ్చి శంగంపాడిలో వుంచాడు. ఏం చేశాడో తెలియదు కానీ ఒక ఆడది విషం తాగి ఎందుకు చనిపోతుంది? జరగకూడనిది ఏదో జరిగింది. నేను చెప్పేదేమిటి నలుగురు పిల్లల్ని వదిలేసి ఒక తల్లి విషం తాగి చనిపోతుందా?

నా చెల్లెల్ని ఒక ఇంట్లో ఒంటరిగా బంధించిపెట్టాడట. ఆ డిఎఫ్ఓ గాడు రోజూ రాత్రిపూట ఆ ఇంటికి వచ్చి వెళ్ళేవాడట. నా చెల్లెలికి కూడా తుపాకి కాల్చడం తెలుసు. ఎప్పుడో నేనే నేర్పించాను

ఒక చిన్న కుర్రాడితో నా చెల్లెలు నాకు ఒక కబురు పంపింది 'నాకొక తుపాకి పంపించు. ఈ డిఎఫ్ఓను చంపి అడవికి వచ్చి నీతో చేరిపోతాను' అని చెప్పి పంపింది.

అప్పుడు నేను 'తొందరపడవద్దు. నలుగురు పిల్లలతో అడవిలో వుండటం వీలుపడదు. చాలా కష్టం. ఆ డిఎఫ్ఓ. గాడిని నేనే చంపేస్తాను. అసలు నేను అడవిపాలు కావడానికి కూడా అతనే కారణం కాబట్టి ఎలాగూ అతణ్ణి నేనే లేపేస్తాను కొద్ది రోజులు ఓపికపట్టు' అని నా చెల్లెలికి తిరిగి కబురు పంపించాను.

అయితే ఆ కబురు చేరిన మరునాడే నా చెల్లెలు విషం తాగి చచ్చిపోయింది. అలా ఒక అమ్మాయి ఎందుకు చచ్చిపోతుంది?

ఆ ఊరికి ఇప్పుడు పోయి అడిగినా ఎవరూ ఆ డి.ఎఫ్.ఓకి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడరు. ఒక్కో ఇంట్లో డిఎఫ్ఓ ఫొటో కూడా వుంటుంది. లేకపోతే పోలీసులు చంపేస్తారు. ప్రజలు చాలా కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది

అసలు ప్రజలు పట్టిస్తేనే కదా వీరప్పన్‌ను పట్టుకోవడం సాధ్యమవుతుంది. అందుకని ఆ డిఎఫ్ఓ ఏం చేశాడంటే ప్రజల దగ్గరకు వెళ్ళి అడిగాడు. మీకు వీరప్పన్ ఏం చేస్తానని చెప్పాడు? ఏం మేలు చేశాడు?' అందుకు ప్రజలు 'వీరప్పన్ మారియమ్మ గుడిని కడతానన్నాడు. వీరప్పన్ పూజలు బాగా చేస్తాడు. తీర్పులు చెబుతాడు. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని చెడిపితే అతణ్ణి పిలిచి మందలించి ఆ అమ్మాయితో పెళ్ళి జరిపిస్తాడు. అన్యాయాలేమీ చెయ్యలేదు అందరికీ మంచే చేశాడు' అని చెప్పారు.

అప్పుడు ఈ డిఎఫ్ఓ ఖాకీ దుస్తులు తీసేసి కాషాయం ముసుగు వేసుకున్నాడు. గుడి కట్టాలి. భక్తిగా వుండాలి. పోలీసుల్ని చూసి ప్రజలు ఎవరూ భయపడకూడదు అనుకున్నాడు.

ప్రజలను హింసించవద్దు, ఇబ్బంది పెట్టవద్దు అని పోలీసు వాళ్ళకి చెప్పాడు. ఇలా ఒక ఎత్తు వేసి వీరప్పన్‌ని పట్టాలి అని భావించాడు

అతను ఏం చేసేవాడు? ఒక్కొక్క ఊరుకు వెళ్ళేవాడు ఇక్కడ చాలామంది మేకలను, గొర్రెలను, పొట్టేళ్ళను పెంచుకుంటారు. వేలకొద్దీ మేకల వల్లనే ఈ అడవంతా నాశనం అయింది సరే ఒక్కొక్క

ఊళ్ళో రెండు మూడు మేకలు ఇవ్వమని అడిగేవాడు. ఎవరైనా అయ్యా ఇవి నావి కావు. కూలికి మేపుతున్నాను అని అంటే - వీరప్పన్ అడిగితే ఇస్తావు కానీ నేను అడిగితే ఇవ్వవా అని దబాయించేవాడు. దాంతో వాళ్ళు భయపడి మేకలను ఇచ్చేసేవాళ్ళు. ఇట్లా తీసుకుపోయిన మేకలన్నీ వేలంవేసి ఆ డబ్బుతో సిమెంటు అదీ కొని మారియమ్మ గుడిని కట్టించేశాడు.

మారియమ్మ చాలా శక్తి వున్న దేవత ఈ డిఎఫ్ఓ నేమో బూట్లు వేసుకునే గుడిలోకి రావడం పోవడం చేస్తూండేవాడు.

అక్కడ ఒక శిల్పం వుండేది. అది చాలా పురాతన శిల్పం. దాన్ని తీసుకెళ్ళి కావేరీ నదిలో పడేయండి అని చెప్పాడు ఈ డిఎఫ్ఓ. అదేమో చాలా శక్తులు వున్న విగ్రహం. జాతర జరిగినప్పుడు ప్రజలు దానికి వేల సంఖ్యలో మేకలు, కోళ్ళు బలియిచ్చేవాళ్ళు. అక్కడ రక్తం నదిలాగా పారేది. అట్లా బలి తీసుకునేది ఆ దేవత

ఒకప్పుడు ఆ ఊరు రెండు వర్గాలుగా చీలి కోర్టుకు ఎక్కారు. ఆ కోర్టుకేసు సమయంలో ఒకతను ఉప్పు పెట్టెమీద నిలబడి అబద్ధం సాక్ష్యం చెప్పాడు. అంతే ఆ సాక్ష్యం చెప్పిన ఎనిమిదవ రోజు నాడే అతని శరీరం మీద వేలకొద్దీ అమ్మవారి కళ్ళు పొడుచుకుని వచ్చాయి (మశూచి వచ్చింది). అతను చచ్చిపోయాడు. తప్పుడు సాక్ష్యం చెప్పాడు కాబట్టే వెయ్యి కళ్ళు పెట్టి మారియమ్మే చంపేసిందని ప్రజలు అనుకున్నారు. అతను కూడా చనిపోయే ముందు 'అబద్ధం సాక్ష్యం చెప్పినందుకే యిలా పోతున్నాను' అన్నాడు.

ఆ దేవత గుడి గురించి, దాని శక్తి గురించి ఈ డి ఎఫ్.ఓకి ఏం తెలుసు. నన్ను పట్టుకోడానికి ఏదో కాషాయం పంచ, కాషాయం లాల్చి వేసుకుని ఒక సెటప్‌తో నాటకం ఆడుతున్నవాడు కదా!

ఆ విగ్రహాన్ని కావేరీ నదిలో పారేయమని చెప్పాడు కదా డిఎఫ్ఓ. కానీ ఆ కుర్రవాడు అలా పారేయకుండా అడవిలో ఒక రాయి మీద పెట్టి వచ్చాడు. డిఎఫ్ఓ చచ్చిపోయిన తరువాత ఆ విగ్రహాన్ని తెచ్చి ప్రజలు మళ్ళీ గుడిలో ప్రతిష్ఠించుకున్నారు.

ఆ గుడిలో మేకలు కోళ్ళు బలి ఇవ్వకూడదనీ, కావాలంటే ఒక రెండు కోళ్ళు మాత్రం గుళ్ళో కోసి మిగతావన్నీ బయట వేరే చోట కోసుకోవాలని చెప్పాడు డిఎఫ్ఓ ప్రజలు అప్పుడు భయపడి అలాగే చేశారు.

దీని గురించి పేపర్‌లో కూడా రాశారు. డిఎఫ్ఓ. శ్రీనివాసన్ ప్రజలకు మంచే చేశాడు కదా - మరి ఆయనను వీరప్పన్ ఎందుకు కాల్చాడు అని ఏదో పేపర్లు రాశాయి.

నా చెల్లెలు చనిపోయిన రోజు నాడే ఈ డిఎఫ్ఓను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాను. అతను ఎటు వెళ్ళినా వందమంది సాయుధ దళంతో వెళుతుంటాడు అందుకని నాటు బాంబులతో మందు పాతరతో చంపాలని ఏర్పాట్లు చేశాను. అంటే అతను మూడు వందల మందితో వచ్చినా నాలుగొందల మందితో వచ్చినా సరే ఎవ్వరూ ప్రాణాలతో బయటపడకూడదు.

ఒక ప్రేలుడు పేలితే నాలుగువైపులా అరకిలోమీటరు దూరం పరిధిలో ఎవరొచ్చినా ప్రాణాలు కోల్పోవలసిందే. అట్లాంటి మందుపాతర రెడీ చేసి పెట్టాను.

అదే సమయంలో నా తమ్ముడు అర్జునన్ నా వద్దకు వచ్చాడు. అంతకు ముందు నాతో వుంటూ అడవిలో కష్టాలు పడలేక ఎప్పుడో వెళ్ళి స్వయంగా పోలీసులకు సరండర్ అయ్యాడు. ఇన్నాళ్ళూ జెయిల్లో వున్నాడు. అంటే నేను చిదంబరం రేంజర్‌ని కాల్చాను కదా. ఆ సమయంలో వాడు సరండర్

అయిపోయాడు. ఇద్దరిని చంపినట్టు నా తమ్ముడి మీద హత్యకేసు పెట్టారు. ఆ కేసు ఫెయిల్ అయిన తర్వాత బయటికి వచ్చేశాడు

పోలీసులు నా తమ్ముణ్ణి పట్టుకుని 'నిన్ను విడుదల చేస్తే నీ అన్న వీరప్పన్‌ని పట్టిస్తావా?' అని అడిగారట. 'సరే అలాగే పట్టిస్తాను' అని నా తమ్ముడు చెప్పాక అతణ్ణి వదలేశారు

ఎక్కడైనా తోడబుట్టిన అన్నని తమ్ముడు పట్టిస్తాడా? ఆ మాత్రం తెలవొద్దా? అంత తెలివితక్కువగా చెప్పి పంపారు పోలీసువాళ్ళు.

జైలు నుంచి వచ్చేశాక నా తమ్ముడు వ్యవసాయం చేసుకుని బతికేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరాడు కానీ పోలీసులు మాత్రం 'అలా కుదరదు మీ అన్నను పట్టించిన తరువాతనే వ్యవసాయమైనా ఏదైనా' అని గట్టిగా చెప్పారు

అంతకు కొద్దిరోజుల ముందే మా చెల్లెల్ని చంపారు. అదేసమయంలో వాడు నన్ను వెతుక్కుంటూ అడవిలోకి వచ్చాడు రాగానే 'అన్నా. అన్నా నువ్వు సరండర్ అయిపో' అని చెప్పాడు.

'ఏంట్రా అర్జునన్? ఏం ముఖం పెట్టుకుని ఇలా అంటున్నావు? మన సొంత చెల్లెల్ని చంపేశారు. చంపింది ఆ డి.ఎఫ్.ఓనే అతని మీద పగ తీర్చుకోడానికి నేను అన్ని ఏర్పాట్లు చేశాను. బాంబులు, మందుపాతరలు పెట్టాను అతనితో పాటు అందరు పోలీసులు చావనీ మన చెల్లెలి భర్తను తీసుకెళ్ళి కేసు పెట్టారు. నాట్రాంపాళయం నుంచి నలుగురు పిల్లలతోసహా చెల్లెల్ని ఇక్కడికి తీసుకొచ్చారు. చెల్లెల్ని అన్యాయంగా చంపారు అందుకని నేను అతణ్ణి చంపాలనుకుంటున్నాను' అని చెప్పాను.

అప్పుడు నా తమ్ముడు 'అన్నా! అట్లా చేయొద్దు అక్కడున్న పోలీసువాళ్ళు అందరూ ఏమీ చేయలేదు కదా! చేసిందంతా డి ఎఫ్ ఓనే వాడొక దొంగ వెధవ నేను ఎక్కడకు రమ్మంటే అక్కడికి వస్తాడు. వీరప్పన్ పిలుస్తున్నాడు రారా అంటే చాలు. అప్పుడు నీవు ఏమైనా చేసుకోవచ్చు. కానీ పోలీసు వాళ్ళందరినీ మాత్రం ఏం చేయొద్దు' అన్నాడు

'సరే పిలుచుకురా. అతను ఎంతోమందిని ముక్కలు ముక్కలుగా నరికాడు. హింసించాడు. అందుకని నేను కూడా అతణ్ణి చిత్రహింసలు పెట్టి చంపుతాను. పోయి అతణ్ణి ప్రాణాలతో పిలుచుకురా' అన్నాను.

'అదంతా వద్దు. అతనొక శత్రువు నేను పిలుచుకొస్తాను. నువ్వు కాల్చేసేయ్' అన్నాడు తమ్ముడు.

'సరే పో' అన్నాను.

అప్పటికి అర్జునన్ అడవిలోకి వచ్చి ఇరవై రోజులు అయింది. ఇరవయ్యవ రోజు నాడే నేనే ఒక ఐడియా చెప్పి అర్జునన్‌ని పంపించాను అదేంటంటే 'ఇరవై రోజులుగా అడవిలో మా అన్నను వెతికి పట్టుకున్నాను. ఇన్ని రోజులూ మా అన్నకి మంచిమాటలు చెప్పి మనసు మార్చాను. ఇప్పుడు సరండర్ అవడానికి అన్న సిద్ధమైపోయాడు. అయితే ఒక కోరిక వుంది. అది డి.ఎఫ్.ఓతోనే చెప్పాలి అంటున్నాడు. మీరు వస్తే మాట్లాడతాడు' అని తమ్ముడు డి.ఎఫ్.ఓకి నమ్మకంగా చెప్పాలి. అప్పుడు అతను తప్పకుండా వస్తాడు

అనుకున్నట్టుగానే 'ఓ ఎస్ వస్తాను పద, అంటూ మా తమ్ముడితో ఆ డిఎఫ్ఓ వచ్చేశాడు. తనతో పాటు ఓ నలుగురిని వెంటబెట్టుకుని వచ్చాడు.

చూశాను. సరే అని తుపాకితో కాల్చేశాను. వాళ్ళు ఒక వాగుని దాటేటప్పుడు.కొట్టాను. డిఎఫ్ఓ నీళ్ళల్లో పడిపోయాడు. వెళ్ళి నేలమీదకు లాగి అతని తలని నరికేశాను. నేను కాల్చినప్పుడే ఇద్దరు

పారిపోయారు తక్కిన ఇద్దరు భయపడుతూ నిలుచున్నారు.

'మిమ్మల్ని ఏం చేయను. మీరు వెళ్ళిపోండి. వెళ్ళి డి ఎఫ్ ఓని వీరప్పన్ కాల్చి తలకోసి తీసుకుపోయాడు అని' చెప్పండి అన్నాను. వాళ్ళు వెళ్ళిపోయారు.

ప్రభుత్వానికి ఇతని తల దొరకకూడదు దుర్మార్గుడు. నా జీవితాన్ని నాశనం చేశాడు. నా చెల్లెల్ని చంపేశాడు!

అతని శరీరం మీద రెండు లీటర్ల పెట్రోలు పోసి తగులబెట్టాను. తలను తీసుకెళ్ళి జుట్టును కాల్చేశాను.

వెయ్యిమంది మగవాళ్ళకి ఏ చెడైనా తలపెట్టవచ్చు. కాని ఒక్క ఆడపిల్లకు కూడా చెడు తలపెట్టకూడదు అని శాస్త్రం చెబుతోంది. నా చెల్లెలు చనిపోయే ముందు ఈ డిఎఫ్ఓ మీద చాలా కసితో వుండేది. ఆమె చనిపోయిన రోజు నుంచే నాకు ఇతణ్ణి కాల్చాలనే పగ రగిలింది.

మేమూ, తమ్ముడు అర్జునన్ కలిసి నిప్పు రాజేసి ఆ డిఎఫ్ఓ తలను పూర్తిగా తగులబెట్టేశాం. తరువాత ఆ పుఱ్ఱెని ఎఱ్ఱంగి అనే అటవీ ప్రాంతంలో పెట్టి 'నువ్వు చేసిన పాపాలన్నింటికీ ఇదే శిక్ష. ఈ ఫారెస్టుకు కాపలాగా వుండు' అని చెప్పి వచ్చేశాము.

ఆ తరువాత మిలటరీ వాళ్ళు, పోలీసు వాళ్ళు అంతా వచ్చి ఆ తలకోసం బాగా వెతికి, ఆవులు కాసే వాళ్ళని అడిగి చివరికి దానిని తీసుకెళ్ళిపోయారు.

డిఎఫ్ఓ కథ అలా ముగిసింది!

ఒక్కనెక్కల్ ప్రశ్న అదన్నమాట. అంటే నలుగురు సబ్ఇన్స్పెక్టర్లని చంపాను. రెండవది చెల్లెల్ని చంపినందుకు డిఎఫ్ఓని కాల్చాను. అప్పుడే!



## రామాపురం పోలీస్ స్టేషన్‌లో ఏడుగురిని చంపాను !

అప్పట్లో కర్ణాటక రాష్ట్రానికీ - తమిళనాడు రాష్ట్రానికీ మధ్య నీటి తగాదా ఏర్పడింది. ఎక్కువ జలాలను వదలాలని జయలలిత కర్ణాటక ప్రభుత్వాన్ని అడిగింది (కావేరి నదీజలాల వివాదం)

ఇష్టం వుంటే ఇవ్వాలి లేకపోతే లేదు అంతేకదా. కానీ, పొట్ట చేతపట్టుకుని ఏదో బతుకుదెరువు కోసం వచ్చిన అమాయకుల మీద దాడులు చేయడం, హింసించడం ఏం న్యాయం?

కర్ణాటక ప్రభుత్వం రాక్షసులను రెచ్చగొట్టి మన తమిళుల మీదకు పంపింది. వాళ్ళు ఎంతో మందిని భయంకరంగా కొట్టారు. ఇళ్ళకు నిప్పు పెట్టారు స్త్రీలపై అత్యాచారాలు చేశారు. హత్య చేశారు. ఇళ్ళను తగులబెట్టి ఏడుస్తున్న పిల్లల్ని ఆ మంటల్లోకి విసిరేశారు. అలా రెండు వందల మందికి పైగా తమిళుల్ని చంపేశారు. ఒక లక్ష మంది తమిళులు ఆ హింసను తట్టుకోలేక శరణార్థులుగా పారిపోయి వచ్చారు. అయ్యా మమ్మల్ని కాపాడండి అని పోలీస్ స్టేషన్‌కు పోతే అక్కడ పోలీసులు వాళ్ళమీద అత్యాచారాలు చేశారు. అక్కడి నుంచి ఏం వేసుకుని వచ్చావే, వట్టిగానే వచ్చావు కదా ఇప్పుడు వట్టిగానే పరుగెత్తు అని తరిమేశారు. అదంతా విన్న నాకు వెర్రి కోపం వచ్చింది. వెళ్ళి వాళ్ళని కాల్చాలన్న ఆవేశం రగిలింది.

చూశాను. రామాపురం స్టేషన్ దగ్గరలలో వుంది. దానిమీద దాడిచేశాను.

అరే ! తమిళులైనా, మరెవరైనా మనుషులే కదా రెండువందల మంది అమాయకులను చంపుతారా ఈ కిరాతకులు ?

ఒక రిటైర్డ్ మిలటరీ అధికారి పదిహేనేళ్ళ కూతురిమీద అతని ముందే అత్యాచారం చేశారు. ఇది పేపర్లో చదివాను. అతని పేరు గుర్తులేదు. ఆ మిలటరీ అధికారి దగ్గర అప్పుడు తుపాకి లేదు. వుంటే అందరినీ కాల్చిపారేసి వుండేవాడు.

ఇలాంటి అక్రమాలు జరుగుతుంటే ఈ పోలీసుగాళ్ళు ఎందుకు అడ్డు చెప్పలేదు? అందుకే రామాపురం పోలీస్ స్టేషన్ మీద దాడి చేసి ఏడుగురిని చంపేశాను అక్కడ వున్న తుపాకులన్నింటినీ ఎత్తుకొచ్చేశాను.

అది అలా జరిగింది.



## ఎస్.ఐ.ని పిలుచుకొస్తావా లేక నీ వాళ్ళని కాల్చిపారేయమంటావా?

కర్ణాటకలో నల్లూరు అని ఓ గ్రామం వుంది. ఆ గ్రామంలో వుండే వాళ్ళంతా తమిళం వాళ్ళే! ఆ ప్రాంతంలో ఒక సబ్ఇన్స్పెక్టర్ వున్నాడు . పేరు షకీల్ అహ్మద్. ఓ ఎస్.పి. వున్నాడు ... పేరు హరికృష్ణ. ఇద్దరూ ఇద్దరే! మహా కిరాతకులు! వాళ్ళకి పెద్ద పోలీసు దళాన్ని. ఎ.కె 47 రైఫిళ్ళని ఇచ్చింది ప్రభుత్వం.

ఒక నేరస్థుడిని వెతకండి. పట్టుకోండి తప్పులేదు. కాని అమాయకులను పట్టుకుని కొట్టడం, వాళ్ళ మీద అత్యాచారం చేయడం న్యాయమేనా?! వాళ్ళసలు అధికారులేనా?

ఓరోజు వాళ్ళు ఆ ఊరుమీద పడి పెళ్ళికాని నలుగురు యువకుల్ని అరెస్టు చేసి తీసుకుపోయారు. ఆ మరునాడే వాళ్ళని కాల్చిపడేశారు. నిజానికి ఆ యువకులు ఎవరి జోలికీ వెళ్ళేవారు కాదు. చాలా మంచి కుర్రవాళ్ళు. అలాంటి వాళ్ళని అన్యాయంగా కాల్చి పడేయొచ్చా? ఈ కర్ణాటక పోలీసులకి తమిళం వాళ్ళంటే ఎందుకో మంట. ఆ నలుగురిని కాల్చేశాక శవాలను లారీలో తెచ్చి నడిరోడ్డుమీద పడేశారు. తమిళ కులటల్లారా రండి బయటకు అంటూ గ్రామానికే నిప్పు పెట్టారు. చాలామంది స్త్రీల మీద అత్యాచారాలు చేశారు ఆ ఊరి నుంచి పారిపోయి వచ్చిన కొంతమంది ఈ విషయాలన్నీ మాకు చెప్పారు ఓ నలుగురు యువకులు నా గ్యాంగులో చేరిపోయారు.

'మా భార్యల మీద అత్యాచారాలు చేశారు. మా పిల్లల్ని చిత్రహింసలు పెట్టారు. వాళ్ళమీద పగతీర్చుకుని మేం చచ్చిపోతాం' అని చెప్పారు.

ఆ తరువాతే నేను సబ్ఇన్స్పెక్టర్ షకీల్ అహ్మద్‌ని, ఎస్.పి. హరికృష్ణని, వాళ్ళతో వచ్చిన దళాన్ని మట్టుపెట్టాను. రామవరం నుండి కొప్పంకు వెళ్ళే దారిపైకి వాళ్ళని ప్లాన్ ప్రకారం రప్పించి మరీ కాల్చాను. ఆ సంఘటన ఎలా జరిగిందో వివరంగా చెబుతాను.

ఈ రాక్షసులని ఎలా చంపాలా అని ఆలోచిస్తుంటే నాకు ఒక సిఐడి గుర్తుకువచ్చాడు. సిఐడి అంటే పోలీసు ఇన్ఫార్మర్ అన్నమాట. నా గురునాధన్‌ని పోలీసులకు వాడే పట్టించాడు అదెలాగంటే -

ఒకసారి గురునాధన్ 20 కిలోల ఏనుగు దంతాలని ఆ ఇన్ఫార్మర్‌కు ఇచ్చాడు. వాడు మధ్యవర్తిగా వుండి వాటిని ఎవరికో అమ్మిపెట్టాడు. అందుకు గురునాధన్ ఆ ఇన్ఫార్మర్‌కి మంచి కమిషన్ కూడా ఇచ్చాడు. అప్పటి నుండి వాడిమీద నమ్మకంతో వాడితో స్నేహంగా తిరిగేవాడు గురునాధన్.

ఇలా వుండగా మరోసారి గురునాధన్ ఆ ఇన్‌ఫార్మర్‌తో 'నాకు ఒక మంచి తుపాకి కావాలి. ఎకె 47 లాంటిది ఏదైనా అమ్మే పార్టీ వుంటే తీసుకురా. నేను కావలసినంత డబ్బు యిస్తాను' అని చెప్పాడు.

అప్పుడు ఆ ఇన్‌ఫార్మర్ అలాగేనని తల ఊపి తిన్నగా పోలీసుల దగ్గరకు వెళ్ళాడు. 'గురునాధన్ అని వీరప్పన్‌కు చాలా కావలసినవాడు. ఎకె 47 తుపాకి కావాలని వచ్చాడు ఇప్పుడు నా ఇంట్లోనే ఉన్నాడు' అని చెప్పాడు అప్పుడు ఇదే ఎస్.ఐ. షకీల్ అహ్మద్, ఎస్.పి. హరికృష్ణ తుపాకులు అమ్మే సేట్ల వేషాల్లో వస్తాము అని ఒక ప్లాన్ చెప్పారు.

ఆ ఇన్ఫార్మర్ గురునాధన్ వద్దకు తిరిగివచ్చి 'రేపు పన్నెండు గంటలకి ఎకె 47 తీసుకుని సేటు వస్తానని చెప్పాడు. ధర మాత్రం నువ్వే మాట్లాడుకో' అన్నాడు. పాపం వాడు చెప్పింది నిజమేనని నమ్మాడు గురునాధన్.

ఆ మరుసటి రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకి అడవి మధ్యలో వున్న ఆ గ్రామానికి ఒక తెల్ల అంబాసిడర్ కారు వచ్చింది అందులో ఎస్.ఐ. షకీల్ అహ్మద్, ఎస్.పి. హరికృష్ణ మరో ముగ్గురు కానిస్టేబుళ్ళు మారువేషాలు వేసుకుని వున్నారు. వారికోసం ఎదురుచూస్తూ కూచుని వున్న ఇన్ఫార్మర్ కారు కనబడగానే ఒక్కసారి లేచి 'సేటు వచ్చేశాడు. పద పోదాం' అని గురునాధన్‌ని కారు దగ్గరకు తీసుకుపోయాడు. ఎస్.ఐ. అతణ్ణి చూసి 'గురునాధన్ అంటే మీరేనా రండి. రండి. బయట నిలబడవద్దు కారు లోపలికి రండి మాట్లాడుకుందాం' అని వినయంగా ఆహ్వానించాడు.

గురునాధన్ అంతా నిజమే అని నమ్మి కారులో కూచున్నాడు. వాళ్ళు ఖాళీ ఎకె 47 చూపించారు. ధర అది మాట్లాడుకున్నారు. 'ఆతర్వాత అసలు మీకు ఈ తుపాకి ఎందుకండి?' అని అడిగాడు ఎస్.ఐ.

'ఏం లేదు షకీల్ అహ్మద్ అని ఇక్కడ ఒక ఎస్ ఐ. రాక్షసుడు వున్నాడు. చాలామంది ఆడవాళ్ళమీద అత్యాచారాలు చేస్తున్నాడు. అతణ్ణి కాల్చడానికే ఇది' అని చెప్పాడంట గురునాధన్.

అంతే ఎస్ ఐ తన పిస్టల్‌ని గభాల్న తీసి గురునాధన్ చెవికి ఆనించి 'నేనేరా ఆ షకీల్ అహ్మద్‌ని' అన్నాడంట. అంతలో మిగతా పోలీసువాళ్ళు గురునాధన్ చేతులను వెనక్కి విరిచి పట్టుకున్నారు.

అంతే.

గురునాధన్‌ని అలాగే తీసుకుపోయి కాల్చి చంపేశారు.

ఆ సంఘటన జరిగిన తరువాత ఆ ఇన్ఫార్మర్‌ని పట్టుకోవాలని ప్రయత్నం చేశాను. కానీ వీలు పడలేదు ఇప్పుడు అతణ్ణే ఉపయోగించుకుని షకీల్ అహ్మద్‌ని ఇక్కడికి రప్పించాలని నేనొక ప్లాన్ వేశాను.

ఆ ఇన్ఫార్మర్ రామ్‌నాయకర్ అన్నదమ్ములు ఐదుగురు వున్నారు. అతని ఇంట్లో ఎప్పుడు ఎనిమిది నుంచి పది వరకు కుటుంబ సభ్యులు వుంటారు

నేను ఒక ముప్పైమందిని తీసుకుని వెళ్ళి ఆ ఇంటిని చుట్టుముట్టాను. ఇంట్లో దూరి అందరి చేతులు వెనక్కి విరిచి కట్టేశాము.

'నేనెవరో తెలుసా నీకు?' అని ఆ ఇన్ఫార్మర్‌ని అడిగాను.

'తెలియదు' అన్నాడు అతను.

'నేను వీరప్పన్‌ని' అని చెప్పాను నాకు బాగా కావలసిన వ్యక్తి గురునాధన్‌ని నువ్వు అన్యాయంగా చంపించావు అయన నీకు ఏం అపకారం చేశాడు? నమ్మిన వాడికి ఇంత ద్రోహం చేస్తావా? డబ్బు కోసమే కదా నువ్వు ఆ పాపానికి ఒడిగట్టింది?' అని తిట్టాను

అతను గజగజ వణికిపోయాడు.

'చూడూ ఇప్పుడు నీ ప్రాణం, నీ కుంటంబ సభ్యుల ప్రాణం దక్కాలంటే నువ్వు వెళ్ళి షకీల్ అహ్మద్‌ని ఇదివరకులాగే నమ్మించి ఇక్కడికి తీసుకురావాలి. లేకుంటే మొత్తం అందర్నీ కాల్చిపారేస్తాను' అని చెప్పాను

అతను భయంతో 'తప్పకుండా పిలుచుకొస్తాను' అన్నాడు

'రైట్. అతను పోలీస్ స్టేషన్‌కి ఎప్పుడు పోయేది, ఎప్పుడు వచ్చేది నాకు అంతా తెలుసు. గురునాధన్‌ని పట్టిచ్చావు కాబట్టి వాళ్ళకు నీ మీద చాలా నమ్మకం వుంది వాళ్ళు నీకు చాలా డబ్బు కూడా ఇచ్చారు కదా' అన్నాను.

'అవును మీరు ఇక్కడే ఇంట్లోనే వుండండి. నేను ఇప్పుడే పోయి పిలుచుకుని వస్తాను' అన్నాడు ఆ ఇన్ఫార్మర్

'నాటకాలు ఆడొద్దు. ఇప్పుడు నేను చెప్పినట్టు నువ్వు చెయ్యాలి. నీ బంధువులంతా నా కస్టడీలో వుంటారు. ఈ నలుగురినీ ఒక మూడు వందల కిలోమీటర్లు అడవిలోపలకి తీసుకుని పోతాను. నువ్వు షకీల్ అహ్మద్‌ని పిలుచుకొస్తేనే వీళ్ళని ప్రాణాలతో వదులుతాను' అని అతను ఏం చేయాలో ఒక ఐడియా కూడా యిచ్చాను

'నువ్వు షకీల్ అహ్మద్ దగ్గరకు పోయి ఇలా చెప్పు, అర్జునన్, కుళందాన్ అనే వాళ్ళు నలభై కిలోల ఏనుగు దంతాలు తీసుకుని అమ్మిపెట్టమంటూ నా దగ్గరకు వచ్చారు నేను గురునాధన్‌ను పట్టిచ్చిన విషయం వాళ్ళకి తెలియదు. తొందరగా అమ్మి ఇవ్వాలి మా దగ్గర డబ్బుకు ఇబ్బందిగా వుంది అన్నారు. సరే నేను పోయి సేటుని పిలుచుకుని వస్తాను అని చెప్పి వచ్చాను. గురునాధన్‌ని మనం ఇక్కడే చంపినందుకు వాళ్ళకు ఈ చోటు అంటే కొంచెం భయంగా వుంది. రామాపురం నుంచి కొప్పం పోయే రోడ్డులో 30వ మైలు రాయి దగ్గరకు వాళ్ళని తీసుకుని వస్తాను మీరు తెల్ల అంబాసిడర్ కారులో సేట్లలాగా రండి. తరాజు, బాట్లు కూడా తీసుకుని రండి. మేం సిగ్నల్ ఇవ్వగానే ఆగండి. అక్కడే ఏనుగు దంతాలని తూకం వేసి డబ్బు బేరం ఆడండి. వాళ్ళు వట్టి చేతులతోనే వచ్చారు. ఒకరి దగ్గర ఏనుగు దంతాలు, ఇంకొకరి దగ్గర గంధపు చెక్కలు వున్నాయి అంతే. వేరే ఆయుధాలు ఏమీ లేవు అని చెప్పి పిలుచుకురా. లేదంటే నీ వాళ్ళని నలుగురినీ కాల్చి చంపేస్తాను. ఏమంటావు పిలుచుకొస్తావా కాల్చమంటావా? అని బెదిరించాను.

అతను నేను చెప్పినట్టే పిలుచుకొస్తాను అన్నాడు. పిలుచుకొచ్చాడు. వాళ్ళ చరిత్ర క్లోజ్ అయ్యింది. ఆ సంఘటన అలా జరిగింది.



## ఇదీ ఆ ఎస్.పి. గోపాలకృష్ణన్ కథ !

మేకల దొంగ గోపాలకృష్ణన్‌ది ఓ పెద్ద కథ. అది కూడా వివరంగా చెబుతాను. వినండి.

దేశ ప్రజలంతా ఒకటి గ్రహించాలి. అదేమిటంటే ఎప్పుడూ అబద్ధం అనేది చెప్పకూడదు. అబద్ధమాడితే దేవుడు మనల్ని శపిస్తాడు. పోలీసువాడు మాత్రం ఎప్పుడూ అబద్ధమే చెబుతాడు మనకైతే అబద్ధం చెప్పాల్సిన అవసరమే వుండదు. జరిగింది జరిగినట్టే చెబుతాము.

నేను రాజకీయ నాయకులలాగానో, పోలీసోళ్ళలాగానో అసలు విషయం దాచి అబద్ధాలు చెప్పను. నేను పాపం మూటగట్టుకోడానికి ఎవర్నీ చంపను. ప్రతీకారం తీర్చుకోడానికి మాత్రం చంపుతాను. అదైనా నా సొంతం కోసం చేసేది పావు భాగమైతే మిగతాదంతా నా ప్రజలకోసమే చేస్తాను. ఎన్నో అలా చేశాను. అలాటివాటిలో ఇది ముఖ్యమైనది.

నేను గంధం చెక్కలు తరలిస్తున్న కాలంలో ఈ గోపాలకృష్ణన్ ఎస్.పి.గా ఆ ఏరియాకు వచ్చాడు. మేం పోగుచేసుకున్న గంధం చెక్కల్ని ఈయన వచ్చి తీసుకుని పోతుండేవాడు. అట్లా కొన్ని రోజులు గడిచాయి. జయలలిత అధికారంలోకి వచ్చాక ఈయనని ఇక్కడి నుంచి వేరే చోటకి బదిలీ చేసింది. తమిళనాడు వైపు గంధం చెక్కల సమస్య అదీ లేదని ఇతణ్ణి బదిలీచేసింది. వెళ్ళిపోయాడు కానీ ఇతను ఊరికే ఉండే మనిషి కాదు. ఏదో ఒకటి చేయాల్సిందే.

గోపాలకృష్ణ ఈ ఏరియాలో వున్న కాలంలో కనీసం ఒక వెయ్యి మేకలనైనా తినివుంటాడు. అవన్నీ ప్రజలవే. వాటిని డబ్బుయిచ్చి కొని తినివుంటే నేను ఇతణ్ణి చంపేందుకు మందుపాతర పెట్టి వుండేవాణ్ణి కాదు.

ఇంతకు ముందే చెప్పాను కదా. ఈ అడవి గ్రామాల్లో చాలా మంది మేకలను పెంచుతారు. యాభై, వంద, రెండువందలు ఇట్లా చాలామంది దగ్గర మేకల మందలు వుంటాయి. ఫారెస్టు వాళ్ళకి లంచాలు యిచ్చి వాటిని అడవిలో మేపుకుంటారు. ఎంత బీదవాడి దగ్గరైనా కనీసం ఓ పది మేకలైనా వుంటాయి. అవే వీళ్ళకి జీవనాధారం.

గోపాలకృష్ణన్ ఏం చేసేవాడంటే - వీరప్పన్‌ని పట్టుకోవాలి అనే పేరు చెప్పి ఓ యాభై మంది పోలీసులను వెంట తీసుకుని ఈ ఊళ్ళమీద పడేవాడు. అలా వచ్చినప్పుడల్లా మేకల మందలు కనిపిస్తే చాలు పది ఇరవై మేకల్ని పట్టి వ్యాన్‌లో వేసుకుని తీసుకుపోయేవాడు. రోజుకు రెండు మేకల చొప్పున కోసుకుని తినేవాళ్ళు. తీసుకెళ్ళిన మేకలు అయిపోగానే మళ్ళీ వచ్చి మళ్ళీ మేకల్ని పట్టుకుని పోయేవాడు. అప్పుడు ఎవరైనా అడ్డుపడి 'అయ్యా నేను పేదోణ్ణి అయ్యా. నా మేకల్ని పట్టుకుపోవద్దయ్యా! వీటిమీదనే బతుకుతున్నాం. మా నోట్లో మట్టికొట్టద్దయ్యా' అని కాళ్ళమీద పడి బతిమిలాడితే వాళ్ళని బూటు కాళ్ళతో అక్కడే చితకతన్నేవాడు. తరువాత అలా అడ్డుచెప్పిన వాళ్ళని కట్టేసి వాళ్ళని కూడా వ్యాన్‌లో ఎక్కించుకుని తనతో తీసుకుపోయేవాడు.

ఈయనకి ఆ ఏరియాలో కొంత పట్టా భూమి వుంది. అక్కడ కొత్తగా ఓ బావి తవ్వుతున్నారు. ఇలా తీసుకెళ్ళిన వాళ్ళచేత అక్కడ వెట్టి చాకిరి చేయించుకునేవాడు. పాపం వీళ్ళంతా కూలీనాలి చేసుకుని బతికే బీదవాళ్ళు. ఒక్కొక్కరికి నలుగురైదుగురు పిల్లలు. అన్యాయంగా వాళ్ళ మేకల్ని తీసుకుపోవడమే కాక వాళ్ళతో ఇట్లా పని చేయించుకోవడం న్యాయమేనా? ఒక ఎస్.పి. స్థాయి అధికారి

...దరయ్యా గ్రంథాలయ సంస్థ
98598

పనేనా ఇది? తప్పు చేస్తే పట్టుకెళ్ళి ప్రభుత్వానికి అప్పగించాలి. శిక్ష వేయాలి. అలా చేస్తేనే కదా అతనికి గౌరవం ఇచ్చేది. కాని ఇతను చేసే పనేంటి?

ఆ ఊళ్ళో షేవి అనే ఓ అమాయకుడు వుండేవాడు. వెళ్ళి చూడండి. అతని భార్య ఇప్పటికీ ఏడుస్తూ వుంటుంది. అతణ్ణి అన్యాయంగా చంపేశాడు ఈ గోపాలకృష్ణ. అతను అడవిలో తన మేకలను కాచుకుంటూ వుండగా వీళ్ళు పది మేకలని పట్టుకుపోయారు. ఆ తర్వాత ఒక సిఐడి వాడు షేవి దగ్గరకు వెళ్ళి నన్ను పొగుడుతూ గోపాలకృష్ణని విమర్శిస్తూ కావాలని మాట్లాడాడు అది నమ్మి షేవి కడుపుమంటతో 'నా పది మేకలని అన్యాయంగా తిన్నాడు. వాడొక పోలీసు ఆఫీసరా? ఉత్త వెధవ మేకల దొంగ' అంటూ ఏదేదో తిట్టాడంట అదంతా గోపాలకృష్ణ చెవిలో చెప్పేశాడు ఆ సిఐడి. అంతే, 'ఎవడ్రా ఆ షేవి' అంటూ కోపంగా వచ్చిపడ్డాడు గోపాలకృష్ణ

'నేనేనయ్యా.' భయపడుతూ అన్నాడు షేవి

'వీణ్ణి చెట్టుకు కట్టేయండ్రా' అని పోలీసులకు ఆర్డర్ ఇచ్చాడు షేవిని ఓ పెద్ద చెట్టుకు కట్టేశారు. ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. ఆ తర్వాత తుపాకితో అతణ్ణి కాల్చిపారేశాడు మూడు రౌండ్లు తలమీద కాల్చాడు. శవానికి రాయి కట్టి నదిలో పడేశాడు ఆ నది పక్కనే వుంటుంది ఇతని ఇల్లు షేవిని అతను ఇంత అన్యాయంగా చంపేశాడు

దాంతరువాత గోపాలకృష్ణ ఇంకొకర్ని చంపాడు. అతనిపేరు నెరుక్కూరి కారంత్. మీసాల గోవిందన్ అనేవాళ్ళు అతణ్ణి. పాపం అతను జబ్బుతో ధర్మపురి ఆసుపత్రిలో పడివున్నాడు అక్కడి నుంచి అతణ్ణి అలాగే ఏర్కాట్ కొండమీదకు తీసుకుపోయి కాల్చిచంపి అక్కడే తగులబెట్టేశాడు అసలు ఒక మనిషిని పట్టుకుని తీసుకుపోయే ముందే దహనం చేయడానికి కట్టెలు రడీగా పెట్టమని ఆర్డర్ ఇచ్చేసే వాడు మనిషిని పట్టుకుపోవడం, కాల్చి చంపడం వెంటనే శవం కనిపించకుండా తగులబెట్టేయడం. ఇదీ అతని పని.

పూన్షైకన్ను అనే ఓ అమ్మాయి వుంది. ఆమెకు చంద్రన్ అని ఒక సవతి కొడుకు వుండేవాడు. అతను పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేసేవాడు. మరి ఏం జరిగిందో ఏంటో తెలియదు. ఆ చంద్రాన్ని కూడా ఇలాగే ఏర్కాట్ కొండకు తీసుకుపోయి కాల్చేసి తగులబెట్టేశాడు

ఆ తరువాత ఇంకొక అబ్బాయిని కూడా ఇలాగే చేశాడు. వాడి పేరు శేఖర్. నా అరవై టన్నుల గంధపు చెక్కని పట్టిచ్చింది ఈ శేఖరే. ఎంఎల్ఏ నాచ్చిముత్తు ద్వారా రాయబారం నడిపిన భడవా వాడు. మా మధ్య విరోధం గురించి తరువాత చెప్తాను.

అప్పుడు గంధపు చెక్కలకు కాపలాగా వున్నాడు శేఖర్ అంతకు పూర్వం వాడు ఎంఎల్ఏ నాచ్చిముత్తు లారీ మీద క్లీనర్‌గా పనిచేస్తుండేవాడు ఆ నాచ్చిముత్తు శేఖర్‌ను కలిసి 'ఒరే ఆ గంధపు చెక్కలని, వీరప్పన్‌ని పట్టివ్వు నీకు కోరినంత డబ్బు ఇస్తాను. నిన్ను సినిమాల్లో హీరోని చేస్తాను. జయలలిత పక్కన నటించేట్టు చేస్తాను. అది చేస్తాను. ఇది చేస్తాను అని ఏవేవో ఆశలు చూపించాడు. వీడు ఆ మాటలకి పడిపోయాడు.

పడయాచ్చి (కాపు వంటి కులం) తెలివి ఎలా వుంటుందో చూడు. ఒక కథ వుంది కదా. ఒకసారి ఒక మాలవాడు ఒక పడయాచ్చివాడు నాగలితో పొలం దున్నుతున్నారట. అప్పుడు పెద్ద వాన వచ్చింది. మాలవాడు ఏం చేశాడంటే నడుముకు వున్న పంచెను తీసి తలమీద కప్పుకున్నాడు. మన పడయాచ్చి వాడు ఏం చేశాడు? తన నడుముకు వున్న పంచెను విప్పి భూమిలో పాతిపెట్టాడంట. ఎందుకు? వాన తగ్గిన తరువాత తీసుకుందామని! ఇట్లా వుంటుంది పడయాచ్చి తెలివి

ఆ అరవై టన్నుల గంధపు చెక్కని అమ్ముకున్నా శేఖర్‌కి ఎంతో డబ్బు దొరికి వుండేది హాయిగా బతికి వుండేవాడు. కాని వాడు పోయి పోలీసు వాళ్ళనే నమ్మాడు. అసలు ఈ పోలీసువాళ్ళకి ఇది కన్న తల్లి - ఇది వీధి కుక్క అన్న తేడాయే తెలియదు. కన్న తండ్రిని కూడా ఎలాగైనా వాడుకోవాలని చూసే కిరాతకులు వాళ్ళు. అలాంటి వాళ్ళ దగ్గరకు పోయి వాళ్ళ మాయ మాటల్ని నమ్మి గంధపు చెక్కలని పట్టిచ్చాడు శేఖర్.

నేను లేని సమయం చూసి ఆ గంధపు చెక్కల ఆచూకీని నాచ్చిముత్తుకు, గోపాలకృష్ణన్‌కు చెప్పేశాడు. అప్పుడు వాళ్ళు వచ్చి మొత్తం గంధపు చెక్కనంతా తరలించుకుపోయారు.

ఈ శేఖర్‌కి వాళ్ళు యిచ్చింది పైసా కూడా లేదు. కొన్నిరోజుల తర్వాత వీడికి కోపం వచ్చి 'నన్ను అదిచేస్తాం - ఇది చేస్తాం అని ఏదేదో చెప్పారు. ఏనుగును చేస్తామని గొర్రెను చేశారు' అంటూ ఏదేదో వాగాడంట అంతే, 'ఓహో శేఖర్ పెద్దమనిషి అయిపోయాడు. వీడికి వెంటనే పెళ్ళి చేసేయాలి. వీడిని ఏర్కాట్ కొండకు తీసుకుపోండి నేనొచ్చి పెళ్ళి చేస్తాను' అని పోలీసులకు చెప్పాడు గోపాలకృష్ణన్. దాంతో శేఖర్ బతుకు ముగిసిపోయింది. ఆ కొండమీదే అతణ్ణి కాల్చి చంపి అక్కడే తగులబెట్టేశాడు. శేఖర్‌తోపాటు షేవి గోవిందన్, చంద్రన్ - ఈ నలుగురి బతుకులను అదే ఏర్కాటు కొండమీద ముగించేశాడు గోపాలకృష్ణన్. వాళ్ళను ఎందుకు కాల్చిందీ ఎవరికీ చెప్పలేదు. వాళ్ళ శవాలు కూడా దొరకనివ్వలేదు.

అయితే షేవిని కాల్చి చంపిన విషయం మాత్రం ప్రభుత్వానికి తెలిసిపోయింది. ఎలాగంటే షేవిని పట్టుకెళ్ళినప్పుడు అతని భార్య పరుగెత్తుకుని వెళ్ళి అప్పూ అనే వకీలుకు చెప్పింది. ఆయన గోపాలకృష్ణన్‌కు ఫోన్ చేసి విషయం ఏంటి అని అడిగాడు. అప్పుడు గోపాలకృష్ణ 'నేను ఎవరనుకుంటున్నావు. ఎస్పీని ధాం ధూం' అంటూ ఎగిరిపడ్డాడు. వకీలుకు బాగా కోపం వచ్చింది. అతను చేసేపని అతను చేశాడు. దాంతో ఆ కేసు విషయం బయటికొచ్చింది.

'గోవిందంపాడి అనే ఊరు దగ్గర ఇద్దరు కుర్రవాళ్ళు మేకలు కాచుకుంటుండగా - అందులో ఒకర్ని ఈ గోపాలకృష్ణన్ పట్టుకుపోయాడు. అతనిని ఏం చేస్తాడో తెలియదు' అంటూ ఫిర్యాదు చేశాడు వకీలు.

నిజానికి ఇక్కడ ఏదైనా ప్రభుత్వం అనేది వున్నదా? ఎవరైనా కనిపించకుండాపోతే ఎక్కడ ఫిర్యాదు చేయాలి? ఏ ఎంఎల్ఏ వింటాడు? ఏ ఎంపీ వింటాడు? ఏ మంత్రి పట్టించుకుంటాడు? ఎంత అరాచక ప్రభుత్వం ఇది!

సరే వకీలు ఆ కేసును బయటకు లాగగానే ఈ గోపాలకృష్ణన్ పోయి డిజిపి దేవారంను బతిమాలుకున్నాడు. అప్పుడు దేవారం, గోపాలకృష్ణన్ ఇద్దరూ కలిసి అప్పూ వకీలుతో బేరం ఆడారు. గోపాలకృష్ణన్ మూడు లక్షల రూపాయలు నష్టపరిహారం ఇచ్చేటట్టు రాజీ చేసుకున్నారు. వకీలు కొంత డబ్బుని షేవి భార్యకు ఇచ్చి మిగతాది తను తీసుకున్నాడు అంతటితో ఆ కేసు పోయింది. అందులో మాత్రం గోపాలకృష్ణన్ మూడు లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు.

ఈ ప్రాంతంలో గోపాలకృష్ణన్‌ని ఎస్పీ అని ఎవ్వరూ అనరు. 'మేకల దొంగ' అనే అంటారు. మేకలను దొంగిలించేవాడిని అలాకాకుండా వేరే ఏం పేరుతో పిలుస్తారు? అతను ఇక్కడ తనే సర్వాధికారిలా ప్రవర్తించేవాడు. ఏర్కాట్ కొండని తన స్పెషల్ స్మశానంగా మార్చుకున్నాడు. ఎదురు చెప్పినవాణ్ణి ఆ కొండకి పట్టుకుపోవడం ... తుపాకితో కాల్చేయడం ... అక్కడే ఆ శవాన్ని దహనం చేయడం .

ఏ ప్రాంతంలోనైనా అరాచకాలు చెలరేగితే వెళ్ళి వాటిని అణిచివేయవలసిన ఒక అధికారి తనే ఇంత అరాచకంగా ప్రవర్తించవచ్చా? తప్పు చేసిన వ్యక్తిని కోర్టుకు అప్పగించకుండా తనే ఇలా దొంగతనంగా కాల్చి చంపేయవచ్చా?

దీనివల్లే ఆ గోపాలకృష్ణన్ ఎస్పీని చంపాలని నేనొక నిర్ణయం తీసుకున్నాను. అయితే అప్పుడు నేను అతణ్ణి కాల్చలేదు. ఎందుకంటే తమిళంవాడు కదా అని ఊరుకున్నాను. కానీ ఇతను వేల మేకల్ని తిన్నాడు. ఎందరినో చంపాడు. అరె! ఎవడన్నా ఒక్క మేకను దొంగిలిస్తేనే పట్టుకుని చెట్టుకు కట్టేసి కర్రలతో కొట్టి కొట్టి చంపుతారు కదా! మరి వేల మేకల్ని దొంగిలించుకుపోయిన ఇతణ్ణి ఎందుకు చంపకూడదు అనుకున్నాను.

జయలలిత అధికారంలోకి వచ్చిన తరువాత ఇతణ్ణి ఇక్కడి నుంచి వేరేచోటుకి బదిలీ చేసింది. అయితే ఇతను అక్కడ ఎక్కువ రోజులు వుండలేకపోయాడు. తేరగా తిని రుచిమరిగాడు కదా.

అందుకని డిజిపి దేవారం దగ్గరకు పోయి - 'నేను వచ్చేశాక ఆ వీరప్పన్ తోక బాగా పెరిగిపోయింది. అక్కడే వుంటే ఆ తోకని సాంతం కత్తిరించి వుండేవాణ్ణి. ఇప్పుడు నన్ను మళ్ళీ అక్కడికే బదిలీ చేయించండి. వీరప్పన్ పని పడతాను. అతనిలాగే నాది కూడా పడయాచ్చి కులమే' అని యేదేదో శపథం చేశాడు. దాంతో దేవారం ఇతణ్ణి మళ్ళీ ఇక్కడికి బదిలీ చేసేశాడు.

దేవుడికి దేంతో నైవేద్యం పెడతాము? పళ్ళు ఫలహారాలు, ఉండ్రాళ్ళతో. మరి కుక్కకి ఏం పెడతాము? అశుద్ధం ముద్దలు. ఇది కుక్క కదా. రారా బాబూ రా! ఈసారి నీ కథ ముగించేస్తాను అని మనసులో అనుకున్నాను.

ఒకరోజు ఇతను అడవిలో గొర్లను కాచుకునే కుర్రవాడిని పట్టుకుని కాల్చేశాడు పాపం అతను ఉత్త అమాయకుడు. నా దగ్గరకు అతను ఒక్కసారి కూడా రాలేదు. అలాంటి వాణ్ణి అనవసరంగా కాల్చిపారేశాడు. మర్నాడు పేపర్లో 'అత్తియూరు అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరప్పన్ అనుచరుడు అంథోని రాజ్ మృతి' అంటూ పేపర్లో వేశారే. ఆ అంథోని రాజ్ అంటే ఈ గొర్ల కాపరే!

ఇంత ఘనమైన పని చేసినందుకు మంత్రి శంగోట్టయ్యాన్ ఇతనికి ఒక అవార్డు కూడా ఇచ్చాడు!

శంగోట్టయ్యాన్ చేసేది తెలుసుకదా. పొద్దు పొడవగానే వెళ్ళి జయలలిత కాళ్ళకి మొక్కుతాడు. పొద్దు గుంకినప్పుడూ ఆమె కాళ్ళకి దండం పెడతాడు. ఏం తప్పు చేశాడని అట్లా ఎప్పుడూ ఆమె కాళ్ళమీద పడిపోతుంటాడు? కావాలంటే దేవుని కాళ్ళమీద పడొచ్చు. కన్న తల్లిదండ్రుల కాళ్ళకి దండం పెట్టవచ్చు. కాని పదవి కోసం ఒక ఆడదాని కాళ్ళమీద పడొచ్చునా?

నీ కంటే పెద్దవాళ్ళు, వయోవృద్ధులు వున్నారే వాళ్ళ కాళ్ళని కళ్ళకు అద్దుకో. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచావు. మంత్రివి అయ్యావు. ఆ జయలలిత కాళ్ళమీద ఊరికే ఎందుకు పడతావు? ప్రజలంతా నిన్ను చూసి ఒకటే నవ్వుకుంటున్నారు. నీకది తెలుసునా? ఎవరి బతుకు తెరువు వాళ్ళది అయిపోయింది.

సరే మన సంగతికి వద్దాం. ఎక్కడ వదిలేశాను కథని. ఆ ...! ఆ మేకల దొంగ మళ్ళీ ఇక్కడికి వచ్చేశాడు. వచ్చి వికటాట్టహాసం చేశాడు. ఇంక ఏం చెప్పాలి. ఈ ప్రాంతంలో మేకలు స్వేచ్ఛగా తిరగాలంటే ఇక అతణ్ణి వదలకూడదు అనుకున్నాను. అప్పుడే మందుపాతరలు రెడీ చేశాను. ఒక్కణ్ణే కాల్చాలంటే ... కాల్చొచ్చు. ఒక్క తూటా సరిపోతుంది. కాని దొంగ మేకలను ఇతనితో కలిసి తిన్నవాళ్ళ పని కూడా పట్టాలి కదా. అందుకే మందుపాతరలు సిద్ధం చేశాను.

దాదాపు పధ్నాలుగు గుంతలు తవ్వి మందుగుండు పెట్టాను. ఎప్పుడు అటువైపు వస్తాడా అని మనుషుల్ని పెట్టి ఎదురుచూస్తూ వున్నాను. ఆరోజు వచ్చాడు. అలాగే పేల్చేశాను. అతని వెనక మూడు వ్యాన్లు వచ్చాయి వాటిని వదిలేయమని చెప్పాను. గోపాలకృష్ణన్ పైకి ఎగిరి వంద అడుగుల దూరంలో పడిపోయాడు. కాలు చితికిపోయింది. తల పగిలిపోయింది. దవడ విరిగిపోయింది. ప్రాణం అయితే పోలేదు ఇప్పుడు ఆ దవడ తీసి వేరే ఏదో పెట్టారు మంచివాడైతే అప్పుడే చచ్చిపోయి వుండేవాడు. దవడ లేకుండా మేకకూర ఎలా తింటాడు? ఇదంతా దేవుడు ఇచ్చిన శిక్ష కాళ్ళు, చేతులు సరిగా లేకుండా మేకల్ని ఎలా పడతావు గోపాలకృష్ణా?

ఇది జరిగినప్పటి నుంచి ఈ ప్రాంతంలో మేకలన్నీ స్వేచ్ఛగా తిరుగుతున్నాయి.

అంతకు ముందు ఇతను వీరప్పన్‌ను చంపిన తరువాతనే పెళ్ళి చేసుకుంటాను అని బహిరంగంగా ప్రతిజ్ఞ చేశాడు ఇతనేమన్నా నా నడమంత్రపు పెళ్ళాం కొడుకా? నేను ఇతనికి తండ్రినా? సరే రారా నా కొడకా నీకు నేనే పెళ్ళి జరిపిస్తాను అని ఆనాడే అనుకున్నాను.

షకీల్ అహ్మద్ కూడా ఇలాగే తల్లితండ్రులు పెళ్ళి చేసుకోరా బాబూ అంటే, లేదు వీరప్పన్‌ని చంపిన తర్వాతే నా పెళ్ళి అన్నాడు. నేనే అతని పెళ్ళి చేసి పైకి పంపించాను

డిఎఫ్ఓ శ్రీనివాసన్ కూడా వీరప్పన్‌ని పట్టి బంధించేవరకూ కొత్తగా కట్టిన ఈ కాషాయం పంచెను విడువను అని ప్రతిజ్ఞ చేశాడు. చివరికి ఆ గోచీని నేనే ఊడబీకాను

షకీల్ అహ్మద్ ఏం చేసేవాడు. ఆడవాళ్ళను పట్టుకుపోయి వాళ్ళ చీరలు విప్పేసి వాళ్ళ మర్మాంగాల్లో కరంట్ షాక్ పెట్టేవాడు.

గోపాలకృష్ణనేమో వీరప్పన్ పేరు చెప్పి తిరుగుతూ మేకల్ని పట్టుకుపోయి తినేవాడు. ఎదురు చెప్పిన వాణ్ణి తీసుకెళ్ళి తన పొలంలో వెట్టిచాకిరి చేయించుకునేవాడు. లేదంటే కొండపైకి పట్టుకెళ్ళి కాల్చిచంపి అక్కడే తగులబెట్టేవాడు. ఈ పనులు చేయడానికా ప్రభుత్వం వీళ్ళని ఇక్కడికి పంపింది? అందుకే నేను వాళ్ళమీద పగపట్టాను.

తమిళనాడు పాలాట్టు ప్రాంతంలోని పయలూరు గ్రామంలో ఈ గోపాల్ ఒక ఐదుగురు ఆడవాళ్ళమీద అత్యాచారం చేశాడు. ఇతనికి బలాత్కారాలు, అత్యాచారాలు అంటే చాలా యిష్టం.

తమిళనాడు పోలీసులు మహా గొప్ప వీరులు కర్ణాటక పోలీసుల చేత తమిళ స్త్రీల మీద అత్యాచారాలు చేయించేవాళ్ళు. ఆ తర్వాత రక్షించేవాళ్ళు. చాలా తెలివైన వాళ్ళు చాలా గొప్ప వీరులు. జయలలిత దగ్గర బహుమతి పుచ్చుకోవాలని అలా చేసేవారు. ఎందుకు వీళ్ళకు ఆ మీసాలు?

కోయంబత్తూరు చిన్నాంపది అనే చోట ఏం జరిగింది? కావేరి నదీ జలాల వివాదం చెలరేగినప్పుడు వేలాది తమిళ స్త్రీల మీద అత్యాచారాలు చేసిన కర్ణాటక పోలీసుల్ని తీసుకొచ్చి చిన్నంపది ఆడవాళ్ళమీద పడమని వదిలారు. వాళ్ళు అత్యాచారాలు చేస్తుంటే ఈ గోపాలుడు సరదాగా చూస్తూ కూచున్నాడు. తుపాకి అందుకుని నలుగుర్ని కాల్చిపారేయొద్దా? వీరప్పన్‌ని పట్టుకునే డ్యూటీ పేరుతో వచ్చి రోడ్డుమీద వెళ్ళే ఆడవాళ్ళపై అత్యాచారం చేసినందుకు వీళ్ళకి రోజుకు ఒక్కొక్కరికి ఎనభై రూపాయల బత్తా దొరుకుతుంది.

మానవహక్కుల కమిషన్ రంగనాథ్ మిశ్రా వచ్చి పోలీసు అరాచకాల మీద విచారణ జరిపాడు. వీరప్పన్‌ని పట్టుకోడానికి అని వచ్చిన పోలీసులు ఇక్కడ గ్రామ ప్రజలను బాధలు పెట్టారని ఆయనే చెప్పాడు కదా.

మాతేశ్వరన్ కొండకు ఉత్తరం దిశలో పది కిలోమీటర్ల దూరంలో సతీశ్వరన్ అనే గుడి వుంది. ఆ గుడివైపు పోలీసు వాహనాలు వచ్చాయి. మందుపాతరలు పేల్చాను. ఎస్ పి గోపాలకృష్ణ తొడ నజ్జు నజ్జు అయిపోయింది. ఒక ఆరుగురు పోలీసు రాక్షసులను అచోటే కాల్చేశాను అడవాళ్ళమీద అత్యాచారాలు చేసినందుకే ఆ పని చేశాను. శవాలను రోడ్డుమీదకు లాగి పడేసి వాళ్ళ తుపాకీలన్నీ తీసుకుపోయాను.



## ఆరుగురు గెత్తేశాలి ఇన్‌ఫార్మర్లని కాల్చి చంపేశాను !

అప్పుడు మిలటరీ వస్తే వాళ్ళని ఎదిరించకూడదు అని నిర్ణయించుకున్నాం ఎందుకంటే మేం ఒక దేశం కావాలని అడగటంలేదు భూమి కావాలని అడగటం లేదు మేం ఆటంకవాదులం కాదు టెర్రరిస్టులం కాదు కాని న్యాయాన్ని నిలబెట్టే వాళ్ళం. ఒక దుర్మార్గుడు ఎన్ని పాపాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అందుకనే నేను అలాంటివాళ్ళని దండించవలసి వచ్చింది ఇదంతా ప్రజల కోనమే చేశాను.

ప్రభుత్వం మనమీదికి మిలటరీని పంపిస్తే మనం ఎదిరించకూడదు వాళ్ళని కాల్చకూడదు అని చెప్పి అక్కడి నుంచి ఊచ్చిప్పలి అనే చోటుకిపోయి రహస్యంగా వున్నాము.

దాదాపు మూడు నెలలు అక్కడే వున్నాము. పిల్లలు, పెద్దలు అందరూ వున్నారక్కడ ఆ ప్రాంతానికి దగ్గరలోనే గెత్తేశా అనే ఊరుంది అటవీ జనుల ఊరు ఒక యాభై ఇళ్ళుంటాయి. పోలీసులకి, ఫారెస్టు వాళ్ళకి ఇన్‌ఫార్మర్‌లుగా పనిచేయడమే వాళ్ళ ముఖ్యమైన వృత్తి. అంటే ఎవరు ఎక్కడ ఉన్నారో ఆచూకి ఇచ్చి పట్టించడమే వాళ్ళ పని అందుకని ఆ చట్టుపక్కల జనం వాళ్ళ జోలికి వెళ్ళరు నమ్మక ద్రోహులు అని చెప్తారు వాళ్ళ గురించి. వాళ్ళ ఆడవాళ్ళు ఫారెస్టు వాళ్ళతో వ్యభిచారం చేస్తారు. ఆ గెత్తేశా ఊరువాళ్ళు ముగ్గురు కేరళ వాళ్ళని కాల్చేశారు. మోహన్ అనే సబ్‌ఇన్స్పెక్టర్‌ని కూడా చంపి తగులబెట్టారు. ఈ అడవి మనుషులకి ఇలాంటి పనులు ఎందుకనలు?

సరే ఇలా వుండగా నా దగ్గర వున్న డబ్బంతా అయిపోయింది. డబ్బు కావాలంటే ఒక వంద మైళ్ళ దూరమైనా పోవలసివుంటుంది. తప్పదు. నేనే పోయి తీసుకువస్తానని బయలుదేరాను. నా భార్య ముత్తులక్ష్మి కూడా నాతోపాటు వస్తానని గొడవ చేసింది ఏడ్చింది అయినా వద్దని చెప్పాను. ఎందుకంటే నా భార్యని తీసుకుపోతే అక్కడ వున్న మిగతా ఆడవాళ్ళకి ధైర్యం వుండదు. రక్షణ వుండదు. అలా చేయడం స్వార్థం కదా. అందుకని 'వాళ్ళందరూ బాగుంటే నువ్వు బాగుండు. వాళ్ళు చచ్చిపోతే నువ్వూ చచ్చిపో' అని గట్టిగా చెప్పి ఆమెతో పోట్లాడి ఒప్పించి వెళ్ళిపోయాను ఆ ప్రదేశానికి తిరిగి రావడానికి నాకు పదిరోజులు పట్టింది.

ఈలోగా అనుకోని ఘోరం జరిగిపోయింది.

మా ఆడవాళ్ళు వంట చేస్తున్నప్పుడు వచ్చే పొగని ఒక గొర్ల కాపరి గమనించాడట. వాడు వెళ్ళి 'ఆ ఊరి కౌండర్‌తో 'ఇట్లా పొగ వస్తోంది అడవిలోంచి అక్కడ ఎవరో వున్నారు' అని చెప్పాడు. ఆ కౌండర్ ఇద్దరు మనుషుల్ని పంపించాడు. అది చాలా దట్టమైన అడవి. ఎక్కడ చూసినా జలగలే కనిపిస్తాయి. అడవి ఏనుగులు, అడవి దున్నలు చాలా వుంటాయి. మేము వున్న ప్రదేశానికి రావడం

చాలా కష్టం అయినా ఆ ఇద్దరు మనుషులు వచ్చి చెట్ల పక్క దాక్కుని అంతా చూసి వెళ్ళారట. వాళ్ళు ఆ విషయం పోలీసులకు చెప్పారు. పోలీసులు మిలిటరీ వాళ్ళకి చెప్పారు. మిలిటరీ వాళ్ళు బిలబిలమంటూ వచ్చేశారు.

ఆ సమయంలో ముఖ్యమైన వాళ్ళం ఎవ్వరమూ లేము ఓ నలుగురైదుగురు భోజన ప్రియులను కాపలాగా పెట్టి వెళ్ళాము. వాళ్ళు ఏదో మెక్కడానికి ఆడవాళ్ళని వదిలేసి వెళ్ళిపోయారు.

దాదాపు ఐదువందలమంది మిలటరీ వాళ్ళు ఆ ప్రాంతాన్ని ముట్టడించారట. అయినా కూడా మా ఆడవాళ్ళని వాళ్ళు పట్టుకోలేకపోయారు. అందరూ చాకచక్యంగా తప్పించుకుని తలోదిక్కూ అడవిలో పారిపోయారు

నా భార్య ముత్తులక్ష్మి కూడా తప్పించుకుని అడవిలో దారి తెలియకుండా పరుగెత్తి పరుగెత్తి నెప్పళారు అనే చోటుకి చేరుకుంది. అక్కడ ముగ్గురు కుర్రవాళ్ళు ఆవులు కాస్తున్నారు. వాళ్ళ దగ్గరకు పోయి జరిగిన సంగతంతా చెప్పి 'నేను వీరప్పన్ భార్యని. నన్ను ఎలాగైనా కాపాడండి' అని బతిమిలాడింది. మీకు కావలసినంత డబ్బు కూడా ఇప్పిస్తానని చెప్పింది. కాని వాళ్ళ మనసు కరగలేదు. పైగా అందులో ఒకడికి కామపైత్యం కలిగింది. నా భార్య చెయ్యి పట్టుకున్నాడట.

'ఒరేయ్ నేను ఎవరనుకుంటున్నావు. వీరప్పన్ భార్యని' అని అరిచింది నా భార్య. నువ్వు ఎవరైతే నాకేంటి. నాకు ఒక ఆడది కావాలి అని మీదకు వచ్చాడు వాడు. వాణ్ణి తోసి తప్పించుకుని మళ్ళీ అడవిలోకి పరుగెత్తింది

ఆ రాత్రంతా అడవిలో ఒక చెట్టుకింద ఒంటరిగా పడుకుంది. భయంకరమైన వర్షం కురిసింది. కడుపులో ఒకటే ఆకలి. అయినా ఎలాగో ఓర్చుకుని తెల్లవారిన తరువాత దారి తెలియకుండా నడిచి నడిచి మళ్ళీ అదే ఊరుకు చేరుకుంది.

అంతకు ముందు రోజు కనిపించిన గొర్ల కాపర్ల తండ్రులు కావచ్చు అక్కడ వున్నారు. పెద్దవాళ్ళు కదా ఏం చేయలేరులే అని వాళ్ళ దగ్గరకు వెళ్ళింది. జరిగిన సంగతంతా చెప్పి వాళ్ళ శరణు కోరింది.

నేను మామరుత్తుపారై పోయివస్తానని చెప్పి వచ్చాను కదా - అందుకని నా భార్య వాళ్ళతో తనని మామరుత్తుపారై తీసుకుపోయి వదలండి. తన ప్రాణాలని కాపాడండి ఎంతైనా డబ్బు ఇప్పిస్తాను అని వేడుకున్నది.

కానీ వాళ్ళు 'మాకేం తెలియదు' అంటూ పాలు తీసుకుని తమదారిన తాము పోబోయారు. 'అయ్యా నన్ను కనీసం మీ ఊరు వరకైనా తీసుకుపోండి. బస్సు ఎక్కి నా పుట్టింటికన్నా పోతాను' అని కాళ్ళమీద పడ్డది. చివరకు వాళ్ళు వెడుతుంటే వాళ్ళ వెంటే పోయింది. అప్పుడు వాళ్ళు నా భార్యని ఒక గుట్ట దగ్గరకు తీసుకుపోయి, 'నువ్వు ఇక్కడే కూచో! మేం మళ్ళీ వచ్చి తీసుకుపోతాం' అని చెప్పి వెళ్ళిపోయారు. నా భార్య ఆ పెద్దమనుషుల మాటలు నమ్మి అలాగే కూచున్నది. వాళ్ళు నేరుగా దగ్గరే వున్న కోయిపాళయం పోలీసు పోస్టుకు వెళ్ళి 'ఇట్లా వీరప్పన్ భార్య వచ్చింది' అని సమాచారం అందించారు. అంతే. ఒక ఇరవై ఐదు మంది పోలీసువాళ్ళు చప్పున వచ్చి నా భార్యని చుట్టుముట్టేశారు. ఆమె పైకి తుపాకులు ఎక్కుపెట్టి నిలుచున్నారు అసలే తిండిలేక అలసిపోయి నీరసంగా వుంది కదా ఎట్లా పారిపోతుంది?

పోలీసులు నా భార్యని పట్టుకుపోయి లోపలపడేశారు. ఆమెను ఎన్నోరకాలుగా హింసించారు. ఏమేమో చేశారు.

ఇదంతా నాకు ఎట్లా తెలిసిందంటే జరిగిన విషయాలన్నీ నా భార్య పోలీసు కస్టడీలో వున్నప్పుడే రహస్యంగా ఒక క్యాసెట్‌లో మాట్లాడి ఆ క్యాసెట్‌ని నాకు పంపించింది.

ఆమెకు క్యాసెట్ అందించే ఏర్పాటు నేనే చేశాను. అంతకుముందు డిఎస్‌పితో మాట్లాడ్డానికి బేబీ వీరప్పన్‌ని పంపానే, అతని ద్వారానే జైల్లో వున్న నా మనుషులను కలిసి వచ్చేలా అనుమతి తీసుకున్నాను.

చూడడానికి వెళ్ళిన మనిషి టేప్ చేస్తాడని ఎవరికీ తెలియదు నేనొక అడవి మనిషిని అనుకుంటారు వాళ్ళు ఈ వీరప్పన్‌ని నాశనం చేయడానికి వాళ్ళు ఎన్నో ప్లాన్లు వేశారు. ఆ ప్లాన్లన్నింటిని బద్దలు కొట్టాను నేను.

బేబీ బీరప్పన్ నా భార్యతో మాట్లాడ్డానికి వెళ్ళేప్పుడే క్యాసెట్ అదీ అన్నీ సిద్ధం చేసిపెట్టాను.

'నువ్వు ఏం భయపడకు. ధైర్య వంతులకు దుఃఖం అనేది వుండదు నిండా మునిగిన వాడికి చలి అనేది వుండదు. జరిగింది జరిగినట్టు అన్ని వివరాలు చెప్పు. నీమీద అత్యాచారం జరిగినా వున్నది వున్నట్టు అది కూడా చెప్పు. మనమంతా చచ్చిపోడానికే పుట్టాము' అని నేను ఆమెకు చెప్పి పంపాను. క్యాసెట్‌ను చూడగానే ఆమె మొత్తం అన్ని విషయాలు వివరంగా చెప్పి క్యాసెట్‌ను పంపింది.

నాకు అదంతా విన్న తర్వాత పిచ్చికోపం వచ్చింది రక్తం మరిగిపోయింది

అరే, ఆడమనిషి అంటే ఒక దయ్యం కూడా పోనీలే అని కనికరం చూపిస్తుంది కదా ఈ పోలీసులు అంతకంటే నీచమైన వాళ్ళు వీరులైతే నన్ను ఎదుర్కోవాలి. నామీద దాడి చెయ్యాలి అప్పుడు నేనైనా చస్తాను. వాళ్ళైనా చస్తారు! కాని నిలబడి ఒంటేలు కూడా పోయలేని ఒక అబల మీద ఇలాంటి దుర్మార్గాలు చెయ్యొచ్చునా? అసలు ఎందుకూ పనికిరాని దద్దమ్మలు, రాస్కెల్స్ వాళ్ళు నాకు చాలా బూతు మాటలు నోట్లోకి వస్తున్నాయి. కాని కంట్రోల్ చేసుకుంటున్నాను. ఎందుకంటే ఈ వీడియో క్యాసెట్‌ని ప్రజలందరూ చూస్తుంటారు.

ముష్టి డబ్బు కోసం ఒక ఆడదాన్ని పోలీసులకు పట్టియిచ్చిన ఆ ఊరి కిరాతకులు ఇక ఈ భూమి మీదనే వుండటానికి వీల్లేదు అనుకున్నాను. అందుకనే ఆ ఏడుగురినీ కాల్చిపారేశాను.

అప్పటి రెయిడ్‌లో మా గ్రూపులో వున్న ఆడవాళ్ళు పారిపోయి అక్కడక్కడా పట్టుబడి పోలీసుల చేత చంపివేయబడ్డారు. పాపాతి, మరియప్పన్ భార్య మణి - ఇద్దరినీ పోలీసులు కాల్చి చంపారు. అన్నా అన్నా అని ఆ ఆడవాళ్ళు కాళ్ళమీద పడి బతిమలాడినా కూడా పోలీసు మగధీరులు వాళ్ళని కాల్చి చంపారు రెండు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం నాకోసం చాలామంది పోలీసుల్ని పంపించాయి. కనీసం రెండు లక్షల మంది పోలీసుల్ని పెట్టారు.

నా భార్యను, నా వాళ్ళను పట్టిచ్చిన వాళ్ళ కోసం చాలా చోట్ల వెతికాను. చివరికి గెత్తేశాల్ అనే చోట వాళ్ళలో ఆరుగుర్ని చంపేశాను. ఒకడు మాత్రం తప్పించుకుపోయాడు అవుల్ని కాస్తుండినాడే వాడు. ఆచూకి చూపించింది వాడే. చివరికి వాడిని కూడా పట్టేశాను. వాడి దగ్గర అప్పుడు ఇంకా మూడు వందల రూపాయలు వున్నాయి. ఎక్కడివిరా అంటే పోలీసులు ఇచ్చినవే అని ఒప్పుకున్నాడు. వాడిని కూడా చంపేశాను ఇలాంటి ద్రోహుల్ని దేశంలో వదిలేయకూడదు కదా!

అసలు నేను ప్రజలెవ్వరినీ చంపను. కాని వీళ్ళు నా గుండె రగిలిపోయేటట్టుగా ప్రవర్తించారు. అందుకనే కోపం ఆపుకోలేకపోయాను.



# యూనిఫాం ధరించి మిషన్‌గన్ పట్టుకుని వెళ్ళాను !

గెత్తేశాల్ ప్రాంతంలో నా మనుషులూ, నేనూ తలదాచుకుని వున్నాంకదా. నేను డబ్బుకోసం వాళ్ళని వదిలి వెళ్ళినప్పుడు అక్కడ మొత్తం పద్దెనిమిది మంది మిగిలారు. వాళ్ళలో నా భార్యతో పాటు స్త్రీలు, పిల్లలు కూడా వున్నారు తిండి దొరకడం కష్టమైపోయింది. నా మనుషులు ముగ్గురు తుపాకులు ఒకచోట పెట్టేసి మామూలు బట్టలు వేసుకుని పక్కనే వున్న పల్లెకు పోయారు. ఒక ఇంటివద్ద ఆగి అక్కడ చెవులకు దుద్దులు వేసుకుని వున్న పెద్దమనిషితో 'అయ్యా మేం గంధపు చెక్కల కోసం వచ్చాం ఆకలిగా వుంది. కొంచెం ఉప్పేసి గంజివుంటే పొయ్యండి' అని అడిగారు. కాని అతను కసిరి వెళ్ళగొట్టాడు

నావాళ్ళు తలచుకుంటే ఏమైనా చెయ్యగలరు కాని నేను తిడతానని భయపడి ఏమీ అనకుండా వెనక్కి వచ్చారు ఆకలితో అలాగే ఆ చోటులో పడివున్నారు. అప్పుడు ఆ పట్టెక్కారన్ వీళ్ళ గురించి పోలీసులకు సమాచారం అందించాడు. ఒక రెండువందలమంది పోలీసులు వచ్చేశారు. పెద్ద పోట్లాట జరిగింది. పద్దెనిమిది మంది ఎవరికి వాళ్ళు విడిపోయి పారిపోయారు. ఇద్దరు ఆడవాళ్ళని పోలీసులు కాల్చేశారు. పిల్లలతో సహా వాళ్ళు కావేరి నదిలోపడి చచ్చిపోయారు మరో ముగ్గుర్ని ప్రాణాలతో పట్టి బాగా చిత్రహింసలు పెట్టి జైల్లో పడేశారు.

అందులో ఒక అమ్మాయి నిండు గర్భిణి. కుళందాన్ అనే అతని భార్య. పరిగెత్తి పరిగెత్తి అలసిపోయి గడ్డిమీద కాసేపు పడుకున్నది. పొద్దుపోతుండగా లేచి కొంచెం ఓపికను కూడదీసుకుని మళ్ళీ నడిచింది. ఆమెకు ఒక పల్లె కనిపించింది. అక్కడకు వెళ్ళి ఒకాయనతో జరిగిందంతా చెప్పి 'సామీ నన్ను కొంచెం బస్సు ఎక్కించండి. నా పుట్టింటికి పోతాను' అని బతిమిలాడింది.

ఆ పాపిష్టివాడు ఆమె రెండు చేతులూ కట్టిపడేసి మోహన్ నివాస్‌ని పిలుచుకుని వచ్చాడు. మోహన్ నివాస్ మహా కిరాతకుడు. అతను వచ్చి ఆమె బట్టలన్నీ ఊడదీశాడు. ఆమె నడుముకు కట్టుకున్న 25 పౌండ్ల నగలు, ఎనిమిదిన్నర వేల రూపాయలు బయటపడ్డాయి. వాటిని అతను తీసేసుకున్నాడు. నగ్నంగా వున్న ఆ గర్భిణీ అమ్మాయిని కాలితో తన్నాడు. తనతో అలాగే తీసుకుపోయాడు. నాకు ఇదంతా ఎలా తెలిసిందంటే అప్పుడు వాళ్ళ వెంట వున్న ఇద్దరు మనుషులు నాకు ఆ తర్వాత చెప్పారు.

నేను యూనిఫాం వేసుకుని, మెషిన్‌గన్ పట్టుకుని కసితో ఆ ఊరుకు వెళ్ళాను. నాతో నా తమ్ముడు అర్జునన్ కూడా వున్నాడు.

మమ్మల్ని చూసి పోలీసులం అనుకుని సెల్యూట్ చేసి రండి రండి అని పిలిచారు వాళ్ళు నా తమ్ముడు మూడున్నర సంవత్సరాలు కర్ణాటక జైల్లో వున్నాడు. కన్నడం బాగా మాట్లాడతాడు.

'ఏంట్రా మీరంతా వీరప్పన్‌కు సహాయం చేసేవాళ్ళు కదూ! మాకు సమాచారం ఏమీ చెప్పరా' అని వాళ్ళ మనసు గ్రహించాలని అన్నాడు.

మోహన్ నివాస్‌ని పిలుచుకుని వచ్చినవాడు జరిగిన సంగతి ఇట్లా చెప్పాడు :

'లేదు సామీ, ఒక ఎనిమిది రోజుల ముందు వీరప్పన్, అతని మనుషులు పద్దెనిమిది మంది ఇక్కడికి దగ్గరలో మకాం వేశారు. మా పల్లెకు వచ్చి అన్నంపెట్టమని అడిగారు మేం పెట్టమని చెప్పాము.

నేను వెళ్ళి తమిళనాడు పోలీసువాళ్ళని పిలుచుకునివచ్చాను. వాళ్ళకు వీళ్ళకు ఫైరింగ్ జరిగింది. ఎవరికీ దెబ్బలు తగల్లేదు. అంతా పారిపోయారు ఒకామె మాత్రం మాదగ్గరకు వచ్చింది. ఆమెను మేం కట్టిపడేసి మోహన్ నివాస్‌కు అప్పగించాము. ఆమె దగ్గర వున్న డబ్బును తీసుకుని మోహన్ నివాస్ ఆమెను మానభంగం చేసి తీసుకుపోయాడు '

నేను కోపం ఆపుకుంటూ 'నీకు ఎంత మంది ఆడపిల్లలు?' అని అడిగాను. 'ఒక్క కూతురినైనా కన్నావా?'

ఆ మాటకు అతను భయంతో ఒక మాదిరిగా చూశాడు నన్ను

'అరే నీ భార్య బతికే వుందా చచ్చిపోయిందా? కనీసం తోడబుట్టిన అక్కగానీ, చెల్లెలుగానీ వుందా? నువ్వు అసలు మనిషివి కావురా! జంతువ్వి నీలాంటి జంతువు ఈ ప్రపంచంలో వుండకూడదు. ఎందుకురా ఇలాచేశావు?' అని గద్దించాను.

'నేను ఎవరో తెలుసునా? వీరప్పన్‌ని! నువ్వు పట్టిచ్చావే ఆమె ఎవరో తెలుసునా? నా ప్రాణ స్నేహితుడు కుళందన్ భార్య' అంటూ తుపాకితో అతణ్ణి కాల్చి పడేశాను. అలాగే దబ్‌మని నేలమీద పడిపోయాడు. 'నరికేయండిరా వీణ్ణి' అని నా వాళ్ళకి చెప్పాను

'మీకు పోలీసు వాళ్ళు ఎంత డబ్బు ఇచ్చార్రా?' అని గెత్తేశాల్ ఊరివాళ్ళని అడిగాను. ఊరంతటికి కలిపి ఒక ఇరవై ఐదువేలు యిచ్చారు అని చెప్పారు వాళ్ళు.

'ఓరి పాపాత్ములారా! నన్ను అడిగితే అంతకు ఎన్నో రెట్లు డబ్బు యిచ్చేవాణ్ణి కదరా' అని వాళ్ళని కాల్చేశాను మొత్తం ఏడుగురు గెత్తేశాల్ వాళ్ళని నా మనుషులు నరికి పడేశారు.

వీరప్పన్‌ని, వీరప్పన్ మనుషులని పట్టిస్తే పది లక్షలు, ఇరవై లక్షలు బహుమానం యిస్తామని ఊరికే రేడియోలో చెబుతుంటారే. అదంతా వట్టి మోసం ఇంతవరకు అట్లా ఎవ్వరికీ ఇవ్వలేదు ఈ పోలీసు వాళ్ళు.

నేను చంపినప్పుడు వాళ్ళ ఫొటోలు వేసి వీరప్పన్ చాలా క్రూరుడు, దుర్మార్గుడు అని పేపర్లో రాస్తారే. మరి వాళ్ళు చంపినప్పుడు నా వాళ్ళవి భార్యవి, పిల్లలవి ఫొటోలు వేసి ఎందుకు అలా రాయరు?



## వేల కోట్లు అడిగాను!

ప్రజలకు ఒక మనవి చేయదలచుకున్నాను. మీరు నా ప్రాణాలని దానంగా అడిగితే కర్ణుడిలాగా యిచ్చేస్తాను. ప్రమాణం చేసి చెప్తున్నాను. సామాన్య ప్రజల కోసం ఏమైనా చేస్తాను.

కానీ నన్ను మట్టుకు పోలీసులకు పట్టించొద్దు. వాళ్ళకు నా ఆచూకీ చొప్పొద్దు. మీకు వీలైతే నాకు సహాయం చేయండి. అపకారం మాత్రం చెయ్యకండి. ఎందుకంటే దేవుడు నావైపు వున్నాడు. ఎప్పుడైనా ధర్మం గెలుస్తుంది. అధర్మం నాశనం అవుతుంది

నా దగ్గర ఎన్నో మాయ విద్యలు వున్నాయి నన్ను గెలవడం ఎవరికీ సాధ్యం కాదు. నన్ను ఎవరూ నాశనం చెయ్యలేరు. నన్ను నాశనం చేద్దామని ఎవరన్నా తలపెట్టినట్టయితే అతణ్ణి నాశనం చేయడానికి యమధర్మరాజు దున్నపోతు ఎక్కివస్తున్నట్టేనని అనుకోవాలి నన్ను చంపడం అంత సులభం కాదు.

రెండు రాష్ట్రాల పోలీసు దళాలు, ఇంకా మిలిటరీ వాళ్ళు వచ్చినా వాళ్ళని ఎదిరించి, వాళ్ళనే దెబ్బతీసి తప్పించుకుపోతున్నాడు ఈ వీరప్పన్. అందుకని వీరప్పన్ దగ్గర ఏం మహత్యం వుందో మీరంతా అర్థం చేసుకోవాలి. అనవసరంగా ఉసిళ్ళు దీపం చుట్టూ మూగి చచ్చినట్టు మీరు చావకూడదు

ఇదంతా దేవుడు నాకు యిచ్చిన వరం. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా ఈ విద్యలను ఎవరూ నేర్చుకోలేరు

నేను ఏదో ఒక రోజు మీ మధ్యకు వస్తాను. ప్రజలంతా నాకే ఓటు వేస్తారు. మంత్రిగా తర్వాత ప్రధానమంత్రిగా వస్తాను మీ అందరికీ స్వేచ్ఛాయుతమైన మంచి జీవితాన్ని రూపుదిద్ది యిస్తాను. ఇది ముమ్మాటికీ నిజం

నాకు ఆస్తులు వద్దు. సుఖాలు వద్దు. డబ్బు దసకాలు ఏమీ వద్దు. అన్నీ అనుభవించాను. ఇప్పుడు నాకు ఏదీ వద్దు నా చివరి కోరిక ఒక్కటే. దేశంలోని ఈ రాక్షసులందరినీ నిర్మూలించాలి. అందుకు దేశ పరిపాలన నా చేతికి రావాలి. పరిపాలన నా చేతికి అందిన తరువాత ఒక్కొక్క రాక్షసుణ్ణి ఏం చేయాలో అది చేస్తాను.

ప్రజలందరికీ స్వతంత్రమైన పరిపాలనను అందిస్తాను. ప్రజలారా దయచేసి మీరంతా శ్రద్ధగా వినండి.

జరిగిన ఘోరమైన సంఘటనలలో, హత్యల్లో మీకు ఒకటి రెండే వివరించాను. అన్నీ చెప్పలేను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడతాను.

(కాసేపు వీడియో కెమెరా ఆఫ్ చెయ్యి బాబూ. కొంచెం రెస్టు తీసుకుని తర్వాత మాట్లాడతాను)

* * *

అధికారులను కిడ్నాప్ చేయడం అనేది జరుగుతుండాల్సిందే ఎందుకంటే ఆ అధికారులు కూడా మన ప్రజల్ని అన్యాయంగా పట్టుకుంటారు. ఏ తప్పూ చేయని అమాయకుల్ని పట్టుకుపోయి వాళ్ళని కేసుల్లో యిరికిస్తారు జైల్లో వేస్తారు. ఒకోసారి చంపుతారు కూడా. మరి ప్రజలను ఇలా అధికార్లు వేధిస్తే తప్పు కాదా? నేను చేస్తేనే తప్పా? పోలీస్ డిపార్ట్‌మెంట్ లేదా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారి ఒంటరిగా వున్న ఒక మనిషిని పట్టుకుంటేనేమో అది అతని సామర్థ్యం కిందకు వస్తుంది!

నాకు అన్యాయం జరిగింది. న్యాయం కోసమే నేను కిడ్నాప్ చేశాను. ఒకరోజు డిఎస్‌పి చిదంబరనాథన్, అతని తమ్ముడు రాజగోపాల్, అతని మరిది - టీచర్ శేఖర్ మొదలైనవాళ్ళు జీపులో వెళ్ళుతున్నారు. నేను ఆ జీపును ఆపి వాళ్ళని కిడ్నాప్ చేసి తీసుకుపోయాను పది కోరికలను ప్రభుత్వం ముందు పెట్టాను

అప్పుడు రాష్ట్రానికి జయలలిత ఛీఫ్ మినిస్టర్. ఆమె కదా ఆ కోరికలను తీర్చాలి

అయితే అప్పుడు వేలాదిమంది ప్రజలు సంతకాలు పెట్టి నాకు ఒక ఉత్తరం పంపించారు. 'అయ్యా ఆ డిఎస్‌పి మా అందరికి కన్నతండ్రివంటివాడు. మంచి కుటుంబం నుంచి వచ్చాడు. చాలా మంచివాడు. ఏదో కొన్ని పరిస్థితులవల్ల పోలీసు ఉద్యోగంలో చేరాడు. మీకు పోలీసులు అంటేనే వెర్రి కోపం వస్తుంది. అందుచేత ఆ డిఎస్‌పిని చంపవద్దు మీ కోరికలు తీరినా తీరకపోయినా ఆయనను మాత్రం ఏమీ చేయవద్దు. అయన దేవునిలాంటివాడు మాకోసం ఆయనకు ప్రాణభిక్ష పెట్టండి' అని ఆ ఉత్తరంలో రాశారు

ఉత్తరం చదివాను

నేను దేన్నైనా మీరతాను కాని సామాన్య ప్రజల మాటను మాత్రం జవదాటాను. ప్రజల వాక్కు బ్రహ్మవాక్కు.

అందువల్ల ఆ డిఎస్‌పీని నేను మంచిగానే చూసుకున్నాను ఏవిధమైన కష్టమూ పెట్టలేదు ఆయన ఏమి తింటాడో అదే పెట్టాను ఒంట్లో బాగాలేకపోతే కావలసిన మందులు, టాబ్లెట్లు యిచ్చాను.

ఆ డిఎస్‌పీ నాతో 'అన్నా మా ప్రాణాలకి ముప్పు వస్తుంది' అన్నాడు.

అప్పుడు నేను 'మీకు నానుంచి ఏ ప్రమాదమూ రాదు. నేను పూజించే దేవుడిమీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నేను మిమ్మల్ని చంపను మీ ప్రభుత్వం నా కోరికలను ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మిమ్మల్ని ప్రాణాలతో వదిలేస్తాను. ఎవరో చేసే పాపానికి నేను మిమ్మల్ని బలిచేయను. అయితే న్యాయం దొరుకుతుందేమో చూద్దాం అని వేచియున్నాను. జయలలిత మనసు ఎలాంటిదో చూద్దాం అని చెప్పాను. ఇంకా అతనితో -

'నీకు ముగ్గురు కూతుళ్ళు, భార్యతో కలిపి మీరు నలుగురు. శేఖర్‌కి కూడా భార్య ఇద్దరు పిల్లలు వున్నారు మొత్తం తొమ్మిది మంది రాజగోపాల్ ఒక్కడే. అతనితో కలిప పదిమంది. హెడ్ను ఇంట్లో మూడు ప్రాణాలున్నాయి అంటే మొత్తం అంతా కలిసి పధ్నాలుగు ప్రాణాలు ఈ పధ్నాలుగు ప్రాణాలను కాపాడడం కోసం జయలలిత ఏమైనా చేస్తుందా లేదా చూద్దాం. ఆమె ఏమీ చెయ్యకపోయినా ఈ వీరప్పన్ మీకు ప్రాణభిక్ష పెడతాడు మీరు ఏమీ భయపడకండి' అని చెప్పాను. వాళ్ళు సరే అన్నారు.

ఇరవై ఏడు రోజులు గడిచిపోయాయి! ప్రభుత్వం నుంచి ఏ సమాధానం లేదు!

నేను ఐదువేల కోట్లు డిమాండ్ చేసి వుండొచ్చు. ఎందుకంటే పోలీసులు ఎన్నో అత్యాచారాలు చేశారు. ఎంతోమందిని హత్య చేశారు. ఎన్నో కుటుంబాలు సర్వనాశనం అయ్యాయి వాళ్ళ అందరి కోసమే నేను నష్టపరిహారం అడిగాను. నేనైతే కష్టపడి సంపాదించుకుని బతకగలను.

నేను అడిగింది వెయ్యికోట్లు. కావాలంటే వాళ్ళు బేరం చేసి మాట్లాడి కొంత తగ్గించి వుండవచ్చు. కాని ఏమీ మాట్లాడలేదు.

తవుడు తినే రాజుకు చాటపట్టే మంత్రి అన్నట్టుగా ఆ జయలలిత అనే రాజు దగ్గర దేవారం అనే మంత్రి (డిజిపి) వున్నాడు. ఆయన 'అమ్మా! మీరు అర్డర్ ఇవ్వండి. ఆ వీరప్పన్ కధని ముగించేసి వస్తాను. ఇంతకు ముందు అతను ఎంతోమందిని చంపాడు ఈ ముగ్గుర్ని కూడా చంపితే చంపనీ నేను అతని పని పడ్తాను అర్డర్ ఇవ్వండి' అన్నాడు.

అంతే తల్లి వరమిచ్చేసింది ఎవడు చస్తే ఆమెకు ఏంటి? ఏం చేస్తారో చేస్కోండి అని చెప్పేసింది జయలలిత. అరె తనుకూడా ఒక స్త్రీయే కదా. డిఎస్‌పి భార్య, శేఖర్ భార్య, హెడ్ను భార్య మొదలైన వాళ్ళంతా కూడా స్త్రీలే కదా. నేను ఏదో కోపంతో పట్టుకొచ్చాను అదే కోపంతో వాళ్ళను చంపుతానని నీకు తెలియదా? నీవు వాళ్ళ ప్రాణాలని కాపాడాలా వద్దా?

ఏంటి ఆ డబ్బు ఏమైనా నీ అబ్బ సొమ్మా? నువ్వు ఎన్నివేల కోట్లు దోచుకోలేదు?

పూలన్‌దేవిని గజదొంగ అంటారు కాని ఆమెను మించిన గజదొంగ జయలలితే!

జయలలిత డబ్బునంతా ఎక్కడ పెట్టింది? స్విట్జర్లాండ్, అమెరికా ఎక్కడెక్కడికో తీసుకుపోయి పెట్టింది అదంతా మన తమిళనాడు ప్రజల డబ్బు

జయలలిత తన పెంపుడు కొడుకు పెళ్ళి కోసం నూట పద్దెనిమిది కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది.

అదంతా మన ప్రజల డబ్బే కదా. కోటి అంటే వంద లక్షలు. తమిళనాడు ప్రజలంతా ఆ డబ్బును విత్తనాల మాదిరిగా నేలలో నాటాలంటే ఒక నెల రోజుల టైం పడుతుంది. అంత డబ్బును ఒక పెంపుడు కొడుకు కోసం మూడు రోజుల్లో ఖర్చు పెట్టింది.

కాని ఈ ముగ్గురు జీవితాలని రక్షించేందుకు మాత్రం ముందుకు రాలేకపోయింది. నేనే వారికి ప్రాణభిక్ష పెట్టాను. అప్పుడు ఓ ఇరవై ఐదు వేల మంది పోలీసులు అడవిని చుట్టుముట్టారు

'వీరప్పన్ ముఠా మీద కాల్పులు జరిగినప్పుడు వీరప్పన్ తమ్ముడు అర్జునన్ తొడలోంచి బుల్లెట్ దూసుకుపోయింది అతను బాగా గాయపడ్డాడు' అని ఏదేదో ప్రకటించాడు డిజిపి. కానీ నేను నిజం చెప్తున్నాను. ఇంతవరకు పోలీసులతో జరిగిన ఏ ఎన్కౌంటర్‌లోనూ మాకు ఒక్క బుల్లెట్ కూడా తగల్లేదు. దేవుడి మీద ఒట్టేసి చెప్తున్నాను. నా తమ్ముడికి బుల్లెట్ గాయం ఏదీలేదు.

అసలు విషయం ఏంటంటే నా తమ్ముడికి తొడ మీద ఒక చీము గడ్డ అయింది. వాడికి అట్లా మొత్తం మూడు సార్లు వచ్చింది. తొమ్మిదేళ్ళ వయసప్పుడు ఒకసారి, పదకొండేళ్ళ వయసప్పుడు ఇంకొకసారి; ఇప్పుడు మళ్ళీ మూడవసారి వచ్చింది. అది చాలా ప్రమాదకరమైన రక్తపుగడ్డ. ఒకోసారి కొంతమందికి మొత్తం కాలునే తీసివేయవలసి వస్తుంది. అలాంటి గడ్డ నా తమ్ముడికి వచ్చింది.

నేను కొన్ని మందులు, ఇంజక్షన్లు చిట్టీమీద రాసి ఒక ఆదివాసీకి ఇచ్చి టౌన్‌కు పంపించాను. నాకు ఇంజక్షన్లు ఇవ్వడం వచ్చు. కొంచెం వైద్యం కూడా తెలుసు. ఒక కత్తి, కొన్ని మాత్రలు అవీ కొనుక్కురమ్మని అతణ్ణి పంపాను నేను చెప్పినవన్నీ కోయంబత్తూరులో కొని వేరే అతనితో పంపించాడు. అయితే ఒక సిఐడివాడు అతణ్ణి గమనించి పట్టుకుని ఆ సంచిలో ఏమున్నాయిరా అని గద్దించాడు. ఇతను ఏమీ జవాబు చెప్పలేదు ఆ సిఐడివాడు అనుమానంతో సంచి తెరిచి చూశాడు. ఇంజక్షన్లు, మందులు, కత్తి, సిరంజ్, మాత్రలు అన్నీ బయటపడ్డాయి.

'ఇవన్నీ ఎక్కడికి తీసుకెళుతున్నావు' అని అడిగాడు ఆ సిఐడి. 'అయ్యా ఒకతణ్ణి కోతి కరిచింది. అందుకనే తీసుకుపోతున్నాను' అని అబద్ధం చెప్పాడు ఇతను. "ఏంట్రా అడవిలో సూది ఇచ్చేవాళ్ళు ఎవరు వున్నారు, నిజం చెప్పు' అని గట్టిగా బెదిరించేసరికి ఇతను వీరప్పన్ కొనుక్కురమ్మన్నాడు అని చెప్పేశాడు. అంతే వాణ్ణి పట్టుకుపోయి రేంజర్‌కు అప్పగించాడు ఆ సిఐడి.

రేంజర్ వైర్‌లెస్‌లో మాట్లాడి పోలీసులను పిలిపించాడు. ఆ తర్వాత సూదిమందులో విషం కలిపి నాకు యిచ్చిరమ్మని అతనిని పంపించారు. కాని అతను నాకు దానిని ఇవ్వలేదు ఆ ఆదివాసీ అతనిని పోలీసులు పట్టుకున్నారని నాకు ముందే తెలిసిపోయింది. ఒకవేళ అతను ఆ మందు తెచ్చి ఇచ్చినా నేను వాడివుండేవాణ్ణి కాదు. పోలీసుల చేతిలోపడి వచ్చిన మందులలో విషం వుంటుందని నాకు తెలియదా?

అంతకు ముందే ఈతచెట్ల తోపు దగ్గరకు వెళ్ళి ఒక పద్దెనిమిది మంది పోలీసుల్ని కాల్చి వచ్చాను. తమిళనాడు పోలీసులు, మిలిటరీ వాళ్ళు కలసి ఒక డెబ్బైమంది వుండొచ్చు. మేం మాత్రం ముగ్గురమే. పద్దెనిమిది మందిని చంపాను. కాని పోలీసులు ముగ్గురే చచ్చిపోయినట్టు ప్రకటించారు. లెక్క తగ్గించి మిగతావారిని పిల్లిపీతిని దాచిపెట్టినట్టు దాచేశారు. యుద్ధంలో జరిగిన నష్టాన్ని యధాతథంగా చెప్పవలసిందే కదా. కానీ కిందపడ్డా మీసాలకు మట్టి అంటలేదు అన్నట్టు చేశారు

నాకు ఆ సంఘటన జరిగినప్పటి నుంచే ఫారెస్టువాళ్ళంటే కోపం. అందుకనే వాళ్ళని కిడ్నాప్ చేసింది. అంతకు ముందు డిఎఫ్ఓని చంపడంతోనే ఆగిపోయాను కాని ఇప్పటినుంచే అందరిమీదా నాకు బాగా కోపం పెరిగింది

సరే, నా తమ్ముడు చీముగడ్డతో చాలా బాధపడుతున్నాడు. ఏం చేయాలి నా దగ్గర మందులు లేవు. అప్పుడు ఒక సీసాను పగులగొట్టి ఆ గాజుముక్కతో గడ్డను కోసివేశాను అడవిలో తొడ అరటి దుంప అనే ఒక దుంప దొరుకుతుంది అదే దీనికి తగిన మందు. అది తెచ్చి నూరి కట్టుకట్టాను బాగా పక్వానికి వచ్చింది. అట్లా పక్వానికి వచ్చినప్పుడే గాజు ముక్కతో కోశాను అంతకంటే ఏం చేయాలి? వాడు నొప్పి భరించలేకపోతున్నాడు కదా. అట్లా కోసేయగానే నాలుగు లీటర్ల చీమైనా వచ్చి వుంటుంది. వేరే మనిషిని పంపి దూది, మందులు, మాత్రలు తెప్పించి కట్టు అదీ కట్టాను. గాయం కొంచెం నయం అయింది. కానీ నరం బాగా లాగుతుంది అన్నాడు అంత చీము పడితే తొడ ఎలా వుంటుంది మరి?

నా తమ్ముడు అర్జునన్‌ని ఒకచోట పడుకోబెట్టి ఒక మనిషిని కాపలాగా వుంచాను మేం వెళ్ళి డిఎస్‌పి చిదంబరనాథన్‌ని మరి ముగ్గురు అధికార్లను కిడ్నాప్ చేసి తీసుకువచ్చింది అప్పుడే.

డిఎస్‌పీయే బందీగా మన దగ్గర వున్నప్పుడు అర్జునన్‌ని ఏం చేస్తారులే అన్న ధైర్యంతో నా డిమాండ్ల క్యాసెట్ యిచ్చి అర్జునన్‌ని ప్రభుత్వం దగ్గరకు పంపాను. కాని పోలీసులు అర్జునన్‌ని అరెస్టు చేసి తమ దగ్గరే పెట్టుకున్నారు. ఇదేంట్రా అని నేను ఆ విషయం తేల్చుకోడానికి ఇక్కడ ఇద్దరు తిండిపోతుల్ని కాపలాగా పెట్టి వెళ్ళిపోయాను.

అప్పుడు ఆ డిఎస్‌పీ ఈ తిండిపోతు దద్దమ్మలతో 'అన్న ఎక్కడికి పోయాడో తెలియదు. అన్న ఆర్డర్ లేకుండా మీరు మమ్మల్ని కాల్చరని మాకు తెలుసు. కాని మన చుట్టూ చాలా మంది పోలీసు రాక్షసులు వున్నారు. వాళ్ళు మమ్మల్ని మిమ్మల్ని కాల్చి చంపుతారు. ఎందుకంటే ఇది దేవారం కుట్ర. నయవంచనతో నన్ను కాల్చేయమని చెప్పి వుంటాడు. అందుగురించి మనం ఇక్కడినుంచి తప్పించుకుని పోదాం' అని ఏదేదో చెప్పాడు. ఈ దద్దమ్మలు సరే పోదాం అని డిఎస్‌పీ వాళ్ళతో పాటు కోయంబత్తూరుకు వెళ్ళి సరండర్ అయిపోయారు.

నిజానికి వాళ్ళకి నేను ఎక్కడ ఉంటానో తెలుసు కావాలంటే ఆ డిఎస్‌పీ వాళ్ళని నా దగ్గరకే తీసుకుని రావచ్చు అలా తీసుకుని వచ్చినా నేను వాళ్ళని చంపివుండేవాణ్ణి కాదు. ఎందుకంటే వాళ్ళని చంపనని ఒట్టుపెట్టుకున్నాను. అరె మన అర్జునన్ జైల్లో వున్నాడు కదా డిఎస్‌పీని వదిలేసి అర్జునన్‌ని విడుదల చేయించుకోవచ్చు కదా అన్న ఆలోచన కూడా రాలేదు వాళ్ళకి. ఆ తిండిపోతులు డిఎస్‌పీతోపాటు సరండర్ అవడానికి వెళ్ళిపోయారు

అంతకుముందు నేను చెప్పినట్టుగానే ఆ డిఎస్‌పీ కలక్టర్ దగ్గరకు పోయి తను సరండర్ అయి నా ఇద్దరు మనుషులను కూడా కలక్టర్‌కు సరండర్ చేశాడు

ఆ డిఎస్‌పీ దొరికివుంటే డిజిపి దేవారం కాల్చివేసి నేను కాల్చినట్టు చెప్పివుండేవాడు దేవారంకి నేనంటే చాలా కోపం. ఎందుకు? నేను ఆయననూ, పోలీసువాళ్ళనీ బాగా తిట్టి ఒక క్యాసెట్ పంపాను. అందులో చాలా తిట్టాను ఆ తిట్లన్నీ వినడానికి డిఎస్‌పీయే కారణం కదా, డిఎస్‌పీ వీరప్పన్‌కు దొరికిపోయినందువల్లనే కదా ఇదంతా అయిందని దేవారం డిఎస్‌పిని కాల్చేసి వీరప్పన్ కాల్చేశాడని చెప్పి వుండేవాడు. ఈ మాటలు చెప్పే డిఎస్‌పీ నా వాళ్ళని నమ్మించి తీసుకుపోయి సరండర్ చేయించాడు.



# కొండమీద పండిన వడ్లయినా రోలు దగ్గరకు వచ్చి తీరాల్సిందే!

నా తమ్ముడు అర్జునన్, డిఎస్పీ చిదంబరనాథన్‌తోపాటు వెళ్ళి సరండర్ అయిపోయిన నా ఇద్దరు అనుచరులు రంగస్వామి, అయ్యన్‌దొరైలు దాదాపు పది నెలలపాటు జుడీషియల్ కస్టడీలో వున్నారు.

ఆ తరువాత వాళ్ళ ముగ్గురిచేత సైనైడ్ గోళీలు మింగించి అన్యాయంగా చంపేసి - వాళ్ళే ఆత్మహత్య చేసుకున్నారు అని ప్రకటించారు పోలీసులు. న్యాయస్థానం కాపలాలో వున్నవాళ్ళని అలా చంపవచ్చునా? కర్ణాటక రాష్ట్రంలో ఈ శంకర్ బిదారి (డిజిపీ) వున్నాడే అతను ఒక దుర్మార్గుడు రాస్కెల్. నిజంగా పోరాటంలో నా వాళ్ళని ముగ్గురినీ కాల్చేసివుంటే పెద్ద పేరు వచ్చి వుండేది. కాని ఈ శంకర్ బిదారి, దేవారం (తమిళనాడు డిజిపి) తమను తాము గొప్ప వీరులు అని చెప్పుకుంటున్నారే. వీళ్ళు చేసినపని వీరత్వమా?

రంగస్వామి, అయ్యన్ దొరైలు కావాలని వెళ్ళి పోలీసులకు సరండర్ అయినవాళ్ళు. కాని నా తమ్ముడు నా తరపున ఒక దూతలాగా మాట్లాడేందుకు పోలీసుల దగ్గరకు వెళ్ళినవాడు. రోగం కూడా బాగుచేసుకుంటాడని నేనే పంపాను. అతణ్ణి అన్యాయంగా అరెస్ట్ చేశారు. వీళ్ళు ముగ్గురూ కోర్టు రక్షణలో పది నెలలపాటు వున్నారు.

వాళ్ళని తమిళనాడులో చంపితే తమిళ ప్రజలు ఊరుకోరని దేవారంకి తెలుసు. అందుకే అతను శంకర్ బిదారి దగ్గరకు పోయి ఈ ఐడియా ఇచ్చాడు.

అసలు సైనైడ్ గుళికలు కర్ణాటకలో దొరకనే దొరకవు. అవి ఒక్క శ్రీలంక తమిళ టైగర్ల దగ్గరే వుంటాయి. సముద్ర తీర ప్రాంతంలో వాళ్ళు తిరుగుతుంటారు. తమిళనాడు పోలీసులు చాలామంది టైగర్లని అరెస్ట్ చేశారు. అప్పుడు వాళ్ళ దగ్గరనుంచి ఈ సైనైడ్ గుళికలను కూడా స్వాధీనం చేసుకున్నారు అంతేకాని మనదేశంలో వేరే ఏ టెర్రరిస్టల దగ్గరకూడా అవి వుండవు.

దేవారం కొన్ని సైనైడ్ గుళికలని శంకర్ బిదారీకి యిచ్చి నా వాళ్ళని ముగ్గురినీ చంపేయమని చెప్పాడు కేసు లేకుండా రాజకీయ నాయకులతో చేతులు కలపమని ఐడియా యిచ్చాడు

శంకర్ బిదారీది లింగాయత్ కులం. కర్ణాటక మినిస్టర్ నాక్కణ్ణన్‌ది కూడా లింగాయత్ కులమే. ఇద్దరూ కలిసిపోయారు.

ఈ సంగతి యిట్లా వుండనియ్యండి. దీంట్లో ఇంకో కథ కూడా వుంది. ముందు ఆ కథ చెప్తాను.

ఒక అసెంబ్లీ ఎన్నికలలో నాక్కణ్ణన్ ఓడిపోయేట్టు చేశాను. ఐదు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఎన్నికలు వచ్చాయి అప్పుడు నేను సింగాపురంలో గంధపు చెక్కలని తరలిస్తున్నాను.

మాతేశ్వర్ కొండ నుంచి ఇద్దరు లింగాయతు పెద్దలు నా దగ్గరకు వచ్చారు. ఒకాయన పేరు మహదేవు. ఇంకో ఆయన పేరు పుట్టప్ప. 'మీరు ఈ ఎన్నికలలో మా రాజీ గౌండర్‌కు సపోర్ట్ చేయాలి' అని అడిగారు. అయితే రాజీగౌండర్ మాత్రం నా దగ్గరకు రాలేదు

అప్పుడు నేను 'నాకు ఈ రాజకీయాలు వద్దు. వేరే పని చాలా వుంది. కిందటిసారి ఇట్లా చెప్పినందుకే ఆ నాక్కణ్ణన్‌కి నామీద గుర్రుగా వుంది. నేను రాను మీరు వెళ్ళిపొండి' అని చెప్పాను.

కానీ వాళ్ళు వినిపించుకోలేదు. 'అలాకాదు. మాకోసం నీవు వచ్చి తీరాలి' అని పట్టుపట్టారు

ఏం చేయాలి. రాజకాయాలు అంటేనే విరోధాలు తప్పకుండా వస్తాయి. సరే రానీ చూద్దాం అని ఒక పది మంది అనుచరులను వెంట తీసుకుని ప్రచారానికి వెళ్ళాను మాతేశ్వరన్ కొండదాటి అంటే ముప్ఫై కిలోమీటర్లు నడిచి బొంగలూరు అనే ఊళ్ళో ముఖ్యమైన వాళ్ళందరినీ పిలిచి 'మీరదందరూ ఈసారి రాజీగౌండర్‌కు ఓట్లు వేయండి' అని చెప్పాను.

అందుకు వాళ్ళు 'నువ్వు నిలబడతావా చెప్పు? నువ్వు నిలబడితే ఒక్కఓటు కూడా పోకుండా అన్ని ఓట్లు నీకే వేస్తాము కాని అతని కొరకు నీవెందుకు కష్టపడతావు అనవసరంగా' అన్నారు.

అప్పుడు నేను 'అయ్యా, ఏదో వచ్చేశాను. అడిగాను. అరె ఇతను ఇంతదూరం నడిచివచ్చి అడిగాడు కదా అని మీరు రాజీ గౌండర్‌కి ఓట్లు వేస్తే సంతోషం. ఓట్లు వేయకపోయినా సంతోషమే' అని చెప్పాను.

'నీవు వచ్చి అడిగినప్పుడు తప్పకుండా ఓటువేసి తీరవలసిందే కాని నీవే స్వయంగా నిలబడి వుంటే బాగుండేది కదా' అన్నారు.

'అలాంటి రోజు వచ్చినప్పుడు చూద్దాం. ఇప్పుడైతే రాజీగౌండర్‌కే ఓటు వేయండి' అని చెప్పి వచ్చాను.

ఇదే ప్రకారంగా వేరే ప్రాంతాలకి నా మనుషుల్ని పంపి ప్రచారం చేశాను ఆ ఎలక్షన్‌లో రాజీ గౌండర్ ముప్ఫై ఐదువేల మెజారిటీతో గెలిచాడు.

అప్పటి నుంచి నాక్కణ్ణన్‌కి నామీద విపరీతమైన పగ. వీరప్పన్ నీకు వ్యతిరేకంగా ప్రచారం చేసినందువల్లనే నీవు ఓడిపోయావు అని అతని మనుషులు ఫిర్యాదు చేశారు.

అట్లాగే వీరప్పన్ ఒక స్మగ్లర్. ఆ స్మగ్లర్ సపోర్టుతో రాజీగౌండర్ గెలిచాడు అని కొందరు అన్నారు. శాసనసభలో ఈ విషయంమీద పెద్ద గలాభా జరిగింది. ఇదంతా ప్రజలందరికీ తెలుసు. రేడియోలో, పేపర్లలో అంతా వచ్చింది.

అయితే రాజీగౌండర్ మాత్రం వీరప్పన్‌ను నేను అసలు చూడనేలేదు. అతను నా కోసం ఓట్లు అడిగివుండొచ్చు. అది నాకు తెలియదు' అని ప్రకటించి తప్పించుకున్నాడు. రాజీ గౌండర్‌ను ఈ ఎన్నికలప్పుడు కలుసుకోలేదు. కాని ముందు ఎప్పుడో నేను అతణ్ణి చూసేవున్నాను. అతనితో మాట్లాడివున్నాను. అతను నాకు తెలుసు. ఈసారిమాత్రం అతని మనుషులే నా దగ్గరకి వచ్చి ఓటుకోసం అడిగారు. ఇది జరిగాక ఈ రాజకీయవాదులంతా ద్రోహులే అని నాకు తెలిసిపోయింది.

తమకు అవసరం వచ్చినప్పుడు కాళ్ళు పట్టుకుంటారు. లేనప్పుడు బింకంగా మాట్లాడతారు. రాజకీయవాదులకు ఇది పుట్టుకతో వచ్చిన గుణం. బాగా డబ్బు సంపాదించుకోడానికి వాళ్ళు రాజకీయాల్లోకి వస్తారు. ఒక్కడు కూడా మంచివాడు లేడు దేశాన్ని, ప్రజలను కాపాడాలని ఒక్కరు కూడా రాజకీయాల్లోకి రాడు. రాజకీయాలు అంటే ఒక బిజినెస్ అయిపోయింది.

నాక్కణ్ణన్, శంకర్ బిదారి ఇద్దరూ అన్నదమ్ములవంటి వారు ఇద్దరిదీ ఒకే కులం, లింగాయత్.

ఈసారి నాక్కణ్ణన్ ఎంఎల్ఏగా గెలిచాడు. నేను ఈసారి ఎవరి తరపునా ఓట్లు అడగలేదు. ఎవరికీ ఓట్లు వేయించలేదు. కాని నాక్కణ్ణన్ రెండు మాట్లు ఓడిపోయాడు ఈమాట గెలవనివ్వండి అని ప్రజలకు చెప్పాను.

సరే - పోలీసువాళ్ళు చెప్పిందంతా నాక్కణ్ణన్ నమ్మేశాడు. లేనిపోనివన్నీ చెప్పి పోలీసులు అతని మనసు మార్చేశారు.

ఏదిఏమైనా కానీ - జుడీషియల్ కస్టడీలో వున్న వాళ్ళని చంపేందుకు ఆయన అనుమతించడం న్యాయమేనా? శంకర్ బిదారి వెళ్ళి చెప్పగానే 'వీరప్పన్‌ది ఒక సంస్థనా లేక రాజకీయపార్టీనా - ఏం కాదు. విషం యిచ్చి వాళ్ళని అట్లాగే చంపేసేయ్' అని ఆర్డర్ ఇచ్చేశాడు నాక్కణ్ణన్

కొండమీద పండే వడ్లైనా రోలులోకి వచ్చి తీరాల్సిందే!

నా వాళ్ళకి సైనేడ్ పెట్టి చంపిన తరువాత దేవెగౌడ రేడియోలో మాట్లాడాడు : నాలుగు సంవత్సరాలు అడవిలో పోరాడుతున్నప్పుడు చేసి వుండాల్సింది. కాని ఇప్పుడు చాలా కిరాతకమైన, పిరికితనమైన పని చేశారు అన్నాడు. మినిస్టర్ చెప్పేశాడు కదా అని నేను ఊరుకున్నాను.

తరువాత ఇంతకుముందున్న మినిస్టర్ ... అతని పేరేంటబ్బా ... ఆ వీరప్ప మొయిలి. అతను నోరు విప్పలేదు. బంగారప్ప అడిగాడు ఇది పంచమహాపాతకం. చాలా విద్రోహపూరితమైన చర్య. న్యాయమైన పద్ధతిలో యాక్షన్ తీసుకోవాలి అన్నాడు.

అప్పుడు వెంటనే మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ గుంటనక్క నాక్కణ్ణన్ సిగ్గులేకుండా పోయి ఆ సమావేశంలో కూచున్నాడు అందరి మనసుల్ని కరగబెట్టేశాడు. 'కరగబెట్టేవాడు కరగబెడితే బండరాయి కూడా కరిగిపోతుంది' అంటారు పెద్దవాళ్ళు. న్యాయాన్ని విచారిద్దామనుకున్న వాళ్ళ మనసుల్ని ఇతనే మార్చిపారేశాడు

ఈ విషయం పి.వి. నరసింహారావు దాకా పోయింది. సిబిఐ ఎంక్వైరీకి ఆర్డర్ కూడా యిచ్చారు. ఒక పెద్ద పోలీస్ ఆఫీసర్ ఆయన పేరేంటో గుర్తులేదు. ఆయన 'ఈ శంకర్ బిదారిని, మాతేశ్వరం కొండల్లో డ్యూటీచేస్తున్న పన్నెండుమంది పోలీస్ ఇన్ఫార్మర్లని ముందు జైల్లో తొయ్యాలి' అన్నట్టు లండన్ బిబిసి రేడియోలో కూడా వచ్చింది.

ఈ సైనైడ్ గోళీలు జైల్లో వున్న వాళ్ళకి ఎక్కడి నుంచి వచ్చాయో మీరు కనుక్కోగలుగుతారా? నా తమ్ముడికి మరో ఇద్దరు నా మనుషులకు వేసిన గోళీలు ఒకనాడు మీ నోట్లోకి కూడా వస్తాయిరా ...!

అంతకు ముందు ఒకసారి పూదిపడుగా అనే ఊళ్ళో ఈ నాక్కణ్ణన్ వేదిక ఎక్కి మైకులో మాట్లాడతుంటే - ఒక పెద్ద మర్రిచెట్టు చాటున నిలబడి ఆయన స్పీచ్ అంతా విన్నాను. అప్పుడే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాడు. ఆ వెంటనే పంచాయితీ ఎన్నికలు వచ్చాయి. మళ్ళీ ఓట్లు అడగడానికి తిరుగుతున్నాడు. అతను అడవిలో వుండేవాళ్ళతో ఇట్లా చెప్పాడు :

'మీరు తుపాకులు పట్టుకున్నారు. వేటాడుతున్నారు. గంధపు చెక్కలని స్మగ్లింగ్ చేస్తున్నారు. తప్పుకదా. అట్లాంటి పనులు చెయ్యొద్దు. మీరంతా నీతిగా బతకండి మీరు ఆ పనులు చేసినప్పుడు - ఆఫీసర్లు పట్టుకుంటున్నారు అంటే ఎందుకు పట్టుకోరు? వాళ్ళు న్యాయాన్ని కాపాడాలి కదా' అని ఏదేదో చెప్పాడు.

లంచాలు లేకుండా చేస్తామని చెప్పి వీళ్ళే కోట్లకు కోట్లు దోచుకుంటారు. ప్రజలకు నీతులు చెప్పి మీరే లంచాలు తీసుకుంటారు. కానీ, అదే ఒక అడవిలో బతికే బీదవాడు ఆకలిబాధ తాళలేక అడవిలో పడివుండే ఏ చెత్తా చెదారమో ఏరుకుని కడుపు ఇంత తింటే అది మీ కంట్లో పడుతుంది. పెద్ద తప్పు అనిపిస్తుంది ఆ పోలీసువాళ్ళు చెప్పే విషయాలకి నీవు వంతపాడతావు ఎనక నుంచి ఏనుగు పోయినా నీకు కనిపించదు. ముందు నుంచి చిన్న చీమ పోతుంటే మాత్రం బాగా కనిపిస్తుంది!

అట్లా ఆ ఊళ్ళో మాట్లాడిన తరువాత నాక్కణ్ణన్ కపిని డ్యాంకు దిగువన వున్న శోళలార్‌కాడు

అనే ఊరుకు వెళ్ళాడు. అక్కడ ఇట్లాగే స్పీచ్ యిచ్చి కార్లో కాకుండా మోటార్ బైక్ మీద తిరిగివస్తున్నాడు. కారు మధ్యలో చెడిపోయిందట. అతనికి చెడు చేయాలని వుంటే నేను ఆ సమయంలోనే చేసి వుండేవాణ్ణి. అపి బరబరా ఈడ్చుకుపోయి వుండేవాణ్ణి కాని నేను అతనికి అప్పుడు ఏ హానీ తలపెట్టలేదు

కాని అదే నాక్కణ్ణన్, శంకర్ బిదారితో కలిసి నావాళ్ళు ముగ్గురినీ అన్యాయంగా బలిచేశాడు

పుట్టిన ప్రతివాడు ఏదో ఒక రోజున చచ్చిపోక తప్పదు నావాళ్ళు చచ్చిపోయారని నేను బాధపడటం లేదు. కానీ ఒక ప్రభుత్వం ఇటువంటి పిరికిపనులు చెయ్యకూడదు.

దేవెగౌడగారూ నిన్ను నేరుగా కలవడానికి నాకు అవకాశం లేదు. కానీ ఎవడో చేసిన పాపాన్ని అనవసరంగా నీ తలమీద ఎందుకు ఎత్తుకుంటావు? రావణాసురుడు మూడున్నర కోట్ల మంది ప్రాణాలు తీసుకున్నాడని రామాయణంలో చదివాం. ఆ ప్రాణాలు అయనని ఏమైనా కాపాడాయా? అదే పాపంలా చుట్టుకుంది కదా. మీకు దొరికిన పదవి పెద్ద వరప్రసాదమా? ప్రజలు చూసి ఓటువేస్తే అధికారంలోకి వచ్చావు. అంతేకదా?

నీది చాలా పెద్ద కుటుంబమని విన్నాను నా వాళ్ళని మీరు చంపినందుకు నేను కలవరపడడం లేదు. చావు పుట్టకలు అనేవి నిమిత్తమాత్రాలు

నువ్వు ఒక ఛీఫ్ మినిస్టర్‌వి ఆరు ఏడు కోట్ల మంది ప్రజలకు నాయకుడివి. ఒక రాక్షసుడు న్యాయస్థానం కాపలాలో (జుడీషియల్ కస్టడీలో) వున్న వాళ్ళని చంపేశాడు అతని తరపున ఒక ఎంఎల్‌ఏ వచ్చి నీతో ఏదేదో చెప్పాడు. ఆ మాటలు నువ్వు నమ్ముతావా? నువ్వసలు బాగుపడతావా?

నీలాగే నేను కూడా ఒకనాడు అధికారంలోకి వస్తాను. ప్రధానమంత్రిగా వస్తాను. వచ్చి చూపిస్తాను అప్పుడు నిన్ను కూడా పట్టి లోపల పడేస్తాను.

సవాల్ చేస్తున్నా.

నేను ఎలక్షన్లో నిలబడతాను. జయలలిత కూడా నామీద గెలవలేదు ఆమే గనక గెలిస్తే నా మీసాలు తీసేస్తాను. కర్ణాటకలో ఎవరిని ఎదిరించి నిలబడమంటావో చెప్పు గెలిచి చూపిస్తాను.

నన్ను మీరంతా దొంగ, నీచుడు, దుర్మార్గుడు అంటూ వర్ణిస్తారు కానీ ప్రజల్లో పలుకుబడి వున్న వ్యక్తి మంచివాడనే కదా అర్థం

నేను ప్రజల కోసమే పాపాత్ములను, రాక్షసులను చంపాను జరిగింది ఇదే. నువ్వు ఇప్పుడు నా తమ్ముడి ప్రాణాలు, మరో యిద్దరి ప్రాణాలు తిరిగి తెచ్చి ఇవ్వలేవు. కనీసం మన ప్రభుత్వం మర్యాదనైనా కాపాడు. గతంలో ఇద్దరు పోలీసులు మోసపోయారు. సరిగా డ్యూటీ చేయలేదు అనిచెప్పి వాళ్ళని ఉద్యోగంలోంచి తీసేశారు మరి ఇదే మంత్రి మండలి శంకర్ బిదారీని ఏం చేయగలిగింది?

పాండిరా పాండి! ఈ లోకం మిమ్మల్ని చూసి నవ్వుతోంది మీరు యాక్షన్ తీసుకున్నా తీసుకోలేకపోయినా ఈ పాపం మిమ్మల్ని ఊరికే వదలదు.

నా తమ్ముడికి సైనైడ్ గుళిక ఎక్కడ నుండి దొరికింది. మెడమీద కత్తిపెట్టి తిను అని బెదిరించినా కూడా నా తమ్ముడు సైనైడ్ గోలి తినడు వాడిని చంపిన పాపం మిమ్మల్ని ఊరికే వదులుతుందని ఎన్నడూ అనుకోకండి. ఏంట్రా అడవిలో తిరిగేవాడు ఏంటో పెద్ద రాజకీయవాదిలాగా మాట్లాడుతున్నాడే అనుకుంటున్నారా? కాదు నేను న్యాయమే మాట్లాడుతున్నాను!



# చెవులతో వినలేని ఎన్నో ఘోరాలు చేశారు!

(క్యాసెట్ చాలదని ముఖ్యమైన పాయింట్లని మాత్రమే అంటే దాదాపు వీరప్పన్ చెప్పిన వెయ్యి మాటలకి ఒక్క మాట చొప్పున ఏరి తీసుకున్నాము - ఎడిటర్)

రాజీవ్‌గాంధి ఎట్లా చనిపోయాడో ప్రజల కోసం వివరిస్తున్నాను రాజీవ్‌గాంధీని విముక్తి పులులు (శ్రీలంక ఎల్‌టిటిఇ టైగర్స్) చంపేశారు అంటున్నారు. ప్రభాకరనే ఆర్డర్ యిచ్చి చంపించాడు, అతణ్ణి అరెస్ట్ చెయ్యాలి అని చెప్తూతోంది మన ప్రభుత్వం.

ఆ విషయం గురించి మనం కొంచెం మాట్లాడుకుందాం రాజీవ్ గాంధీ భారతదేశానికి ప్రధానమంత్రిగా పరిపాలిస్తున్నారు.

శ్రీలంక మన పొరుగున వున్న వేరే దేశం

మన భారతదేశంలో ఇరవై నాలుగు రాష్ట్రాలు వున్నాయి వందకోట్ల ప్రజలు వున్నారు. వాళ్ళను చూసుకుంటే చాలదా? పక్కింటివాడి పెళ్ళానికి మనమెందుకు చీరకట్టాలి?

అసలు శ్రీలంకలో చచ్చిపోతున్న వాళ్ళంతా ఎవరు? మన తమ్ముళ్ళే కదా? అక్కడ ప్రవహిస్తున్నది మన రక్తమే రాజీవ్‌గాంధీ మన మిలటరీని అక్కడికి ఎందుకు పంపించాలి? తప్పు కదా? మిలిటరీ అంటే ఏమిటి? ఒక దేశం యొక్క మహాశక్తి దీనికి సంబంధించిన కథ మహాభారతంలో ఒకటి వుంది. అది మీకు చెప్తాను

కృష్ణపరమాత్ముని సలహామీద అర్జునుడు మంచు కొండలమీదకు పోయి శివుని కోసం కఠోరమైన తపస్సు చేశాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమయ్యాడు. 'నీకు ఏం వరం కావాలి అర్జునా?' అని అడిగాడు. నాకు కొన్ని అస్త్రాలు కావాలి అన్నాడు అర్జునుడు. అడిగినవన్నీ ఇచ్చేశాడు శివుడు. వాటిని తీసుకుని కృష్ణుడు వున్న చోటకు వచ్చాడు అర్జునుడు. కృష్ణుడు అడిగాడు 'అర్జునా నీవు అడిగిందంతా దొరికిందా?' ఆ! అన్ని అస్త్రాలు దొరికాయి బావా' అన్నాడు అర్జునుడు.

అప్పుడు కృష్ణ పరమాత్ముడు ఏం చెప్పాడో తెలుసా? 'అర్జునా! ఈ అస్త్రాలు మొత్తం లోకాన్ని నాశనం చేయగలుగుతాయి. అంత శక్తి వుంది వీటికి. నువ్వు వీటిని చాలా జాగ్రత్తగా కాపాడాలి. పెద్ద పెద్ద అసురులు, రాక్షసులు మొదలైన వాళ్ళమీదనే ప్రయోగించాలి. అమాయక ప్రజల మీద అస్సలు ప్రయోగించకూడదు అట్లా ప్రయోగిస్తే నీకు చాలా పాపాలు అంటుతాయి' అని చెప్పాడు. అర్జునుడు అదే ప్రకారం నడుచుకున్నాడు.

మరి రాజీవ్‌గాంధీ చేతికి అధికారం వచ్చిందంటే అది ప్రజలు ఇచ్చిన ఒక వరం. అది ఒక పెద్ద అస్త్రం.

శ్రీలంకలో ఏం జరుగుతున్నది. ఒక తమిళ స్త్రీ మీద వందమంది అత్యాచారం చేస్తున్నారు. ఆఖరికి సోడా సీసాలను కూడా పగులగొట్టి స్త్రీల శరీరాల్లో గుచ్చుతున్నారు. అలా అత్యాచారం చేసి చంపి వాళ్ళ తోలు తీసి ముక్కలుగా నరికి పోగులుపెట్టి - ఇదిగో తమిళ స్త్రీల మాంసం కుప్పకి పదిహేను రూపాయలు అని బోర్డులు తగిలిస్తున్నారు.

ఆడవాళ్ళమీద అత్యాచారం చేయడం ప్రపంచంలోనే అన్నింటికంటే మహా పాతకం ఒక మగవాడిమీద ఇంకో మగవాడు పగ తీర్చుకోవచ్చు. తన్నవచ్చు. చంపవచ్చు కానీ స్త్రీల మీద యిట్లాంటి

ఘోరాలు మనం చరిత్రలో కనీవినీ ఎరగం. ఆ ఘోరాలన్నీ అక్కడివాళ్ళు ఫొటోలు తీసి ఇక్కడికి తీసుకొచ్చి చూపించారు.

రాజీవ్‌గాంధీ కూడా వాటిని చూసే వుంటారు. అయనకు కూడా ఒక కూతురు, ఒక కొడుకు వున్నారు కదా. వాళ్ళలో ఎవరికైనా అట్లాంటి ఘోరం జరిగితే ఆయన మనస్సు ఎట్లా భగ్గున మండి వుండేది?

తమిళులకి శ్రీలంకలో కాలి చెప్పుకు ఇచ్చే విలువ కూడా యివ్వడం లేదు అక్కడ తమిళుల రక్తం కావేరి నదిలాగా ప్రవహిస్తున్నది.

గాయం మీద సూదితో గుచ్చినట్టుగా .. నిప్పుల మంటలో పెట్రోలు పోసినట్టుగా . మన దేశం నుంచి వేలాది రాక్షసులను అస్త్రాలు యిచ్చి అక్కడికి పంపించాడు రాజీవ్‌గాంధీ. వీళ్ళు పోయి చేసిన అక్రమాలకి లెక్కేలేదు సింహళ సైన్యంతో చేతులు కలిపి శాంతిని తెస్తున్నాం అనే పేరుతో చెయ్యకూడని పనులు చాలా చేశారు

ఒక సైన్యం శాంతిని తేగలదా? అనవసరంగా అక్కడపోయి దూరాడు. అప్పుడే ..

ఆడవాళ్ళు తుపాకులు పట్టుకోవడం అనేది అంతకుముందు చరిత్రలో వున్నదా? మూడు యుగాలు గడిచిపోయి నాలుగో యుగం (కలియుగం) నడుస్తోంది ఇంతవరకు శ్రీలంకలో మాదిరిగా ఆడవాళ్ళు ఎప్పుడూ ఆయుధాలు ధరించలేదు. ఈనాడు అక్కడ మగవాళ్ళతో సమానంగా ఆడవాళ్ళు ఆయుధాలు పట్టుకున్నారు. ఫిరంగులు పేల్చడం, చేతి బాంబులు విసరడం వంటి అన్ని పనులు చేస్తున్నారు.

ఇవాళ సింహళ సేన మట్టికరుస్తోంది !

మన సైన్యం వెళ్ళి అక్కడున్న తమిళ ప్రజలమీదనే దాడిచేసింది.

భారత సైన్యం వెనక్కి తిరిగి వచ్చినప్పుడు మన కరుణానిధి వాళ్ళకు ఆహ్వానం చెప్పేందుకు వెళ్ళలేదు. ప్రతిపక్షం వాళ్ళందరూ అడిగారు 'సైన్యాన్ని ఆహ్వానించేందుకు నువ్వు ఎందుకు పోలేదు' అని.

అప్పుడు కరుణానిధి ఒక మాట అన్నాడు. అది తలచుకుని నేను ఎప్పుడూ గర్వపడతాను. అదేమిటంటే 'అక్కడ చనిపోయింది మనవాళ్ళే - ఇక్కడ చనిపోయిందీ మనవాళ్ళే ఏమని ఆహ్వానం పలకాలి? నా మనస్సు చాలా గాయపడ్డది.'

రాజీవ్‌గాంధీ పరిపాలన ముగిసిన తర్వాత వి.పి.సింగ్ అధికారంలోకి వచ్చాడు 'ఇదంతా అనవసరపు హింస' అని మన సైన్యాన్ని వెనక్కి పిలిపించాడు.

మన సైన్యం చేతిలో అక్కడ ఎంతోమంది తమిళులు చచ్చిపోయారు. అట్లాగే మన సైన్యంలో పద్దెనిమిది వందలమంది చచ్చిపోయారని చెప్తున్నారు కాని అది అబద్ధం. సరైన లెక్క నేను చెప్తాను. భారత సైన్యంలో పదహారు వేల ఏడువందలమంది కంటే ఎక్కువే చచ్చిపోయారు. వాళ్ళు పదివేల మంది వరకు చచ్చిపోయారు.

మన సైన్యం విచ్చలవిడిగా అత్యాచారాలు చేసింది ఇక్కడ వుండే ఒక మామూలు పోలీసువాడే మొత్తం తమిళనాడును బాంబే రెడ్‌లైట్ ఏరియాగా అనుకుంటాడు కదా మరి సైనికులు ఇంకెట్లా అనుకుని వుంటారు? ఈ అత్యాచారాల నుంచి తమనితాము కాపాడుకోవడంకొరకే అక్కడి ఆడవాళ్ళు తుపాకులు పట్టారు.

అక్కడ ఎట్లాంటి అత్యాచారాలు జరిగాయంటే నిండు గర్భిణీ స్త్రీ కడుపుని నిలువునా కోశారు.

కడుపులోని బిడ్డను ఎత్తిపట్టుకుని ఇది రెండో టైగరా అని నరికివేశారు. మనం వినలేని ఘోరాలు యివి.

అలాంటి అత్యాచారాల తర్వాతనే అక్కడి ఆడవాళ్ళు ఆత్మాహుతి దళాలుగా మారిపోయారు. భారత సైన్యాన్ని మనమీదకి పంపింది ఎవరు? తుపాకిని చూడకుండా తుపాకిని పంపింది ఎవరు? అని అన్నీ ఆలోచించారు. కారకుడు రాజీవ్‌గాంధీ అని నిర్ణయించారు. అక్కడి నుంచి ఒక ఇరవై ఐదు మందిని పంపారు. రాజీవ్‌గాంధీని చంపారు.



## డెహరాడూన్ దాటి గంగానది వరకూ వెళ్ళాను !

కామరాజ్ నాడార్ గారు రాజకీయాల్లో వున్నారు. పెద్ద నాయకులు అయ్యారు. ఆయన ఏం చదివారు? ఏమీ లేదు. మన ఎం జి ఆర్ కూడా మూడో క్లాస్ వరకే కదా చదివింది! చిన్నప్పుడు నాటక కంపెనీలో చేరి నటుడిగా పైకి వచ్చారు. అందువల్ల చదువుకంటే అనుభవమే చాలా గొప్పది.

అసలు చదువు వేరు - అనుభవం వేరు. చదువువల్ల ఒక మనిషి బుద్ధిమంతుడు కాడు. పెద్ద చదువు చదివి డిగ్రీ తీసుకున్నవాడు కూడా అత్యాచారాలు చేస్తున్నాడు. కాబట్టి మన తల్లితండ్రుల పెంపకాన్ని బట్టి మన బుద్ధి తయారవుతుంది.

మన తల్లితండ్రులకు దుర్బుద్ధి వుంటే మనకు కూడా అదే దుర్బుద్ధి వస్తుంది. మంచివాళ్ళతో కలిసి తిరిగిన వాడు మంచివాడు అవుతాడు. దొంగలతో కలిసి తిరిగినవాడు తప్పకుండా దొంగగానే మారతాడు.

నాదగ్గర రేడియో ఉంది. న్యూస్ పేపర్స్, బుక్స్ అన్నీ వస్తాయి. అన్నీ చదువుతాను. నాకు రాజకీయాల గురించి బాగా తెలుసు. అసలు సరస్వతీ దేవే ఇంకా చదువుకుంటోంది కదా! ఎవ్వరూ అన్ని విషయాలను సంపూర్ణంగా నేర్చుకోలేరు.

తమిళనాడులో నేను అన్ని ప్రాంతాలు చూశాను. ఉత్తర భారతదేశంకు కూడా వెళ్ళాను

అన్నింటికన్నా డెహరాడూన్ దాటిని తరువాత రుషులు తపస్సు చేసుకునే గంగానది తీర ప్రాంతం నాకు బాగా నచ్చింది పదేళ్ళ కిందట నేను అక్కడికి వెళ్ళాను. నా తలరాత మారింది. లేకపోతే నేను శాశ్వతంగా అక్కడే వుండిపోయే వాడిని నా జీవితమే మారిపోయి వుండేది . ...



## నలభై మంది స్త్రీల మీద అత్యాచారం చేశారు!

రాజీవ్‌గాంధీ విషయం చెప్పాను కదా. ఇప్పుడు జయలలిత గురించి కొంత మాట్లాడుకుందాం. జయలలిత ఒక స్త్రీ. తన పెంపుడు కొడుకు కోసం 118 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పెళ్ళి చేసింది కదా! ఆ డబ్బంతా ఎవరిది? నూట పద్దెనిమిది కోట్లు అంటే మనం హోటల్‌కు పోయి టిఫిన్ చేసినట్టు అమెకు! సముద్రాన్ని తోడుకుపోయినట్టు తమిళనాడు డబ్బంతా తోడుకుపోయింది. ఉత్తరం దిక్కు

వున్న రాష్ట్రాలలో వెయ్యేసి రెండువేలేసి ఎకరాల స్థలాల్ని కొనేసుకుంది. తనకు కావలసినవాళ్ళ పేర్ల మీద ఆ భూమినంతా రిజిష్టర్ చేసి పెట్టుకుంది.

దోఖా తినడంలో (మోసపోవడంలో) తమిళనాడు వాళ్ళను మించినవారు లేరు. అయితే తమిళనాడు ప్రజలు కృతజ్ఞతను మరవని వాళ్ళు. ఎం జి. రామచంద్రన్ చనిపోయిన తరువాత కూడా అతను చేసిన మంచిని తమిళులు మరిచిపోలేదు. అలా మరిచిపోకుండా కృతజ్ఞతగా ఆయన 'రెండోఆకు'కు ఓట్లు వేశారు కదా! (ఎంజిఆర్ పార్టీ ఎఐడిఎంకె ఎన్నికల గుర్తు రెండాకులు. ఇక్కడ మొదటి ఆకు అంటే ఎంజిఆర్ సొంత భార్య అనీ, రెండో ఆకు అంటే జయలలిత అనీ వీరప్పన్ ఉద్దేశం). అందుకు నేను గర్వపడుతున్నాను. రెండాకుల గుర్తుమీద ఒక గాడిదను నిలబెట్టినా కూడా ప్రజలు ఓట్లు వేశారు!

తన పెంపుడు కొడుకు పెళ్ళికి చేసిన ఖర్చును ప్రజలంతా మరవాలని, వాళ్ళను మోసం చెయ్యాలని ఆమె తన పెంపుడు కొడుకుతోపాటు కొంతమంది బీదవాళ్ళకి కూడా పెళ్ళి చేసిపెట్టింది. ఇదంతా ప్రజలకు తెలిసిన సంగతే

జయలలిత పరిపాలనా కాలంలో ఎన్నో అత్యాచారాలు జరిగాయి. ఏ కేసులోనైనా ప్రతిపక్షం వాళ్ళు నిజానిజాలను బయటకు లాగాలని ప్రయత్నం చేస్తే ఆ మహిళకు ఒక లక్ష రూపాయలు నష్టపరిహారం యిచ్చేది. మన శాసనాలు అట్లా వున్నాయి. అసలు ముందుగా అత్యాచారం చేసినవాడిని కాల్చి పారేయాలి.

కరుణానిధి అధికారంలో వున్నప్పుడు ఇట్లాంటి అత్యాచారాలు అస్సలు జరగలేదు. శ్రీలంకలో వున్న స్త్రీలు వీరపత్నులు. ఇక్కడివాళ్ళు అలా కాదనుకుంటాను.

ధర్మపురి జిల్లాలో ఇంతవరకు పద్దెనిమిది మంది స్త్రీల మీద అత్యాచారాలు చేశారు వాఛాత్తి అనే కొండ వుంది. ఆ ప్రాంతంలో పోలీసు వాళ్ళు, ఫారెస్టు వాళ్ళు కలిసి నలభై మంది స్త్రీల మీద అత్యాచారాలు చేశారు.

విచారణలో నేరస్తులను గుర్తించడానికి ఆ పోలీసువాళ్ళని, ఫారెస్టు వాళ్ళని వరుసగా నిలబెట్టినప్పుడు అత్యాచారానికి గురైన స్త్రీలు వేలెత్తి కొంతమందిని గుర్తించారు. నామీద అత్యాచారం చేసింది ఇతనే అని చూపించారు. అయినా ఇంతవరకు ఒక్క పోలీసును కూడా అరెస్టు చేయలేదు

మనం బతికేదే మన కోసం కదా! అందుకనే ఆ కిరాతకులు ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదు.

చిన్నాంపది అనే ఊరిలో కర్నాటక, తమిళనాడు పోలీసులు కలిసి ఊరంతా అమాయకుల మీద ఇష్టం వచ్చినట్టు అత్యాచారాలు చేశారు ఈమె ప్రభుత్వం వాళ్ళలో ఒక్కరిరైనా పట్టుకుని లోపలికి తోసిందా? పోలీసుల మీద కంట్రోల్ అంతా ఈమె చేతిలోనే కదా వుండేది!

ఈమే గనుక ఒకరికి భార్య అయివుంటే, నలుగురు పిల్లల్ని కన్న తల్లి అయివుంటే ఇలా చేసుండేదా?

చిదంబరంలో పద్మిని అనే అమ్మాయిని పోలీస్ స్టేషన్‌కి తీసుకుపోయి అత్యాచారం చేశారు. బాగా హింసించారు. వాళ్ళలో కూడా ఎవ్వరినీ ఈమె అరెస్టు చేయలేదు

సేలం జిల్లాలో తలైవాసన్ తంగమ్మాల్ అనే అమ్మాయిని పట్టుకుపోయి చేయకూడని ఘోరాలన్నీ అమ్మె మీద చేశారు.

ఒరే పాపాత్ములారా ! ఉండండి. నేను అధికారంలోకి వచ్చినప్పుడు ఆ స్త్రీలకు రకరకాల ఆయుధాలు యిస్తాను. పెండకుండ, చీపురుకట్ట, చాట పట్టుకుని కొట్టమని ఆడవాళ్ళకి చెప్తాను.

ఖాకీ బట్టలు వేసుకున్న కుక్కల్ని బయటకు లాగాలి. ప్రజలారా! దయచేసి మీరందరూ నాకు ఓటువేయండి. నేను అధికారంలోకి వస్తాను.

జయలలిత అధికారంలో వుంది కదా అని ఇలాంటి ఘోరాలు చెయ్యొచ్చునా పాపుల్లారా! మీరు తీసుకునే జీతానికి చక్కగా కష్టపడి పనిచేయండిరా పాతకుల్లారా! దేశాన్ని కాపాడే డ్యూటీ కోసమే కదా మీరు ఖాకీ బట్టలు వేసుకున్నది. ప్రజలకు ఏ కష్టం వచ్చినా పోలీసు స్టేషన్‌కే కదా పరుగెత్తుకుని వెళ్ళాల్సింది. మీ దగ్గరకు రక్షించమని వచ్చిన ఆడవాళ్ళ మీద మీరే అత్యాచారం చేస్తే ఇంక చేసేదేముంటుంది? అందరూ తుపాకులు పట్టవలసే వుంటుంది

అట్లా తుపాకులు పట్టుకుని రాక్షసుల్ని చంపితే తీవ్రవాదం అంటారు. మిలిటరీని పెట్టి అణిచేయండి అంటారు అందుకే ప్రజలందరికీ నేను చెప్పేదేమిటంటే మీరంతా ఎంజిఆర్‌లాగా న్యాయం తెలిసిన మంచిమనిషికి ఓటు వేయండి. మీకు స్వేచ్ఛ దొరుకుతుంది కాని అటువంటి మనిషి పుట్టనేలేదు కదా!

వీళ్ళ అక్రమాలన్నీ అణిచివేయడానికి నేనే అధికారంలోకి రావాలి. డబ్బు, కారు, బంగళా, హెలికాప్టర్ కావాలి అనే కోరిక నాకు ఏమీ లేదు వనదేవత మీద ఒట్టేసి చెప్తున్నాను. మీకోసం నా ప్రాణాలు కూడా యిచ్చేస్తాను. ఆఖరు క్షణం వరకూ మీకోసం కష్టపడి పనిచేస్తాను. ఎందుకంటే నేను పేదరికంలో, కష్టాల్లో పుట్టి పెరిగిన వాణ్ణి.

ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. మీకు ఘోరమైన అన్యాయాలు జరుగుతున్నాయే అని నా బాధ. అందుకనే నా గుండె వాటిని సహించడంలేదు. అత్యాచారం జరిగిందని ఎవరైనా చెబితే ఆ చేసినవాణ్ణి వెంటనే చంపిపారేయాలని అనిపిస్తుంది. చేతికి దొరికితే ముక్కలు ముక్కలుగా నరికి పడేస్తాను. అత్యాచారాలు చేస్తున్నది ఎవరు? రాజకీయవాదులు లేకుంటే పోలీసులు. ఎంఎల్‌ఎల కథలు బాగా కంపుకొడుతున్నాయి.

ఎంజిఆర్ మంచి మహారాజు. అయన వచ్చిన తర్వాత మంచి మధ్యాహ్నభోజన పథకం తీసుకొచ్చాడు. ఎంతోమంది ప్రజలు చదువుకున్నారు అయనవల్ల కోట్లమంది ప్రజలకు మంచి జరిగింది. అయన సినిమాల్లో నటించి సంపాదించిన డబ్బంతా రెండు చేతులతో ప్రజలకు దానం చేశాడు. ఇది అందరికీ తెలిసిన విషయమే.

జయలలిత గురించి ఇంకా చెప్తాను. అరె, తమిళనాడు ప్రజలు మనమీద అభిమానంతో ఓట్లు వేశారు కదా - వాళ్ళకి మంచి జీవితం లభించేలాగా చూడాలి మనం అని అనుకోవాలి.

కాని కుక్కతోక వంకరని మనం సరిచెయ్యలేము కదా. అట్లాగే జయలలిత బుద్ధిని కూడా మనం మార్చలేము

జయలలిత పాలనలో పోలీసువాళ్ళకి అంతులేని స్వేచ్ఛ వుంటుంది అడిగేవాళ్ళు లేరని అత్యాచారాలు చేశారు.

పత్రికా విలేకరులు లేకపోతే ఈ దేశంలో జరిగే అవినీతి గురించి ప్రజలకు తెలిసివుండేది కాదు. ఎక్కడ ఏ అవినీతి, అక్రమం జరిగినా పత్రికా విలేకరులు అక్కడికి పోయి ఫొటోలు తీసి పత్రికల్లో బాగా రాస్తారు. అలాంటి వాళ్ళని ఈమె మనుషుల్ని పెట్టి కొట్టించేది. ఎందుకంటే వాళ్ళు తన అవినీతిని బయటపెడుతున్నారు ప్రజలకు తెలిసిపోతుంది కదా. ఇకమీదట ప్రజలు తనకు ఓటు వెయ్యరని ఆమెకు తెలుసు. ఆమె పాలనలో ఎన్నో ఘోరాలు జరిగాయి ఒక నియంత కూడా చెయ్యని పనులను ఆమె చేస్తుంది.

రెండో విషయం ఏంటంటే డి.ఎం.కె. కరుణానిధికి, ఈమెకీ (అసెంబ్లీలో) ఒకమాటు ఏదో గొడవ జరిగింది. ఈమె చాలా ఇదిగా మాట్లాడి వుంటుంది. వాళ్ళు నరే ఫో అని తోసేసి వుంటారు. అంతే ఆమెకు ఒక ఛాన్స్ దొరికినట్టు అయింది. ఎలక్షన్‌లో ఆ గొడవను బాగా వాడుకోవచ్చు అనుకుంది. తలవెంట్రుకలు విప్పుకుని 'అయ్యో సామీ! నేను ఒక ఆడమనిషిని కదా నామీద ఇట్లా అత్యాచారం చేస్తారా? నను ఇలా పట్టుకుని లాగారు - అలా పట్టుకుని లాగారు నా పరువుని నాశనం చేశారు' అని బాగా ప్రచారం చేసింది.

ప్రజలంతా చూశారు. ఒక స్త్రీకి ఇంత అన్యాయం జరిగింది కదా పాపం అని అందరూ ఆమెకు ఓట్లు వేసేశారు

మరి ఎంతోమంది స్త్రీల మీద అత్యాచారాలు జరిగినప్పుడు నువ్వేం చేశావు?

ఒక స్త్రీవి, న్యాయం చేస్తావు అనే కదా ప్రజలు నీకు ఓటువేసింది లేకపోతే నీకు ఓటు వేసి వుండకపోయేవాళ్ళు కదా! కాని నువ్వు ఆడవాళ్ళకే కళంకం తెచ్చావు కదా పాపీ

ప్రేమానంద అని ఒకడు వున్నాడు ఆ ప్రేమానంద అనాధాశ్రమంలో వున్న ఆడపిల్లలందరి మీద అత్యాచారాలు చేశాడు. ఒక అత్యాచారం జరిగినప్పుడు పోలీసులు ఎట్లా విచారణ చేస్తారో ఆ విషయం కూడా మీకు చెప్తాను



## తవుడు తినే రాజుకి చాట పట్టే మంత్రట!

ఒక స్త్రీని నలుగురు దుర్మార్గులు మానభంగం చేస్తారు. కొందరు స్త్రీలు బయటికి చెప్పరు. అవమానాన్ని అలాగే దిగమింగుకుని మౌనంగా వుండిపోతారు. మరికొందరు స్త్రీలు విషం తాగి చచ్చిపోతారు. ధైర్యం వున్నవాళ్ళు మనం ఏమైపోయినా సరే అని కోర్టులో కేసువేసి వీడు అత్యాచారం చేశాడు అని చెప్పేస్తారు.

ఆమె చెప్పిన దానికి సాక్ష్యం కావాలి కదా. డాక్టర్ చేత మెడికల్ చెకప్ చేయిస్తారు అదొక వింత. దాని తర్వాత విచారణ ఎందుకు? మళ్ళీ సాక్ష్యం ఎందుకు? ఆ రిపోర్టుని పక్కన పెట్టి ఆమెను కోర్టుకు తీసుకుపోయి నల్లకోట్లు వేసుకున్నవాళ్ళు అసహ్యమైన ప్రశ్నలు అడుగుతారు.

తల్లుల్లారా నన్ను క్షమించాలి. నన్ను కన్నది ఒక స్త్రీయే. నాకు భార్యగా వచ్చింది ఒక స్త్రీనే. నాకు పుట్టిన బిడ్డ కూడా ఆడపిల్లనే. ఆ దుర్మార్గులు చేసే ఆగడాలు చూసి భరించలేక నేను ఇట్లా మాట్లాడుతున్నాను. నానోటి నుంచి వచ్చే తప్పుల్ని మన్నించండి.

నేను ఒక రాయిని తీసుకున్నా కూడా చెప్పే తీసుకునేవాణ్ణి నా మనసులో ఎలాంటి కపటమూ వుండదు. అయితే బాగా కోపం వచ్చినప్పుడు మాత్రం నేను బూతుమాటలు వాడతాను. అందుకని మీరు నన్ను క్షమించాలి.

మానభంగం చేయబడి అప్పటికే సగంచచ్చిన అమ్మాయిని ఛాంబరులో నిలబెట్టి ఇంత దూరి వుంటుందా? అంత దూరి వుంటుందా అని ఛండాలంగా ప్రశ్నిస్తున్నారు. అక్కడ అత్యాచారానికి గురికావాలి. ఇక్కడ అన్యాయానికి గురికావాలి. అందుకనే కోర్టుకు పోయినా కూడా పరిస్థితి ఇలా

వుందే అని - ఆడదానిగా పుట్టిందే పెద్ద తప్పయిపోయిందని కొంతమంది చచ్చిపోతున్నారు.

కాని అక్కడ అత్యాచారం చేసినవాడు మాత్రం ఇంకో నలుగురిని అత్యాచారం చేస్తూ జాలీగా వుండిపోతున్నాడు.

ఇలా వుంది మన ప్రభుత్వం తీరు!

ఈ ప్రపంచంలో మనం మొట్టమొదట కాపాడవలసింది ఆడవాళ్ళ యొక్క శీలాన్నే! ఇదంతా మహాభారతంలో వుంది రామాయణంలో వుంది. పురాణాలన్నిట్లోనూ వుంది.

ద్రౌపది గురించి మాట్లాడేప్పుడు, వినేప్పుడు మనకి కళ్ళల్లోంచి నీళ్ళు వస్తాయి సీత గురించి మాట్లాడేటప్పుడు కళ్ళలోంచి నీళ్ళు వస్తాయి కాని జయలలిత కధ విన్నప్పుడు ఎవరి కళ్ళల్లోంచైనా నీళ్ళు వస్తాయా? శశికళ (జయలలిత ఆప్తమిత్రురాలు) గురించి మాట్లాడేటప్పుడు ఎవరి కళ్ళల్లోంచైనా నీళ్ళు వస్తాయా? ఈమెను తలచుకుంటేనే నవ్వు వస్తుంది. పోయి పోయి ఈమెకు ఓటు వేశారే ఈ జనం చాలా ఘోరమైన కాలమయ్యా ఇది - చాలా ఘోరమైన కాలం.

ఈ ప్రేమానంద్ వున్నాడే వాడొక పంచ మహాపాతకుడు కాషాయం దుస్తులు ధరించి, స్వామీజీ వేషం వేసుకుని అతిచిన్న వయసు బాలికల మీద, అనాధల మీద అత్యాచారం చేస్తుంటాడు. రాజకీయ నాయకులతో ఇతను చేతులు కలుపుతాడు.

జయలలిత పరిపాలనలో ఇట్లా చాలా ఘోరాలు జరుగుతున్నాయి. ఈమెకు డిజిపి దేవారం ఒక జతగాడు. ఒక దొంగ అతను ఎవర్నైనా చంపాలనుకుంటే మనసులో పెట్టుకుంటాడు. బంద్ లాంటిది జరుగుతున్నప్పుడు అదను చూసి కాల్చేస్తాడు. 'రాళ్ళతో దాడి చేశారు. పరిస్థితి చేయిదాటి పోయింది అందుకనే ఫైరింగ్ ఆర్డర్ ఇచ్చేశాను' అని ప్రకటిస్తాడు

ఇతను తమిళనాడుకు డిజిపి. ఒక పెద్ద హింసావాది. తవుడు తినే రాజుకు చాటపట్టే మంత్రి లాగా అన్నమాట. జయలలితకు ఇద్దరు మంత్రులు. ఒకరు శశికళ! ఇంకొకరు దేవారం!!



## ఫస్ట్ క్లాస్ మనుషులకే ఓటు వెయ్యండి!

కరుణానిధికి చెప్తున్నాను ...

అయ్యా కరుణానిధి గారూ ! మీరు ఇంతకుముందు రెండుసార్లు ప్రజలకు సేవ చేసినట్టు నాకు తెలియదు. నీకు కూడా వయసు అయిపోయింది: నీవు అధికారంలోకి వచ్చినా ఎంజిఆర్ మాదిరిగానే వుంటావు. మంచిపేరు సంపాదించుకో. ప్రజలు ఎప్పుడూ నిన్ను తలచుకోవాలి. వాళ్ళకి ఒక మంచి జీవితాన్ని ప్రసాదించి పోవాలి నువ్వు. నీ కుటుంబం చల్లగా వుండాలి అని కోరుకుంటున్నాను.

పాట్టాలి పార్టీలో రాందాస్ వున్నాడు దేవుడి లాంటి మనిషి. ప్రజలారా ఆయనకు కూడా ఓటు వెయ్యండి. చాలా గొప్ప మనసున్న మనిషి. అలాంటివాడు తమిళనాడులో కనిపించడం కష్టం ఆయనకు ఓటు వెయ్యండి. మీకు స్వేచ్ఛ దొరుకుతుంది. మీకు సహాయం చేస్తాడు. ఇది సత్యం. 'అయ్యా రాందాస్ గారూ! మీకు నమస్కారం చేసి ఒకమాట అడుగుతున్నాను. ప్రజలు ఓటువేసి మీరు అధికారంలోకి వచ్చిన తరువాత వాళ్ళ బాగుకోసం చేయవలసింది అంతా చెయ్యండి అయితే అత్యాచారాలను మాత్రం వెంటనే అరికట్టాలి.

మూడో మంచి మనిషి వై గోపాలస్వామి (వైగో). అంటే మొదట కరుణానిధితో కలిసివుండి, ఆ తర్వాత విడిపోయాడే అతను. గోపాలస్వామి పార్టీ పేరేంటి? ... ఆ మరుమలర్చి ద్రావిడ మున్నేట్ర కజగం (ఎం డి ఎం.కె). ఆయనకు ఓటు వేయండి. చాలా మంచివాడు. నాలాంటివాడు మన తమిళ విముక్తి పులులు (ఎల్‌టిటిఇ వారు) నాశనం అవుతారని ఏడ్చినవాడు వాళ్ళకోసం ఇక్కడి నుంచి ఢిల్లీకి పోయాడు పి.వి. నరసింహారావును ధైర్యంగా అడిగింది ఎవరు? ఆయనే! పి.వి. ఇంటిముందు నిరాహారదీక్ష చేసి అరెస్టు కూడా అయ్యాడు ఆయన ప్రజలు నాశనం అవుతుంటే చూడలేడు. నాలాగే ప్రజలంటే పిచ్చి ఆయనకి ఆ మహారాజుకి తప్పకుండా ఓటువేయండి మీకు తప్పకుండా స్వేచ్ఛ లభిస్తుంది.

ఇకపోతే ఈ కమ్యూనిస్ట్ పార్టీలు వున్నాయి కదా. ఎడమ కమ్యూనిస్టు .. కుడి కమ్యూనిస్టు అని. వాళ్ళకి కూడా ఓటువేయండి ఎందుకంటే పేద ప్రజలకి మేలు చేయగలిగేది వాళ్ళే. అట్లాగే ఇంకా చిన్న చిన్న పార్టీల వాళ్ళు ఎంతోమంది వుంటారు. వాళ్ళకి కూడా ఓటు వెయ్యండి.

మన తమిళనాడు ప్రజల మాదిరిగా సులభంగా మోసపోయేవాళ్ళు వేరే ఎవరూ వుండరు. ఇంత ఇదిగా చెప్పాను. అయినా మీరు ఆమెకే ఓటు వేస్తే మీ అంత చవటలు ఎవరూ వుండరు. మీ అందరూ పడుతున్న కష్టాలు చూసి మీకు ఇట్లా ఒక దారి చూపిస్తున్నాను. అంటే మీరు ఈ దారిన వెళ్ళండి మెట్లు వస్తాయి. పైకి వెళ్తారు. ఆ దారిలోపోతే అగాధంలో పడిపోతారు అని చెప్తున్నాను.

రామునికి పధ్నాలుగు సంవత్సరాల వనవాసం. పాండవులకి పన్నెండు సంవత్సరాల వనవాసం. నాకు మాత్రం దేవుడు ఇరవై ఐదు సంవత్సరాల వనవాసం విధించాడు నేను ఇప్పుడు నా కోసం ఓట్లు అడగటంలేదు. మీ కోసమే అడుగుతున్నాను. మీ మంచికోసమే ఇదంతా చెప్తున్నాను.



## అయ్యా రజనీ కాంత్‌గారూ మీకు కూడా ఒక మనవి ...

రజనీకాంత్ రాజకీయాలలోకి రావాలని చాలా మంది ప్రజలు కోరుకుంటున్నారు అందుకే ఈ నాలుగు మాటలు చెప్తున్నాను.

అయ్యా రజనీకాంత్‌గారూ ..

ఇప్పుడు నేను మీతో మాట్లాడుతున్నాను.

ఎంజిఆర్ ఏం చేశారు? స్వయంగా ఒక పార్టీని ప్రారంభించారు. తనే ఒక ముఖ్యమంత్రి అయిపోయారు. ప్రజలకు చేయవలసిన మంచిపనులన్నీ చేశారు. ఆ తరువాత తను చేరవలసిన చోటుకు చేరుకున్నారు.

ఆయన పోయినా కూడా ఆయన పేరు మాత్రం మాసిపోలేదు.

అదేమాదిరిగా నువ్వు ఎవరినీ సపోర్ట్ చెయ్యవద్దు. ఎవరితోనూ కలవవద్దు వాళ్ళు నీ పేరును చెడగొడ్తారు. నీవు దేవుడిమీద భక్తి వున్నవాడివని నాకు బాగా తెలుసు తమిళనాడు జనం నిన్ను ఎంతో నమ్మివున్నారు. నువ్వు గనక ఎలక్షన్‌లో నిలబడితే చీఫ్ మినిస్టర్ అయిపోతావు.

నిన్ను ఒక పావులాగా వాడుకుని తర్వాత చిదిమెయ్యాలని చాలా మొసళ్ళు కాచుకుని వున్నాయి.

చేరవలసిన చోటుకు చేరుకున్న తరువాత బయట వదిలేసే చెప్పుల మాదిరిగా నిన్ను వాడుకోవాలని చూస్తున్నారు.

నేను చెప్పేకదా ఓటు వేయించాను. ఈ రాజకీయవాదులు ఇప్పుడు ఇలా చేస్తున్నారే అని బాధపడి లాభం వుండదు.

నేను వైకుంఠం చూడాలనుకుంటే నేనే చచ్చిపోవాలి. కాని ఇంకొకడు ఎవడో వైకుంఠం చూడటానికి మనం చచ్చిపోతే లాభం ఏముంటుంది? అందుకని నువ్వు ఎవర్నీ సపోర్ట్ చెయ్యవద్దు. నువ్వే ఒక పార్టీని పెట్టి - నువ్వే ఎలక్షన్‌లో నిలబడు నువ్వే చీఫ్ మినిస్టర్‌గా రా ..! తమిళ ప్రజలకు స్వేచ్ఛని ప్రసాదించు. ఆ మంచిపేరు నీకే దక్కాలి. ధర్మం నిన్ను కాపాడుతుంది.

నీకు అనేక నమస్కారాలు చేసి చెప్తున్నాను. దయచేసి నువ్వు ఇంకొకరికి గొడుగుపట్టవద్దు. ఇప్పుడు నేను బయటికి వచ్చినా కూడా నేనే నిలబడతాను. ఇంకొకరితో కలిసి చేరను. అడవిలో వున్న నేను ఎవరికో ఓటు వేయమని ఎందుకు చెప్పాలి? ఎందుకంటే . ప్రజలు మళ్ళీ రెండాకుల గుర్తుకు (జయలలితకు) ఓటువేసి నాశనం అవుతారేమోనని చెప్తున్నాను.

ప్రజలకు దారిచూపే మార్గదర్శి కావాలి. అందుకే నేను ఇదంతా చెప్తున్నాను. అంతే తప్ప వేరే ఏమీ లేదు నువ్వు స్వయంగా ఎన్నికలలో నిలబడవచ్చు. ఇంకొకరికి ఎందుకు గొడుగుపట్టుకోవాలి? ఇది అర్థంలేని పని.

ఇప్పుడే రేడియోలో విన్నాను. రజనీకాంత్ ఎవరికీ సపోర్ట్ చేయడంలేదు అని చెప్పారు. నేను చాలా సంతోష పడ్డాను నువు నిలుచుంటే వర్షంమాదిరిగా ఓట్లు పడతాయి. భయంకరమైన మెజారిటీతో గెలుస్తావు. ఇందులో అబ్జెక్షన్ ఏమీ లేదు. నువ్వు ముఖ్యమంత్రి అవడం ఖాయం. ఎంజిఆర్ కంటే ఒకపాలు ప్రజలకు ఎక్కువే సేవ చేయగలుగుతావు. నీ దగ్గరకు వచ్చి నీతో నేరుగా మాట్లాడే అవకాశం దేవుడు నాకు ఇవ్వలేదు

కరుణానిధి గారికీ, రాందాస్ గారికి, వై. గోపాలస్వామిగారికి సవినయంగా చెప్తున్నాను. ప్రజలు తమ తప్పును వీలైనంతవరకు దిద్దుకోగలుగుతున్నారు. మీ ముగ్గురిలో ఒకరు చీఫ్ మినిస్టర్ అవబోతున్నారు మీలో ఎవరు చీఫ్ మినిస్టర్ అయినా ప్రజలకు ఎంత సహాయం చెయ్యగలుగుతారో అంత చేసి మంచిపేరు సంపాదించుకోవాలి. కానీ జయలలిత మాదిరిగా ఉచ్చుగుంటలో చేపలు పట్టినట్టు చేయొద్దు ఎంజిఆర్ చేసినదాంట్లో ముప్పావు వంతైనా మంచిని మీరు చెయ్యగలరు. ఇది తప్పకుండా జరుగుతుంది. జయలలిత, శశికళలు కలసి అక్రమాలు చేసినట్టు మీరు చెయ్యరు.

ప్రజలకు, మీకు అందరికీ చెప్పవలసినదంతా చెప్పేశాను. మళ్ళీ చెప్పాలన్నా ఇంతకుమించి ఏమీ వుండదు. గొడ్డుకోదెబ్బ - మనిషికోమాట అన్నారు. నేను మాత్రం మీకు ఒకటి కాదు వెయ్యి మాటలు చెప్పాను



## నన్ను మించిన తీవ్రవాది ఈ ప్రపంచంలోనే లేడు !

భారతదేశంలోనేకాదు ప్రపంచమంతటా వున్న తీవ్రవాదులకు (టెర్రరిస్టులకు) అందరికీ నేను ఒక విషయం స్పష్టం చేస్తున్నాను. మీరు ఎవ్వరూ నన్ను మించిన తీవ్రవాదులు కారు. కాకపోతే

మీది పెద్ద సంస్థ కావచ్చు. ఒక జిల్లాలో చాలామంది సభ్యులుగా వుండి పోట్లాడుతుండవచ్చు కాని నేను .. ఒకే ఒక్క వీరప్పన్‌ని మీ అందరితో యుద్ధం చేయగలను ఈ రాక్షసులనందరినీ నేనే నాశనం చేస్తున్నాను. ఇక్కడ మీకు ఒక కథ చెప్తాను.

అర్జునుడు తీవ్ర తపస్సు చేసి అస్త్రాలవీ సంపాదించుకుని వచ్చాడు కదా. అప్పుడు కృష్ణుడు ఏమన్నాడంటే 'అర్జునా ఈ అస్త్రాలను సాధించుకురావడం పెద్ద గొప్పకాదు. వీటిని ఎవరిమీద పడితే వాళ్ళమీద కాకుండా మహా రాక్షసులు, అసురులు, శత్రువుల మీద మాత్రమే ప్రయోగించాలి సామాన్య ప్రజల మీద ప్రయోగించకూడదు అట్లా ప్రయోగిస్తే నీకు పాపం తగులుతుంది అని చెప్పాడు.

దేవుడు చెప్పాడు ఈరోజు ఆ దేవుణ్ణే అనుసరించి మనం నడుస్తున్నాం కదా. మీరు కూడా కావాలంటే యుద్ధం చేసి పెద్ద పెద్ద రాక్షసుల్లాంటి వాళ్ళని చంపివేయండి. మంచి పేరు తెచ్చుకోండి నాకు అభ్యంతరం ఏమీ లేదు. కానీ మీరు బస్సుల్లో బాంబులు పెడ్తున్నారు రోడ్డుమీద బాంబులు పెడ్తున్నారు ఇళ్ళల్లో బాంబులు పెడ్తున్నారు అమాయక ప్రజలకు హాని చేస్తున్నారు

మన టెర్రరిస్టు మురాలన్నింటినీ నేను ప్రశ్నిస్తున్నాను. నాకు మిమ్మల్ని కలిసే అవకాశం రాలేదు. అందుకే ఈ వీడియో ద్వారా మీతో మాట్లాడుతున్నాను. మీరు దీనిని చూస్తారు కదా. మీరు ఆవిధంగా ఎప్పుడూ బాంబులు పెట్టకండి మనం మన శౌర్యాన్ని చాటుకోవాలంటే రాక్షసుల్లాంటి వాళ్ళని చంపాలి. సైన్యాన్ని చంపాలి. అదే మన వీరత్వానికి గుర్తు.

నేను ఒక్కడినే ఆ పనిని చేస్తున్నాను.

ఒక రాజకీయ నాయకుడు మాయమాటలు చెప్పి ప్రజల ఓట్లు దొబ్బి గెలిచి ఆ తర్వాత స్త్రీల మీద అత్యాచారాలు చేస్తున్నాడు అనుకోండి. అలాంటి వాడిని పట్టి కాల్చిపారేయండి.

ఒక అధికారి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను బాగా హింసిస్తున్నాడనుకోండి. అలాంటివాణ్ణి కూడా కాల్చేయండి.

అలాంటి వాళ్ళను కాల్చి నువ్వు చచ్చిపోతే వీరస్వర్గానికే వెళ్తావు. ధర్మం చేస్తే స్వర్గం. అధర్మం చేస్తే నరకం. కాబట్టి అమాయక ప్రజలను అన్యాయంగా చంపి మీరు పాపం తలకెత్తుకుని నరకానికి వెళ్ళకండి. మనకు అలాంటి పని వద్దేవద్దు. ఇంతకు ముందు చేస్తే చేశారు. కాని ఇక ముందు మాత్రం అలా చేయవద్దు. అది మీకే మంచిది

మీరు కిడ్నాప్ చెయ్యాలనుకుంటే ఒక పెద్ద అధికారిని కిడ్నాప్ చేయండి. అ మనిషి ప్రజలను హింసించేవాడు. అట్లాగే ఒక రాజకీయవాదిని కిడ్నాప్ చేయండి. అతను ప్రజలను మోసగిస్తున్నాడు. అలాంటి వాళ్ళని కిడ్నాప్ చేసి మన సత్తా ఏంటో నిరూపించుకోవాలి.

అంతేకాని -

అక్కడ అమాయక ప్రజలను పోలీసులు హింసిస్తున్నారు ప్రభుత్వం కూడా వాళ్ళని హింసించి చంపుతోంది. వాళ్ళలాగే మనం కూడా చేస్తే ప్రజల గతేం కావాలి?

ఈ విషయం గురించి బాగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోండి. ఇకమీదట మీరు రాక్షసులని మాత్రమే సంహరించాలి. అమాయకులను మాత్రం ఏమీ చెయ్యవద్దు. మీకు జయం లభిస్తుంది



# నన్ను హంతకుడంటున్నారు ఒప్పకుంటాను, కానీ ...

ఈ ప్రభుత్వం మీద నాకు నమ్మకం లేదు. దీనిని నమ్మి నేను సరండర్ కాలేను.

ఇప్పుడు మిలిటరీని వేశారు మూడేళ్ళ క్రితం మిలిటరీని ఇక్కడికి పంపించారు. వాళ్ళు రెండేళ్ళు వున్నారు. మూడోవంతు మిలిటరీని వెనక్కి తీసుకున్నారు. రెండో వంతును ఇక్కడే వుంచేశారు రెండు సంవత్సరాలుగా నాకోసం గాలిస్తున్నారు. అయినా పట్టుకోలేకపోయారు.

ఈ మధ్య రేడియో వార్తల్లో చెప్పారు కర్ణాటక మంత్రి చెన్నైకి వెళ్ళి జయలలితతో కలిసి మాట్లాడాడు. ఇద్దరూ కలిసి నన్ను పట్టుకోడానికి ఒక కొత్త ఎత్తు వేశారు ఏంటా ఎత్తు? మరుసటి రోజు వార్తల్లో ప్రకటించారు

వీరప్పన్ అయినా, వీరప్పన్ మనుషులైనా వచ్చి లొంగిపోతే వాళ్ళ ప్రాణానికి ఎలాంటి హానీ తలపెట్టము అని హామీ యిస్తున్నాం అని చెప్పారు.

ఇట్లాంటి మాటల్ని నమ్మే కదా నా మనుషులు అయ్యన్‌దొరై, రంగస్వామి, అర్జునన్ సరండర్ అయ్యింది మరి వాళ్ళ ప్రాణాలు ఎలా పోయాయి? సైనైడ్ గోలీలు మింగి చచ్చిపోయారు అని చెప్పారు కదా.

రేపు నాకు కూడా అదే సైనైడ్ గోలీల చావు రాదని నమ్మకం ఏముంది? నాకు సైనైడ్ వేయరని హామీ ఏముంది?

నా వాళ్ళని అప్పుడు సైనైడ్ గోలీలతో చంపింది ఈ ప్రభుత్వమే. వాళ్ళని పోలీసులు చంపేసి ఆత్మహత్య చేసుకున్నారని నాటకం ఆడారు.

సైనైడ్ గోలీలను దేవారం పట్టుకెళ్ళి శంకర్ బిదారికి ఇచ్చాడు. వాళ్ళతో రాజకీయవాదులు చేతులు కలిపారు అందరూ కలిసి చంపారు. నా తమ్ముడికి, ఇతర ఇద్దరు మనుషులకి సైనైడ్ మాత్రలు మింగవలసిన అవసరం ఏమీ లేదు వీళ్ళే కుట్రపన్ని ఆ పని చేశారు

వీళ్ళు అడవిలో యుద్ధం చేసి నా మనుషులని చంపివుంటే వాళ్ళకి బంగారు పతకం ఇచ్చినా అర్థం వుండేది. కానీ సరండర్ అయి జ్యుడీషియల్ కస్టడీలో వున్నవాళ్ళని చంపిన ఈ పిరికి పందలకి వీరపతకం!

మొత్తం ప్రపంచానికి చాటి చెప్తున్నాను. ఈ భారతదేశంలో ఇంత నయవంచన వున్నది. ఇటువంటి దుర్మార్గులను నమ్మి ఎవరు సరండర్ అవుతారు? వీళ్ళు నీతి, న్యాయం వున్న రాజకీయవాదులేనా?

వీళ్ళు నమ్మకద్రోహులు హంతకులు. కిరాతకులు నన్ను హంతకుడిని అంటున్నారు. కానీ వాళ్ళు నిజాయితీపరులా? రాక్షసులను చంపాను అని నేను ఒప్పకుంటాను. మరి నా తమ్ముడిని మరి ఇద్దరినీ చంపామని వీళ్ళు ఒప్పకుంటారా?

కస్టడీలో వున్నవాళ్ళకి సైనైడ్ ఎక్కడినుంచి వస్తుంది? నా తమ్ముడు సంకెళ్ళతో లాకప్‌లో వుంటాడు. వీళ్ళు ఇరవైనాలుగు గంటలు తుపాకులు పట్టుకుని కాపలా కాస్తుంటారు మరి అతనికి సైనైడ్ ఎలా దొరుకుతుంది?

నా తలనిండా వెంట్రుకలే తప్ప లోపల మెదడు ఏమీ లేదనుకుంటున్నారా? లేకపోతే అధికారం మీ చేతుల్లో వుంది కదా అని గెంతులు వేస్తున్నారా? వెయ్యండి నేనేం చెవిలో పువ్వులు పెట్టుకుని

కూచోలేదు. ఒక టైం వస్తుంది. అప్పుడు చూసుకుందాం. వాళ్ళు మాట్లాడినదంతా అబద్ధం. మినిష్టర్ ఇచ్చిన వాగ్దానం అంతా అబద్ధం ప్రభుత్వం ప్రకటించిన తర్వాతే కదా వీళ్ళు వెళ్ళి సరండర్ అయ్యారు. అలా నమ్మి వెళ్ళిన వాళ్ళని ఇంత ఘోరంగా చంపేశారు

మాకూ ఈ పోలీసు రాక్షసులకూ మధ్య ఎన్నో యుద్ధాలు (ఎన్‌కౌంటర్లు) జరిగి వుండొచ్చు. మేం వాళ్ళని కాల్చి వుండొచ్చు. వాళ్ళు మమ్మల్ని కాల్చి వుండొచ్చు. ఒక్కొక్క పోలీసు అధికారి కనీసం నలుగురు అమాయక ప్రజలను కాల్చివుంటాడు. ఆ కోపంతో నేను ఆ పోలీసుల్లో ఒకర్ని కాల్చి వుంటాను. ఆ విషయం ఇంతకుముందే చెప్పాను కదా

అయితే ఈ ప్రభుత్వ పెద్దలకీ - నాకూ మధ్య ఏవిధమైన వ్యక్తిగత కక్ష లేదు. అయినా కూడా వీళ్ళు ఇంత పాపానికి ఒడిగట్టారు

న్యాయస్థానం కాపలాలో (జ్యుడీషియల్ కస్టడీలో) వున్నవాళ్ళని చంపి - వాళ్ళే ఆత్మ హత్య చేసుకున్నారని అబద్ధం ఆడుతున్నారు.

ఇలాంటి వాళ్ళని నమ్మి నేను మట్టుకు ఎట్లా సరండర్ అవుతాను? అవను.

జమ్ము కాశ్మీర్ తీవ్రవాదులకు ఇలాంటి అవకాశం యిచ్చారు ఒక టెర్రరిస్టు సరండర్ అయి తన ఆయుధాన్ని అప్పగిస్తే అతనికి ఒక యాభై లక్షల రూపాయలు యిచ్చి ఇంకొక జీవితాన్ని చూపిస్తుంది ఆ ప్రభుత్వం

రెండోది -

ఈ వీరప్పన్ చాలా హత్యలు చేసి ఇప్పుడు మరో జీవితం అడుగుతున్నాడు. వీరప్పన్‌కి అలాటి అవకాశం యివ్వకూడదు అని చాలామంది అంటున్నారు. పోలీసువాళ్ళే అలా అంటారు. కాని ప్రజలు మాత్రం ఎప్పుడూ అట్లా అనరు. చాలామంది ప్రజలు వీరప్పన్ ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తున్నారు. ఈ విషయం నాకే కాదు మొత్తం దేశమంతా తెలుసు.

హంతకుడైన వీరప్పన్‌కి పునర్జన్మ ఎలా ఇవ్వాలి అని ప్రభుత్వం అడిగితే - వందలాది మంది అమాయకులను పోలీసులు మాత్రం కొట్టి చంపలేదా అని ఎదురు ప్రశ్నిస్తారు.

అంతేకాదు పోలీసులు వందలాది మంది స్త్రీలపై అత్యాచారాలు చేశారు. న్యాయస్థానం కాపలాలో వున్న వాళ్ళని కూడా చంపారు ప్రభుత్వం వాళ్ళ ప్రాణాల్ని తిరిగి తెచ్చివ్వగలదా? తెచ్చి ఇవ్వలేనప్పుడు వీరప్పన్‌ని మాత్రం ఎందుకు అడుగుతున్నారు అంటారు ప్రజలు.

ఒక్కొక్క పోలీసువాడు నలుగురు అమాయకులను చంపివుంటాడు అందుకే నేను అలాంటివాళ్ళని చంపి వుంటాను.

కాని నేను ఎవరి సొమ్ము దొంగిలించను. ఎవరి మీదా అత్యాచారం చెయ్యను పోలీసులు చేసినట్టుగా నేను హత్యలు చెయ్యను

పోలీసువాడు ఏం చేస్తాడు? ఒక స్త్రీ అందంగా వుంటే ఆమె భర్తని అరెస్టు చేసి కస్టడీలో పెట్టి చంపుతాడు. ఒక స్త్రీ కోసం ఆమె భర్తని అన్యాయంగా చంపుతాడు. ఏమంటే ఇతడు వీరప్పన్ గ్యాంగులో చేరినవాడు అని ప్రకటిస్తారు. ఆ తర్వాత ఆమె మీద అత్యాచారం చేస్తారు ఆమెని కూడా చంపేస్తారు. లేకపోతే తమ చేతికింద పెట్టుకుంటారు. ఆమె అవమానం భరించలేక విషంతిని చస్తుంది. ఇట్లా ఎంతోమంది మహిళలు చచ్చిపోయారు. అట్లా చచ్చిపోయిన వాళ్ళందరి ప్రాణాలూ ఈ ప్రభుత్వం వాపస్ ఇవ్వగలదా?



## నా కస్టడీలో ఎనిమిదిరోజులున్న ఓ రాజకీయ నాయకుడి కొడుకు !

పోలీసులతో, రాజకీయ నాయకులతో వీరప్పన్‌కి ఏదో లోపాయికారీ ఒప్పందం వుంది ... అందుకే వీరప్పన్ పట్టుబడటంలేదు అని చాలా మంది అనుకుంటున్నారు.

కాని అది పచ్చి అబద్ధం గతంలో ఎలక్షనప్పుడు నేను రాజకీయవాదులను సపోర్ట్ చేసిన మాట వాస్తవమే కాని వాళ్ళ పద్ధతులు నచ్చక వదిలేశాను అబద్ధాలు చెప్పి నన్నొక పావులాగా వాడుకుని వాళ్ళు ఓట్లు సంపాదించుకున్నారు నేను చెప్పడం వల్ల ప్రజలు వాళ్ళకు ఓట్లు వేశారు. కాని గెలిచిన తరువాత వాళ్ళు ప్రజలకు చిప్ప చూపించారు. తాము మాత్రం బాగా సంపాదించుకున్నారు. రాజకీయాలు అంటే వ్యాపారం, అత్యాచారం అయిపోయింది అందుకే నేను వాళ్ళతో సంబంధం పెంచుకోలేదు. తెంపేసుకున్నాను

నేను వంటరివాడిని ఇక పోలీసులంటేనే నాకు పడదు వాళ్ళు చేసే పనులవల్ల వాళ్ళంటేనే నాకు పిచ్చి కోపం వస్తుంది నాకూ, వాళ్ళకూ మధ్య ఏ ఒప్పందం లేదు ఏ సపోర్ట్ లేదు.

నేను మంచివాడినని ప్రజలకు తెలుసు అందుకనే వాళ్ళు నాకు సహాయం చేస్తారు. పోలీసులు వచ్చి ప్రజలను ఎంత హింసించినా, ఆఖరికి ఎంతమందిని కాల్చిచంపినా కూడా వాళ్ళు నాకు సహాయం చేయడం మానరు.

మంచివాడికి ఎక్కడైనా సరే మంచే దొరుకుతుంది. చెడ్డవాడికి ఎక్కడైనా చెడే జరుగుతుంది. ఇది ప్రభుత్వం గ్రహించాలి. వీరప్పన్ మంచివాడు కాబట్టే వీరప్పన్‌కి ప్రజల సహకారం లభిస్తోందన్న విషయం ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. నేను చెడ్డవాడినై వుంటే ఈ పాటికి ఎప్పుడో ప్రజలు నా ఆచూకి తెలిపివుండేవాళ్ళు నన్ను ఎప్పుడో వాళ్ళే నాశనం చేసివుండేవాళ్ళు.

నాకు అధికారుల, రాజకీయవాదుల మద్దతు వున్నది అనడం వట్టి అబద్ధం. నేను అసలు వాళ్ళ ముఖం కూడా చూడను

పోలీసులతో, సైనికులతో జరిగిన ఎన్‌కౌంటర్లలో నా అనుచరులు 45 మంది వరకు చచ్చిపోయినట్టు ఒక లిస్టును ప్రకటించారు.

నిజానికి ఎన్‌కౌంటర్‌లో వీరప్పన్ మనిషిని ఒక్కర్నైనా కాల్చలేదు పోలీసులు. రోడ్డుమీద వెళ్ళే వాళ్ళనో, ఇంట్లో పడుకున్నవాళ్ళనో పట్టుకుపోయి కళ్ళకు గంతలు కట్టి దేవారం కాల్చేవాడు. ఆయన పోలీసులకు పెద్దట. పోయి చూడండి. ఆయనకు ఓ స్మశానమే ఉంది. నలభై ఏం ఖర్మ వందల మందిని అట్లా కాల్చివుంటాడు ఆడవాళ్ళమీద అత్యాచారం చేయడానికే పోలీసుల్లో ఒక అధికారి మనుషుల్ని ఈవిధంగా చంపేసేవాడు. దొంగ. అతణ్ణి నేను కాల్చాను. అతను ఇప్పుడు ఆస్పత్రిలో వున్నాడు. అతని పేరు మోహన్ నివాస్. అతను ఏం చేసేవాడంటే ముందుగా ఒక ఇంట్లో దూరేవాడు. ఆ ఇంట్లోని ఆదివాసీ మగవాడిని పట్టుకొచ్చి కాల్చిచంపి దహనం కూడా చేసేసేవాడు ఆ తర్వాత ఆ ఇంటి మీద పడి చచ్చిపోయిన వాడి భార్యపై అత్యాచారం చేసేవాడు. ఏమైనా అతనికి ఇదే పని!

నేను ఇప్పుడు చెప్తున్నాను - నా వంటి మీద అసలు ఏ తూటా పడదు. పడదంటే పడదు. అతను ఎన్నో రౌండ్లు కాల్చాడు. అయినా నాకు ఏమీ అవలేదు. అదే నేను కాల్చగానే తగిలి పడిపోయాడు.

సరే అది వదిలేయండి నాకు కర్ణాటక రాష్ట్రంలో రాజ్‌కొండర్‌తో మాత్రం సంబంధం వుంది. అంతే. అంతకుమించి మరే ఇతర రాజకీయవాదితోనూ సంబంధంలేదు. నేను - తమిళనాడులో కూడా ఏ రాజకీయవాది దగ్గరకూ పోలేదు.

నాచ్చిముత్తుతో నాకు రాజకీయ సంబంధాలు వుండేవి అన్నమాట కూడా నిజం కాదు అతను ఒక మోసగాడు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుంటాడు మొదట్లో అతను కూడా అన్నిరకాల దందాలు చేసి కేసుల్లో ఇరుక్కున్నాడు వెళ్ళి ఎంజిఆర్ కాళ్ళమీద పడ్డాడు ఎంజిఆర్ అతనికి ఇకనుంచి అట్లాంటి పనులు చేయకు. నీకు ఒక ఎంఎల్ఏ సీటు ఇస్తాను. ఎలక్షన్లో నిలబడు అనిచెప్పి మెట్టూరు సీటు యిచ్చాడు. ఎంజిఆర్‌కి ప్రజల్లో ఎంతో పలుకుబడి వుంది. ఆయన పేరు మీద ఒక గాడిదను ఎలక్షన్లో నిలబెట్టినా కూడా ప్రజలు ఓటు వేస్తారు. అలాగే ప్రజలు రెండాకుల గుర్తుకే ఓటు వేశారు నాచ్చిముత్తు అట్లా ఎంఎల్ఏగా గెలిచాడు.

గెలవగానే ఏం చేశాడు? అవినీతి పనులు, అత్యాచారాలు మొదలుపెట్టాడు.

తమ కొడుక్కో కూతురుకో ఉద్యోగం దొరకాలంటే తల్లితండ్రులు ఏం చేస్తారు? రికమెండేషన్ కోసం తమ ప్రాంతం ఎంఎల్ఏ దగ్గరకే కదా వెళ్తారు. అట్లాగే ఆ ఏరియాలో వుండే డిఎఫ్ఓ కూడా తన కూతురు కోసం అతని దగ్గరకు వెళ్ళాడు ఆమె బాగా చదువుకున్న పిల్ల. ఉద్యోగం కోసం ఆమెకు ఎంఎల్ఏ రికమెండేషన్ కావలసివచ్చింది డిఎఫ్ఓకు తెలుసు అతను మంచివాడు కాదు, దుర్మార్గుడు అని అందుకే కూతురిని ఒంటరిగా పంపకుండా తను కూడా ఎంఎల్ఏ ఇంటికి వెళ్ళాడు. ఈరోడు శరఖ ప్రాంతం డిఎఫ్ఓ ఆయన మెట్టూరు రేంజ్ అంతా ఆయన కంట్రోల్‌లోనే ఉంది అట్లాంటి డిఎఫ్ఓ కూతురు చేయిని తండ్రి ముందే పట్టుకున్నాడు ఆ నాచ్చిముత్తు. అట్లాంటి నీచుడు అతను. డిఎఫ్ఓ తన కూతుర్ని పిల్చుకుని ఏడుస్తూ వెనక్కి వచ్చేశాడు. అలాటి దుర్మార్గుణ్ణి నేను ఎలాగూ చంపేస్తాను.

గతంలో నా గంధపు చెక్కల లోడును ఆ నాచ్చిముత్తు పట్టిచ్చాడు కాబట్టే నాకు అతని మీద ద్వేషం వుంది అనేది అబద్ధం. చెక్కలోడుది ఏముంది? నాలుగు పట్టుబడతాయి. మూడు గమ్యానికి చేరుతాయి. అది మామూలు విషయం దానికోసం అతణ్ణి నేను చంపాలని అస్సలు అనుకోలేదు అతను చాలామంది పేద అమ్మాయిల మీద అత్యాచారం చేస్తున్నాడు కాబట్టి అతణ్ణి లేపెయ్యాలి అని నా మనుషులకి చెప్పాను.

అతణ్ణి పట్టుకొచ్చి గుండు గొరిగించి, సున్నం బొట్లు పెట్టి, గాడిదమీద కూచోబెట్టి ఇతను ఇంతమంది ఆడవాళ్ళమీద అత్యాచారం చేశాడు కాబట్టి ఈ శిక్ష విధిస్తున్నాను అని ప్రకటిస్తూ ఊరేగించాలి అనుకున్నాను. ఊరికే కాలిస్తే చప్పున చచ్చిపోతాడు. పైగా అలా కాల్చితే వాడికి మోక్షం దొరుకుతుంది. కాబట్టి అతనికి ఇలాంటి దండనే ఇవ్వాలి. ప్రజలు అతణ్ణి చూసి బాగా నవ్వాలి అనుకున్నాను.

ఒకసారి నా మనుషులు అతణ్ణి పట్టుకుని ఆపి కారు తాళాలు లాగేసుకున్నారు. 'రారా అన్న దగ్గరకు పోదాం' అని అతణ్ణి కారులోంచి బయటకు పిలిచారు. అతను అలాకాదు ఇలాకాదు అని రకరకాలుగా బతిమిలాడటం మొదలుపెట్టాడు. కారు తాళాలు మన దగ్గరే వున్నాయి ఎక్కడికి పోతాడులే అనుకుని నా మనుషులు నా కోసం కబురు పంపారు నేను అక్కడికి చేరుకునే లోపల వాడు కారును ఎలాగో తోయించుకుని స్టార్ట్ చేసి పారిపోయాడు.

ఒక ప్రజా నాయకుడిగా ఉంటూ అతను దుర్మార్గపు పనులు చేస్తుంటే - పోలీసులేమో తమాషా

చూస్తుంటారు. అరోజు తప్పించుకున్నాడు. మళ్ళీ ఏ రోజు దొరికినా అతనికి దండన తప్పదు. రెండు చేతులైనా నరికేస్తాను. భీముడు దుర్యోధనునికి చేసినట్టు కాళ్ళైనా విరిచేస్తాను.

నాచ్చిముత్తు నా లిస్ట్‌లో వున్నవాడు. అతనిదొక పెద్ద దర్బార్. అతని తండ్రిపేరు సంపంగి. అన్నూర్‌కు చెందినవాడు. రాజకీయాల్లో బాగా పలుకుబడి వున్నవాడు. ఆ సంపంగితో పాటు ఆయన కొడుకులందరూ అత్యాచారాలు చేయడంలో ఆరితేరినవాళ్ళు.

కర్ణాటక, తమిళనాడుల మధ్య కావేరి నదీ జలాల సమస్య చెలరేగినప్పుడు - వీళ్ళు బాగా రెచ్చిపోయారు. అంతకుముందు కౌండర్ కులానికి చెందిన ఒక తమిళ మహిళ కోసం ఇతను చాలా సార్లు ట్రై చేశాడు అప్పుడు వీలుకాలేదు ఈ సమస్య చెలరేగినప్పుడు ఇదే సమయమని నలుగురు రాక్షసుల్ని పంపి ఆమెను పట్టుకొచ్చి అత్యాచారం చేశాడు. ఆ విషయం నాకు మన ప్రజలు చెప్పారు. తమిళుల డబ్బు, నగలు, ఆస్తి అంతా అతని ఇంట్లోనే పోగేసుకున్నాడు.

అతనికోసం కాపు కాశాను. రాళ్ళ క్వారీకి అతను పోయి వచ్చేదారి నాకు తెలుసు కాపు కాశాను. అనుకున్నట్టే వచ్చాడు. పట్టుకున్నాను కాల్చాలనే అనుకున్నాను. అతను కారు ఆపకుండా వెళ్ళి వుంటే కాల్చివుండేవాడినే. కాని చేయి ఊపగానే కారు ఆపాడు అతణ్ణి ఈడ్చుకుపోయి ఒక ఎనిమిది రోజులు నాదగ్గర పెట్టుకున్నాను. బాగా హింసించాను.

అడవిలో చల్లగా వున్న చోట ఒక రకమైన చీమలు బారులుగా పోతుంటాయి. వాటి దారిలో ఏది వచ్చినా తప్పించుకోవడం చాలా కష్టం. ఎండ్రకాయలు, తేలు ఏవీ వాటి ధాటికి తట్టుకోలేవు. నాలుగు చీమలు కుడితే చాలు మనం గంటసేపు తేలు కుట్టినట్టు అల్లాడిపోవలసిందే.

అతణ్ణి కట్టేసి ఆ చీమల్ని మీద పడేశాను.

'ఎందుకురా ఆడవాళ్ళమీద అత్యాచారాలు చేస్తావు? నీ చెల్లెలో, భార్యనో ఎవడైనా అలాచేస్తే నీకు ఎట్లా అనిపిస్తుంది. వేరే స్త్రీలు కూడా అలాంటివాళ్ళే కదా' అని బాగా తిట్టాను.

'నేను ఎవరిమీద అత్యాచారం చేయలేదన్నా నా తమ్ముడు వేరేవాళ్ళతో కలిసి చేశాడేమో. నేను కాదు' అని ప్రాధేయపడ్డాడు.

ఇంకొకరోజు ఉడుంపాదలో వేశాను. అది కుట్టితే చాలా బాధతో గిలగిలలాడాడు ఈ విధంగా అతణ్ణి ఎనిమిది రోజులు నా దగ్గర పెట్టుకున్నాను.

ఆ తర్వాత 'సరే మీ దగ్గర లెక్కలేనంత డబ్బువుంది. ఆ డబ్బే మీ చేత ఈ దుర్మార్గాలు చేయిస్తోంది మీ నాన్నకు ఒక కోటి రూపాయలు నష్టపరిహారం తీసుకురమ్మని చెప్పు. నిన్ను వదిలేస్తాను' అన్నాను

అప్పుడు వాళ్ళు పన్నెండు లక్షల రూపాయలు తీసుకొచ్చి నా కాళ్ళమీద పడ్డారు. ఇకనుంచి ఇలాంటి తప్పుడు పనులు చెయ్యమని అన్నారు అత్యాచారం చేసింది ఇతను కాదు ఇతని తమ్ముడు అని రికమెండేషన్ చేశారు. వాళ్ళకి బాగా వార్నింగ్ ఇచ్చి డబ్బు తీసుకుని వెళ్ళగొట్టాను.

ఆ పన్నెండు లక్షల రూపాయలను పేద ప్రజలకే ఇచ్చేశాను

మన చట్టాలు, శాసనాలు సక్రమంగా లేవు. అత్యాచారం చేసిన వాళ్ళకి పెద్ద శిక్షలు వేయాలి నడిరోడ్డుమీద నిలబెట్టి ఆడవాళ్ళచేత చీపురు, చాట, పెండతో కొట్టాలి ఊరంతా ఈడ్చుకుంటూ తిప్పాలి. అలాచేస్తే ఇక వాళ్ళు స్త్రీని నిప్పును చూసినట్టు చూస్తారు. ఎవరూ తప్పుడుపని చెయ్యరు. స్త్రీలు స్వేచ్ఛగా తిరుగగలుగుతారు.

మన దేశానికి వ్యాపారం పేరుతో వచ్చి, ఇక్కడి రాజుల వద్ద ఆయుధాలు లేకపోవడం చూసి తెల్లవాడు మొత్తం దేశాన్ని ఆక్రమించుకున్నాడు ఈ దేశాన్ని సులభంగా పరిపాలించాడు. అప్పుడు మహాత్మా గాంధీ తలెత్తి పోరాటం చేసి ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడు

అప్పుడు మహాత్మాగాంధీ ఏమన్నాడో తెలుసా?

'ఇవాళ మనకు వచ్చింది నిజమైన స్వతంత్రం కాదు ఒక స్త్రీ అర్ధరాత్రి బయటకు వెళ్ళి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకోగలిగిన రోజే నిజమైన స్వతంత్రం వచ్చినట్టు." అని అన్నాడు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒకరి తర్వాత మరొకరు ఎంతోమంది అధికారంలోకి వచ్చారు అయినా గాంధీ చెప్పినదానిని ఇంతవరకూ ఎవరూ సాధించలేదు వాళ్ళు మంచివాళ్ళైతే సాధించి వుండేవాళ్ళు. కాని అసలు తప్పుచేసేది వాళ్ళు రాజకీయవాదులు అన్యాయాలు, అత్యాచారాలు చేస్తుంటే పోలీసువాళ్ళు తొంగిచూస్తుంటారు. వాళ్ళే చేసినప్పుడు మనం చేస్తే తప్పేంటి అని న్యాయం కోసం ఎవరైనా పోలీస్ స్టేషన్ వచ్చినప్పుడు వాళ్ళు కూడా అత్యాచారం చేస్తారు. బస్‌స్టాపులో ఒంటరిగా కనపడ్డ స్త్రీని జీపులో ఎక్కించుకుని తీసుకెళ్ళి అత్యాచారం చేస్తారు

అలాంటివాళ్ళకే ఈ ప్రజలు ఓట్లు వేస్తున్నారు. మనం ఏం చెయ్యగలం చెప్పు?



## మూడు కోట్లు అడిగితే ప్రభుత్వం మూడు లక్షలు ఇచ్చింది !

నాలుగు నెలల కిందట అందియూర్ అటవీ ప్రాంతంలో చిలంగూరమ్మ గుడి దగ్గరనుంచి ఓ ఫారెస్టు గార్డును, ఇద్దరు వాచర్లను కిడ్నాప్ చేసి తీసుకుపోయాను వాళ్ళను విడిచిపెట్టాలంటే మూడు కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి నా డిమాండ్‌ను పంపించాను.

ఒకప్పుడు అన్యాయంగా, అరాచకంగా ప్రవర్తించినందుకు ఒక డిఎఫ్ఓనే కాల్చి చంపాను.

నా తమ్ముడు అర్జునన్ కోసం మందులు, ఇంజక్షన్‌లు తీసుకువస్తున్న నా మనిషిని బంధించి రేంజర్‌కి అప్పగించింది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగే. ఆరోజు నుంచి నాకు మళ్ళీ ఫారెస్ట్ వాళ్ళంటే మంటగా వుండేది. అవకాశం చిక్కగానే ఓ ముగ్గురు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్ళని కిడ్నాప్ చేసి మూడు కోట్లు అడిగాను

డబ్బు ఎలా తీసుకుని రావాలో, ఎట్లా అప్పగించాలో క్యాసెట్‌లో రికార్డ్ చేసి ఒక రైతు ద్వారా దానిని ప్రభుత్వానికి పంపించాను. అతను ఆ క్యాసెట్‌ను రేంజర్ ఆఫీసులో ఇచ్చేశాడు. దాంట్లో నేను ఏం చెప్పానంటే -

డబ్బు తీసుకుని వచ్చే వ్యక్తి ఎర్రబుల్లెట్ (మోటారు సైకిల్) మీద అడవిలోకి ఒంటరిగా రావాలి. అతను ఎర్రపాంటు, ఎర్ర చొక్కా ధరించాలి. శాలువా కూడా ఎర్రదే కప్పుకోవాలి బుల్లెట్‌కు ఒక ఎర్రజెండా తగిలించుకోవాలి. బండిని చాలా మెల్లగా నడుపుతూ రావాలి.

అందియూర్ చెక్‌పోస్ట్ దగ్గర వున్న నాలుగు రోడ్ల కూడలిలో నా మనిషి నిలబడి వుంటాడు. తక్కినవాళ్ళు తుపాకులు పట్టుకుని దాక్కుని వుంటారు. ఎందుకంటే మన మనిషికి ఏదన్నా ప్రమాదం వస్తే దాడిచేయడానికి! అతను డబ్బు తెచ్చియిచ్చి వెళ్ళిపోవాలి డబ్బు నా చేతికి అందిన వెంటనే ఈ ముగ్గురు ఫారెస్ట్ వాళ్ళని వదలిపెడతాను ..' ఇట్లా ఆ కాసెట్‌లో మాట్లాడి పంపాను. ఒక గడువు

పెట్టి ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల లోపు డబ్బు నాకు అందాలని లేకపోతే వాళ్ళని చంపేస్తానని చెప్పాను.

ఈలోగా అడవిలో నివసించే ఒక యువకుడిని రోడ్డుమీద నిలబడి మోటార్ సైకిల్ మీద వచ్చేవాడి దగ్గర డబ్బు తీసుకుని నాకు ఇచ్చేలా అంతా చెప్పి సిద్ధం చేశాను. ఒకచోట గుంతలు తవ్వి మేమంతా వాటిలో తుపాకులు పట్టుకుని మాటువేసి కూచున్నాము.

నేను చెప్పిన విధంగానే ఎర్ర బుల్లెట్ బండిమీద ఎర్ర షర్టు వేసుకున్న మనిషి వచ్చాడు. బండి దూరం నించి వస్తుండగానే చూసి నేను రోడ్డుమీద నిలబెట్టిన వాడికి సైగచేసి 'ఆపరా' అని చెప్పాను. కాని వాడు అడవి మనిషి కదా భయపడుతూ బిగదీసుకుని వుండిపోయాడు.

మోటార్ సైకిల్ వీడిని దాటుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది. ఆపైన వున్న టౌన్ వరకు వెళ్ళి మళ్ళీ వెనక్కి వస్తుందిలే అని మేము అలాగే కాపు వుంచాము. కాని గవర్నమెంటు వాడికి కూడా భయమేసి మోటార్ సైకిల్‌లో గాలి తీసేసి అది పాడైపోయిందననే నెపంతో బస్సులో అటునుంచి అటే వాపస్ వెళ్ళిపోయాడు. అప్పుడు మోటార్ సైకిల్‌పై వచ్చింది మణియక్కార్. టైర్ బరస్ట్ అయింది - లేకపోతే వీరప్పన్‌ని చూడకుండా వెనక్కి వచ్చేవాణ్ణి కాదు అని అక్కడ ఏవేవో గొప్పలు చెప్పాడట.

ఆ తర్వాత మూడు రోజులకు మళ్ళీ నేను చెప్పిన పద్ధతిలోనే ఇంకొక మనిషిని పంపించింది ప్రభుత్వం. అతని పేరు సెల్వరాజ్. అతను పాత డిఎస్‌పీ కొడుకు. ఊటీ దగ్గర చెంగల్ ఎస్టేట్‌లో వుంటాడు. నాకు ఇంతకు ముందే తెలిసినవాడు నా దగ్గరకు వచ్చేందుకు అందరూ భయపడు తుంటే చివరికి సెల్వరాజ్‌ను పిలిపించారట. అతను దేవారంకి కూడా బాగా తెలిసినవాడు.

సరే ఒకసారి ఎర్రపాంటు, ఎర్ర షర్టు, ఎర్ర జెండాతో బండి వస్తుండగానే 'బైకు వస్తోంది ముందుకు పోయి నిలబడు' అని ఆదివాసీ వాడిని హెచ్చరించాను. వాడు ధైర్యంగా రోడ్డు మధ్యకు వెళ్ళి బండిని ఆపాడు.

'ఎక్కడ మీ లీడర్?'

'అడవిలోపల దూరంగా వున్నాడు'

'ఏం చెప్పాడు?'

'ఏం చెప్పలేదు. డబ్బు యిస్తాడు తీసుకుని రారా' అని పంపించాడు.

'మరి క్యాసెట్ ఏదైనా ఇచ్చాడా?'

'లేదు'

'నాకు మీ లీడర్ని చూడాలని వుంది.'

'అది వీలుకాదు. ఆయన ఇక్కడ లేడు.'

'ఒరేయ్ నిజం చెప్పు. నువ్వు వీరప్పన్ మనిషివేనా? నేను ఇంతకు ముందు ఇక్కడ తిరిగినవాణ్ణే. నాకు వీరప్పన్ మనుషులు అందరూ తెలుసు నిన్ను ఎన్నడూ చూడలేదే'.

వాళ్ళ మాటలు అన్నీ నాకు వినిపిస్తూనే వున్నాయి. తర్వాత సెల్వరాజే మళ్ళీ అన్నాడు. 'ఒరేయ్ నీ మీద నాకు నమ్మకం కుదరడంలేదు. వీరప్పన్ మనిషి అని వేరేవాళ్ళు కూడా డబ్బు తీసుకుపోవచ్చు. నాకు నీ మీద అనుమానంగా వుంది '

ఇక లాభంలేదు. ఇతను కూడా డబ్బు ఇవ్వకుండా వెనక్కి వెళ్ళిపోతాడో ఏమో అనుకుని నేను రంగస్వామిని పంపించాను.

రంగస్వామిని సెల్వరాజ్ గుర్తుపట్టి 'రండన్నా రండి' అంటూ నమస్కారం చేశాడు

డబ్బంతా పంపించారు అంటూ అట్టపెట్టె, సంచి కింద పెట్టాడు సెల్వరాజ్.

అదే సమయంలో అటువైపు ఒక బస్సు వచ్చింది. ఆ టైమ్‌లో అటు బస్సు రాకూడదని ముందే చెప్పాము. అయినా వచ్చింది. వెళ్ళి డ్రైవర్‌ని కొట్టి బెదిరించి పంపించాడు సెల్వరాజ్ నేను వున్నంతవరకు ఏ పోలీసువాడు రాడు డబ్బును లెక్కబెట్టుకో అంటూ రోడ్డుమీద పోశాడు. అందులోంచి ఒక బండిల్‌ని తీసుకున్నాడు.

'ఎందుకు తీసుకున్నావది' అని అడిగాడు రంగస్వామి.

'కలెక్టర్ దగ్గర అది చూపించాలి ఒక పదివేల బండిల్ తీసుకురమ్మని ఆయనే చెప్పాడు అందుకని తీసుకుంటున్నాను' అన్నాడు సెల్వరాజ్.

ఎవరికోసం తీసుకున్నాడో తెలియదుగాని పదివేలు మాత్రం అతను తీసి జేబులో పెట్టుకున్నాడు.

'మీ పెద్దాయనని చూడాలని ఆశతో వచ్చాను. వీలుకాలేదు అందరూ బాగున్నారు కదా కొంచెం జాగ్రత్తగా వుండండి' అని చెప్పి బుల్లెట్‌మీద వెళ్ళిపోయాడు సెల్వరాజ్.

నేను డిమాండ్ చేసింది మూడు కోట్లు. ప్రభుత్వం పంపింది మూడు లక్షలే దాంతో నాకు బాగా కోపం వచ్చింది.

వీల్లేదు నేను అడిగినంతా ఇస్తేనే వీళ్ళను వదిలేస్తాను లేకపోతే కాల్చిపారేస్తాను. వారిలో ఒక్కడిని వదిలేసి డబ్బు ఇవ్వకపోతే మిగతా యిద్దర్ని చంపుదామనుకున్నాను.

కాని వాళ్ళు ముగ్గురూ బోరుమని ఏడ్చారు 'మేం పేదవాళ్ళం చాలా చిన్న ఉద్యోగులం. పై అధికారుల ఎంగిలి కంచాలు కడిగేవాళ్ళం మా కోసం డబ్బు యివ్వరు మమ్మల్ని చంపొద్దు. మమ్మల్ని చంపొద్దు అంటూ నా కాళ్ళమీద పడి బతిమాలారు

నేను కూడా అంతకుముందే వాళ్ళ భార్య పిల్లల ఫొటోలని పేపర్లలో చూశాను. గుడి చుట్టుపక్కల కూడా నోటీసులు, పోస్టర్లు అంటించారు. అందుకనే వాళ్ళను చంపడానికి నాకు చేతులు రాలేదు

'సరే వెళ్ళిపొండి' అని వదిలేశాను.

ఆ మూడు లక్షలతోనే వెనక్కి వచ్చేశాను.

కానీ ఆ తర్వాత ముఖ్యమంత్రి జయలలిత, డిజీపీ దేవారంలు 'మేం వీరప్పన్‌కి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పోలీస్ ఆపరేషన్ మొదలుకాగానే భయపడి వీరప్పనే వాళ్ళని వదిలేశాడు' అని ప్రకటించారు శాసనసభలో కూడా అలాగే చెప్పారు

హుఁ! కిడ్నాప్ చేసిన వాళ్ళని ఊరికే వదిలేస్తాడా ఈ వీరప్పన్ ?! మూడు లక్షలు ముట్టిన తర్వాతనే వదిలేశాను వాళ్ళని. లేకపోతే ముక్కలు ముక్కలు నరికిపడేసి వుండేవాణ్ణి.



## లాంగ్ షాట్‌లోంచి కొట్టవలసి వచ్చింది లేకపోతేనా ... ...

ఇరవై రోజుల కిందట అంటే పోయిన నెల ఇరవయ్యో తారీకున కావచ్చు. పేపర్లో ఒక వార్త

వచ్చింది కదా - గంధపు చెక్కలు స్మగ్లింగ్ చేస్తున్న ఒక గుంపు తమిళనాడు స్పెషల్ టాస్క్ ఫోర్స్ సబ్‌ఇన్స్పెక్టర్ మోహన్ నివాస్, ఎస్పీ తమిళ చెల్వన్‌ల మీద కాల్పులు జరిపిందని ...

ఆ దాడి చేసింది మేమే. బుర్రలూజైన మోహన్ నివాస్ మీద కాల్పులు జరిపింది మేమే!

అతను ఇంతవరకు తక్కువలో తక్కువ మూడు వందల మంది ఆడవాళ్ళమీద అత్యాచారం చేసి వుంటాడు. అతను చేసే పాపిష్టి పనులు చూడలేక ఎంతోమంది పోలీసులే ఈ దరిద్రపు ఉద్యోగం మాకు వద్దంటూ పారిపోయారు. చాలామంది ప్రజలు నా దగ్గరకు వచ్చి అతనిమీద ఎన్నో ఫిర్యాదులు చేశారు ఏడ్చారు. అతను అట్లాంటి దుర్మార్గపు పనులు చేస్తుంటే మీ ఎంఎల్ఏ దగ్గరకు పోయి ఎందుకు చెప్పలేదు అని అడిగాను వాళ్ళని.

'అయ్యా మా ఎంఎల్ఏది ఒక పెద్ద కథ ఆ ఎంఎల్ఏ ఒక మహిళ. ఆమె ఏం చేస్తుంది?' అన్నారు.

ప్రజలు మోహన్ నివాస్ చేసే అరాచకాల గురించి చాలా విషయాలు చెప్పారు. అవి వింటుంటే నా కడుపు రగిలిపోయింది.

మోహన్ నివాస్ ఎప్పుడూ రాత్రిపూటనే ఊరుమీద పడ్తాడు. ఆరేడుగురు పోలీసులను వెంటబెట్టుకుని వస్తాడు. అందమైన ఆడవాళ్ళు వుండే ఇంటిని ముందే ఎన్నుకుంటాడు. ఆ ఇంటి ముందు జీపును ఆపుతాడు. ఇంట్లో వున్న మగవాళ్ళందరినీ పట్టుకుని ఏదో ఒకటి అంటూ బాగా కొట్టి జీపులో ఎక్కించుకుని తీసుకుపోతాడు మర్నాడు రాత్రి అదే ఇంటికి వచ్చి ఆ మహిళమీద అత్యాచారం చేసి పోతాడు. ఎంతోమంది ఆడవాళ్ళు అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయారు.

చిన్నంజాన్ అనే అతను చెప్పాడు - అతని కూతురిని అతని ముందు, అల్లుని ముందు, మామ ముందు అత్యాచారం చేశాడట. ఆమె ఓ చిన్న బిడ్డకు తల్లి. ఆమె చంకలోని బిడ్డను లాగి వేరేవాళ్ళకు ఇచ్చి అందరిముందు అత్యాచారం చేశాడు 'మేం ఆ ఘోరం చూడలేక కళ్ళు మూసుకుని కుమిలి కుమిలి ఏడ్చాము' అన్నాడు చిన్నంజాన్.

'మరి అప్పుడు అతనితో వచ్చిన పోలీసులు ఏం చేశారు' అని అడిగాను.

'ఇతను అత్యాచారం చేస్తుంటే తుపాకులు పట్టుకుని రక్షణలాగా నిలబడ్డారు' అన్నాడు. అతని భార్యమీద కూడా అత్యాచారం చేశాడని, ఆ తర్వాత తమ బట్టలు విప్పి .... మామ ఇంట్లో అల్లుడు ... అల్లుని ఇంట్లో మామ ఇట్లా అసహ్యమైన పనులు చేయించాడని, ఆరు నెలలపాటు తమ కస్టడీలో పెట్టుకుని నానా హింసలు పెట్టారని, తన భార్య, కూతురు, అల్లుడు అంతా సిగ్గుతో ఎటో పారిపోయారని చెప్పాడు.

లక్ష్మి జటమాలి, చిత్తరంగి ఇంకా ఐదారుగురు ఆడవాళ్ళమీద కూడా ఇట్లాగే అత్యాచారం చేస్తే వాళ్ళు కూడా ఊరువదలి పారిపోయారు

అణైకర్రై అనే ఊళ్ళో మాధవి అనే అమ్మాయి ఒక్కతే అతని నుంచి తప్పించుకుంది. మిగతా ఆడవాళ్ళందరినీ అతను మానభంగం చేశాడు. అంటే ఒక సంవత్సరం నుంచి రోజూ అతనికి ఇదే పని.

ఇంత జరిగినా మీరు ఏం చెయ్యలేదా అని కోపంగా అడిగాను ఆ ఊరివాళ్ళని.

'మేం దాదాపు ఐదారువందల మంది ఆడవాళ్ళం వెళ్ళి కలక్టర్ ఆఫీసు ముందర నిరాహార దీక్ష చేశాము. వీరప్పన్‌ను పట్టుకోవడానికి పంపించిన పోలీసులు వాళ్ళు తమిళనాడు వాళ్ళైనా, కర్ణాటక

వాళ్ళైనా సరే మామీద అత్యాచారాలు చేస్తున్నారు, మమ్మల్ని బానిసలుగా చూస్తున్నారు మాకు న్యాయం కావాలి అని కలక్టర్‌తో మొరపెట్టుకున్నాం.'

'అప్పుడు శంగోట్టై అని ఒక మంత్రిగాడు వున్నాడు కదా అతనో పెద్ద దొంగ. అతను ఏదో మధ్యవర్తిగా వచ్చాడు. అదీ ఇదీ చెప్పి జయలలిత ఇచ్చింది అని మా అందరికీ తలా ఒక చీర ఇచ్చాడు' అన్నారు ఆడవాళ్ళు

నాకు కోపం వచ్చి 'మీరు ఆ చీరలని ఎందుకు తీసుకున్నారు? వాటిని అక్కడే కుప్ప పోసి తగలబెట్టేయవద్దా? ఆ జయలలిత, ఈ శంగోట్టై అందులో తగులబడిపోయి వుండేవాళ్ళు కదా అని బాగా తిట్టాను. అందరూ మారు మట్లాడకుండా తలలు వంచుకున్నారు. ఏడ్చారు.

దాంతర్వాత ఈ సమస్య గురించి లక్ష్మణ్ అనే ఎంఎల్ఏ శాసనసభలో మాట్లాడాడు మీరు వీరప్పన్‌ని పట్టుకొమ్మని పంపించిన పోలీసులు అమాయక మహిళల మీద అత్యాచారాలు చేస్తున్నారు ఐదు వందల మంది స్త్రీలు వచ్చి నిరాహార దీక్ష కూడా చేశారు మీ పరిపాలనలో అంతా అరాచకత్వమే జరుగుతోంది అని నిలదీశాడు. అందుకు జయలలిత నేను మద్రాసులో వుండి అంతా చూశాను ఎక్కడా అత్యాచారాలు జరగలేదు. అదంతా అబద్ధం అని సమాధానం యిచ్చింది కోట్లమీద కోట్లు ఆస్తులు సంపాదించుకుంటూ మద్రాసులో కూచుని వున్న ఆమెకి ఈ అడవిలో ఏం జరుగుతోందో ఏం తెలుసు?

ఈ విషయాలన్నీ నాతో చెప్పిన ప్రజలు 'మాకు ఎక్కడా న్యాయం దొరక్క మీ దగ్గరకు వచ్చాము సామీ, చచ్చిపోయినవాళ్ళు చచ్చిపోయారు. ఊరు వదలి పారిపోయిన వాళ్ళు పారిపోయారు మాకు మీరే దిక్కు' అని ఏడ్చారు.

ఏ ఊరుకు వెళ్ళినా, ఎవర్ని అడిగినా అంతా మోహన్ నివాస్ పేరే చెప్తున్నారు. ఎవరు ఇతను ఈయన విషయం తేల్చాల్సిందే అనుకున్నాను. 'మీరు నాకు అతణ్ణి గుర్తుపట్టి చూపించగలరా' అని అడిగాను. ఆ చూపిస్తాం అతనికి ప్రభుత్వం ఒక జీపు యిచ్చింది జయలలిత తర్వాత ఈయనే పెద్ద మినిష్టర్ లాంటివాడు. ఎప్పుడూ జీప్‌మీదనే తిరుగుతుంటాడు. మేము ఆయన ఆనవాలు చూపిస్తాం. మీరు కాల్చిపారేయండి' అని చెప్పారు.

నేను ఒక ప్లాన్ సిద్ధం చేశాను. కొంతమందికి తుపాకులు యిచ్చి రోడ్డుకు ఒకవైపు దాక్కోమని చెప్పాను నేను, నా మనుషులు మరొకవైపు మాటువేశాం ఆ ఊరువాడిని ఒకచోట నించోబెట్టి జీపు వస్తుంటే సిగ్నల్ ఇవ్వమని చెప్పాను.

నేను మొదట తుపాకి పేల్చుతాను అంతవరకు ఎవరూ కాల్చవద్దు అని అందరికీ ముందే సూచనలు ఇచ్చాను.

అట్లా మేమంతా ఎదురుచూస్తూ వున్నాం. సాయంత్రం ఆరుముప్పావు అవుతోంది. కొంచెం చీకటి పడింది. అప్పుడు వచ్చాడు ముందువున్న మనిషి జీపు వస్తోందని సిగ్నల్ ఇచ్చాడు. అంతే వేరేవైపున వున్న వాళ్ళలో ఒకరు తొందరపడి తుపాకి పేల్చాడు నేను కాల్చేవరకు ఎవరూ కాల్చొద్దని చెప్పినా అతను కాల్చేశాడు. జీపు ఇంకా చాలా దూరంలో వుంది. వెంటనే అది ఆగి రివర్స్ తీసుకుని పోబోయింది అప్పుడు మేం కూడా ఫైరింగ్ మొదలు పెట్టాము

వాళ్ళు కూడా జీపు దిగి జీపును అడ్డంగా పెట్టుకుని కిందినించి కాల్పులు జరుపుతున్నారు. ఒకతను జీపు దూకి పారిపోయాడు బాగా చీకటిపడింది ఏమీ కనబడటంలేదు. జీపు దూరంగా వుంది. అంటే లాంగ్‌షాట్ అయిపోయింది. నేను అనుకున్న చోటుకు వచ్చేవరకు ఆగివుంటే నా

ఎస్.ఎల్.ఆర్ గన్‌తో పేల్చేసి వుండేవాడిని. జీపు తుక్కుతుక్కు అయిపోయి వుండేది. కాని కొత్త కుర్రవాళ్ళు కదా! తొందర పడ్డారు. అందువల్ల మంచి అవకాశం వృథా అయిపోయింది. ఆ రోజు ఆయనతోపాటు తమిళ్ చెలువన్ అనే ఎస్‌పీ వచ్చాడు. ఎందుకు వచ్చాడు? మోహన్ నివాస్ మీద ఈ వీరప్పన్ దాడిచేస్తాడని ఆయనకు తెలుసుకదా. ఆయనను చంపాలని నేను అనుకోలేదు. అసలు ఆయన వచ్చిందే నాకు తెలియదు. కానీ మోహన్ నివాస్‌తో ఎంతమంది వచ్చినా అదే గతిపడుతుంది. చంపడం చంపడమే.

ఆ మర్నాడు పేపర్లో నేను వీరప్పన్‌ని పట్టుకునే తీరతాను అని మోహన్ నివాస్ ఏదేదో అన్నట్టు రాశారు.

నేను అతనికోసం కాచుకునే వుంటాను. దేవుడే అతణ్ణి మళ్ళీ నా దగ్గరకు రప్పిస్తాడని ఆశతో వున్నాను అతను ఒక వీరుడైతే మళ్ళీ రావాలి. నన్ను పట్టుకోవాలి 'ఒరే మోహన్ ..... రారా. రా నీవో నేనో చూసుకుందాం! నేను నీలాగా ఆడవాళ్ళమీద అత్యాచారాలు చేసేవాణ్ణి కాదు. మనిషి రక్తం తాగితే విషం తలకెక్కి పిచ్చిలేస్తుందట. అయినా ఫరవాలేదు. - నిన్ను కాల్చి నీ గుండెలోంచి ఓ చారెడు రక్తం తాగుతాను దుర్మార్గుడా. నిన్ను చంపకపోతే నా పేరు వీరప్పన్ కాదు! నిన్ను ప్రభుత్వం ఇక్కడికి ఎందుకు పంపించింది? ఈ వీరప్పన్‌ని పట్టుకొమ్మనా లేకపోతే ఆడవాళ్ళ మీద అత్యాచారాలు చెయ్యమనా? ......

ప్రజలారా నేను ఇట్లా మాట్లాడుతున్నందుకు మీరు బాధపడొద్దు. నా కడుపు రగిలిపోతున్నది. వాళ్ళే నన్ను ఈవిధంగా మాట్లాడేట్టు చేశారు. చాలా వెర్రిగా మాట్లాడుతున్నాను. నన్ను క్షమించండి. దేవారంకి ఇదంతా తెలుసు. ఆయనకు ఒక కూతురు ఉంది.

'వీరప్పన్ పిరికివాడు. ఒక గుంటలో కూర్చుని కాల్చిపారిపోయాడు' అని చెప్పాడంట మోహన్ నివాస్. 'ఒరే నువ్వు రారా. నిన్ను గనక కాల్చకపోతే నేను నా తండ్రికే పుట్టలేదు'. ... ...



## పోలీసులు చేస్తే ఒప్పు నేను చేస్తే తప్పా?

నేను ఇప్పుడు కర్ణాటక ముఖ్యమంత్రి దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతున్నాను. అయ్యా దేవేగౌడా! తమిళనాడులో ఒక న్యాయస్థానం కాపలాలో (జ్యుడీషియల్ కస్టడీలో) వున్న వాళ్ళని (నా తమ్ముడు అర్జునన్ మరి ఇద్దరు మనుషుల్ని) న్యాయవిచారణ జరపాలనే పేరుతో మీ డీజీపీ శంకర్ బిదారి కర్ణాటకకు తీసుకుపోయారు. ఆయనా, తక్కిన పోలీసులు కలిసి అన్యాయంగా నా వాళ్ళని సైనేడ్ గోలీలు యిచ్చి చంపేశారు.

నీ మనస్సాక్షిగా, దేవుడి సాక్షిగా ఈ విషయం నీకు తెలుసు. ఇట్లా చేయడం ద్వారా ఒక పోలీసువాడు న్యాయస్థానాన్ని చెప్పుతో కొట్టాడు!

నేను ఎన్నో హత్యలు చేశానని నన్ను పట్టుకోమని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పోలీసుల్ని పంపించాయి. వాళ్ళు సరిపోరని కేంద్రం నుంచి మిలిటరీ దళాలను కూడా దింపారు. వాళ్ళందరూ వచ్చి నన్ను పట్టుకోలేక ప్రజలను హింసించి, ఆడవాళ్ళమీద అత్యాచారాలుచేసి పోయారు. ఇప్పుడు టిబెటన్ దళాలను పంపించమని పి.వి. నరసింహారావుని మీరు అడుగుతారేమో!

అయ్యా! నేను ఏమైనా పెద్ద సైన్యాన్ని తయారుచేసి ప్రత్యేక రాష్ట్రం కావాలని అడుగుతున్నానా? లేదే! భార్యా భర్తల మధ్య గొడవలాగా మన మధ్య వున్నది చాలా చిన్న సమస్య. దీనిగురించి పెద్ద మిలిటరీ దళాలను దింపి ఎన్ని కోట్ల రూపాయలను ఖర్చు పెడుతుందో మీ ప్రభుత్వం పెట్టండి. ఫరవాలేదు. దాని గురించి నాకు ఏమీ బెంగలేదు.

కానీ నేను తప్పు చేశాను అని మీరు అంటున్నారు కదా. మరి న్యాయస్థానం కాపలాలో వున్న వాళ్ళని మీ పోలీసులు చంపేశారు కదా! అది తప్పుకాదా? దానిపై మీరు ఏమన్నా యాక్షన్ తీసుకున్నారా?

ఒక ఎంఎల్ఏ ఎవరో మీ దగ్గరకు వచ్చి ఉన్నదీ లేనిదీ అన్నీ కల్పించి చెప్తాడు అతని మాట విని, అతని పక్షం వహించి ఎవర్నైనా బాగా కొట్టవచ్చునా?

ఈ వీరప్పన్ ఏ అపరాధం చెయ్యలేదు, ఎవర్నీ చంపలేదు అంటే మీరు ఒప్పుకుంటారా? అదే ఎంఎల్ఏ వచ్చి ఏం చెప్పినా ఒప్పుకుంటారు. అవునా? ప్రజలకు ఎంత అన్యాయం జరుగుతున్నా కూడా మీరు ఏమీ పట్టించుకోవడంలేదు. ఈ విధంగా ఒక పక్షంవైపు మొగ్గుచూపి మాట్లాడవచ్చునా? అది న్యాయమేనా? మిమ్మల్ని ఇట్లా ఎందుకు అడుగుతున్నానంటే ఈ వీడియో క్యాసెట్‌ని ప్రజలందరూ చూస్తున్నారు కదా.

మీ రాజకీయ నాయకుల అరాచకత్వం అంతా ప్రజలందరూ చూడాలి. ఈ విషయాలన్నీ ప్రజలందరికీ తెలియాలి. అందుకే నీ దుర్మార్గాన్ని ప్రజలకు ఎత్తి చూపుతున్నాను నువ్వేమో మారవు. ప్రజలకైనా తెలియాలి కదా. వీరప్పన్‌కు ఏమీ తెలియదని ఇంతవరకు నీవు అనుకుని వుండవచ్చు. ఇప్పుడు నేను మొత్తం ప్రపంచానికే నా విషయం చాటి చెప్తున్నాను.

మీరు ఏదో ఒకరోజు తప్పుచెయ్యకపోతారా? జైలుకు రాకపోతారా? అప్పుడు ఇదే సైనేడ్ గోలీ మీకోసం రెడీగా వుంటుంది. తలకు ఒక శిక్ష, గడ్డానికి ఒక శిక్ష అని వేరేగా వుండదు కదా. మీరు ఒక దారి చూపారు. వేరేవాడు మీకు అదే దారి చూపిస్తాడు.

మీరు ప్రాణాలకు హామీ ఇచ్చి కూడా లొంగిపోయిన వాళ్ళని అన్యాయంగా చంపేశారు. ఇప్పుడు వేరేవిధంగా మాట్లాడుతున్నారు. చీఫ్ మినిస్టర్, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఈ ముగ్గురూ దేవుళ్ళతో సమానం. వీళ్ళు అబద్ధం ఆడకూడదు మీ నోట్లోంచి ఒక అబద్ధం వచ్చిందంటే ఈ దేశం నాశనం అయ్యే రోజు దగ్గరపడిందని అర్థం.

నువ్వు చాలా పెద్ద కుటుంబం నుంచి వచ్చిన వాడివి. ఒక పార్టీలో ముఖ్యమైన వాడివి. నిన్ను నమ్మి కోట్లాది ప్రజలు ఓట్లు వేశారు. పరిపాలన నీ చేతికి ఇచ్చారు దేవునితో సమానమైన నీవు ఇట్లాంటి అబద్ధం చెప్పకూడదు. ఒక దుర్మార్గుడు తను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధమాడతాడు. వాడిని కాపాడేందుకు నువ్వు అబద్ధం ఆడతావా? నువ్వేమన్నా అన్నింటికీ తల ఊపే దద్దమ్మవా? నా తమ్ముడు చచ్చిపోయాడని నేనేమీ కలవరపడడంలేదు. పుట్టిన ప్రతివాడూ చావవలసిందే. కానీ మీ ప్రభుత్వంలో ఇలా జరుగుతుందమిటా అన్నదే నా బాధ.

ఒక అన్యాయం జరిగింది. సరే నీవు దానిపై తగిన చర్య తీసుకుని వుండొచ్చు కదా. తప్పు చేసిన వాళ్ళని అరెస్టు చేసి వుండొచ్చు కదా.

ముందు నీ నోటితోనే చెప్పావు. తరువాత ఎందుకు వదిలిపెట్టావు?

నేను కూడా ఒక భారతీయ పౌరుణ్ణే కదా. ఒక కన్నుకు వెన్న ఇంకో కన్నుకు సున్నం పెట్టకు. ఖాకీ బట్టలు వేసుకున్న వాళ్ళదే రక్తం కాదు. మాలో వున్నదీ రక్తమే. భారత దేశంలో పుట్టిన మన అందరిదీ ఒకే జాతి.

నా మీద యాక్షన్ తీసుకోకుండా వదిలేయ్ ఆ శంకర్ బిదారి సంగతి నేను చూసుకుంటాను. ఇప్పుడు పంపిన పోలీసు దళాలతోనే ఆగిపో. ఒకేసారి ఐదువందల మందిని చంపగలను నేను. నువ్వు వాళ్ళ మీద ఏదైనా చర్య తీసుకుంటావా లేదా చూస్తాను. ఈ ముగ్గురి గురించే నేను అడుగుతున్నాను.

పోలీసులు ప్రజలను కాల్చారు. నేను ఆ పోలీసు రాక్షసులని కాల్చాను. అది యుద్ధం. నాలుగు సంవత్సరాలుగా అడవిలో జరుగుతున్న పోరాటం ఆ యుద్ధంలో ఆ పోరాటంలో నీ పోలీసులు నా వాళ్ళని కాల్చివుంటే అప్పుడు నీకు మంచిపేరు వచ్చి వుండేది. కానీ నా వాళ్ళని ఒక దుర్మార్గమైన రీతిలో చంపేశావు అలా చంపింది శంకర్ బిదారి అని నువ్వే నీ నోటితోనే చెప్పావు.

కానీ, ఇప్పుడు నువ్వు ఒక తలాడించే బొమ్మలా అయిపోయావు. ఇక ఈ ప్రపంచంలో ఎవర్ని నమ్మగలం మేము? చెప్పు చూద్దాం!

నేను ఒక మహాయుద్ధం చేయబోతున్నాను. ఇది మాత్రం తప్పదు. అయితే నేను ప్రజలను నాశనం చేసేవాడిని మాత్రం కాదు. టెర్రరిస్టులు బస్సుల్లో అక్కడా యిక్కడా బాంబులు పెడుతుంటారు. కర్ణాటకకి నాలుగు బాంబులు చాలు. నా దగ్గర బాంబులు లేవనుకుంటున్నావా? వున్నాయి. నాకు చాలామంది తీవ్రవాదులు కూడా తెలుసు. వాళ్ళ సపోర్ట్ కూడా వుంది నాకు. అట్లా చేస్తే ఒక్క బొగ్గు ముక్క కూడా దొరకదు.

అసలు నేనేమన్నా ప్రత్యేక దేశాన్ని అడుగుతున్నానా? న్యాయం మాత్రమే అడుగుతున్నాను. నేను కూడా సరండర్ అవాలని, ప్రజలకి సహాయం చెయ్యాలని అనుకున్నాను. కాని న్యాయం చేయి దాటిపోయింది. అయినా ఓపికపట్టి వున్నాను. నా ప్రాణం పోయినా సరే ప్రజలను మాత్రం నాశనం చేయను. కాని ఈ శంకర్ బిదారీని, ఆ దేవారంని మాత్రం ఊరికే వదిలిపెట్టను. ఇంక కొన్ని రోజుల్లో ఆ దేవారం తెల్లబట్టలు వేసుకోబోతున్నాడట. అతనే సైనైడ్ గుళికల్ని సప్లైచేసిన ద్రోహి. బందీలుగా వున్నవాళ్ళని చంపిన దుర్మార్గుడు.

ఇప్పుడు ఒక స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ని కర్ణాటకలో వేశారు కదా. వాళ్ళని నేను చూసుకుంటాను. అతనికి వీలైతే అతను నన్ను కాల్చనీ. నాకు వీలైతే నేను అతణ్ణి కాలుస్తాను.

నేను సత్యంగా చెప్తున్నాను. మళ్ళీ యాక్షన్ తీసుకుంటే మాత్రం ఈ కర్ణాటకలో నాలుగు బాంబులు పెడతాను. కర్ణాటక పోతుంది. నువ్వు పోతావు. నీ చుట్టాలు పక్కాలు అందరూ పోతారు.

నేనేదో ఉత్తగానే ధోకా తినేవాడిని అనుకోవద్దు. నాకు అన్ని విషయాలు తెలుసు. నా దగ్గర చాలా బలం కూడా వుంది. ఆ పోలీసోడు చెప్తున్నాడంట - వీరప్పన్ దగ్గర ముగ్గురు నలుగురే వున్నారని. నేను తలుచుకుంటే రేపే వెయ్యిమందిని చేర్చుకోగలను.

ఉంటే నీతో మాట్లాడటానికి వీలవుతుంది. తరువాత నీ యిష్టం. నేను ఇప్పుడు చెప్పవలసింది అంతా అయిపోయింది



## వీరపాండ్య కట్టబ్రహ్మన్న పరిపాలించిన నేల యిది!

నాలాగే వుండే వీరపాండ్య కట్టబ్రహ్మన్న ఎంతో సైనికబలగం వున్న తెల్లవాడిని ఎదిరించి యుద్ధం చేసి వీరమరణం పొందాడు. దేనికైనా శౌర్యం కావాలి. అత్యాచారం చేసినవాడి మీద అడవాళ్ళకైనా,

మగవాళ్ళకైనా ఎదురుతిరిగి దాడిచేసి చంపి పారేయాలి. చంపడం అనేది ఏమంత గొప్పపనా? ఒక్క తూటా ధ్వని - అంతే పని అయిపోతుంది. మీ దగ్గర తుపాకీ లేకపోతే ఒక పిడిబాకుని షర్టులోపల చెక్కుకుని పోయి ఛటుక్కున కడుపులో పొడిచేయ్ అంతే చచ్చిపోతాడు. అత్యాచారాలు జరగకుండా ఈ ప్రభుత్వం కాపాడాలని అస్సలు ఎదురు చూడకూడదు

పోలీసు అధికారే హత్యచేస్తే ఈ గుండు బాంబులు (మందుపాతరలు) పెట్టండి. జెలెటిన్ పుల్లలు పది పెడితే చాలు. వాటికి కనెక్షన్ ఇచ్చి జీపు వస్తున్నప్పుడు అంటిస్తే జీపు ఇంతెత్తు ఎగిరిపడుతుంది. అంతా నల్లగా మాడి చెల్లాచెదురుగా పడిపోతారు మీకు తెలియదా - మనమేమన్నా రెండువేల సంవత్సరాలు బతకపోతున్నామా ఏంటి?

డిఎస్‌పి చిదంబరనాధన్‌ని వీరప్పన్ కిడ్నాప్ చేసి తీసుకుపోలేదు డీఎస్పీయే సెటప్ చేసుకుని వీరప్పన్ దగ్గరకు వెళ్ళాడు. అందుకనే అతణ్ణి ఏమీ చేయకుండా వీరప్పన్ వదిలేశాడు అని పోలీసులు చెప్పారు.

డిఎస్‌పి చిదంబరనాథన్ నన్నో, నా ఫొటోనో చూసి వుండొచ్చు కానీ నేను అతని ముఖం కూడా అంతకు ముందెప్పుడూ చూడలేదు.

అతను ఎవరో కూడా నాకు తెలియదు. అడవిలో వుండేవాళ్ళు చెప్పడం వల్ల ఫలానా చోట ఒక డిఎస్‌పి వుంటున్నట్టు తెలిసింది నేను కిడ్నాప్ చేయడానికి వెళ్ళినప్పుడు అతను చాలా భయపడిపోయాడు. ఆయన కుటుంబ సభ్యులు బేహోష్ అయి పడిపోయారు.

ఆయనను కిడ్నాప్ చేసి తీసుకువచ్చిన తరువాతనే ఆయన గురించి నాకు తెలిసింది. ఆయన చాలా మంచి అధికారి అని ప్రజలు చెప్పారు.

దేవారం తనకు పేరు రావాలని, తనే గొప్ప వీరుడని అందరికి తెలియాలని సెటప్ గిటప్ అని కల్పించాడు నేను అబద్ధం ఆడను. సత్యం చెప్తున్నాను అది సెటప్ కాదు.

నేను అతణ్ణి పట్టుకుపోయిన తర్వాత ఆ ప్రాంతంలోని వేలాది మంది ప్రజలు సంతకాలు చేసి అతను మంచి మనిషి, ఏమీ చేయవద్దని పేపర్‌లో ప్రకటన యిచ్చారు. అదంతా చూసి సరే పోనీ అని అతణ్ణి ఏమీ చేయకుండా వదిలేశాను.

అప్పుడు డిఎస్పీయే నాతో చెప్పాడు. మా పోలీస్ వాళ్ళ దుర్మార్గం నాకు బాగా తెలుసు. వాళ్ళే నన్ను చంపేసి నీ పేరు చెప్తారు. అందుకే నాకు భయంగా వుంది అని చెప్పాడు. జయలలిత మీద నాకు నమ్మకం లేదు అన్నాడు. ఆమె ఎవరినీ గౌరవించదు ఎవరినీ చూడదు ఈ మంత్రులంతా ప్రతిరోజూ పొద్దున లేవగానే వెళ్ళి ఆమె కాళ్ళమీద పడతారు. కానీ ఆమె ఎవరినీ లెమ్మని కూడా చెప్పదు. అలాంటి రాక్షసి నన్ను గౌరవిస్తుందా అని భయపడ్డాడు.

ఆ తరువాత డిఎస్పీని రెండు నెలలు సస్పెండ్ చేసినట్టు విన్నాను ఈ డిఎస్పి ఒక డమ్మీ అని దేవారం అన్నాడట. ఈ రోజుల్లో నిజాయితీకి, న్యాయానికి పాటుపడే అధికర్లనే డమ్మీలు అంటున్నారు!

ఇందిరాగాంధీ పదిహేడేళ్ళు దేశాన్ని పరిపాలించింది. మిలిటరీతో ఎంతోమందిని చంపించింది. ఆ అమ్మ చివరికి బుల్లెట్ దెబ్బతోనే కదా చనిపోయింది. అలా పరిపాలించేవాళ్ళు ఎవ్వరైనా సరే నరకాన్ని చూడవలసివస్తుంది. మహాభారతంలో ఇది రాసి వుంది దేవారంకి కూడా ఇదే జరుగుతుంది తనతోటి ఒక డిఎస్పిని కాపాడాలన్న ఆలోచన కూడా రాలేదు చూడు అతనికి. పైగా డిఎస్పిని తనే కాల్చాలనుకున్నాడు. తను కాల్చి చంపి ఇది వీరప్పన్ పని అని చెప్పాలనుకున్నాడు ఆ సంగతి

తెలిసే డిఎస్పి భయంభయంగా దాక్కుంటూ వెళ్ళి కలెక్టర్‌కు ఫోన్‌చేసి కారు పంపించమని చెప్పాడు. డిఎస్పి గనక అడవిలో కనబడివుంటే పోలీసులే తప్పక కాల్చి చంపివుండేవాళ్ళు. జయలలిత పరిపాలన అలాంటిది మరి.



## దశరథ మహారాజు వెయ్యి ఏనుగుల్ని చంపాడు !

నేనైతే వెయ్యి ఏనుగుల్ని చంపలేదు. నా బతుకుతెరువు కోసం ఐదు పది ఏనుగులను చంపి వుంటాను అంతే అయితే దీనికి కూడా ఓ కథ వుంది చెప్తాను విను. ఇది రామాయణంలో రాసిపెట్టి వుంది

రాముడి తండ్రి దశరథుని కథ. అయనకు ముగ్గురు భార్యలు కైకేయి, సుమిత్ర .... ఇంకో భార్య ఎవరు ... ఆ... కౌసల్య! ముగ్గురు భార్యలు వుండి కూడా అయనకు పిల్లలు పుట్టలేదు. అప్పుడు దశరథుడు వెళ్ళి తపస్సు చేశాడు.

శివుడు ప్రత్యక్షమయ్యాడు. 'ఏం కావాలయ్యా నీకు ...?'

'దేవుడా నాకు పిల్లలు లేరు. పిల్లలు కలిగే వరం యివ్వు'

అప్పుడు శివుడు ఏమని వరం యిచ్చాడు తెలుసునా? 'నువ్వు వెళ్ళి ఒక వెయ్యి ఏనుగులను చంపు. నీకు మగపిల్లలు పుడతారు' అని చెప్పి శివుడు మాయమైపోయాడు.

దశరథుడు అదే ప్రకారంగా ఏనుగులను చంపడం మొదలుపెట్టాడు. 999 ఏనుగుల్ని చంపేశాడు. ఇంకొక్క ఏనుగును చంపితే వెయ్యి అయిపోతుంది. అడవిలో ఒక చోట కొంచెం నీళ్ళు వున్నాయి. అక్కడకు పోయి ఒక చెట్టుచాటున ఏనుగు కోసం మాటువేసి కూచుని వున్నాడు రాత్రి పన్నెండు గంటలు అవుతోంది. చిమ్మచీకటి. ఏదో నడిచివస్తున్న చప్పుడు వినిపించింది. బాణాన్ని రెడీ చేసి పెట్టాడు దశరథుడు.

కాని ఆ వచ్చేది గురుపుత్రుడు. అస్సలు నడవలేని తన ముసలి తల్లితండ్రులని కావడిలో కూచోబెట్టి భుజం మీద మోసుకుంటూ ఆదారిన పోతున్నాడు. తల్లిదండ్రులు దాహంగా వుంది నాయనా అని చెప్తే కావడిని దించి ఒక చెట్టుకొమ్మకి కట్టి నీళ్ళు తీసుకురావడానికి ఆ ఊట దగ్గరకు వచ్చాడు చిన్నకుండను అతను నీటిలో ముంచినప్పుడు బుడబుడ మని శబ్దం అయింది ఓహో ఏనుగే నీళ్ళు తాగుతోంది అనుకుని బాణం వదిలాడు దశరథుడు.

'హా పాపాత్ముడా! నా మీద బాణం వేసింది ఎవరూ' అని కిందపడిపోయాడు గురుపుత్రుడు.

ఇదేంటి మనిషి మాట వినిపించింది అని గబగబా పోయి చూశాడు దశరథుడు.

చూస్తే అక్కడ గురుపుత్రుడు పడివున్నాడు.

'నిన్ను చూస్తుంటే ఏదో దేశాన్ని పరిపాలించే రాజులాగా అనిపిస్తోంది. ఎవరు నువ్వు?'అని అడిగాడు గురుపుత్రుడు

'అయ్యా నేను అయోధ్యను పరిపాలించే దశరథ మహారాజును వెయ్యి ఏనుగులను చంపితే మగపిల్లలు పుడతారని ఈశ్వరుడు వరమిచ్చాడు. ఇప్పటివరకు తొమ్మిదివందల తొంభై తొమ్మిది

ఏనుగుల్ని చంపాను. ఇంకొకటి చంపితే వెయ్యి అయిపోతాయి. మిమ్మల్ని పొరపాటున ఏనుగు అనుకున్నాను .. నన్ను క్షమించండి ...' అని చెప్పాడు దశరధుడు.

'సరే అయిందేదో అయిపోయింది నా ప్రాణం పోతున్నది ఇక నేను మాట్లాడలేను .. ఈ నీళ్ళను తీసుకుపోయి ఆ చెట్టుదగ్గర వున్న నా తల్లిదండ్రులకు ఇవ్వు .. వాళ్ళ దాహం తీర్చిన తర్వాతనే జరిగింది చెప్పు ..' అని చచ్చిపోయాడు గురుపుత్రుడు.

దశరధుడు బాధపడుకుంటూ మంచినీళ్ళు పట్టుకుని చెట్టుదగ్గరకి పోయి చూశాడు అక్కడ కావడిలో చెట్టుకు వేలాడుతూ కూచుని వున్నారు గురుపుత్రుని ముసలి తల్లితండ్రులు

వాళ్ళకు మంచినీళ్ళు యిచ్చాడు దశరథుడు.

'ఇంతసేపు అయిందేమిటి? కొడుకా. ఏం చేశావు?' అని అడిగారు

'నేను మీ కొడుకును కానండి. దశరధుణ్ణి. అయోధ్యను పరిపాలించే రాజుని' అని చెప్పాడు దశరథుడు.

'ఓ రాజా మరి మా కొడుకు ఏమయ్యాడు?'

జరిగినదంతా వివరించాడు రాజు.

ఆ ముసలివాళ్ళు దుఃఖంతో 'దేవుడు వరం యిచ్చాడు కాబట్టి నీకు ఎలాగూ కొడుకు పుడతాడు. నా కొడుకు ఎట్లాగైతే పోయాడో అట్లాగే నువ్వు చచ్చిపోయే రోజున నీ కొడుకు కూడా నీ నోట్లో నీళ్ళు పొయ్యడానికి దగ్గర వుండడు. నువ్వూ మాలాగే కుమిలి కుమిలిచస్తావు' అని శాపంపెట్టారు

నేను ఒకటి అడుగుతున్నాను అసలు వెయ్యి ఏనుగులను కాల్చమని శివుడు ఎందుకు చెప్పాడు? దశరథునికి అట్లాంటి వరం ఎందుకు యిచ్చాడు? ఒక రాక్షసుణ్ణి చంపేందుకు పాలసముద్రంలో వున్న విష్ణుమూర్తే రాముడిగా ఒక రాజుగా అవతారం ఎత్తాడు. అట్లా దశరథునికి దేవుడు పుట్టాలంటే అతను వెయ్యి ఏనుగులను కాల్చాలని చెప్పాడు ఈశ్వరుడు.

దశరధుడు రాజు. ఒక కొడుకు పుట్టడం కోసం వెయ్యి ఏనుగుల్ని చంపాడు. మరి నేను ఒక సాధారణ మనిషిని. నా కడుపు కోసం నేను ఐదో పదో ఏనుగులను చంపాను అంతే. అసలు ఈ చెట్టుపుట్టలు, రాళ్ళు రప్పలు, పక్షులు, జంతువులు 84 కోట్ల జీవరాసులు అన్నీ దేవుడు మనిషికోసమే సృష్టించాడు.

ఏనుగును కూడా మనిషి కోసమే సృష్టించాడు ఏనుగువల్ల ఏం ప్రయోజనం లేదు. నేను ఏనుగుని చంపాను. మేక పిలల్లని పిలిస్తే 'మే' అంటూ పరుగెత్తుకుని వస్తుంది మేకల్ని మనం పెంచుకుంటాం. ఒకోసారి దాన్ని ఎత్తుకుపోయి మెడకోసి చంపుకుంటాం. దాన్ని వండుకుని తింటాం. మరి అది పాపం కాదా? ఏనుగు రాక్షస పిండం. మనిషిని చూస్తే వదలదు. వేరే మృగాన్ని చూసినా వదలదు. వెంటబడి చంపేస్తుంది. అట్లాంటి అడవి జంతువుని కాల్చడంలో పాపం ఏమీ లేదు. నేను నా బతుకుతెరువు కోసం, నా పొట్టకోసం దాన్ని కాల్చాను. దాని దంతాల్ని అమ్ముకుని తింటున్నాను. అట్లా వచ్చిన డబ్బులో చాలా భాగం ప్రజలకు కూడా యిచ్చాను. కాబట్టి నేను చేసింది పాపం కాదు అదీగాక ఆ పాపంలో ఒక పుణ్యం కూడా వుంది

అదేంటంటే నేను ఏనుగుని చిత్రహింసలు పెట్టి చంపడం లేదు. కుంభస్థలం మీద గురిచూసి తుపాకితో కాలుస్తాను. ప్రాణం పోతున్న సంగతి కూడా తెలియకుండా అది ఒక్కసారి పడిపోతుంది. అది చాలా మంచి చావు. నేను దాని దంతాలు మాత్రం తీసుకుపోతాను. ఆ తర్వాత ఎన్నో కాకులు,

గద్దలు, పక్షులు, రకరకాల జంతువులు, జీవరాసులు, చీమలు అన్నీ వచ్చి దాన్ని తృప్తిగా తింటాయి. కడుపునిండా తిన్న తర్వాత 'ఈ ఏనుగును ఏ మహారాజు చంపి ఇక్కడ పడేసి పోయాడో అయన చల్లగా వుండాలి' అని దీవించి వెళ్ళిపోతాయి.

కాబట్టి దంతాలు తీసుకుపోవడం చిన్న పాపం అయితే తక్కినదంతా పుణ్యమే కదా. దానాలు అన్నిట్లో కడుపుకు చేసే అన్న దానమే కదా గొప్పది!

కొందరికి తినడానికి తమిళనాడు చాలదు. జయలలిత మొత్తం దేశానికే ప్రధాని కావాలనుకుంటుంది. అది కూడా చాలదు అమెరికాకు అధ్యక్షురాలు అయితే బాగుండునని అనుకుంటుంది. ఇది మనిషి ఆశ. దానికి అంతులేదు. కాని ఒక మనిషికి అన్నం పెట్టినప్పుడు - కడుపు నిండగానే ఇక చాలు చాలు అని చెప్తాడు కాని డబ్బు ఇస్తే ఇట్లా అనడు. కాబట్టి అన్నదానమే అన్నింటికంటే గొప్పది

నేను ఏనుగును చంపి పడేసి పోవడం వల్ల, దానిని తిన్నవన్నీ నన్ను దీవించి పోవడం వల్ల నాకు పుణ్యం లభిస్తుంది.



## జంతువులకు వుండే నీతి మనుషులకు లేదు !

జంతువులకంటే మనిషికి తెలివి ఎక్కువే. కానీ బంగారం కొరకు, భూమి కొరకు, ఆడదాని కొరకు ఇట్లా చాలా ఆశలకి లొంగిపోతాడు.

ఒక్క అమ్మాయిని పదిమంది మనుషులు చెడగొడ్తారు. అందుకనే మనుషులకి మంచి చెడు విచక్షణ లేకుండా పోతోంది. కానీ జంతువులకు అటువంటి ఆశలు లేవు. ఒక కాలం వచ్చినప్పుడే ఆవులు, ఏనుగులు, పందులు, జంతువులు అన్నీ అప్పుడే లైంగిక సంబంధాలు పెట్టుకుంటాయి. మిగతా కాలంలో పెట్టుకోవు. కానీ మనిషి అలా కాదు. అందుకే మనుషులకు ఏదీ తెలియకుండా పోతోంది.

జంతువులలో వుంటే కొన్ని శక్తులు మనుషులలో లేకుండా పోయేది దీనివల్లనే. వాన రాబోతోందని జంతువులు, పక్షులు చాలా ముందుగానే పసికడ్తాయి. కాని మనకు రేడియోలో వింటేనే తెలుస్తుంది. లేకపోతే తెలియదు. జంతువులు రేడియో న్యూస్ వింటాయా ఏంటి? ఇక్కడ నుంచి రెండువందల మైళ్ళ దూరంలో పడ్డ వాన గురించి ఏనుగుకి ఊరికినే తెలిసిపోతుంది. అప్పుడు అది వేరే చోటుకి వెళ్ళిపోతుంది.

ఈ పక్షులున్నాయే - పొద్దున లేవగానే తమకు మాంసం ఎక్కడ దొరుకుతుందో వాటికి అవలీలగా తెలిసిపోతుంది. కానీ, మనుషులకి బుద్ధి వున్నది తప్ప అలాంటి శక్తులు మాత్రం లేవు అక్రమాలు చేయటం వల్లనే ఆ శక్తులు దెబ్బతిన్నాయి.

జంతువులు మనుషుల్లాగా అక్రమంగా ప్రవర్తించవు ఒక ఏనుగు మరొక ఏనుగుతోనే సంబంధం పెట్టుకుంటుంది. కాని మనిషి ఆడ కుక్క దగ్గరకు కూడా పోవాలని చూస్తాడు. జంతువులకు అక్క చెల్లి భార్య అనే తెలివి లేదు. కాని అవి ఒక టైమ్ వచ్చినప్పుడే కలుసుకుంటాయి. వేరే టైమ్‌లో కలుసుకోవు

ఒక ఆడ ఏనుగు మీద ఐదు మగ ఏనుగులు అత్యాచారం చేసి చంపవు

చాలామంది బ్లూ ఫిలిం గురించి ఏదో చెప్తున్నారు కదా అని నేను కూడా ఒక రోజు పోయి చూశాను.

నరకలోకం ఎక్కడ వుంది . అక్కడే వుంది అనిపించింది మనిషైనవాడు సెక్స్ ఫిలిమ్ చూడకూడదు. చెడ్డకథ అయినా పూర్తిగా వినాలి అంటారు కదా అని నేను ఆ ఫిలిమ్ చూశాను. అట్లా చూడటమే మహా పాపం అనిపించింది.

అరె ఒక ఆడామె దగ్గరికి ఒక గాడిద, కుక్క, గుర్రం పోతాయి ఒక ఆడదాని మీద నలుగురు మగవాళ్ళు పోతారు. దీనిని వీడియో తీసి క్యాసెట్‌లో పెట్టారు. ఛీఛీ ఇట్లాటి పనులు జంతువులు కూడా చెయ్యవు.



## ప్రభుత్వం దండించకపోతే మనమే దండించాలి - మరో మార్గంలేదు!

ప్రభుత్వం పంపిన పోలీసులతో మనకి చాలాసార్లు భయంకరమైన ఎన్‌కౌంటర్లు, పోరాటాలు జరిగాయి. వాళ్ళు ఒక ఐదువేల రౌండ్లు కాల్చి వుంటారు. అయినా మామీద ఒక్క బుల్లెట్ కూడా తగలలేదు. పెద్ద పెద్ద చెట్లకు రంధ్రాలు రంధ్రాలుగా ఎన్నో గాయాలు అయ్యాయి.

ఒకసారి సరండర్ అవుతానని కబురు పంపించాను. ఒక సెటప్ వేశాను. చిన్న నాటకం ఆడాను. పోలీసులు గ్రహించారు రాలేదు. వస్తే కాల్చేస్తానని భయం. అప్పుడు నేను వాళ్ళకి చెప్పాను. ఈ వీరప్పన్‌ని చంపడం అంత సులభం కాదు అని!

నామీద తూటాల వర్షమే కురిసినా సరే లేచి నిలబడి తిరిగి కాలుస్తాను. నా సంగతి మీకు తెలియదు. అనవసరంగా ఇందులో పడొద్దు అని చెప్పాను ఆ మోహన్‌తో

అతను నమ్మలేదు. వీడు అబద్ధం చెప్తున్నాడు, డూప్ విడుస్తున్నాడు అనుకున్నాడు. నేను ఊరికే రోడ్డుమీద పోయే వాళ్ళని కాల్చను. నా విషయంలో జోక్యం చేసుకున్నవాళ్ళనే కాలుస్తాను. జోక్యం చేసుకుంటే అతని కథ ముగిసిపోయినట్టే. అతను కాలిస్తే నాకు తగలదు. నేను కాలిస్తే అతని పని ఖాళీయే.

ఇంతవరకూ ఎంతోమంది పోలీసులు వేలసార్లు కాల్చారు. అయినా ఎందుకు తగలలేదు. కళ్ళు మూసుకుని కాల్చినా కూడా తగిలి వుండేది కదా. ఈ పోలీసులకు, చదువుకుని పట్టభద్రులైనవాళ్ళకి ఈ విషయం అర్థం కావద్దా? పురుగులు ఎక్కడినుంచో వచ్చి మంటలో పడి చస్తున్న మాదిరిగా చచ్చిపోతున్నారు.

అంటే ఇంతవరకు నేను ఎంతమందిని కాల్చానో - వాళ్ళు ఎంతమందిని కాల్చారో ఫైసలా కావాలి. ఇందుకు తలుపులు ఎప్పటికీ తెరిచే వుంటాయి.

ఫైసలా చేసుకుందాం అని పిలిస్తే నేను వస్తాను ఇక ప్రాణ నష్టం వద్దు.

అలా కాదు వీరప్పన్‌ని చంపే తీరాలి అంటే - దానికి కూడా నేను తయారుగా వున్నాను. చచ్చిపోయినవాళ్ళ తాతముత్తాతలు స్మశానంలో లేచివచ్చినా కూడా నన్ను ఏమీ చేయలేరు నేను మాత్రం వాళ్ళని కాలుస్తూనే వుంటాను వాళ్ళు చస్తూనే వుంటారు.

నేను చీఫ్ మినిస్టర్‌గా వస్తే ఒక రాష్ట్రానికి మాత్రమే ఏదైనా చేయవచ్చు. అందుకే నేను వస్తే ప్రైమ్ మినిస్టర్‌గానే వస్తాను. అప్పుడే ఈ భారతదేశపు కష్టాలన్నింటినీ తీర్చేందుకు వీలవుతుంది. నచ్చంగా ఇది జరుగుతుంది. నాలాంటి మనిషి - నాలాంటి భారతీయ పౌరుడు ఎక్కడా లేడు - ఇకముందు కూడా పుట్టబోడు.

నా చివరి కోరిక ఒక్కటే -

నా దేశ ప్రజలందరికీ స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని అందించి వెళ్ళాలి అన్నదే ఆ కోరిక. నా ప్రాణం మీద, నేను మొక్కుకునే దేవుడి మీద ఒట్టువేసి చెప్తున్నాను.

టైము వచ్చినప్పుడు మీరు నాకు అలా అధికారం యిస్తే మీకు మంచి జీవితాన్ని తీర్చిదిద్ది యిచ్చి పోయే చోటుకు పోతాను. చిట్టచివరి దశలో అయినా ఇది జరిగే తీరుతుంది. అంతవరకు నేను ఈ వనవాసం చెయ్యాల్సిందే. నేను నశించను. నన్ను ఎవరూ నాశనం చేయలేరు. దేవుడు నా వెనకున్నాడు.

కర్ణాటక ఫారెస్ట్ గార్డ్ మోహన్ అనేవాడిని నేను పోలారు చెక్‌పోస్ట్‌లో కాల్చేశాను. ఎందుకు కాల్చాను, ఎలా కాల్చాను చెప్పమంటారా?

మోహన్ ఒక ఫారెస్ట్ డిపార్ట్‌మెంటు ఉద్యోగి. కుడవు అనే ప్రాంతానికి చెందినవాడు. మనుషులు అంటేనే అతనికి పడదు. ఊరికెనే కాల్చిపారేస్తాడు చాలామంది అమాయకులను కాల్చాడు.

ముస్సమడుగు, మెట్టేరి, రాజిమడల్ అనే ప్రాంతాల్లోంచి ఓ డెబ్భై మంది వెనకబడ్డ జాతులవాళ్ళు వెదురు బొంగుల కోసం అడవిలోకి వచ్చేవాళ్ళు. బొంగులు నరికి, కట్టలుగా కట్టి కావేరి నది నీటి మీదుగా వాటిని తరలించుకుపోయి వాటిని అమ్ముకుంటూ బతికేవాళ్ళు. పాపం అందరూ పేదవాళ్ళే. వారిలో ఆడవాళ్ళు కూడా వుండేవారు

అయితే ఈ మోహన్ అడవిలో అట్లాంటివాళ్ళను కనిపిస్తే వదిలిపెట్టేవాడు కాదు కాల్చిపారేసేవాడు.

ఒక అధికారి ఎంత పెద్ద తప్పు చేసినా ప్రభుత్వం ఏమీ పట్టించుకోదు. అదే అధికారిని ఎవరైనా కొడితే మాత్రం రక్షక దళం మీదే దాడిచేసినట్టు చెప్తుంది ప్రజలు ఎంత అరిచినా వినదు. అలావుంది పరిస్థితి.

వెదురు బొంగుల కోసం వచ్చే ఆ పేద జనం రాత్రిపూట ఏదో ఇంత వండుకుని ఏ చెట్టుకిందో పడుకుంటారు.

ఆరోజు ఈ మోహన్ తనతోపాటు మరో నలుగురు ఫారెస్ట్ అధికార్లను వెంటబెట్టుకుని వచ్చి ఆ జనం మీద కాల్పులు జరిపాడు. దూరం నుంచే వాళ్ళని కాల్చేసి వెళ్ళిపోయాడు. ముగ్గురు మనుషులు అక్కడికక్కడే చచ్చిపోయారు పదిమందికి పైగా గాయపడ్డారు. కొందరికి కాళ్ళు విరిగాయి. కొందరికి చేతులు విరిగాయి. మర్నాడు పొద్దున్న వాళ్ళని లారీ తెచ్చి తరలించారు. వాళ్ళంతా తమిళనాడు వాళ్ళు. ధర్మపురి జిల్లా పెన్నాగరం తాలూకాలో వుండేవారు ఇది కర్ణాటక సరిహద్దులో జరిగింది.

ఈ విషయం నాకు వెంటనే తెలియలేదు. అప్పుడు నేను సింగాపురంలో వున్నాను. ఆడి నెల 18న పొద్దున్నే ఆయుధాలు కడిగి వాటికి పూజ చేయడం నా అలవాటు అందుకని తుపాకులు కడిగేందుకు కావేరీ నదికి వెళ్ళాను. పూజ చేస్తుండగా చాలా మంది పోలీసులు తుపాకులు పట్టుకుని అటుగా వెళ్తుండటం కనిపించింది ఇన్ని పోలీసు గన్నులు పోతున్నాయేమిటబ్బా అనుకున్నాను ముందు

ఎస్పి యొక్క తెల్ల అంబాసిడర్ దాని వెనకాల జీపులు పోతున్నాయి. మొత్తం 18 బండ్లు వున్నాయి. సింగప్పాడు పక్కిరేక్కళ్ మీదుగా వున్న చిన్న రోడ్డు గుండా పోతున్నాయవి.

పగలు సుమారు పన్నెండు గంటలకి మనకి కబురు అందింది. అడవిలో ఒక చెట్టు కింద పడుకుని నిద్రపోతున్న వాళ్ళని మోహన్ కాల్చేసి పోయాడని, ముగ్గురు చచ్చిపోయారని, పదిమంది గాయపడ్డారని, వాళ్ళలో చిన్నపిల్లలు, ఆడవాళ్ళు కూడా వున్నారని సమాచారం వచ్చింది.

వాళ్ళని అట్లా కాల్చేసిపోయిన మోహన్ వైర్‌లెస్‌లో 'వీరప్పన్ ముఠాతో పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో వీరప్పన్ కూడా చనిపోయాడు' అని కావాలనే మెసేజ్ ఇచ్చాడు. ఎస్పి పోలీసు అధికారులు అంతా వచ్చి చూశారు. ఏముంది అక్కడ వీరప్పన్ లేడు, మారప్పన్‌లేడు. అమాయక జనం పడివున్నారు.

దెబ్బ తగిలిన వాళ్ళని కావేరి నదికి అవతలివైపుకు తీసుకుపోయి లారీల్లో తరలించి పకనేక్కళ్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ యిచ్చారు 'ఈ సంఘటన కర్నాటక ఏరియాలో జరిగిన విషయం మేం ఏం చేయలేం. మీరు అక్కడికిపోయి ఏమన్నా చేసుకోండి అన్నారంట ఆ పోలీస్ స్టేషన్ వాళ్ళు. గాయపడ్డవాళ్ళలో ఊరికి పోయిన తరువాత ఎంతమంది చచ్చిపోయారో, వాళ్ళ గతి ఏమైందో ఎవరికీ తెలియదు.

ఈ విషయంలో ప్రభుత్వం ఏమైనా చర్య తీసుకుంటుందా అని ఎదురు చూశాను. ఏమీ తీసుకోలేదు.

నేరం చేసిన వాళ్ళని ప్రభుత్వం దండిచకపోతే ఏం చేయాలి? మనమే ముందుకు వచ్చి దండించాలి. మనమే ప్రభుత్వం. అంతకంటే మరో మార్గంలేదు.

ప్రజలను చంపేసి వచ్చిన మోహన్ పాలారు చెక్‌పోస్ట్‌లో వున్నాడు. అతణ్ణి చంపెయ్యాలని నేను ఆ చెక్‌పోస్టుకు వెళ్ళాను. అతను అమాయకులను చంపేశాడు. హత్యకు హత్యేకదా శిక్ష.

అప్పుడు టైం పది అవుతోంది. మోహన్ ఒక మంచం మీద కూచుని గప్పాలు కొడుతున్నాడు. అతని చుట్టూ పదిమంది వున్నారు. నేను అలా కాల్చాను ... ఇలా కాల్చాను అని కన్నడంలో గొప్పలు చెప్తున్నాడు నాకు కన్నడం తెలుసు. దాక్కుని అంతా వింటున్నాను అప్పుడు కొడితే వేరేవాళ్ళకు తగులుతుంది. తప్పు చేసిన వాడినే శిక్షించడం ధర్మం కదా. తప్పు చెయ్యని వాడిని కొడితే పాపం తగులుతుంది. అందుకే అట్లాగే దాక్కుని వున్నాను. ఒక నాలుగు గంటలు గడిచిపోయాయి. అప్పుడు అతను బయటకు వచ్చాడు. అతని దగ్గరికి వేరే మనిషి వచ్చి ఏదో మాట్లాడుతున్నాడు. ఛాన్స్ దొరికింది. సూటి చూసి తుపాకి పేల్చేను. అంతే ధఢాల్మని కింద పడిపోయాడు. ఆ వేరే మనిషి భయంతో పారిపోయాడు. ఈవిధంగా మోహన్‌ని చంపేశాను

నిజానికి ఇది ప్రభుత్వం చెయ్యవలసిన పని. కాని ప్రభుత్వం చేయలేదు. అందుకనే నేను చేశాను.

నేను చెప్పాను కాబట్టి జరిగిందంతా అబద్ధం అని మీకు అనిపించవచ్చు. ఆ ప్రాంతానికి వెళ్ళి ప్రజలను మీరే విచారించండి వీరప్పన్ చెప్పింది నిజమా అబద్ధమా మీకే తెలుస్తుంది.

పోలీసులు ఎవరిమీద చర్యలు తీసుకుంటారు? త్యాగం చేసే మన మీదనే. మనమీదికే ప్రభుత్వం మిలిటరీని పంపిస్తుంది.

రెండురోజుల కిందట రేడియోలో ఒక వార్త వచ్చింది వీరప్పన్‌కి అన్నం, సరుకులు సప్లై చేసిన పదిమందిని అరెస్టు చేశారు అని.

ఇదివరకైతే ఇట్లా వీరప్పన్‌కి సహాయం చేసినవాళ్ళని బాగా హింసించి కాల్చి చంపేవాళ్ళు ఆడవాళ్ళమీద అత్యాచారం చేసేవాళ్ళు కాని ఎలక్షన్లు వస్తున్నాయి కదా. కొంచెం ఓపిక పట్టండి అని పోలీసులకు అమ్మ చెప్పి వుంటుంది. అందుకే అరెస్టుచేశారు. ప్రజలు నాకే ఓటు వేస్తారు. మళ్ళీ నేనే అధికారంలోకి వస్తాను. అప్పుడు అన్ని అధికారాలు మీకు యిస్తాను. అంతవరకు చిన్న చేపను విసిరి పెద్ద చేపను పట్టినట్టు వుండండి అని అమ్మ (జయలలిత) చెప్పింది. లేకపోతే ఆ పదిమందిని కాల్చేసి ఎన్‌కౌంటర్‌లో పదిమంది వీరప్పన్ మనుషులు చనిపోయారని చెప్పి వుండేవాళ్ళు.

ఇప్పుడు కాల్చేస్తే గలాటా అవుతుంది. ప్రతిపక్షం వాళ్ళు గోల చేస్తారు-అని అమ్మ పెద్ద బ్బాయి (డిజిపి) చెవిలో చెప్పింది. ఆ పెద్దబ్బాయి తక్కిన పిల్లలకు చెప్పాడు. అందుకని చంపడం ఆపారు.



## అవకాశం దొరికితే బయటికి వస్తాను !

నేను ఎంజిఆర్ జీవిత చరిత్ర చదివాను. ఆ పుస్తకం నా దగ్గర వుంది. ఎంజిఆర్ ఎక్కడ పుట్టాడు, ఎట్లా పెరిగాడు, ఆయన కుటుంబం ఎట్లాంటిది అంతా తెలుసు నాకు.

ఎంజిఆర్ లాంటి మనిషి పుట్టడం చాలా కష్టం. అయితే రజనీకాంత్ అలాంటివాడే అని నాకు తెలుసు అతను కూడా పేదవాడిగా పుట్టాడు పరదేశిగా వున్నాడు రజనీకాంత్ కర్ణాటక రాష్ట్రానికి చెందినవాడు. కండక్టర్‌గా పనిచేసినవాడు.

దేవుడు ఆయనకు ఒక దారి చూపించాడు. సినిమాలలో నటించాడు. పైకి వచ్చాడు. రజనీకాంత్ అందరినీ గౌరవిస్తాడు. నాలాగనే ఆయనకు కూడా దైవభక్తి ఎక్కువ. ఆయన గనక పరిపాలనలోకి వస్తే మరో ఎంజిఆర్ వచ్చినట్టేనని అందరూ భావిస్తున్నారు. అతను నటించి సంపాదించినదంతా అనాధాశ్రమాలకు ఇచ్చేశాడు ప్రజలకి సహాయం చేశాడు. నాకు అన్నీ తెలుసు.

వీరప్పన్ అడవిలో వుంటాడు. ఇతనికి ఏమీ తెలియదు అనుకుంటారు. నేను ప్రజలతో మాట్లాడతాను పుస్తకాలు చదువుతాను పేపర్లు చదువుతాను రేడియో న్యూస్‌వింటాను. ప్రపంచంలో ఏం జరుగుతున్నదీ అంతా తెలుసుకుంటాను. ఆలోచిస్తాను. అందుకే నాకు ముందు మంచి జరగబోతోందా - చెడు జరుగబోతోందా అని నా జ్ఞానం వల్ల ముందుగానే తెలుస్తుంది

ఇప్పుడు నేను సామాన్య ప్రజలకు ఒక మాట చెప్పాలనుకుంటున్నాను. సోదర సోదరీమణులారా, తల్లుల్లారా ... పెద్దలు, చిన్నలు అందరికీ నేను నొక్కి చెప్తున్నాను. నా జీవితంలో నేను పడ్డ కష్టసుఖాలు, బాధలు అన్నీ మీకు వివరించాను. పోలీసువాళ్ళు చేసిన అరాచకాల వల్ల కడుపు రగిలి కోపంతో నా నోట్లోంచి కొన్ని చెడ్డమాటలు వచ్చి వుండొచ్చు. అందుకు మీరంతా నన్ను క్షమించండి.

శివుడి దయ ఎలా వుంటే అలాగే జరుగుతుంది. నేను నా జీవితంలో కొంత కాలం వనవాసం చేశాను. చేస్తున్నాను. బయటికి వచ్చే అవకాశం దొరికితే వస్తాను. నాకు మీరంతా ఓటువేసి అధికారంలో వుంచితే వుంటాను.

ఇప్పుడు నేను బతకడానికి ఏ పిట్టనో కొట్టి కాల్చుకుని తింటున్నాను. నాకు భూమి మీద, బంగళామీద, బంగారం మీద, డబ్బుమీద వున్న మమకారం అంతా ఎప్పుడో మసిఅయిపోయింది.

నా చివరి కోరిక ఒక్కటే. అది ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందించి వెళ్ళాలని. మహాత్మా

గాంధీ చెప్పిన మాటని నిజం చేసి వెళ్ళాలని. నా ఆత్మ ఇందుకోసమే తపిస్తోంది.

నాలాంటివాడు ఇంతవరకూ ఈ దేశంలో పుట్టలేదు. ఇకముందు పుట్టబోడు. ఈ పనిని నేనే చెయ్యాలి. చేస్తాను నేను చావను. అధర్మం చస్తుంది. ధర్మం ఎప్పుడూ గెలుస్తుంది మన పురాణాల్లో ఇదేకదా వుంది. నేను ధర్మాన్నే పాటిస్తాను. దేవుడు నాకు దారి చూపిస్తాడు. నేను బయటికి వస్తాను. అదంతా మీరే చూస్తారు.

ఇంతకు పూర్వం నేను నక్కీరన్ పత్రికకు మూడుమాట్లు ఇంటర్వ్యూలు ఇచ్చాను కాని అది నిజమా - అబద్ధమా ఇట్లాంటి మనిషి అసలు వున్నాడా అని చాలామంది రకరకాలుగా అన్నారు.

అందుకనే ఇప్పుడు నేను వీడియోలో మాట్లాడి దానిని క్యాసెట్‌లో రికార్డ్ చేసి ప్రజలందరూ నన్ను చూసేలా పంపిస్తున్నాను. త్యాగం చెయ్యాలనే తపన వున్న మనిషిని. నేను మొక్కే దేవుళ్ళ సాక్షిగా చెప్తున్నాను. ఆ దేవతలే నా చేత ఈ మాటలు పలికిస్తున్నారు సత్యం చెప్తున్నాను. నేను ప్రజలకు ఆవగింజంత అన్యాయం కూడా చెయ్యలేదు. కాని నన్ను శత్రువుగా చేసుకున్న వాళ్ళని మాత్రం నేను వదిలిపెట్టలేదు. ఇది నాకు పుట్టుకతో వచ్చిన గుణం.

మీ అందరికీ మంచి జీవితాన్ని అందించి వెళ్ళాలన్నదే నా ఆఖరు కోరిక. దేవుడి దయ ఎలా వుందో తెలియదు. వుంటాను. మీ అందరికీ నా నమస్కారాలు.

సెలవు.

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No. 18598
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.



యావత్ భారత దేశంలోనే 'మోస్ట్ వాంటెడ్ క్రిమినల్' గా పేరుగాంచిన గంధపు చెక్కల వీరప్పన్‌తో 'నక్కీరన్' పత్రిక జరిపిన వీడియో ఇంటర్వ్యూకు అక్షరరూపం ఇది !

ఇందులో.....

వీరప్పన్ తన బాల్యం గురించి, తన కుటుంబ స్థితిగతుల గురించి, తను ఏనుగుల వేటగాడిగా ... గంధపు చెక్కల స్మగ్లర్‌గా మారడానికి దారితీసిన పరిస్థితుల గురించి, అటవీశాఖ సిబ్బంది అవినీతి ప్రజల్ని కాపాడాల్సిన పోలీసులు చేసిన అరాచకాలూ, తను చేసిన హత్యలూ మొదలైన విషయాల గురించి సవివరంగా పేర్కొన్నాడు.

దాదాపు పాతిక సంవత్సరాలనుంచి తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యై కూర్చున్నాడు వీరప్పన్. అతను రెండు వేల ఏనుగుల్ని చంపాడనీ; వందకోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఏనుగు దంతాల్ని, గంధపు చెక్కల్ని స్మగ్లింగ్ చేశాడనీ అంటారు. పోలీసులు, ఫారెస్ట్ సిబ్బందితో సహా మొత్తం 138 మందిని హత్యచేశాడనే ఆరోపణలున్నాయి. చాలాకాలం క్రితమే అతని తలకు 40 లక్షల రూపాయల బహుమతి ప్రకటించబడింది. సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఏడు బెటాలియన్ల సైనికులు; తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 4,500 మంది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరప్పన్ వేటలో నిమగ్నులై వున్నారు. ఇదొక అపూర్వమైన నడుస్తున్న చరిత్ర.

మన వ్యవస్థలోని లొసుగుల్ని హిపోక్రసీని ముఖ్యంగా న్యాయస్థానాలు, పోలీసు విభాగం, ప్రభుత్వ యంత్రాంగం పనితీరునూ, రాజకీయ దివాళా కోరుతనాన్నీ అర్థం చేసుకునేందుకు చిత్తశుద్ధివుంటే ఆ లోపాలను సవరించుకునేందుకు ఈ పుస్తకం ఎంతగానో తోడ్పడుతుంది.

మహనీయుల జీవిత చరిత్రల నుంచేకాదు, హంతకుల నేరస్థుల జీవన పరిణామ క్రమాలనుంచి కూడా మనం ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని చాటి చెబుతుంది ఈ పుస్తకం !

నక్కీరన్ సుప్రసిద్ధ తమిళ పక్షపత్రిక. గోపాల్ వ్యవస్థాపక సంపాదకత్వంలో 1988లో ప్రారంభించబడింది. పరిశోధనాత్మక జర్నలిజం ద్వారా ఈ పత్రిక అనతికాలంలోనే అశేష పాఠకుల ఆదరాభిమానాలను పొందింది. ముఖ్యంగా ఆటో శంకర్, వీరప్పన్‌లకు సంబంధించిన విశేష కథనాలు ఈ పత్రికకు ఎంతో పేరు తెచ్చి పెట్టాయి.

రాజీ పడని పత్రిక రచనకు నిబద్ధతకు గుర్తింపుగా ప్రాచీనకాలంనాటి సాహసవంతుడైన సంఘం కవి నక్కీరన్ పేరునే తమ పత్రికకు పెట్టుకున్నారు. నక్కీరన్ శివున్ని వ్యతిరేకిస్తూ రాసిన ఈ తమిళ కవిత ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది.

'శివుడు చేసినా ఎవరు చేసినా తప్పు తప్పే' !
నన్ను భస్మం చేసేందుకు ఆయన తన మూడో కన్ను తెరచినా కూడా నేను ఇదే మాట అంటాను.
'తప్పు తప్పే' !